ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

జనవరి, 2021
సంచిక : 438
వెల : 40/-



## పోరుబాట పిలుపు!

అరుగరుగో
రైతమ్మలు! రైతన్నలు!
పోరుబాటలో నిలబడ్డారు!!

నీటి ఫిరంగీల నేటి దాహార్తులకు
చనుబాలు కుడిపింది వారే!
బాష్పవాయు తుపాకీల
కడుపాకలి తీర్చిందీ వారే!!

ప్రజా రచయితలారా!
జనసాంస్కృతిక కళాకారులారా!!
గోర్కీ "అమ్మ"లమై నిలబడదాం!

నల్లచట్టాల కల్లపాలకుల
నయవంచక బూటకాలపై
ఒక్కటిగా ఓకేరీతిగా
ఉద్యమమై కలబడదాం!

నాగలినే వింటి బద్దగా బిగించి కట్టి
కలాన్ని కోలగా ఎక్కుపెట్టి
దేశమంతా సంఘీభావం డప్పుకొట్టి
మట్టి పిడికిళ్ల సాగురగడలో
భుజం కలిపి నిలబడదాం!!

జనసాహితి ప్రచురణ

# మీ విజయం మా ఘనత కాదు... బాధ్యత

Confidence
Competence
Commitment
Control
Character

CHAMPS'™

## COURSES OFFERED

- CA - FDN
- CA - FINAL
- CA - INTER
- CMA (U.S.A.)



***Chief Mentor***

**R.SASI KUMAR**

B.Com., LLB., ACA, ACMA (Ind), ACMA (U.K.), CIA (U.S.A.), CMA (U.S.A.), CGMA

Mr. Sasi Kumar is the Chief Mentor at CHAMPS' who is a highly qualified and dynamic finance professional with vast experience in both Indian and International corporates. He has held responsible senior positions at Dubai and Bahrain.
He is member of numerous prestigious institutions worldwide.
He has trained many global professionals and helped them in reaching their career goals.

Chanakya Academy for Management and Professional Studies Pvt. Ltd. (CHAMPS'™)

# 11-6-865/201, 2nd Floor, Mahboob Residency, Beside Pragati Offset Printers, FAPCCI Marg, Red Hills, Lakdi Ka Pul, Hyderabad - 500 004

info@champsindia.net | www.champsindia.net

TOLL FREE # 1800-419-7272

జనసాహితి ప్రచురణ

44 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంపుటి : 44
సంచిక : 04-06
జనవరి 2021

438

www.prajaasaahithi.com


## ఈ సంచికలో...


| | | | |
|---|---|---|---|
| ❑ ముఖచిత్రం | : | రైతాంగం పోరు పిలుపు – చిత్రం : అంతర్జాలం నుండి | 01 |
| ❑ రెండవ అట్ట | : | ఛాంప్స్ వాణిజ్య ప్రకటన | 02 |
| ❑ మూడవ అట్ట | : | ఢిల్లీ రైతు పోరు పిలుస్తోంది (పాట) – శ్రీదేవి; ప్రాభాత సమీరం (కవిత) – జీవన్ | 67 |
| ❑ నాల్గవ అట్ట | : | రైతుభేరి (పాట) – పినాకిని – శంకర్ చిత్రం | 68 |
| ❑ సంపాదకీయం | : | భారత రైతాంగాన్నీ దేశ ప్రజానీకాన్నీ మళ్ళీ మళ్ళీ దగా చేస్తున్న పాలకవర్గాలు.... | 05 |
| ❑ సమకాలీనం | : | అశేష రైతాంగపు వీరోచిత ఢిల్లీ ముట్టడి! – దివికుమార్ | 07 |
| ❑ ప్రకటనలు | : | ప్రముఖ రచయిత సిహెచ్. మధుకి ఆర్థిక చేయూతనిద్దాం | 09 |
| | : | వేమన అధ్యయన & అభివృద్ధి కేంద్రం, రాయలసీమ సాంస్కృతిక వేదిక విజ్ఞప్తి | 51 |
| | : | రైతాంగ పోరాటంపై కవితల, పాటల కొరకు విజ్ఞప్తి | 53 |
| ❑ కథలు | : | పెనం మీంచి పొయ్యిలోకి – గౌరీశంకర్(**10**); లాంతరు జానకమ్మ – డా॥ కే.వి. రమణరావు(**31**) | |
| ❑ వ్యాసాలు | : | హబీబ్ జాలిబ్ కవిత 'దస్తూర్' (వ్యవస్థ) – కొత్తపల్లి రవిబాబు | 35 |
| | : | హిందుత్వ తీవ్రవాదులు డిజిటల్ నేరాలకు పాల్పడుతున్నారా?– జి.వి. భద్రం | 43 |
| ❑ పుస్తక పరిచయం | : | మహిళాభ్యుదయ దీపిక అబ్బూరి ఛాయాదేవి 'వనిత' – డా॥ షేక్. మహబూబ్‌బాషా | 55 |
| ❑ కవితలు | : | ఉదయ్ (**12**), సిహెచ్.మధు (**13**), కె. శాంతారావు (**14**), కంచరాన భుజంగరావు (**15**), గోలి మధు (**20**), డా॥ జి.వి. కృష్ణయ్య (**27**), రవి సంకోజు (**52**) | |
| ❑ బాలసాహితి | : | సైలాడ అశ్విని (**28**), పల్లి గాయత్రి (**29**), గొల్లంగి త్రివేణి (**30**), కె. పుష్పలత (**42**) | |
| ❑ కరపత్రం | : | దేశాన్ని అంబానీప్రదేశ్, ఆదానీప్రదేశ్‌లుగా మార్చుచూస్తున్న పాలకుల దేశ ద్రోహాన్ని ఎండగడదాం | 21 |
| ❑ నాటిక | : | ఎండమావులు – ఐ.టి.ఆర్.వి. శివాజీరావు | 37 |
| ❑ పుస్తక సమీక్ష | : | సింగమనేని అపరిమితమైన 'పరిమితం' – బూదాటి వేంకటేశ్వర్లు | 46 |
| ❑ డాక్యుమెంటరీ సమీక్ష | : | 'ల్యాండ్ లెస్' – బాలాజీ కోల్‌కతా | 25 |
| ❑ సజీవ సాహిత్యం | : | ఓ రచయితా! ఓ కళాకారుడా! అల్లదుగో కర్షకుడు అతని చేయి అందుకో | 16 |
| ❑ పాట | : | అడుగడుగున దగా – రౌతువాసుదేవరావు | 24 |
| ❑ ఈ నెల పుస్తకం | : | 'పోరాటం' కవితా కథల సంపుటి – సిహెచ్. మధు | 19 |
| ❑ వివిధ | : | రైతుల ఉద్యమానికి పంజాబు, హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తుల సంఘీభావం (**20**); 40మంది ప్రముఖ ఆర్థికవేత్తలు వ్యవసాయ శాఖామంత్రికి రాసిన లేఖ (**23**); డియోగో మారడోనా మరణం (**34**); మంగ్లేశ్ డబ్రాల్ మరణం (**45**); ముప్ఫై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి (**62**); చైతన్యవాహిని (**64**); ఈ పుస్తకాలు అందాయి (**65**) | |
| ❑ శాశ్వతనిధి | : | సంకు అప్పారావు (**04**), చల్లా వెంకటరెడ్డి, సజ్జా నారాయణరావు (**42**), గోరంట్ల వెంకటేశ్వరరావు, కంఠంనేని రవీంద్రరావు, నండూరి రాఘవయ్య (**50**), పాములపాటి జానకమ్మ (**52**), పి. జీవరత్నం (**61**) | |
| ❑ సంతాపాలు | : | ఆర్. శాంతసుందరి (**22**), సలుమూరి రాజారావు (**34**), ఇ.ఎస్.రెడ్డి (**36**), ముత్యాల ప్రసాద్, కొమ్మారెడ్డి కేశవరెడ్డి (**49**), సౌమిత్ర చటర్జీ (**53**), దేవీప్రియ, కె. సదాశివరావు (**54**), ఆదూరి సంతోష్ (**61**), గుత్తి చంద్రశేఖరరెడ్డి (**63**) | |



ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : **9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
**30-7-6,** అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – **520002.**
ఫోన్ : **7075957010** prajasahithi1977@gmail.com

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. **59,** రాధాక్రిష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – **532001**
ఫోన్ : **9441913829** prajasahithi1977@gmail.com



ISSN 0971-278X

LCCN 94903393

# కామ్రేడ్ సంకు అప్పారావు
## 28వ వర్ధంతి



స్వాతంత్ర్య సమరయోధులు, పశ్చిమగోదావరిజిల్లా తొలితరం కమ్యూనిస్టు, రాష్ట్ర రైతుసంఘం నాయకులు కామ్రేడ్ సంకు అప్పారావు 1917లో భీమవరం తాలూకా కొండేపూడిలో జన్మించారు.

ఆయన 1937లో మే నెలలో జరిగిన కొత్తపట్నం తొలి రాజకీయ పాఠశాలలో పాల్గొన్నారు. ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు సాగిన రైతు రక్షణ యాత్రలో పాల్గొన్నారు. 1939లో కాళీపట్నం జమిందారీ వ్యతిరేక పోరాటంలో రైతు సత్యాగ్రహపు తొలి బృందానికి నాయకత్వం వహించి అరెస్టు అయ్యారు. 1943-44లలో కలవలపల్లి, సూర్యాపురం, గోపాలపురం జమీందారీ వ్యతిరేక పోరాటాలలో, కానూరు, పెండ్యాల లంక రైతుల పోరాటాలలో ప్రముఖపాత్ర వహించారు.

కమ్యూనిస్టుపార్టీపై నిషేధం విధించిన కాలంలో ఒరిస్సాలో రహస్య జీవితం గడిపారు. 1952 ఎన్నికలలో 450 ఓట్ల తేడాతో ఓడిపోయారు. తర్వాత స్థానిక సంస్థల అభ్యర్థిగా శాసనమండలికి ఎన్నికయ్యారు.

గోదావరి బ్యారేజి నిర్మాణానికి సాగిన ఉద్యమంలో, పోలవరం ప్రాజెక్టు సాధనకు, జిల్లాలోని వివిధ రైతు పోరాటాలలో పాల్గొన్నారు. ఆయన 1992 మే 29న తన 75వ ఏట ఏలూరులో మరణించారు.

అప్పారావుగారి భార్య లక్ష్మీకాంతంగారు పశ్చిమగోదావరి జిల్లా మహిళాసంఘ అధ్యక్షులుగా చాలకాలం పనిచేశారు. వారి పెద్దమ్మాయి మనోరమ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేసి విశ్రాంత ప్రిన్సిపల్‌గా వున్నారు.

సంకు మనోరమగారు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అప్పారావుగారి 28వ వర్ధంతి సందర్భంగా 2020 మే నెలలో 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి 30,000 రూపాయలు ఇచ్చారు. వారికి కృతజ్ఞతలు.


'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**



| | | |
|---|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | | రు. 300-00 |
| ఐదేళ్లకు | చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి



**ప్రజాసాహితి ప్రకటనల ధరలు**
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| రెండవ, మూడవ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం


## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు మీ పేరు పైన వుంటాయి. దాని ప్రకారం చందా పూర్తికాకముందే, చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు విరాళాలు సేకరించండి. – సంపాదకవర్గం

# సంపాదకీయం

# "భారత రైతాంగాన్నీ, దేశ ప్రజానీకాన్నీ మళ్ళీ మళ్ళీ దగా చేస్తున్న పాలకవర్గాలు - సాహిత్య సాంస్కృతికోద్యమ కర్తవ్యాలు!"

**"ఈ భూ నభోంతరాళం బద్దలైపోవడం ఖాయమిక!**
**కడుపు మంటల్లో కాలం కుతకుతా వుడుకుతోందిప్పుడు!**
**నాడీమండలాల్లో నవయుగ దుందుభులు మోగుతున్నాయహో!**
**నీ భౌమిక మధ్యనున్న అగ్గిని కెలుకుతున్నారెవరో....!!"**

పై మాటలతోపాటు ఏనాడో కవి ఛాయరాజ్ అన్నట్లు పోషకాహార రచయితలైన రైతులు నేడు భారత రాజధాని పొలిమేరల్లో పొలి, పొలీ అంటూ ధిక్కార స్వరాల్ని వినిపిస్తున్నారు. కరోనా నేపథ్యంలో ప్రజలు తిరుగాడే పరిస్థితులు సన్నగిల్లాయని ప్రభుత్వం భావిస్తున్నది కనుకనే భారత వ్యవసాయరంగాన్ని దేశీయ – విదేశీ గుత్తసంస్థలకు ధారాదత్తం చేయడానికి మూడు చట్టాల్ని హడావిడిగా తీసుకువచ్చింది. ఏకపక్షంగా – నియంతృత్వంగా పాలకపక్షాలు వ్యవసాయ చట్టాల్ని చేశారు.

కారన్‌వాలిస్ అనే గవర్నర్ జనరల్ కాలం 1789లో శాశ్వత భూమిశిస్తు విధానం ప్రవేశపెట్టి, భూమిని వ్యక్తిగత సొంత ఆస్తి చేసేసి – జమీందారీ విధానంతో స్థానిక భూస్వామ్యవర్గాన్ని తన చేతి కర్రగా మార్చుకుంది, బ్రిటిష్ సామ్రాజ్యవాదం. దీనివల్ల భూమి అమ్మకపు సరుకైపోయింది. వ్యక్తిగత ప్రాధాన్యతలు ముందుకు వచ్చి – పంటల సమతుల్యత దెబ్బతిని దేశ ఆహార భద్రత ప్రమాదంలో పడింది. బ్రిటిష్ వలస పాలన వ్యాపార పంటలకు ప్రాధాన్యతనిచ్చింది. అప్పుడు – దాంతో కరువు కాటకాలు కృత్రిమంగా చోటు చేసుకున్నాయి. 1943 నాటి అంగట్లో అన్నీ వున్నా బెంగాల్ కరువు తిండానికి తిండి లేకుండా చేసింది. వేలవేలాది మందిని ఆకలి చావులకు గురిచేసింది. ఇక్కడే వలస పాలన భారత వ్యవసాయరంగాన్ని వ్యాపార యుద్ధ సంస్కృతికి బలిచేసింది. సంపదను కాలువలు గట్టి తరలించుకుపోయింది. ఆర్థిక, రాజకీయ విధానాలు స్వదేశీ విదేశీ దోపిడీవర్గాల చుట్టూ తిరిగేలా చేసింది. సామాజిక, సాంస్కృతిక శ్రమ సారాన్ని లాభనష్టాల తరాజులో వేసింది. ఈ పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే నీలిమందు, పొగాకు, ప్రత్తి, కాఫీ, టీ లనే వ్యాపార పంటలకు దారితీసి, ఆహారపంటలు నాశనం అయ్యాయి. దీనికి తోడు ఆ తరువాత చోటు చేసుకున్న హరిత విప్లవం, నీలి విప్లవం అమలుచేసిన పాలకవర్గాలు నేలను నిస్సారం చేసే కంపెనీ విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందుల చుట్టూ రైతు ప్రపంచాన్ని గానుగెద్దులా తిప్పుకున్నాయి. దాంతో ఋణభారం పెరిగి, గిట్టుబాటు ధరే కాదు కనీస మద్దతు ధర కూడా లేకుండా చేయడం వల్ల – రైతు గుండె దిటవు కోల్పోయాడు. మడిచెక్క రైతుల ఆత్మహత్యలకు వేదికయ్యింది. ఇంచుమించు 4–5 లక్షలమంది రైతులు గుండెపగిలి బతుకును బలవంతపు చావులకు బలిచేసారు. "నాలుగు గట్లేసి / మడిచెక్కను బంధించిన వర్గచరిత్ర కురూపి" దీనితో స్వయంసమృద్ధి గ్రామీణ వ్యవస్థ వెన్నెముక విరిగి, కుప్పకూలింది. భూమిలేక – భుక్తిలేక రైతన్న, రైతమ్మ పనికోసం వలస పక్షులయ్యారు. పిల్లల చదువులు అటకెక్కాయి. ప్రభుత్వ బడులు మూతపడ్డాయి. గ్రామీణ చేనేతరంగం, కుమ్మరి, కమ్మరి సహస్ర వృత్తుల సమస్త జనమూ దిక్కుతోచక జంగిడిలో ఉసిరికాయల్లా అటూ ఇటూ పరుగులు పెట్టారు. ఈ వాస్తవికతనే కళ్ళకు కడుతూ 2005లో అంటే నేటికి 15 ఏళ్ళ క్రితమే 'ప్రజాసాహితి' గ్రామీణ జీవన విధ్వంసాన్నీ దాని మూలాల్నీ విశ్లేషిస్తూ రైతాంగ ఉద్యమ ఆవశ్యకతను చాటుతూ ప్రత్యేక సంచికను తీసుకొచ్చింది కూడా.

సాహిత్యానికీ, సాగు సంస్కృతికీ అవినాభావ సంబంధం ఉంది. సమాజ హితాన్ని కోరేది ప్రజాసాహిత్యం. సమాజం నడకను తీర్చిదిద్దేది వ్యవసాయం – ఆ నడక తీరుతెన్నుల్ని ఒడిసిపట్టి చూపెట్టేది సాహిత్యం. అందుకే సాహిత్య వ్యవసాయం అనే పద బంధం ఏర్పడింది. కనుకనే పోషకాహార రచయితగా రైతుకి అక్షర ప్రపంచం జేజేలు చెప్పింది.

ఈ నేపథ్యం నుంచి వర్తమానాన్ని అవగాహన చేసుకోడానికి ప్రయత్నిస్తే – ఇంచుమించు నెలరోజులుగా భారత రైతాంగం నాగళ్ళ కవాతు అన్నట్లు ట్రాక్టర్లపై కదిలివచ్చి – ఇటీవల మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన 3 చట్టాలనూ బేషరతుగా రద్దు చేయాలని శఠించింది. చట్టాలను సారాంశంగా చూస్తే గత 1991 నూతన ఆర్థిక విధానాలకు దారితీసిన డంకెల్ ముసాయిదా గాట్ ఒప్పందంగా ఆపై ప్రపంచ వాణిజ్యసంస్థ కనుసన్నల్లో నూతన వ్యవసాయ విధానాలు అమలులోకి వచ్చాయి. సరళీకరణ – ప్రైవేటీకరణ – ప్రపంచీకరణ అనే మూడు విధానాలతో రైతును భూసంబంధాల నుండి పరాయీకరించి వ్యవసాయం దండగమారినదనే స్థితికి తీసుకొచ్చారు. అందులో అధికారపక్షం – ప్రతిపక్షం ఇద్దరూ తోడుదొంగలే. దళారీ బూర్జువా వర్గం సామ్రాజ్య వాదానికి దాసోహం అంటూ అదే దేశభక్తి అంటూ నమ్మిస్తున్నారు. భారతదేశపు మార్కెట్ ఎకానమీని "ప్రపంచీకరణకు" దేశీయ, విదేశీయ, గుత్తపెట్టుబడులకు ధారాదత్తం చేస్తున్న నల్లని కల్ల చట్టాలివి. ఇవి రైతుల మేలుకోసమే అన్నట్టు మేకవన్నె పులి వేషాలు వేస్తున్నారు.

ఇప్పటికే ఆ మూడు వ్యవసాయ చట్టాల్లో దాగున్న వంచనాశిల్పాన్ని సామాజిక, సాంస్కృతిక, సాహిత్యరంగాలు పలు కోణాల నుండి విశ్లేషిస్తూనే వున్నాయి. ఈ చట్టాల వల్ల రైతులు తమ ఉత్పత్తుల్ని గతిలేక అనివార్యంగా కారుచౌకగా గుత్తసంస్థలకు అమ్ముకోవలసి వస్తుంది. ఇప్పటికే టమాటా, ఉల్లి, పత్తి, రైతులు తమ పంటల్ని రోడ్డు మీద ఒంపేసి గుండెలవిసేలా ఆక్రోశించడం గత పాతిక ముప్పై సంవత్సరాలుగా చూస్తూనే వున్నాం. ఇక మార్కెట్ యార్డుల రూపేణా ప్రభుత్వం రైతు ఉత్పత్తులకు బాధ్యత పడకపోతే స్వేచ్ఛామార్కెట్ ఎకానమీ తనకనుకూలమైన లాభసాటి ధరతో అధునాతన ఎలక్ట్రానిక్ అగ్రికల్చరల్ మార్కెట్ల నిర్మాణాలతో రైతుని నిర్దాక్షిణ్యంగా కాలితో మట్టగించి – మట్టిలో కలిపేస్తుంది. రైతులతో గుత్త వాణిజ్య సంస్థల ఒప్పంద వ్యవసాయం కూడా ఇలాగే కనీస మద్దతు ధర కూడా ఇవ్వక

రైతుని కుదేలు చేయడమేగాక, అడుగడుగునా దగాకోరు ఒప్పందాలతో మార్కెట్ ధరల్ని దళార్ల కనుకూలంగా మార్చేస్తారు. ఇకపోతే నిత్యావసరాలైన పప్పులూ, ఉప్పులూ, నూనెగింజలు, కూరగాయలు, పండ్లు మొదలైనవాటి నిల్వలపై ఆంక్షలు తొలగిస్తే – ఇది దేశ ఆహార భద్రతకే గొడ్డలిపెట్టు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌శక్తుల అధీనంలోకి దేశ ఆహార వ్యవస్థ వెళ్ళిపోతుంది. బెంగాల్ కరువు మళ్ళీ పునరావృత మవుతుంది. ఆకలిచావులు, నిత్యకృత్యం అవుతాయి. దేశం పీనుగుల పెంట అవుతుంది.

ఈ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విధ్వంసాన్ని అవగాహన చేసుకున్న పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర రైతాంగం దీనిని ప్రతిఘటించడానికే ఢిల్లీ వచ్చింది. 6 నెలల గ్రాసం దగ్గర పెట్టుకొని సాంస్కృతిక పోరాట రూపాలతో కేంద్ర ప్రభుత్వాన్ని నిగ్గదీస్తున్నారు. రైతులు ఈ మూడు చట్టాల్నీ రద్దు చెయ్యమంటే – ప్రభుత్వం సవరణ చేస్తామంటూ సన్నాయి నొక్కులు నొక్కుతోంది.

ఢిల్లీలో గడ్డకడుతున్న తీవ్ర చలిలో, నల్లచట్టాలకు వ్యతిరేకంగా ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ఆత్మహత్యల పర్వం అయిపోయిందంటూ ప్రతిఘటనాపంథాన్ని పట్టారు భారత రైతాంగం!

గత 3 సం॥ల క్రితం రైతులు పెద్ద పెట్టున ప్రభుత్వ దళారీ వ్యవసాయ విధానాలపై నాసిక్ నుండి ముంబాయి వరకు పాదయాత్ర చేసారు. వలసకూలీలు కరోనా కాలంలో నెత్తుటి పాదచారులై వలస భారతాన్ని కళ్ళెదుట నిలబెట్టారు. ఎక్కడికక్కడ ప్రజలు ప్రభుత్వ దివాలాకోరు విధానాలపై తిరగబడాల్సిన పరిస్థితులను ప్రభుత్వమే కల్పించింది!

ఈ సంఘటిత ప్రజావెల్లువని చీలికలు పీలికలు చేయాలనే, పాతికేళ్ళుగా సాహిత్యరంగంలో అనేక వాదాలను పెంచి పోషిస్తున్నారు.

"కవులను కదిలించడమంటే – కాలం దొంకంతా కదిలించడమే" అంటాడు శ్రీశ్రీ.

నిజమే – ఢిల్లీలో రైతాంగ పోరాటంలో కుల, మత, జండర్, ప్రాంతీయ విభేదాల్ని వదిలిపెట్టి – ఫక్తు వర్గ ప్రాతిపదికమీదనే కదిలి వచ్చారు. రాజ్యాంగబద్ధంగా వచ్చిన మూడు మహమ్మారి చట్టాలను ధిక్కరిస్తున్న కీలకమైన ఉద్యమం ఇది. కానీ పాలకవర్గ మేధావులు ఈ రైతు కదలికల వెనుక ఖలిస్తాన్ ఉగ్రవాదులున్నారని ప్రచారం చేస్తున్నారు.

70 ఏళ్ళనాటి తెలంగాణ రైతాంగ మహోద్యమానికీ, 50 ఏళ్ళనాటి శ్రీకాకుళ గిరిజన రైతాంగ తిరుగుబాటుకీ భూమిక ఒకటే – అదే వ్యవసాయరంగం.

ఈ వ్యవసాయరంగాన్ని పోరాటబాటలో నిలకడగా, తెగింపుగా నిలబెట్టే సాంస్కృతికాంశం ఆట – పాట –

మన తిరునగరి, సుద్దాలలు, మన సుంకరలు, మన సుబ్బారావు పాణిగ్రాహిలు కలం గళం వీరులై ప్రజల్ని చైతన్య ప్రవాహంగా నడిపించారు.

అలిశెట్టి ప్రభాకర్ భారత రైతాంగం అంతర్ ఛాయాచిత్రాన్ని గీసి చూపిస్తూ –

"వడ్లగింజను వల్చిచూడు
రైతు అస్థిపంజరం కనిపిస్తుంది" అంటాడు.

ఒళ్ళు గగుర్పొడిచే ప్రతీక అది.

"చెమటలోడ్చి ప్రపంచమునకు భోజనము పెట్టు,
వానికి భుక్తి లేదు" అంటూ జాషువా గదుముతారు.

రైతు సామాజిక నిర్మాత ఎలాగవుతాడో. దువ్వూరి రామిరెడ్డి – 'కృషీవలుడు' చెబుతుంది.

జానపదుల చీకటి నీడలు ఎలా విస్తరించి వున్నాయో తెలియజెప్పే బోయి భీమన్న సాహిత్యం ఏం చెబుతోంది? – శ్రీశ్రీ 'ప్రతిజ్ఞ' ఏం నేర్పుతోంది? చెమటకి విలువకట్టే షరాబు ఇక్కడెవడూ లేడు మరి!

రైతు చుట్టూ అల్లుకున్న సామాజిక జీవన నిర్మాణ సూత్రాన్ని తెంపి, ఈ గద్దెనెక్కిన గుడ్డి గ్రద్దలు ఎక్కడ నిలబడతాయి?

రోజూ – అన్నం ముద్ద చేతిలో ఏమంటోంది?
వరి పంట కంకులెత్తిన – గోధుమ మడిచెక్క
పోరాట బావుటా పట్టిన రైతు ప్రతిఘటనాబాట
ఈ వ్యవసాయ చట్టాలు రైతులకేనా నష్టం?
ఆహారం అవసరమైన అన్ని రంగాల ప్రజలకీ
సంబంధించిన పోరాటం కాదా ఇది!

రచయితలూ, కవులూ, కళాకారులూ ఎక్కడికక్కడ – కదలబారి ఎప్పటికప్పుడు – భారత రైతాంగ పోరాట చరిత్రని పాటలు పాటలుగా, ఆటలు ఆటలుగా – కవితలుగా – నాటికలుగా – ఎక్కడికక్కడ మొత్తం ప్రజానీకాన్ని అంతా – రైతు బిగించిన పిడికిలిగా తెగించి గంభీరంగా దృశ్యమానం కావాలి! క్రియాశీల సాగు సాహిత్య విస్ఫోటనం కావాలిప్పుడు.

**"రైతు పాదాల నుండి పాకి**
**చేతులపైకెక్కుతోంది**
**నూతన ప్రపంచం!**
**నేల అతడిది; లోకం రచన అతడిది**
**సౌందర్యమతడిది;**
**పిడికెడు మట్టిలో**
**గరిసెడు గ్రామాలతడు**
**పట్టెడు సారంలో**
**పుట్టెడు పట్టణాలతడు**
**ప్రవాహం రైతు!"**
**అమృత సారమూ అతడే**
**అగ్నిశిల్పమూ అతడే "** **(ఛాయరాజ్)**

నీటికి నడకలు నేర్పిన హరిత గీతి అతడు!

నీటితో – నిప్పుతో చెలగాటాలాడితే ఏమవుతుందో చరిత్ర చెబుతోంది!

నాగరికతకి పునాదిగా నిలబడిన తల్లివేరు కదా అతడు!

రైతు లేనిదే రాజ్యం లేదు – ఏరు పుయ్యడం తెలిసినవాడు – రైతు – రాజ్యమేలడం చెప్పాలా! అతడికి!!

ఈ మహత్తర ప్రజాతంత్ర పోరాటానికి ఢిల్లీ ఆటపట్టు కావాలి.

భ్రమల నివురు నినాదాల హోరుకి ఎగిరిపోతోంది!

రైతాంగ ఉద్యమ పోరు నిప్పుకణికలై రగిలిపోతూ వుంది!!

**23-12-2020**

సమకాలీనం

# అశేష రైతాంగపు వీరోచిత ఢిల్లీ ముట్టడి! పోట్లగిత్తలాంటి పాలకుల దూకుడుకు ముక్కుతాళ్లతో కట్టడి!!

**కరోనా** పీడిత విషాద పీడకలలతో 2020వ సంవత్సరం మిగిలిపోతుందేమో అనుకునే సమయంలో … మరో మహాభారత సమరోధృతితో దేశ రాజధాని ఢిల్లీని రైతాంగ వీరులు ముట్టడించటమే కాక, దాన్ని మొక్కవోని పోరాట దీక్షతో కొనసాగిస్తున్నారు. దాని చారిత్రాత్మక స్ఫూర్తిని మనకు అందించబోతున్నారు. భవిష్యత్తు పోరాటాలకు ముఖద్వారంగా నిలబెడుతున్నారు.

ప్రపంచ మార్కెట్ శక్తుల బడా కార్పొరేట్లు ఆడించే తైతక్క లాట తప్ప అసెంబ్లీల్లో పార్లమెంటులలో ప్రజల సమస్యలకు, పీడిత రైతాంగ జీవన సంక్షోభాలకు నిష్కృతి లభించదని పాలకులే చెప్పక చెబుతున్నారు. ప్రజావ్యతిరేక కఠిన చట్టాలను ఏకపక్షంగా చేసుకుపోవటం ద్వారా వాటిని తిరస్కరించాల్సిన, ధిక్కరించాల్సిన, బజారులలో తేల్చుకోవలసిన తప్పని స్థితిలోకి ప్రజలను నెడుతున్నారు. కోవిడ్ లాంటి మహా విపత్తును కూడా పాలకులు తమ కార్పొరేట్ యజమానులకు అనుకూలంగా మార్చుకోగలరని మరొకసారి 2020వ సంవత్సరం రుజువు పరిచింది.

కోవిడ్ మహమ్మారిని ఎదుర్కోవడంలో నిర్లక్ష్యపూరితంగా వ్యవహరించిన కేంద్ర పాలకులు, వారి కార్పొరేట్ సంపన్న వర్గాలు – పట్టణాలు నగరాలలో జీవిస్తున్న కోట్లాది అసంఘటితరంగ శ్రామిక ప్రజానీకపు నిరుపేద కుటుంబాలను గాలికొదిలేశారు. కనీస ప్రయాణ సౌకర్యాలకు కూడా నోచుకోని ఆ సన్నజీవాలు, కాలిబాటన, రైలుపట్టాల వెంబడి వందల, వేల కిలోమీటర్లు కుటుంబాలకు కుటుంబాలు సంసారపు మూటలను నెత్తిన పెట్టుకొని నడుచుకుంటూ తమ జీవన మూలాలైన గ్రామాలను వెతుక్కుంటూ చీమల బారుల్లాగా రోజుల తరబడి సాగిపోయిన మహా పాదయాత్రను దేశం దేశమంతా గమనించింది. ఆ శ్రమజీవులను తమతమ గ్రామాలు తిరిగి అక్కున చేర్చుకున్నాయి. కార్మిక – కర్షక జీవ సంబంధాలను మరొక్కసారి కోవిడ్ దాడి స్పష్టం చేసింది.

ప్రజల కదలికలను, ఉద్యమాలుగా సమీకరణం కావటానికి ఎన్నో అడ్డంకులను పరిమితులను విధించిన కోవిడ్ కాలంలోనే, కార్మిక కర్షకులపై మొత్తంగా నూటికి 90 మంది దేశ ప్రజానీకంపై చట్టబద్ధ దాడి కావించడానికి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పూనుకుంది 44 కార్మిక చట్టాలను నాలుగు 'కోడ్లు' కింద కుదించి కార్మిక హక్కులను హరించింది. వ్యవసాయరంగ సంస్కరణలు పేరుతో 3 వ్యవసాయ చట్టాలను, విద్యుత్ పంపిణీ చట్టాలను ఏకపక్షంగా ఆమోదించుకుంది.

ఆ మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, తమ కార్మిక సోదరుల తరిమివేతకు కారణమైన కేంద్ర పాలకుల రాజధాని నడిబొడ్డులోకి లక్షలాది కర్షక వీరులు నేడు ముట్టడిగా తరలి వచ్చారు. నవంబరు 26న దేశవ్యాప్తంగా బందుకు పిలుపునిచ్చిన కార్మిక వర్గానికి సంఘీభావంగా తమ వర్గ బంధువులైన కర్షకులు కూడా ఢిల్లీ మహానగరంలోకి తరలివచ్చి వారితో చేతులు కలిపారు. నాటినుండి గడిచిన నెల రోజులుగా దేశ రాజధాని నగరం ప్రధాన రహదారులను కట్టడి చేస్తూ పాలకులను నడిబొడ్డులో చేయివేసి నిలవేశారు. ఈ నెల 8న రైతాంగ పోరాటానికి మద్దతుగా దేశవ్యాపితంగా సమస్త ప్రజానీకం తమ తమ పద్ధతులలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

పుల్వామా దాడి పుణ్యమా అని ఎన్నికల ముందు ఉన్మాదాన్ని సృష్టించి అత్యధిక సీట్లను సంపాదించుకున్న భాజపా, తన కార్పొరేట్ ఎజెండాకు మతోన్మాదాన్ని జోడించి దూకుడుగా ఫాసిస్టు పొగరుని ప్రదర్శిస్తున్న దురహంకారానికి నేటి కర్షకుల ముట్టడి, పోట్ల గిత్తను ముక్కుతాళ్లతో బంధించినట్లయింది.

మన తెలుగు నాటకంలో యమధర్మరాజు "సావిత్రీ! ఏ వరమైనను కోరుకొనుము, అదియు నీ పతి ప్రాణంబు దక్క" అన్నట్లు "ఎలాంటి సవరణలు చేయాలో చెప్పండి, మూడు చట్టాలను ఉపసంహరించుకోవడం తప్ప" అని పాలకులు చర్చల పేరిట రైతాంగాన్ని వారి నాయకత్వాన్ని మొత్తంగా భారత ప్రజానీకాన్ని బులిపించే ప్రయత్నం చేస్తున్నారు .

ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ ఉంటే, రైతాంగం పట్టుదలతో సంఘటితంగా మొక్కవోని ధైర్యంతో అసమాన సాహసంతో నిలబడ్డారు.

సుమారు లక్ష ట్రాక్టర్ గూడు బండ్లతో, ఆరునెలలపాటు సరిపడా నిత్య జీవితావసరాలతో గ్రామాలకు గ్రామాలు తరలివచ్చాయి. మొదట ఒక్క పంజాబీలే అనుకున్నారు. తర్వాత హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ ఇటీవల మహారాష్ట్ర నుండి కూడా వేలాదిగా రాజధానికి రైతాంగం తరలివస్తున్నారు. నెల రోజులు గడిచిపోయాయి. రైతుల బిగువు సడలుతుందనుకున్న ప్రభుత్వ ఆశలు నిరాశలవుతున్నాయి.

రైతాంగ ఉద్యమ ప్రతినిధులతో ఇప్పటికి ఐదు సార్లు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు చర్చలు జరిపారు. వ్యవసాయ ఉత్పత్తులకు, చిన చేపను పెద్ద చేప మింగే స్వేచ్ఛా విపణిలో కనీస మద్దతుధర లభిస్తుందని నోటి హామీలు చాలా ఇస్తున్నారు. ప్రతి చిన్న పారిశ్రామిక ఉత్పత్తికి అమ్మకపు ధర ముద్రింపబడి ఉంటుంది. అది తప్పనిసరిగా లాభాలు జోడించుకుని దాని ఉత్పత్తి ఖర్చులకు మించే ఉంటుంది. వ్యవసాయ ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు తక్కువ కాకుండా కొనుగోలు చేసే చట్టబద్ధ ఏర్పాటుని రైతులు కోరుతున్నారు. అందుకే ప్రస్తుత మూడు చట్టాలను ఉపసంహరించుకుని మద్దతు ధరను చట్టబద్ధంగా ప్రకటించమని కోరుతున్నారు.

పెద్దపులుల సంతలో మేకలకు న్యాయం జరగదని రైతులకు అనుభవమే! అయినా బడా కార్పొరేట్ కంపనీలు వారి స్వేచ్ఛా విపణి అంటే ప్రజలకు, ప్రత్యేకించి రైతాంగానికి మేలు చేసేదే తప్ప ఎలాంటి కీడు జరగదని పాలకవర్గ మీడియా నిండా వారి మేధో ప్రతినిధులు

రంగురంగుల కలల ప్రపంచాన్ని చూపిస్తున్నారు. రైతాంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలన్నిటికీ స్వేచ్ఛా మార్కెట్‌లోనే పరిష్కారం ఉందని బుకాయిస్తున్నారు. ఒకరయితే ఇప్పటికే రైతులు కొనుగోలు చేస్తున్న ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, ట్రాక్టర్లు, డీజిల్ ఆయిల్ ఇవన్నీ కార్పొరేట్ వారివి కాదా? అంటూ మార్కెటింగ్ వ్యవస్థ కూడా కార్పొరేట్ అవటాన్ని సమర్థిస్తూ మాట్లాడారు. నిజమే మరి! గత పాలకులంతా కలిసి నేటి రైతాంగాన్ని ఇప్పటికే పీకలదాకా నీట ముంచితే, ఇక నుంచి స్వేచ్ఛా మార్కెట్లో తలను కూడా ముంచి, ఉన్న ఈ కాస్త ఉసురు కూడా మిగల నివ్వకుండా చేస్తారన్నమాట!

## మనకు జీవాధారం వ్యవసాయరంగం

నూటికి ఏ ఐదుగురుకో పదిమందికో తప్ప మన గ్రామీణ జీవన వ్యవస్థ అయిన వ్యవసాయ రంగంతో ప్రత్యక్ష పరోక్ష జీవ సంబంధం లేనివారే ఉండరు. అందుకు ముఖ్య కారణం ఏమంటే మనకు వ్యవసాయం వృత్తి కాదు జీవన విధానం. తరతరాలుగా వ్యాపించి ఉన్న సామాజిక సంస్కృతి.

సాధారణ ప్రజానీక మంతా ఢిల్లీ దాకా వెళ్ళలేకపోయినా రైతాంగ ఉద్యమానికి సానుకూలంగా ఉన్నారు.

వామపక్ష పార్టీలు కాక ఇతర రాజకీయ పార్టీలు ఈ పోరాటానికి మద్దతు ఇస్తున్నారు. ఆఖరికి అధికార పక్షంలో ఉన్న ప్రభుత్వాలు కూడా వ్యతిరేకంగా మాట్లాడగలిగిన స్థితిలో లేరు, దాన్ని ప్రజానీకం హర్షించరని తెలుసు కనుక!

కెనడా దేశపు ప్రధానమంత్రి నేడు సాగుతున్న రైతాంగ ఉద్యమం ప్రారంభమైన కొద్ది రోజులలోనే ఇది చాలా న్యాయమైనదేనంటూ బహిరంగ ప్రకటన చేశారు. మూడు రోజుల క్రితం అమెరికా దేశపు డెమోక్రటిక్ మరియు రిపబ్లికన్ సెనేట్ సభ్యులు ఏడుగురు రైతాంగ ఉద్యమానికి సానుకూలంగా ఒక విజ్ఞప్తిని విడుదల చేశారు. లండన్ నగరంలో కూడా భారతీయ సంతతికి చెందినవారు ఆందోళన చేస్తున్నారు. ప్రపంచవ్యాపితంగా వామపక్షశక్తులు భారత రైతాంగ విజయాన్ని కాంక్షిస్తున్నారు.

భారతీయ జనతా పార్టీ పచ్చగా నిలవాలన్నా, ఏపుగా ఎదగాలన్నా ఉన్మాద మత ఎజెండా చుట్టూ దేశమంతా తిరుగుతూ ఉండాలి. దానికి భిన్నంగా ఇప్పుడు రైతాంగ సమస్య కేంద్రంగా చర్చ జరుగుతున్న సమయంలో వారి అబద్దాల ఫ్యాక్టరీ రైతాంగ సమస్య చుట్టూ చిలవలు పలవలుగా గోబెల్స్ ప్రచారాన్ని సాగిస్తున్నారు.

తాము అక్రమంగా అనైతికంగా ప్రజాస్వామికవాదులను మేధావులను, 80 ఏళ్లు పైబడిన వారిని కూడా అరెస్టు చేసి, రెండేళ్లుగా బెయిలు కూడా అందనివ్వకుండా చూస్తూ, జైలుపాలు కావించిన దాన్ని సవరించుకుని విడుదల చేయమంటూ రైతాంగ ప్రతినిధులు కోరినందుకు తప్పుబడుతూ స్వయంగా ప్రధానమంత్రి ఉద్వేగాలు రెచ్చగొడుతున్నాడు. వారు చట్టబద్ధంగా రుజువైన నేరస్తులు కారని అక్రమంగా రెండేళ్లపాటు బెయిలు కూడా అందకుండా నిర్బంధంలో గడుపుతున్నారనే సత్యాన్ని కప్పిపుచ్చుతున్నారు. నగ్నమైన ఇలాంటి ప్రభుత్వ దాడిని ఉద్యమకారులు ఖండించలేకపోతే, రేపు వారు ఎదుర్కోబోయే నిర్బంధాన్ని ఖండించగల నైతిక బలాన్ని ఉద్యమం కోల్పోతుందని తెలుసు కనుకనే ఒక ప్రజాస్వామిక హక్కు సూత్రంగా మేధావుల విడుదలను వారు డిమాండ్ చేశారని మనం భావించాలి.

కోవిడ్ వ్యాధి పేరుతో దేశమంతా లాక్డౌన్ విధించిన తరువాత ప్రపంచంలో మరే దేశం కన్నా మన దేశపు ఆర్థికవ్యవస్థ ఏప్రిల్ – జూన్ నడుమ 24% వెనుకకు పోయింది అంటే – మైనస్ 24% అన్నమాట! అట్లాంటి రోజుల్లో ఒక్క వ్యవసాయరంగం మాత్రమే నాలుగు శాతం అభివృద్ధిని సాధించింది. దేశం దేశమంతా వలస కార్మికుల తీరున ఆహార లేమితో ఈతి బాధలు పడకుండా కాపాడింది వ్యవసాయ రంగమే! తమ వ్యాపారానికి లాభసాటిదయిన మన వ్యవసాయరంగాన్ని పూర్తిగా కబ్జా చేయడానికి ప్రపంచ – దేశీయ కార్పొరేట్లు దశాబ్దాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. గతంలో బ్రిటిష్ వలసవాదులు భారతదేశం అంతా తమ మిలటరీ శక్తులతో, రాజకీయ కుయుక్తులతో ఆక్రమించు కోవడానికి ప్రయత్నించినట్లు, ఇప్పుడు అధికార మార్పిడి తదనంతరం సహాయం, అప్పులు, తాకట్టు, అమ్మకం, సంపూర్ణ ఆర్థిక దురాక్రమణ లాంటి రూపాలలో నయా వలసవాద పద్ధతులలో ప్రయత్నిస్తూ వస్తున్నారు. 1966లో గ్రీన్ రివల్యూషన్ పేరిట ఆరంభమైన హరిత విప్లవం తర్వాత (బాబ్రీ మసీదు రాజకీయాలను వెంట నిడుకొని వచ్చిన) 1991 నాటి డంకెల్ ప్రతిపాదనల క్రమమంతా అందులో భాగమే. తాము ఎదుర్కొంటున్న ఆర్థిక రాజకీయ సంక్షోభ ఫలితంగా అనివార్యంగా సంభవించే ప్రజల నిరసనను ఆందోళనలను ఒక తాటి మీదికి రానివ్వకుండా ఎన్నో రకాల సామాజిక సాంస్కృతిక విచ్ఛిన్నాలకు పాలకులు పాల్పడ్డారు. అందులో హిందూ మతం పేరిట పెంపొందించుకుంటూ వచ్చిన మతోన్మాదం ఒకటి. అది కార్పొరేట్ వర్గాలకు తిరుగులేని దోపిడీ అవకాశాలను కల్పించే రాజకీయ నిరంకుశ శక్తి. కాశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా విదేశీ స్వదేశీ కార్పొరేట్లకు దోపిడి స్వేచ్ఛను కల్పించడమే నేటి పాలకుల ఎజెండా ! దీనిని వారు గత పాలకుల నుండి అందుకుని, వారికి సాధ్యం కానంత వేగంగా అమలుపరచడానికి పూనుకుంటున్నారు. “ఒకే దేశం; ఒకే చట్టం; ఒకే మార్కెట్; ఒకే పార్టీ; ఒకే భాష; ఒకే మతం ఇలాంటి పారిభాషిక పదాలన్నీ బడా కార్పొరేట్ల అడ్డూ అదుపు లేని దోపిడీ ఎజెండాలో భాగమే! కాశ్మీరులో భూములన్నిటినీ కార్పొరేట్లకు, తోచిన రీతిలో దఖలు పడే విధంగా, ఆ రాష్ట్రానికి ఉన్న స్వయంప్రతిపత్తిని నిర్లక్ష్యంగా రద్దు చేసింది కూడా అందుకే!!

భాజపాకు వెన్నుదన్నుగా ఉన్న కార్పొరేట్ల బలసంపదకు కేంద్ర పోలీసు బలగాల చట్టబద్ధ అధికారాలను, ఆర్ ఎస్ ఎస్ అర్ధ సైనిక శక్తితో కలిసి ముస్లింలపై దళితులపై ప్రశ్నించే మేధావులపై దాడులు చేయిస్తూ దేశం దేశం అంతా కార్పొరేట్ల సామ్రాజ్యంగా మార్చే ఆర్థిక రాజకీయ ఎజెండా అమలు పరుస్తున్నారు. ఈ దుష్ట మాంత్రికశక్తి ముందు ప్రాంతీయ పార్టీలు వారి ప్రభుత్వాలు అణగారిపోవడమో లేక లొంగి బ్రతకటమో తప్ప, తలెత్తుకుని చట్టబద్ధ అధికారాల కోసం కూడా ప్రశ్నించలేని దుస్థితికి దిగజార్చుకుంటూ వస్తున్నారు.

ఇక్కడ ఆంధ్ర దేశంలో పెద్ద వీరుల్లాగా కులం కత్తులతో కాట్లాడుకుంటున్న అధికార ప్రతిపక్ష పార్టీలు, కేంద్ర ప్రభుత్వం దగ్గరకు వెళ్లి చెరొక కాలు మీద సాగిల పడుతున్నారు.

ఇదే కొనసాగితే వలస పాలన కాలం నాటి రాచరిక సంస్థానాధీశు లు అనుభవించిన పాటి స్వయంప్రతిపత్తిని కూడా రాష్ట్ర పాలకులు కోల్పోతారు. భాజపా పాలకుల ఫాసిస్టు తరహా ధోరణులన్నీ కార్పొరేట్ రాచరికపు ప్రజాస్వామ్య యుగ నయావలస లక్షణాలనుకోవాలి.

తమ వ్యాపారానికి అడ్డు లేని ఏకీకృత మార్కెట్ ఎంత బలంగా రూపొందితే అంత మంచిదని కార్పొరేట్ వర్గాలు కోరుకుంటాయి కదా!

అందుకే! నేటి రైతాంగ ఉద్యమం బహుళజాతుల, స్వదేశీ కార్పొరేట్ల విచ్చలవిడి దోపిడీకి అవకాశాలిచ్చే చట్టబద్ధ విధానాలకు దేశవ్యాపిత ప్రతిఘటన! బహుళజాతుల, స్వదేశీ కార్పొరేట్ల అడ్డుకట్ట! 1857 నుండి నేటిదాకా అసంపూర్ణంగా మిగిలిపోయిన జాతీయోద్యమ కర్తవ్యాలు తిరిగి ఎజెండాగా రంగ ప్రవేశం చేయటం! ఆరుగాలం కష్టించి పంటలు సృష్టించే రైతాంగానికి హక్కు భుక్తం కావాల్సిన భూమి కార్పొరేట్ గద్దల పాలుకాకుండా నిలువరించే ప్రజాతంత్ర స్వభావం కల పోరాటం!

నూతన ప్రజాస్వామ్య విప్లవ ఆవశ్యకతను భారత సామాజిక సమస్యల కేంద్రకం వ్యవసాయరంగంలో వున్నదని మరొకసారి బలంగా చాటుతున్న రైతువీరుల పోరాటస్ఫూర్తిని దేశమంతా వెదజల్లుదాం!

**26-12-2020** **- దివికుమార్** ✸

# అనారోగ్యంతో, పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ప్రముఖ రచయిత కామ్రేడ్ సిహెచ్. మధుకి ఆర్థికంగా చేయూతనిద్దాం!

**76 ఏళ్ల** సిహెచ్. మధు నిజామాబాద్ పట్టణ వాసి. గత 50 ఏళ్లకు పైగా అనేక రచనలు – కథలు, నవలలు, కవిత్వం, వ్యాసాలు – రాసిన ఇప్పటికీ రాస్తూ ఉన్న సిహెచ్ మధు, గడిచిన ఎనిమిది నెలలుగా క్యాన్సర్ వ్యాధిగ్రస్తుడై తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. మధ్య తరగతి స్థాయి ఆర్థిక స్థితిగతులు కూడా లేని మధు, తన వైద్య ఖర్చులకే కాక కుటుంబ జీవనానికి కూడా కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి. రచయితలుగా సాహిత్య పాఠకులుగా ఈ పరిస్థితుల్లో ఆయనకు మనం ఏ మేరకైనా చేయూతను అందించడం ఒక కనీస ఊరట కలిగించేదిగా ఉండగలదు.

'ప్రజాసాహితి' ప్రారంభ సంచికలోనే (ఆగష్టు 1977) సిహెచ్. మధు కథను రంగనాయకమ్మగారు ప్రచురించారు. 'స్వాతి' పత్రిక నవలల పోటీలో మొదామొదటి బహుమతి మధు అందుకున్నారు.

ఆయన నిజామాబాద్ నుండి 'జలపాతం' అనే మాసపత్రికను సుమారు పది సంవత్సరాలకు పైగా నడిపారు. పౌరహక్కుల సంఘం, విప్లవ రచయితల సంఘం నిజామాబాద్ జిల్లా నాయకత్వ బాధ్యతలను నిర్వహించారు. అనేక ప్రజా ఉద్యమాలలో ప్రత్యక్ష పాత్ర పోషించారు. ఇటీవల కాలంలో 'ప్రజాసాహితి' మాసపత్రికలో కథలు కవితలను, 'నవ తెలంగాణ' దినపత్రికలో సామాజిక రాజకీయ అంశాలపై వ్యాసాలను విస్తారంగా రాస్తూ ఉన్నారు. మిత్రుల అభిమానంతో 2 – 3 ఏళ్ల క్రితం ఒక కవితా సంకలనం వెలువడింది. త్వరలో మరొకటి "పోరాటం" పేరుతో రానున్నది.

ఇంకా పుస్తక రూపాన్ని పొందని వందలాది రచనలు చేసిన సాహిత్యకారుడు ఆయన!

అసమానతలతో కూడిన భారత సామాజిక వ్యవస్థలో మౌలిక మార్పులు రావాలనే ప్రగాఢ ఆకాంక్షతో ఆయన సాహిత్య సామాజిక కార్యక్రమాలు సాగాయి.

ఇప్పటి వరకూ ఊర్లు తిరుగుకుంటూ సాగించిన కొద్దిపాటి బట్టల వ్యాపారంతో సాగిన ఆయన జీవనం .. కరోనాతో అస్తవ్యస్తం కాగా, కాన్సర్ వ్యాధితో పూర్తిగా కుంటుపడింది.

కామ్రేడ్ మధుది ధిక్కార స్వరం. పాలకుల మెర మెచ్చులకు, లాలింపులకూ లొంగని కలం! ప్రజా ఉద్యమాలనే నమ్ముకున్న నిబద్ధజీవి!

రచయితలుగా, సాహిత్య అభిమానులుగా, ఉత్తమ పాఠకులుగా, ప్రజాసాంస్కృతికోద్యమ సానుభూతిపరులుగా కామ్రేడ్ సిహెచ్. మధుకు ఆర్థికంగా, మీ వంతు సహకారాన్ని అందించండి.

మధు బ్యాంక్ నంబర్ వివరాలు ఈ క్రింద ఇస్తున్నాం.!!

**Ch.Madhu, నిజామాబాద్,**

**SBI**

**A/c no. 62067096181**

**IFSC code SBIN0020310**

ఇట్లు,

**15-12-2020**

**కొత్తపల్లి రవిబాబు**, ప్రధాన సంపాదకులు ప్రజాసాహితి

**దివికుమార్**, జనసాహితి అధ్యక్షుడు

ఈ క్రింది ఫోను నంబరులకు సమాచారం ఇవ్వగలరు. పొందగలరు.

**94401 67891, 94901 96890**

కథ

# పెనం మీంచి పొయ్యిలోకి

– గౌరీశంకర్

"ఏరా అప్పల్నాయుడూ, ఏడకెల్తిత్తన్నావురా?" అడిగేడు సిమ్మాద్రి.

"మన మేస్త్రుగోరు కబురంపితే పొయ్యొత్తున్నాను".

"ఎవురు, ఎడ్మేస్త్రుగోరా?"

"కాదురా, మన గురువుగారు నాగరాజు మేస్త్రుగో(ౖరా".

"అవున్రా, మన గురూగారు మల్లీ మనూరొచ్చి(న్రంత గదా, బావున్నా(రా?"

"అప్పుడెలగుండ్రో విప్పుడూ అలగే వున్నా(రా.... మనల్ని సూత్తే గొప్పగ కులాసవుద్దిరా ఆరికి".

"అద్చురేగానీ, ఇంతకీ ఎందుకు బిల్సేరేటి?"

"బీదా బిక్కీ, మాలా మాదిగా, రైతూ, కూలీ.... అందరూ గావా(లా ఆయనికి"

"మన్నిన్నప్పటినుండి అదే తీరాయన్ది, మనకి తెలన్దేవుంది? ఇంతకీ అసల్చంగతి సెప్పినావుగాదు...."

"నాన్సెప్తుంటే మజ్జిలో దూరీ.... మరేం నేదురా, యవుసాయం ఎట్టుంద్రా అని వాకబు సేసినారు."

"ఆరికెందుకురా సేద్దెం గురించిప్పుడూ..? అయినా సెప్పడానికేటుంద్రా.... కడుపు సించుకుంటే కాల్లమీద పడతంది...."

'అదే అన్నాన్నేను'.... అంటే, 'అందుకే(న్రా పెద్దన్నగోరు మీ కోసరవని మాంచి సట్టాలు సేసినారన్నారు.'

"ఏందో ఆ సట్టాలు...?"

'మనకి గొప్పదురుస్టం పట్టీసినాదట, యేటంటే ఇకమీదట్నుండి మన పంటల్ని మార్కెట్టుకే తీస్కెల్లాలని రూలేం లేదట. మనిస్టవచ్చినకాడ అమ్ముకోవచ్చట....'

"అంతే(ట్రా....?" సోదారం మార్కెట్టి కట్టుకెల్నాం.... ఆడ మనవనుకున్న దర రానేదు, గప్పుడనకాపిల్లో, నేకపోతే యే గుంటూరో పోయి ఆడమ్ముకుంతావన్నమాట..... అంతేనా?

"కరెస్టుగ జెప్పినా(వ్రా.... యవసాయ దారులంటే గవురుమెంటోడికి అంతెకసెక్కవై పోనాది. మనం పండించిన పంటల్ని కూరగాయల గంపని నెత్తిమీనెట్టుకొని కొంప కొంపకీ తిరిగమ్ముకున్నట్టు మనం గూడా ఒక్కో మార్కెట్టికీ తిరుగుతూ అమ్ముకోవాలి గావోల్సు.... ఈ తిరగడానికెంతవుద్దీ.... అసలు మార్కెట్టుకేత్తే సావుకార్లందరూ కుమ్మక్కవ్వకుండా ఆల్లనెవురాపగల(రా? ఆల్లందర్నీ కాదని మనకి రేటిచ్చే నాదునెవడట?"

"ఇంతకీ గవుర్మెంటోడు మనకి సరైన రేటిత్తాడా, ఇవ్వడటా..... అదేవైనా సెప్పేరా?"

"దీనెనకాలున్న మాయాజాలం సెప్పే(రా.... ఆరు సెప్పినియ్యింటుంటే బు(ర పాడైపోనాదనుకో. గిట్టుబాటు దర ఊసెత్తకుండా, మార్కెట్లో మంచి రేటిచ్చి గవుర్మెంటే కొంతాదనకుండా, మీకు నచ్చిన కాడికట్టికెల్లి అమ్ముకోవచ్చని అంతన్నారట గదా. దానర్దం మార్కెట్టు కమిటీల్ని ఎత్తీదవట. అప్పుడేటవుద్దీ.... మార్కెట్టికి రావాల్సిన పీజులు రాకుండా పోతాయి, మనకాడ కమీసన్లు తీస్కొని కొనుగోలు సేసే సిన్న సిన్న సావుకార్లూ నెత్తిమీన గుడ్డేసుకోవాల్సిందే...."

"మరి పెద్ద రైతులు పండించే పంటలన్నీ ఏడకు బోయి అమ్ముకోవాలె?"

"గదే నానూ అడిగినా(న్రా..... దిప్పుడు సూడు, వొయిజాగులో పెద్ద పెద్ద సాపుల్లో బట్టలూ, బంగారాలు, టీ.వీ.ల్తో పాటు బియ్యాలు, పప్పులూ, ఉప్పులూ, కూరగాయలూ, పళ్ళూ.... అన్నీ కలిపి ఒక్కలే అమ్మీసుకుంతన్నారు గాదా.... అట్టాంటి పెద్ద పెద్ద కంపినీవోల్లు కొనీసుకుంతారట.... సివరికి ఆల్లు సెప్పిన రేటుకే మనోల్లంతా అమ్ముకోవాలి, నాబాలన్నీ ఆల్లట్టుకుబోతారు.... అదన్నమాట అసల్చంగతి!"

"వార్నీ, మనం దుమ్ములు సప్పరించు కోడవేనన్నమాట! ఇంకేటి సెప్పేరేటి?"

"యవుసాయం మన్సేత గానేదనుకుంటే, మనకి మంచి రేట్లు రాడం నేదు గనక, మనం కంపినీవోల్లతో కాంటాట్టు కుదుర్చుకోవచ్చట".

"అంతే(ట్రా?"

"అంతేనా? నానిందాకట వొయిజాగులో వున్న పెద్ద పెద్ద కంపినీ వోల్ల గురించి సెప్పినాను గాదా, అట్టాంటోల్తో ఓ పదెకరాలు ఆసామీ ఓ ఐదు సమచ్చరాల్కి కాంటాట్టు కుదుర్చుకన్నాడనుకో. ఆ కంపినీవోడు సెప్పిన పంటే ఎయ్యాల, పెట్టుబడి మనవే ఎట్టుకోవాల, కంపినీ తాలూకూ మదుసులొచ్చి తనికీలు సేసి మనకి చలహాలిత్తారట. రేటు కూడా ముందే మాటాడీసుకోవాల. అవసరవైతే కుసింత అప్పులిత్తారేవో!. చరే, పంట పండీసినాది., కోసీసినాం.... ఆల్లప్పుడొచ్చి పంటని సూత్తారట. పంట నాణ్యాన్ని బట్టి ఒకటో రకం, రెండో రకం, మూడో రకం అన్జేత్తారట. ఒకటో రకానికే మనం కుదుర్చుకున్న రేటిత్తారట, రెండో రకం, మూడో రకం నాసియ్యన్నమాట. ఆట్లికి ఆడికి నచ్చిన రేటే ఇత్తాడు.... ఇంకోమాట.... ఒకేల రైతుకీ, కంపినీవోడికి మద్దిన తగువులొత్తే కోర్టులు కూడా ఏవీ సెయ్యలేవట.... సూస్కో ఎలగుందో....!"

"వారినీ ఎంకమ్మ.... ఎటెల్నా కంపినీవోలే బాగుపడతరన్నమాట...."

"అంతేగా, రేయనకా పగలనకా, ఎండనకా వాననకా, అన్ని పాట్లు పడీ మన కండలు కరిగించి బంగారం పండిత్తుంటే పెద్దోల్లు గెద్దల్లా తన్నుకుపోత(న్రు, పుత్తడి ఆల్లకీ – ఇత్తడి మనకీ...."

"ఈ రెండూ కాదుగానొరే ఈటి కంటే ఘోరవైంది ఇంగోటి సెప్పినా(రా."

"ఈట్లికే బు(ర తిరగతన్నాది, ఇంగోటి కూడానా.... అది కూడా సెప్పు మరి....."

"మనవందరం వరి పండిత్తున్నా, ఎంతో కొంతకి అమ్మీసుకోని, సవగ్గా వత్తంది కదాని కోటా బియ్యం కొనుక్కోని తింతన్నాం గదా...."

"యేటి సేత్తాం మనం పండించుకున్న పంటని కూడా మనం అనుబగించలేక పోతన్నాం. రైతు కంటే దిక్కుమాలోడు ఎవుడూ ఉండ(డ్రా...."

"కోటాలో మనకిచ్చే బియ్యం, పప్పులు, పంచార, గోదుములూ ఇయ్యట్నీ గవుర్మెంటే

రైతులకాడ్నుంచి కొంతాదట. కొనీసి గవుర్మెంటు గోడాన్లల్లో నిల్వసేత్తాదట. అట్టా నిల్వసేసిందే దేశంలున్న పేదోల్లందరికీ ఇట్టా కోటాలో తక్కువ రేట్లుకి అమ్ముతారంట. అయితే పైవేటు కంపినీలు ఎంత బడితే అంత సరుకు కొనీకుండా ఆల్ల మీన గవుర్మెంటు కంట్రోలు సేత్తాదట...."

"ఆల్లని కంట్రోలు సెయ్యడవెందుకురా?"

"ఎందుకు సెయ్యాలా? అలా సెయ్యకపోతే మన్లాంటి బక్క రైతులకాడ సవగ్గా పంటలు కొనీసి ఆల్లకున్న పెద్ద పెద్ద గోడవున్లో స్టాకు సేసీసి, రేట్లు బాగా పెంచీసి అమ్ముకుతింటా రన్నమాట...."

"అమ్మనీ.... గవుర్మెంటోడు మంచిపనే సేత్తండన్నమాట!"

"అలగే.... మంచోడు మంచోడంటే కొండెక్కి కూకుండంట.... అట్టగుంది ఆలెవ్వారం...."

"అదేట్రా మల్లీ అలగంతావ్.... మల్లేదైనా పితకలాటం ఉందేటి?"

"మరి....? సావు కబురు సల్లగ సెప్పినట్టు ఇప్పుడు గవుర్మెంటోడు నిత్తావసర సరుకులు ఎంతైనా నిల్వ సేసుకోవచ్చని కంపినీవోల్లకి పరిమిసనిచ్చీసినాడట...."

"అంటే.....?"

"ఆ! అదే జరుగుద్ది. దీని వల్ల మనబోటి రైతుల్కే కాదు, జనాలందరికీ కూసాలు కదిలిపోతై. రేట్లు ఇబ్బిడి ముబ్బిడై జేబులు కాలీ అయిపోయి గూబలు వాసిపోతాయి."

"అమ్మ..... అమ్మ..... గవుర్మెంటోల్లు గుండెల్దీసిన బంటుల్రా.... ఈల్లు ఎవ్వర్నీ బతకనిచ్చేలా నేర్రా....."

'ఇంతకీ నీకెంత బూవుంది? అందల ఏటి పండిత్తన్నావ్' అన్నారు.

'నాకెంతుందండీ, రెండెకరాలు.... ఒకెకరంలో వరి సేను, ఇంగో ఎకరంలో సెరుకు సేనేత్తానండీ' అన్నాను.

"దాన్నెం ఎక్కడమ్ముతావు? ఏ మార్కెట్టుకి తీసికెల్తావ్? అన్నారు."

'మార్కెట్టులాంటియేం వుండవండి.... సావుకార్లే కల్లం కాడికొచ్చి ఎంతో కొంతిచ్చి అట్టుకుపోతారండీ' అన్నాను.

'గిట్టుబాటు దరొత్తుందా?' అన్నారు

'అట్టాంటియ్యేవీ మాకు తెల్దండీ.... సావుకారి దాన్నెం రంగు, గింజ సూసి దర కడతాడండి.... అటో యిటో తెగిపోద్దండి.... మార్కెట్టు కట్టుకెల్తే సార్జీలు కన్నం తప్ప, సావుకార్లందరూ ఏకవైపోయి పెద్దగా రేటేవీ పలకదండి' అన్నాను.

"అంతేగదట్రా.... పాపం కూరగాయ లేసుకునీవోల్లు టమాటాలు, వంకాయలూ ఎన్నిసార్లు మార్కెట్లుకి తీస్కెల్లి రేటు రానేదని రోడ్డు పక్కనే అయ్యన్నీ వగ్గీసి రానేదు.... మార్కెట్టుండవే గానీ అదంతా మాయని మేస్ట్రుగోరికేం తెలుత్తదిరా!"

'అవున్లే.... సెరుకేత్తన్నన్నావు గదా, అదెట్టాగుందేటీ అన్నారు.'

'అయ్యా, సెరుకు పండించడవంటే ఒల్లు పులిసిపోత్తండి.. జేబులు కాలీ అయిపోతయ్యండీ అన్నాను.

'అంతే గదరా.... దీనెమ్మ తస్సాగొయ్య.... ఎంత సాకిరీ సెయ్యాలా.. ఎంత మదుపెట్టాల..'

'దానికైనా మీరనుకున్న దరొత్తుందా అన్నారు.'

'ఎక్కడండీ.... కిందటేడు టన్నుకి రూ. 2500 లిచ్చేరు.... ఇయ్యేడూ అదే రేటంట' అన్నాను.

'ఎప్పుడ్నుండి అడగతన్నాంరా మూడేలైనా సెయ్యండీ అని.....

'మార్కెట్లో పందారకి రేటు పలకడం నేదన్సెప్పి, గీసి గీసి సేతిలో పెడతండ్రు....'

'అదే అన్నాన్నాను గూడా.... మరెందుకురా ఇన్ని పుర్రాకులు బడుతూ, ఆరుగాలం మట్టితోనే సావాసం జేత్తూ, నాబం రాకపోయినా, కనీసం పెట్టిన కర్సులైనా రానప్పుడు, వేలకి వేలు అప్పుల్దెచ్చి సెయ్యకపోతే....' అన్నారు.

'వరి పండిత్తన్నానంటే మూడ్నాలుగు కట్టలు ఇంట్లో తిండి గింజలకుంచుకోని మిగిలిందమ్మెత్తన్నాను.... కూలీ యెట్టుకోలేక ఒక్కోసారి నా పెల్లాన్ని, పిల్లల్నీ కూడా మడిలోకి దింపుతున్నాను. అలా కొంత కలిసొత్తాది.... ఇంక సెరుకంటారా.... నానే కాదు ఏ రైతైనా పేక్టరీ సేర్లు పోతయ్యని సచ్చినట్టు రేటొచ్చినా రాకపోయినా పండిత్తన్నాం' అన్నాను.

'మరి భార్యా, పిల్లలూ, ఆల్ల తిండీ, సదువులూ, ఆరోగ్గెం.... ఇయ్యట్నీ ఎలా సరిపెడతన్నావ్ అన్నారు.'

'యవుసాయంతో సాగనేక లారస్ కంపినీకి పోతన్నానండి.... ఇంకా సాలకపోతే తోట సుట్లుకి బోతానండీ' అన్నాను.

"యిన్ని ఇదాలుగా సాక్కపోతే బతుకెట్టా గడుత్తదిరా మన బోటోల్లకి? ఇంతే.... గానుగెద్దుల్లా అదే బతుకు.... సాలీ సాలని బతుకు.... సాగనేకపోతే బూవుల్ని బీడు పెట్టీసి ఏ సెన్నయ్యో, కాస్మీరో పోయి కూలిపన్లు సేసుకోడవే... ఇయ్యే గదా మన బతుకులు...."

'సరిగ్గా పాయింటుకొచ్చేవురా.... మేస్ట్రుగోరు ఇదే సెప్పినారు. యవుసాయాన్ని పండుగ సేత్తానని అంటూనే రైతుల్కి యవుసాయం గిట్టుబాటు కాకుండా సేత్తే, యేరే గత్తెంతరం నేక పెద్ద పెద్ద కంపినీవోల్లకి యెంతో కొంతకి బూవుల్నమ్మీసుకొని, టౌనుల్లో ఆల్లే ఎట్టుకున్న కంపినీల్లో సవగ్గా కూలోల్లుగా మారిపోతన్నాం.'

"మరే.... మన పొన్నవోలు రైతులెంత మంది సెన్నై పోతన్నారో సూత్తన్నాం గదా...."

'మరి, డిల్లీలో సుట్టుపక్కల ఐదార్రాస్ట్రాల్నుండి లచ్చల్లో రైతులు వేలకి వేలు టాక్టర్లు ఏసుకొచ్చీసి స్టైక్ సేత్తన్నారు, మనోల్లకేవైనా తెలుసునా అనడిగినారు.'

'ఆ.... టిబిల్లో సూత్తన్నాం గానీ అదేందో, ఎందుకు సేత్తన్నారో మనోల్లకెవురికీ తెల్దండీ' అన్నాను.

"నేనిప్పటివరకూ సెప్పిన సెట్టాలకి ఎతిరేకంగా ఉద్దెమం సేత్తన్నారు.... నారీల్లో ఆర్నెల్లకి సరిపడా సరుకుల్దెచ్చుకున్నారట. తాడోపేడో తేల్సుకోని గానీ మావెనక్కెల్లేది లేదని, గజగజ వడికింటే సల్లోనే తిని, తొంగుంటూ ఉద్దెమాన్ని మాంచి గట్టిగ సేత్తన్నంట."

'అటుపక్క దేశివంతా ఉడికిపోతంటే మనోల్లేట్రా, కనీసరం రోడ్డమీనకి కూడా ఎక్కడా రాడంనేదు.... ఎక్కడా ఆ ఊసే ఇనపడ్డం నేదు....? అనడిగినారు.'

"మనవా.... సార్లే..... మనకున్న అరెకరా, ఎకరా బూవుల్లో అప్పులూ సొప్పులూ సేసుకుంటూ, లారస్‌లకీ, మనాడోల్లని చెండిక్స్‌లకీ అంపుకుంటూ ఏదో మనవూ బతుకుతున్నాంలే అనుకునేటోల్లం, మనవెక్కడ సెయ్యగలం ఉద్దెమాలు? అటేపు రైతులంతా పెద్ద రైతులు కాబట్టి ఓ సమచ్చరం పంటెయ్యక పోయినా బతగ్గల్రు. ఆల్లకీ, మనకీ సాపత్తెం ఎట్టా కుదురుద్దీ....?"

'ఇలగే నానూ అన్నాన్రా.... దానికి ఆయనేవన్నారో తెల్సా, సువ్వే అంతన్నావు గదా అప్పల్నాయుడూ ఆల్లు పెద్ద రైతులనీ....

మరాల్ల పరిత్తితే బాగునేక రోడ్లెక్కి వందల మైల్లు టాట్టర్ల మీన ఎలిపొచ్చి, దేనికీ జంకకుండా అంతలా ఉద్దెమం సేత్తుంటేనే పెబుత్తం నిమ్మకి నీరెత్తినట్టు సూద్దాంలే.... ఏదో ఒకటి సేత్తాంలే అంతంది తప్ప సెట్టాల్ని ఎనక్కి తీస్కొనేది నేదంటంది గదా, అట్టాంటప్పుడు మీనాంటి బక్కరైతుల్నెవడు పట్టించుకుంటాడు? వచ్చీ రోజుల్లో మీ పరిత్తితి ఇంగా దారునవైపోదా? అనడిగినా(్రా....'

"అది కూడా కరెస్టేరా.... విప్పుడే మన పరిత్తితి కుడితిలో పడ్డెలకనాగ వుంటే ఈ సెట్టాలన్నీ పన్జెయ్యడం మొదలెడితే మన్చంగతి ఏటవుద్దంటావ్?"

"ఏవుందీ.... పెనం మీంచి పొయ్యిలో అడ్డట్టే!"

'మరి మేస్త్రుగోరితో ఏటన్నావ్?'

'దేశ రాజిదాన్లో నచ్చల మంది రైతులు అన్నింటికీ తెగించి ఉద్దెమం సేత్తుంటే, నాయంగా సూత్తే ఇదే చరైన టైము సారూ, దేశింల రైతులందరూ సెయ్యి సెయ్యి కలిపే దానికి.... కాపోతే సెప్పినాను గదండీ మాబోటి బక్క రైతులు అంత బేగా కదల్రండి.... కాదు.... కదల్లేరండీ..... కదల్చాలి సారూ.... కదల్చాలి.... కదలబారాలి.... కదల బారి బారులు బారులుగా, దండ్లు దండ్లుగా రాజదానికి వరసకట్టాలి!!! మావే గాదండీ, బతుకులు బుగ్గైపోతున్నోల్లందరూ గలవాల!!! ✷

కవిత

# పోరు బావుటాలైన పగిడీలు!

**- ఉదయ్**

నాగలి అలరించాల్సిన భుజాలపైనేనా
రెపరెపలాడే ధిక్కార జెండాలు!
నారుమడి బురదలో నర్తించాల్సిన పాదాలేనా
కసికసిగా ప్రవహించే పిడుగుల వడివడి అడుగులు!
చెళ్లున చెర్నాకోల తిప్పిన చేతుల్లోనేనా
అక్షరాలా కట్టెకు కట్టిన అట్టలు
పులుముకున్న హోరుధ్వనుల
ఆవేశాలు!
మడిచేల గట్లను తెంచి పారించిన నీళ్లేనా
పోలీసు ధారాపాత
శూలాల నాపే ఉత్తుంగ తరంగాలు ! ...
విత్తులై నారులై గింజలై
ఆకలితీర్చే అమృత దాతలేనా
నిప్పులై రవ్వలై జ్వాలలై రాజధాని రస్తాకెక్కిన కర్షకులు!!
వాహే గురూ వాహే గురూ అనే స్వర్ణమందిర భక్త జనులేనా
రక్షక భటాసురుల ఆంక్షల ఇనుపముళ్ల కంచెలనిరిచిన పంజాబీ కేసరులు!

పక్షానివో ప్రతిపక్షానివో నాలుగ్గోడల మధ్య నాలుకలపై నర్తించే పదాలు కావవి...
మైనస్ డిగ్రీల చలిగాడ్పులను సలసలా మరిగించి లావాలా ప్రవహింపజేసే నాగళ్ల నినాదాలవి !
తలవంచుకుని దుక్కులు దున్నే దుక్కిటెద్దు లొక్కసారిగా తలవిదిల్చినప్పటి మెడలో మోగిన గంటల పెనుధ్వనులవి !
తలపాగా వస్త్రాలొక్కసారిగా రుధిరం పూసుకున్న జెండాలై ఎగసెగసి పడే సెగమంటల భుగభుగలవి!

చిటపట పటియాలా, భగభగ భటిండా, అలల తలల అమృతసర్,
జ్వాలాజ్వలన జలంధర్, పఠాన్‌కోట్, ఫతేఘర్‌సాహిబ్, గురుదాస్‌పూర్,
హోషియార్‌పూర్.... పంజాబ్ టైగర్ల గర్జనల పెనుఉప్పెన
పంజాబ్ సింధూ గుజరాత్ మరాఠా...
ద్రావిడ, ఉత్కళ వంగా ఒక్కటేమిటి జాతీయగీతం పలికిన ఊళ్లన్నీ పిడికిళ్ల పిడుగులై హస్తినతీరం తాకిన పెనుతుఫాన్
రైతు బతుకుపాలిట శాపపు తాకీదుల అంతుతేల్చే భగత్సింగ్ జాతి దాల్చిన సునామీరూపు
ఢిల్లీ ఖిల్లా దద్దరిల్లే ధిక్కునామీరూపు! ప్రచండగాలుల తీవ్రాతి తీవ్ర వాయుగుండాల
వ్యవసాయ, విద్యుత్ చట్టాల రద్దుకై ఢిల్లీని చుట్టుముట్టిన ఉప్పెన కెరటాలయిన ఉప్పుటి చెమటధారలు !!! ✷

కవిత

# రైతన్నా జయం నీది

- సిహెచ్. మధు

**ఎత్తిన** పిడికిలి దించకు రైతన్నా
మీకు నా అక్షరం మద్దతుగా వుంటుంది
కవుల కలాలుంటాయి
కమ్యూనిస్టు కంఠాల సంగతి నాకు తెలియదు
కానీ
కోట్లాది జనం వెనుక వున్నారు
శ్రామికులు, కార్మికులు, శ్రమజీవులు
చెమట వంచే జీవితాలు
నీ వెనుకా ముందు వున్నారు
భారతం మొత్తం నీ వెనుక వుండి
నీ పిడికిలికి మద్దతుగా
నీ ఆగ్రహానికి అండగా
మీ సమష్టి గొంతులకు ప్రాణంగా
ఈ భారతం నీదె రైతన్నా
నేల నీది
విత్తనం నీది
నాగలి నీది
పంట నీది
మద్దతు ధర నీది కాదు
నీవు నిర్ణయించలేవు
రాజ్యం నీదంటారు
ప్రజాస్వామ్య భారతంలో
వైభోగం నీదని పాలకులంటారు
నిన్ను ఆకాశం ఎక్కిచ్చి
ఆకలితో చంపుతున్నారు
నీవు పండించిన పంటకు మద్దతు ధర నీదికాదు
పంట మీద అధికారం నీదికాదు
మద్దతు ధర కొరకు
పిడికిలెత్తిన రైతన్నా
నీకు భారత జాతి వందనాలు తెలుపుతుంది
ఎత్తిన పిడికిలి ఆకాశంపై అలాగే మెరుస్తూ వుండనీ
నీకు తోడుగా కోట్లాది పిడికిళ్లు వస్తున్నాయి
పోరాటం ప్రారంభించావు రైతన్నా
సెల్యూట్ రైతన్నా సెల్యూట్
నా రైతు జిందాబాద్
భారత రైతు జిందాబాద్
నీకు మద్దతు ధర దొరుకదు
ఇక్కడ సర్కారు - దళారీలు - దోపిడిగాళ్లు
కార్పొరేట్ సామ్రాజ్యం ఒకటే -
మనం వేరు
నీవు నేను కష్టజీవులం వీరు
చెమట పంచి
నేలమీద బంగారం పండిస్తాం
జనం ఆకలిని తీర్చుతాం
మనకు అతీగతి లేదు
సర్కారు మద్దతు లేదు
మద్దతు ధర యివ్వరు
పండించిన పంట ధర కొరకు నిలదీస్తే -
లాఠీలతో జవాబు చెపుతారు
ఎదురు తిరిగిన రైతన్నా
సెల్యూట్
నా జాతి రైతు జిందాబాద్
మెట్‌పల్లిలో రోడ్డెక్కాక
మద్దతు ధర అడుగకూడదంటే
పండించే ధాన్యం కొనాలి ఎవరూ
సర్కారు ఖరీదు చేయాలనే డిమాండ్
రైతు నుండి రావటం
పోరాటం ప్రారంభం
ఎత్తిన పిడికిలి దించకు రైతన్నా
పోరాటం ప్రారంభించావు
గుడ్ విషెస్ రైతన్నా
జాతి నీ వెనుక వుంటుంది
కష్టం నీది
ధర నీదికాదు
సర్కారు ధర నిర్ణయిస్తారు
దళారీల దోపిడికి చేయూతగా
ధర సర్కార్ నిర్ణయిస్తుందట
రైతన్నా -
నష్టం కానీ కష్టం గానీ -
ఇష్టం వుంటే అమ్ము -
ఇష్టం లేకపోతే కాలబెట్టు
కన్నీళ్ళు వస్తున్నాయి. రైతు బ్రతుకు అమవాస్య కావటం
సన్నపు వడ్లను ఎన్నో దగ్గర కాలబెట్టారు
ధర రానిదెందుకని -?
నెలరోజుల సూర్యాస్తమయాల మధ్య
ఎందరో రైతుల బలవంతపు అస్తమయాలు చూచాను
ధర రాక - అప్ప తీరక - ఆకలితో వేగలేక
కుటుంబాన్ని నడుపలేక
పిడికిలెత్తారు దించకు రైతన్నా-
సమస్త భారతం నీ వెనుక వస్తుంది

ఆరోగ్య మందుల ధరలు, ఇతర వస్తువుల ధరలు
కార్పోరేట్ సామ్రాజ్యం నిర్ణయిస్తుంది
పది ఉత్పత్తికి ఖర్చు అయితే
వంద దోచుకు తింటారు
ఎరువుల ధరలు వాళ్లే నిర్ణయిస్తారు
వంద అయితే వెయ్యి నిర్ణయిస్తారు
మనం అమ్మిన ధాన్యం
రెట్టింపు ధరకు మనకే అమ్ముతారు
నీవు పండించిన పంటను
రెట్టింపు ధరకు నీకే అమ్ముతారు
ఇది దోపిడి రాజ్యం
శ్రమ దోపిడి, సంపద దోపిడి
నీ కష్టం దోపిడి నీ సుఖం దోపిడి
నీ బ్రతుకు దోపిడి
రైతన్నా -

భారత జాతి నీ చేతిలో వుంది
ప్రజాస్వామ్యం నీ చేతిలో వుంది
రైతన్నా -
పోరాటాన్ని కొనసాగించు
పిడికిలెత్తు
ఎత్తిన పిడికిలి దించకు

పోరాటం భారతం విస్తరించింది
కోట్ల రైతుల భారత యాత్ర చేస్తున్నారు
ఒకటి ఒకటి
కోట్ల పిడికిళ్ళు ఎత్తండి!
జయం మీది
సర్కారు మనది కాదు
రైతన్నా
మనం మోసపోయాం

కవిత

# ముసుగులు లేవు

– కె. శాంతారావు

**అవును**
ఇప్పుడంతా బహిరంగమే
ముసుగులు లేవు
పాలకులే కార్పోరేట్లు
కార్పోరేట్లే పాలకులు
రైతులే ప్రజలు
ప్రజలే రైతులు
యుద్ధం కాని యుద్ధం
కష్టాన్ని భవితను
కబళించే పాలన ఓవైపు
ప్రజల్ని దేశాన్ని
కాపాడుకోవాలనే ఆలన మరోవైపు

బరిమీద రసవత్తరమైన
రాజ్యనాటకాన్ని చూస్తున్నాం.

విరాగివేషాలు యోగాసనాలు
మొసలి కన్నీళ్ళు
మోకరిల్లి మ్రొక్కడాలు
నెమలి నాట్యాలు, భాజాభజంత్రీలు
పాదపూజలు, ప్లాస్టిక్ పరివేతలు
ఓహ్! అంతా విన్యాసమే
హాస్యభరితమే....
కానీ నవ్వులు పూయవు
పొట్ట చేతపట్టుకుని
తాతల తండ్రుల వలస బతుకు
కాలంతోపాటు భారంగా
నడుస్తూనే ఉన్నది.

యుగయుగాలుగా
రక్తస్వేద సేద్యం
భూమంతా....
పరచుకునే ఉన్నది
కలలో ఇలలో
ఇదే జీవనధ్యాస కదా....!
పటాటోప నాటకాలకు
నవ్వులెలా పూస్తాయి?

పాలనలో ప్రజాస్వామ్యం
హరించుకుపోయిన వేళ ఇది.

చావో రేవో
విజయమో వీరస్వర్గమో
రాజధాని రహదారులు
భగత్‌సింగ్ బాటలో
ఎరుపెక్కుతున్నాయి.

ప్రాణాలొడ్డే పోరాటంకన్నా
పరమార్థమేముంది జీవితాన

అవును ఇప్పుడంతా
బహిరంగమే
ముసుగులు లేవు.

కవిత

# రైతు బతుకు

- కంచరాన భుజంగరావు

1. రైతు బతుకు
అన్నం మెతుకు!
అన్నదాత నోట్లో మట్టికొట్టి
వాణిజ్య వట వృక్షాలకు
ఎరువుగా వేయడానికి
కొత్తగా వేస్తున్న ఎత్తు
నూతన సాగు చట్టాల లోగుట్టు!

2. దానీ, బానీలను
ఇతరత్రా మీ వాణిజ్య
మిత్ర దిగ్గజాలను బులిపించుకోండి!
ఈ పెట్టుబడుల స్వర్గంలో
పునః పునః ప్రతిష్ఠించి
గగనాల ఎత్తుకి బలిపించుకోండి!
కానీ రైతు ఆశలకు
పాడెగట్టె ఆ పని చెయ్యొద్దు.

3. దశాబ్దాలుగా విస్తరిస్తున్న
మన దేశ సరళీకరణ విధానాలన్నీ
ప్రైవేటు పెట్టుబడులకు
సాగిల పడుతున్నాయి తప్ప
రైతుల రాబడి కోసం
తోడ్పడలేకపోతున్నాయెందుకు?

4. నిలువెత్తు మాటకారితనం
మహా లౌక్యంతో
దేశానికి వెన్నెముకగా
ప్రచారం పొందుతున్నపుడు
మట్టి మనిషి బతుకు
కనీస మద్దతు కోసం
పోరుకు సిద్ధమైంది..
వెన్ను విరిగిన
అన్నదాతల ట్రాక్టర్లు
రహదార్లపై నిరసిస్తున్నాయి..
అడుగు అడుగు జత కలిసి
అన్నదాతల ఉద్యమం
అనునాదమై ప్రకంపించి
పెద్ద కుర్చీని కుదేస్తుంది!

5. ఉపన్యాసాలలో
రైతులపై కురిపించే
అసాధారణ ఆదరణ
ఊక దంపుళ్ల ఉప్పెన!
నిజానికి భారత రైతాంగం
కోరుకునేది
ఆచరణ ఫలాలందించే
ఋతుపవనం!
సాగుబడి అనుకూలించే
సకాల హర్షావరణం!

6. మట్టి మర్మమేమిటో
తెలుసుకోగలిగాడు కానీ
తనని తరాలుగా
అస్వతంత్ర జీవిగానే ఉంచుతూ
రైతు సంక్షేమాన్ని వల్లిస్తున్న
శ్రేయోరాజ్యం నైజమేమిటో...
పాలకుల తీపి మాటల ఊటల్లో...
చేదు నిజమేమిటో
తెలుసుకోలేక పోతున్నాడు.

7. దేశంలోని వనరులన్నీ
కార్పొరేట్లకు
ఫలహారంగా మార్చేశాక
పెట్టుబడికి మరో దారి
కానరాలేదేమో?
దుర్గాహంతో
బక్క రైతుల పొలాల్లోకి
మళ్లింది!

8. రైతుకి
పంటే అస్తిత్వం
భూమే భూమిక
వ్యవసాయమే వ్యక్తిత్వం!
పొలాన్ని తన్నుకుపోవడానికి
ఎగిరి వస్తున్న గద్దల కోసం
పొలం పొలిమేరల్లో
వడిసెలతో సిద్ధం..
సాగుబడిలో దిగుబడి కోసం
మండీల్లో మద్దతు కోసం
చట్టాల గుదిబండలను
దాటించే నిబ్బరం కోసం
అనివార్యమైన యుద్ధం..!

9. పుట్లు, గరిశలుగా...
వైవిధ్యమున్న చోట
దేశానికంతటికీ
ఒకటే మార్కెట్టా?
దోచుకున్నోడికి దోచుకున్నంత!
సాగే బతుకు తెరువైన వాడిని
వంచించే గుంట నక్కల
బ్లాక్ ప్రైవేట్ మార్కెట్
పండించే వాడి కోసమా?
కొని తినేవాడి కోసమా?
ఈ ఇద్దరినీ
దోచుకుతినేవాడి కోసమా?

10. వెన్నుపూసను
నాగలి చేసి
చెమట నదులను ఏతం వేసిన
మట్టి బెడ్డల ముద్దు బిడ్డలు
రైతులు!
వారి శ్రమకు తగిన
ఫలితం ఇమ్మంటే ...
బతక నేర్చిన సోమరి పోతుల
తేమ శాతం లెక్కల్లో
కుక్కి పీనుగల్ని చేసి
గొంతు నొక్కాలని చూస్తారా?
మీ మార్కెట్ మాయాజాలం మాకొద్దు!
చట్టబద్ధమైన మద్దతు ధర
మా హక్కుల పొద్దు!

సజీవ సాహిత్యం

# శ్వాసకోసం.... దేశపు శ్వాసకోశం పడుతున్న సంఘర్షణ ఇది!!

**మన** వ్యవసాయ సంస్కృతిలో రైతాంగం అంటే దేశపు శ్వాసకోశం. అది సరిగా పని చేస్తేనే దేశం సజీవంగా ఉంటుంది. రైతాంగ సంక్షోభానికి కారకులెవరు? వ్యవసాయాన్ని దండగ మారిదిగా మార్చింది ఎవరు?

దీనికి పరిష్కారం ఎప్పుడు? ఎలా?? తెలుసుకోవడానికి ప్రయత్నం చేద్దాం!!

మార్కెటెకానమీ అంటే మహా మాయా మశ్చీంద్ర! సామ్రాజ్యవాదులు బడా కార్పొరేట్లు దోపిడీ రాజ్యపు అండదండలతో రైతులతో ఆడే శకుని పాచికల జూదం!!

రెక్కలు ముక్కలు చేసుకుని పంటలు పండించడం తప్ప ఎరుగని భారతదేశపు రైతాంగానికి ఈ దళారి మార్కెట్ శక్తులు మిగిల్చిందేమిటి? అయినకాడికి అమ్ముకోవటం, గిట్టుబాటు ధర కూడా అందనివ్వకపోవడం, ప్రభుత్వాల మద్దతు కోసం ఎదురు చూపులతో విసిగి వేసారడం తప్ప!! చివరకు దిక్కులేని దీనులై ఆత్మహత్యలపాలవడం తప్ప!!

ఒకరికి పెట్టడమే ఎరుగున్న అన్నదాతలు, చేయి చాచి అడగడం తెలియని మన రైతాంగం, ప్రభుత్వాల విధానాలు తమకు కనీస భద్రతను కల్పిస్తాయని దశాబ్దాలుగా ఎదురు చూశారు. మోసపు కళలో ఆరితేరిన పాలకులు శ్రమను నమ్ముకున్న రైతులని ఏళ్ల తరబడి వంచించారు. ఆత్మహత్యల పాలు చేశారు. జీవితానికి భద్రత అంటే ఏమిటో ఎరుగకుండా చేశారు.

"ఎంతకాలమీ నరకం! ఎన్నినాళ్ళు ఈ మోసం!

ఓ వంచక నాయకులారా

ఓ దళారి పాలకులారా!!" అంటూ నేడు ఢిల్లీ గద్దెను దాని నడి బజార్లోనే నిలదీసి ప్రశ్నిస్తున్నారు.

కరోనా మహమ్మారిని అడ్డంపెట్టుకుని, అడ్డగించే అవకాశం, ఉద్యమించే సందర్భం ప్రజలకు లేకుండా చేసి, అడ్డగోలుగా తమ బుల్డోజర్ మెజారిటీతో రైతాంగాన్ని భూమిలేని కూలీలుగా, కట్టు బానిసలుగా మార్చాలని క్రూర పరిహాసం ఆడారు. మీ మార్కెట్ జూదపు మాయ ఆటలు ఎల్లకాలం సాగవని అశేష రైతాంగం నేడు సంఘటిత శక్తిగా రూపొంది హెచ్చరిస్తున్నారు.

ఈ రైతాంగ పోరాటం ఒక అనంత జీవిత సంగ్రామం!!

"కల్లలేని కార్మికుడా కలత నిదుర వదులుకో!

అల్లుడుగో కర్షకుడు అతని చేయి అందుకో"

అని 55 ఏళ్ల క్రితం కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి రాశాడు.

పదిహేనేళ్ళ క్రితం అనగా 2005 నవంబర్ ప్రజాసాహితి (సంచిక 277) గ్రామీణ జీవన విధ్వంసం – రైతాంగ ఉద్యమం అనే శీర్షికతో, 1/4 డెమ్మీలో 144 పేజీల ప్రత్యేక సంచికను వెలువరించింది. రచయితలకు కళాకారులకు సందేశం ఇస్తూ అల్లడుగో కర్షకుడు అతని చేయి అందుకో అని పిలుపునిచ్చింది. నాటికీ నేటికీ ఆ సంపాదకీయం తాజాగా ఉంటుంది. మీరే చదివి చూడండి!!

– సం॥

2005 నవంబర్ సంపాదకీయం

# ఓ రచయితా! ఓ కళాకారుడా! అల్లడుగో కర్షకుడు అతని చేయి అందుకో

ఏ జీవికైనా ఆకలికి మించిన అణచివేత లేదు. ఆకలిని అణచివేసే అన్నం మెతుకుల్ని పండించే రైతుకన్నా దేశానికి గౌరవనీయుడెవరూ లేదు. సమాజమనే మానవ శరీరానికి వ్యవసాయం శ్వాసప్రక్రియ లాంటిది. పాశ్చాత్యులు వ్యవసాయాన్ని "అగ్రికల్చర్" అంటారు. కల్చర్ అంటే సంస్కృతి అని అర్థం. ప్రకృతిని యథాతథంగా వినియోగించుకోవటం కాకుండా, ఆహార సేకరణ(వేట) దశ నుండి ఆహారాన్ని ఉత్పత్తి చేసే దశకు మానవజాతి అభివృద్ధిగాంచటమే తొలి విప్లవాత్మక సంస్కృతి. ఆహార ధాన్యాలనుత్పత్తి చేసి భూమి నుండి బుక్కెడు బువ్వను పండించే అద్భుత సృజనాత్మక కళాకారుడు వ్యవసాయదారుడు. ప్రకృతిలో లీనమై, ప్రకృతే ధ్యానమై దాన్ని ప్రేమించి, లాలించి, ఘర్షించి పంటలు వర్షించేట్టు చేయగల సర్వోపకార రైతాంగ జీవితం, ఈనాడు సామ్రాజ్యవాద బహుళజాతుల పడమటి 'గాలిలో దీపం'లా విలవిలలాడుతోంది. ఆ

వెలుతురు ఆరకుండా, ఆ దీపం కొడిగట్టకుండా చూడాల్సిన బాధ్యత రచయితల మీద కూడా ఉంది.

**రచయిత - రైతు - రాజకీయం**

ప్రకృతి మాత హృదయస్పందనల్ని బాగా అర్థం చేసుకుని వాటిని అర్థవంతమైన పాడిగా, పంటగా వినూత్న సృష్టి గావించేది కర్షకులయితే, మానవ హృదయ రాగాలకు, ఘోషలకు స్పందించి తిరిగి వాటిని మీట గల కథగా, కవితగా సాహితీ సృజన కావించగలవారు రచయితలు. దుష్ట జంతువుల మధ్య పురుగూ పుట్రలతో సహజీవనం గావిస్తూ పోరాడుతూ రాత్రనకా, పగలనకా అడవుల్లో మైదానాల్లో నిర్భయంగా సంచరించే రైతాంగం, సామాజిక దుష్ట శక్తులతో వేగలేకుండా వున్నారు. మార్కెట్టు శక్తుల పరమపద సోపాన మాయా జూదగాళ్లు, తమ కుట్రలూ పథకాలతో ఎటువైపు నుండి ఎప్పుడు ఎలా మింగివేస్తారో కాటు వేస్తారో తెలుసుకోలేకుండా వున్నారు.

గ్రామీణ జీవన విధ్వంసంలో చీమ చిటుక్కుమనే శబ్దాలను కూడా నమోదు చేసుకోవాల్సినంత నిశిత పరిశీలన రచయితలకెంత అవసరమో, ఈ సంక్షోభపు కారణాల్నీ, కారకుల్నీ పసిగట్టి, ఎంతటివారైనా నడిబజారులో నిలబెట్టి ఎండగట్టడం కూడా అంతే అవసరం. దీనివల్ల విషపు నాగులూ, క్రూర సింహాలూ మనపైన పగబడతాయేమోనని ముందే ఊహించి, దుష్టునకు దూరంగా ఉండటం మేలని భావించి, దానికి రాజకీయమనే పేరుపెట్టి, దానితో తమకు కించిత్తు ప్రమేయం లేదనే సౌకర్యవంతమైన, భద్రమైన స్థావరాల్లో విశ్రాంతి తీసుకుంటున్న రచయితలు కూడా లేకపోలేదు. రచయితలకు రైతాంగంపట్ల, ప్రజలూ సమాజము పట్ల నిబద్ధత వుండాలంటే, అది కూడా రాజకీయమేనని తామందుకు సుదూరమని సుద్దులు చెప్పే ప్రబుద్ధులు కూడా రచయితల్లో వున్నారు.

జీవితాన్ని రాజకీయం ఏ మేరకు ప్రభావితం చేస్తే, శాసిస్తే, అదుపు చేస్తే, అడ్డుకుంటే ముందుకు నడిపిస్తే ఆ మేరకు సాహిత్యం రాజకీయాల్ని తప్పనిసరిగా పట్టించుకోవాలి, నిరసించాలి, ధిక్కరించాలి, ఎదురించాలి, మనస్ఫూర్తిగా బలపరచాలి. అప్పుడు మాత్రమే రచన జీవన వాస్తవికతకు దగ్గర కాగలుగుతుంది. ఈ విషయం తెలియక వినియోగించకపోయినా, తెలిసి తెలిసి వదిలేసినా, సాహిత్యం కలుపుని పట్టించుకోని సాగవుతుంది! కలుగుల్ని పూడ్చలేని గాదెవుతుంది!!

**రాజ్యధిక్కార రచయితలు!!**

సంపన్నులూ పేదలుగా చీలిన వర్గ వ్యవస్థలో 'రాజ్యం' అలీనంగా వుండలేదు. అది ఆధిపత్య వర్గాల దోపిడీ పీడనల సాధనంగా వుంటుంది. రాజ్యానికి తలవంచటమంటే సంపన్నుల వ్యవస్థ ముందు తల దించుకున్నట్టే! రైతాంగాన్ని పీల్చి పిప్పిగావించే ప్రక్రియలో అలనాటి రాచరిక రాజ్యం నుండి నేటి ఆధునిక రాజ్యం దాకా తమ తమ నయవంచక తీరులలో నైపుణ్యం గడించి వున్నారు. 700 సంవత్సరాల పూర్వమే సూఫీ కవి అమీర్ ఖుస్రో ఇలా చెప్పాడు.

"రాజు కిరీటంలో పొదిగిన ప్రతి రత్నం
పేద రైతు కంటి నుండి జారి గడ్డకట్టిన రక్తం"

రాజులను "మనుజేశ్వరాధములనీ", "కూళల"నీ అతి తీవ్రంగా నిరసించిన బమ్మెర పోతరాజు, వారికి కవిత్వాన్ని అంకితం చేయటమంటే "పడుపుకూడు" తిన్నట్లేనన్నాడు. ఇంకా.... **రాజ్యంబు పాపమూలము... రాజ్యముతో నొడలెరుంగరాదు సుమతియున్"** అన్నాడు. తను రచించిన భాగవతాన్ని రావుసింగ భూపాలుడెంత వత్తిడి చేసినా అతనికి అంకిత మివ్వకుండా ఎదిరించి నిలబడ్డాడు. అమీర్ ఖుస్రో గానీ, బమ్మెర పోతన గానీ తమ భయాన్నీ – భక్తినీ దేవుని భావం ముందు ప్రదర్శించారు గానీ, తామే దైవ స్వరూపులమని విర్రవీగిన రాజుల ముందు వారి రాజ్యం ముందు మాత్రం తలవంచలేదు. ప్రజాస్వామిక యుగంలో రచయితలు శ్రామిక ప్రజానీకంపట్ల నిబద్ధులై వుండాలే గాని, సామ్రాజ్యవాద ప్రభువులతో వారి అడుగులకు మడుగులొత్తే దేశీయ దళారీ ప్రజా వంచక రాజ్యవ్యవస్థతో తలపడాలేగాని, తలవంచకూడదు! అక్షరాలను లక్షల కిందకో, కీర్తి ప్రతిష్టల కిందకో మార్చుకోకూడదు.

రాజు దైవాంశ సంభూతుడనీ, మానవ జీవిత కష్టాలకూ, కడగండ్లకూ ఆ రాజు గానీ నాటి రాజ్యవ్యవస్థ గానీ కారణం ఎంతమాత్రం కావనీ, అవి వారి వారి పూర్వజన్మసుకృత కర్మఫలాలనీ ప్రజలకు బోధించిన భావజాలమంతా రాజ్యాన్ని కాపాడటాని కుద్దేశించినదే.

కొద్దిమంది బొజ్జలు నింపుకోవడానికీ, ఆధిపత్య దోపిడీ వ్యవస్థలను కాపాడుకోవటానికై ఈ కర్మ సిద్ధాంతాన్ని ప్రజల మెదళ్లలోకి రుద్దేవారు నేటికీ వున్నారు.

మన సాంప్రదాయక రాచరిక వ్యవస్థపై పెరుగుతున్న నిరసన ధ్వనులు విప్లవ వెల్లువగా మారకముందే బ్రిటీషు సామ్రాజవాదుల వలస పాలనలోకి మన ప్రజలు, రైతాంగం ఈడ్వబడ్డారు. వారి దోపిడీ పీడనలకనువుగా సవరించబడిన మన వ్యవస్థలో ఆహారధాన్యాల ఉత్పత్తికి బదులు వ్యాపార పంటల ఉత్పత్తికి ఆనాడే అంకురార్పణ జరిగింది. నీలిమందు, పొగాకు, పత్తి, కాఫీ, టీ లాంటివి వ్యాప్తి చేశారు. శిస్తులు, పన్నులు విధించారు. వడ్డీ వ్యాపారం పెంచారు. చేనేత, లోహ పరిశ్రమలు ధ్వంసమై వ్యవసాయం మీద ఆధారపడే వారి జనాభా పెరిగింది. ఉపాధి కరువై 19వ శతాబ్ది చివర ఉమ్మడి మదరాసు రాష్ట్రంలోనూ, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో (1943), బెంగాల్‌లోనూ తీవ్రమైన కరువు చావులొచ్చాయి కానీ ఆత్మహత్యలు లేవు. 60వ దశకంలో మొదలైన పైరుపచ్చ విప్లవము, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ (1991) తర్వాత నుండే చేతివృత్తుల, శ్రామికుల, రైతుల మూసివేయబడ్డ మిల్లు కార్మికుల ఆత్మహత్యల పరంపర పెరిగిపోయింది. ఆత్మహత్యలకు కారణం కేవలం ఆర్థిక దుస్థితి కాదు. అది ఒక సాంస్కృతిక సంక్షోభపు వ్యక్తీకరణ.

**సాంస్కృతిక సంక్షోభ లఘుచిత్రం!**

ప్రతి రైతు ఆత్మహత్య వెనుకా ఒక పెద్ద విషాద గాథ వుంటుంది. సామ్రాజ్యవాద మార్కెట్ భూతపు కాటు వుంటుంది. బహుళజాతి కంపెనీల ఎగుడు దిగుడు ధరల నిలువు దోపిడీ వుంటుంది. దళారీ వ్యాపారుల చక్రవడ్డీల ఘోరం, కల్తీ, నకిలీ విత్తనాల మోసం ఉంటుంది. పాలకుల అవినీతి చీకటి రాజకీయముంటుంది. అతివృష్టినీ, అనావృష్టినీ కూడా సొమ్ము చేసుకుని ప్రజల్ని, రైతాంగాన్ని నిర్లక్ష్యం చేసే రాజ్య యంత్రాంగపు ప్రజా వ్యతిరేకతత్వం వుంటుంది. కరువన్నది తాగునీటికీ సాగునీటికే కాక సామాజిక, కుటుంబ జీవితంలో మానవీయ హృదయ

స్పందనలు మోడువారి, సానుభూతికీ సంఘీభావానికి కూడా కరువేర్పడుతుంది. తెలిసి తెలిసీ సాటి మనిషిని ఆదుకోలేని అశక్తత... స్వార్థం పడగలు విప్పుతాయి. నెర్రెలు కొట్టేది రేగడి దుక్కులు, ఎండిన బీడులు మాత్రమేకావు – మానవ సంబంధాలు కూడా బీభత్సంగా విచ్ఛిన్నమైపోతాయి! డబ్బు ముద్దిలో దేవుడున్నాడనేది అక్షర సత్యంగా సాక్షాత్కరిస్తుంది. కన్నవారినీ, పెరిగిన ఊరునీ, అనుబంధం పెంచుకున్న పంటపొలాల్నీ పశువుల్నీ వీడి, వలసలు పోయి కూలీలుగా, రిక్షా వారిగా, గృహనిర్మాణ కార్మికులుగా వెట్టిచాకిరీలు చేస్తూ, మురికి గుంటల పక్కన ఈగల దోమల నడుమ జానాబెత్తెడు గుడిసెల్లో తలదాచు కోవాల్సిన దుస్థితి దాపురిస్తుంది. కన్నబిడ్డలతో వ్యభిచారం చేయించాల్సిన నైచ్యం ఏర్పడుతుంది.

అన్ని కులాలవాళ్లూ తమ కులం తప్ప మిగిలినవారు మాత్రమే అవకాశాలన్నీ అంది పుచ్చేసుకుంటున్నారనుకుంటారు. సాటి కుల మతస్తులపట్ల అభిమానం కంటె, అన్య కుల – మతస్తులపట్ల ద్వేషం పెచ్చరిల్లుతుంది. అవినీతి సహజమై అడ్డగోలుగా సంపాదించినవాడు ఘనుడై, వీటితో రౌడీ మాఫియాలు జత అయి, వారికి రాజకీయం గొడుగై ప్రజల నెత్తిన స్వారీ చేస్తుంటుంది. ఇటువంటి సాంస్కృతిక సంక్షోభంలో మునిగితేలే గ్రామాలు వలస బతుకులతో, ఆత్మహత్యలతో సగం కాలిన శవాల్లా భయానకంగా దర్శనమిస్తూ వుంటాయి. ఇదీ! సంక్షోభపు లఘుచిత్రం!!

## సామ్రాజ్యవాద ప్రపంచీకరణం!

పాలకులు రైతుల ఆత్మహత్యలకు, సామ్రాజ్యవాద ప్రపంచ బ్యాంకుకు సంబంధం లేదంటారు. రచయితలూ, ప్రజలలో ప్రపంచ బ్యాంకు దుర్మార్గాన్ని అర్థం చేసుకునే చైతన్యం పెరగగానే, "ప్రపంచీకరణ మృగానికి మానవ ముఖం (ముసుగు) వేస్తున్నాము. ఆ పని భాజపా – తె.దే. పాలకులకు సాధ్యం కాలేదు, ఇక నుండీ అది సాధుజంతువై పోతుంది, చూస్కోండంటున్నారు. మరోవైపు ప్రపంచబ్యాంకు నిర్దేశిత విధానాలను, నీటిపారుదలతో సహా సమస్తరంగాలలో అమలుపరచటానికి సర్వసన్నద్ధులై వున్నారు. ప్రపంచబ్యాంకు దోపిడీని భరించి, పెత్తనాన్ని సహించటానికి తహతహలాడుతున్నారు.

మేధావులు, రచయితలలో ఇంకొందరు "ప్రపంచీకరణ అనివార్యం. అది సర్వవ్యాపితం. ఆపలేనిది, కనుక దానితో రాజీపడి, దాని మోచేతి నీళ్లను తాగటానికి వేగంగా క్యూలో నిలబడటమే మార్గము"ని బోధిస్తున్నారు. వీళ్లు "దున్నబోతే దూడల్లోనూ, మెయ్యబోతే ఎడ్లల్లోనూ" సామెత బాపతు. అంతేకాదు పురుష దురహంకారుల అత్యాచార క్రౌర్యాన్నుండి తప్పించుకోలేనప్పుడు, ఎదురు తిరిగి, గాజులు విరగొట్టించుకునీ జాకెట్లు చిరిగీ... ఎందుకంత రొష్టు , కాసేపు సరదా తీర్చుకోమ"ని స్త్రీలకు సలహా యిచ్చే తరహా నీచాతి నీచ బాపతుగాళ్లన్నా తప్పుకాదేమో!!

రచయితల్లో మరికొందరు "ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాలు అనవసరం. ఎన్ని చేసినా రష్యా, చైనాలులాగా కుప్పకూలి పోవటానికే గదా!" అంటున్నారు. రష్యా, చైనాలవి వైఫల్యం అనటం కంటె ఓటమి అన్నదే సామాజిక సూత్రాల కనుగుణంగా వుంటుంది. వైఫల్యానికి వ్యతిరేక పదం సాఫల్యం. పెట్టుబడిదారీ అగ్రరాజ్యాలు సామ్రాజ్యవాదాలుగా మారి అన్య దేశాల పురోగమనాన్ని తీవ్రంగా నిరోధిస్తున్నాయి. మానవాభివృద్ధికి ఆటంకంగా నిలిచాయి. ఇతర దేశాల వ్యవస్థల్ని స్వతంత్రంగా బతకనివ్వటం లేదు. పై మేధావులీ దుర్మార్గాన్ని "విజయం"గా 'సాఫల్యం'గా పరిగణిస్తున్నారు.

రష్యా, చైనాలు భూస్వామిక వ్యవస్థ నుండి పూర్తిగా బయటపడ్డాయి. అవి సోషలిజాన్ని నిలుపుకోలేకపోవచ్చు. కానీ స్వతంత్ర పెట్టుబడిదారీ రాజ్యాలన్నా అయినాయి. రష్యా అయితే ప్రస్తుతం అగ్రరాజ్యం కాకపోయినా సామ్రాజ్యవాద కూటమిలో భాగస్వామిగా వుంది. చైనా సాధించిన అభివృద్ధికి భూమిక, ఆ దేశంలోని భూస్వామ్య వ్యవస్థను, సామ్రాజ్యవాద పెత్తనాన్ని ఓడించి విముక్తి పొందటమన్న నిజాన్ని కప్పిపుచ్చటానికి, దాని ఇటీవల తిరోగమనాన్ని (ప్రశంసిస్తూనే) ఎత్తి చూపుతున్నారు. ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లాండు, అమెరికాల సామ్రాజ్యవాద తత్వాన్ని నిరసించే వారెవ్వరూ వాటి విప్లవాల్ని, అవి సాధించిన విజయాల్ని శ్లాఘించకుండా లేరు. వెనుకబడిన దేశాలయినా రష్యా, చైనాలు సాధించిన సామాజిక పురోగమనాన్ని మనం ఇంకా పొందనే లేదు. భారత దేశానికి లభించిన స్వాతంత్ర్యం రష్యా – చైనాలను అలా ఉంచినా, మరే సామాజిక విప్లవం లాంటిది కూడా కాదు. కేవలం అధికార మార్పిడి మాత్రమే ఇక్కడ జరిగింది. మన సామాజిక వ్యవస్థలో మౌలిక, విప్లవాత్మక మార్పులేమీ రాలేదు. అందుకే పాత సమస్యలే మరింత నాజూకుగా కొన్ని, క్రూరంగా మరికొన్ని మనల్ని నేటికీ వెన్నాడుతున్నాయి.

ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా బ్రిటీషు పాలనా వారసత్వాన్ని కొనసాగిస్తున్నందుకు తమకు గర్వంగా వుందని ప్రకటించాడు. భూస్వామ్య సంస్కృతి యొక్క క్షీణ, నీచ రూపాలు – స్త్రీలపట్ల వివక్ష, సామాజిక వివక్షలతో కూడిన కులవ్యవస్థ, మూఢ విశ్వాసాలూ, దురాచారాలూ, కర్మ సిద్ధాంతాలు మొదలైనవి సజీవంగా కొనసాగుతున్నాయి.

ఉద్యమాల ఫలితంగా రూపొందిన ప్రజానుకూల చట్టాల అమలుకు కూడా తిరిగి పోరాటం చేయక తప్పటం లేదు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఒక వైపున కులవృత్తులను కొంత మేరకు ధ్వంసం చేసి కూడా, ప్రత్యామ్నాయ ఉపాధిని చూపించలేని పరిస్థితులలో, కుల వృత్తులతోనే కలో గంజో వెతుకులాడక తప్పని స్థితి, పీడిత కులస్తులకు ఏర్పడింది. ప్రపంచీకరణ అంటే స్వతంత్ర పారిశ్రామీకరణ కాదు. అగ్రరాజ్యాల ఆర్థిక – రాజకీయాల ప్రయోజనాలకు అనుగుణంగా వెనుకబడిన దేశాల వ్యవస్థలను సర్దుబాటు (స్ట్రక్చరల్ ఎడ్జెస్టుమెంట్) చేయటం. ఒకనాటి బ్రిటీషు సామ్రాజ్యవాదం స్థానిక భూస్వామ్యపు సాంఘిక పునాదిపై కొనసాగినట్టే, ఈనాటి ప్రపంచీకరణ కొత్త భూస్వాములను కూడా సృష్టిస్తూ తిష్ట వేస్తోంది.

భారత పాలకులు సామ్రాజ్యవాదుల నుండి తెచ్చే అప్పులను ఎలాఖర్చు చేయాలో నిర్ణయించుకోగలిగిన స్వతంత్రతనే కనుక మన దేశం కలిగి వుంటే అమెరికా యొక్క అగ్రరాజ్యతత్వ రాజకీయ దుశ్చర్యలను ఎందుకు ఖండించలేకపోతున్నారు? నూటికి 60 మంది అమెరికన్లు బుష్ ప్రభుత్వం ఇరాక్ పై చేసిన దాడిని ఖండిస్తూంటే, 'స్వతంత్ర ప్రజాస్వామిక'మైన భారత ప్రభుత్వం ఎందుకు నీళ్లు నములుతోంది?

ఇరాక్ పైన ప్రత్యక్ష మిలిటరీ యుద్ధం సాగిస్తున్న అమెరికా – బ్రిటన్లు, భారత ప్రజలపై, రైతాంగంపై ఆర్థికంగా, మార్కెట్

మాయాజాలంతో, ఆంక్షలు విధిస్తూ, ఏకపక్ష నిర్ణయాలతో క్షీణ సంస్కృతులు రుద్దుతూ, మనపై పరోక్ష యుద్ధం గావిస్తున్నారు.

మన రైతాంగం ఆరుగాలం ఇంటిల్లిపాదీ కష్టించి, చెమటోడ్చి పండించిన ఉత్పత్తులకు సామ్రాజ్యవాదం సృష్టించిన మార్కెట్టికానమీలో గిట్టుబాటు ధరా, గుర్తింపు లేనట్టే.... తరతరాలుగా దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా మనదేశపు రైతాంగం నిరంతరాయంగా సాగించిన తిరుగుబాట్లూ, ఉద్యమాలూ, పోరాటాలకు కూడా 'అధికార' చరిత్రలో తగు స్థానం లేకుండా పోయింది. మన రైతాంగపు పోరాట సాంస్కృతిక వారసత్వంపై నేటి మన తరాలకు తగు గౌరవం కలుగనీయకుండా భారత పాలకులూ వారి 'పదుపుకూటి' మేధావులూ చేస్తూనే వున్నారు.

**రైతాంగ పోరాటస్ఫూర్తి... రచయితల కర్తవ్యం**

స్వచ్ఛమైన పాలతో సమాజానికి పౌష్టికాహారాన్ని అందించే రైతు మనసులో... భూస్వామ్య – సా మ్రాజ్యవాద సంస్కృతీ, రాజకీయాలు – పిరికి పాలు పోస్తూనే వున్నాయి. మన రైతులు యుద్ధకాముకులు కాదు. కానీ వాళ్లపై యుద్ధం జరుగుతోంది. ప్రకృతిపై పోరాటంలో రైతాంగానికి – గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి, పారా, పలుగు లాంటి ఇనుప పరికరాలు అందించిన కార్మికవర్గమే, ప్రపంచంలో మొదటిసారిగా కర్షకుల గుర్త యిన కొడవలిని తమ సుత్తితో జోడించి జెండాగా హత్తుకున్నాయి. కార్మిక కర్షక పునాదిగా నూతన రాజ్యవ్యవస్థ నిర్మాణం గావించటానికి కార్మిక, కర్షక ఉద్యమాల చైతన్యవంతమైన సమన్వయం ద్వారానే సాధ్యపడుతుందని ప్రపంచ ప్రజా పోరాటాల చరిత్రతోపాటు మన దేశంలో జరిగిన తెభాగ, పున్నప్ర వాయలార్, వర్లీ, త్రిపుర , మహత్తర వీర తెలంగాణా విప్లవ పోరాటం, నక్సల్బరీ తదితర అనేక వ్యవసాయక విప్లవాల చరిత్ర కూడా రుజువు పరిచింది. బ్రిటీషు సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా మన ముందు తరాల దేశభక్తులు సాగించిన మహత్తర ఉద్యమాల, త్యాగాల స్ఫూర్తిని రైతాంగానికి అందించాల్సిన కర్తవ్యం రచయితలపై ఉంది. అనేక చారిత్రక ద్రోహాల, వంచనల, నయవంచనల – ఉనికిని మరిచిన ఉద్రేకాల – గాయాలతో విసిగి, వేసారిన రైతాంగంలో, వారి సంఘటిత శక్తిపై వారికి ఆత్మవిశ్వాసం కలిగించాల్సిన చారిత్రక బాధ్యత ఈనాటి రచయితలది.

మూగజీవాల హృదయాలను చదవగలిగిన రైతు, మార్కెట్ మాయాజాలం ముందు, 58 ఏళ్ల స్వతంత్ర పాలకుల విద్రోహాల వల్ల మూగపోవాల్సిన దుస్థితిలో చిక్కుబడిపోయాడు. జీవిత పోరాట సత్యమనే సూరీణ్ని కప్పివేసిన చీకటి భావజాలాల మబ్బుల్ని తరిమివేయటానికి రచయితలు సంకల్పించాలి.

చేయి అందించటమే తప్ప చెయ్యి చాచే గుణం లేని మన దేశపు రైతు, ప్రస్తుతం అయినవాళ్ల దెబ్బలకు దిమ్మదిరిగి వున్నాడు.

**ఓ రచయితా! ఓ కళాకారుడా!!**

రైతాంగానికి సంఘటితోద్యమ చైతన్యంపై తిరిగి విశ్వాసం కలిగించటానికి


మేలుకో! మేలుకో!! ఇంక నిదుర వదులుకో!!

**అల్లదుగో కర్షకుడు అతని చేయి అందుకో!**

**8.11.2005**

"గ్రామీణ జీవన విధ్వంసం – రైతాంగ ఉద్యమం"పై ప్రజాసాహితి ప్రత్యేక సంచిక **(277)** నవంబర్ **2005** సంపాదకీయం. ✸

**ఈ నెల పుస్తకం**




# మైత్రీ బుక్‌హౌస్, విజయవాడ

## అభ్యుదయ, విప్లవ సాహిత్యకేంద్రం

# పోరాటం

## కవితా కథల సంపుటి

### రచయిత : సిహెచ్. మధు

సిహెచ్. మధు ఐదు దశాబ్దాలుగా సామ్యవాద తాత్విక భావజాలంతో కవిత్వం రాస్తున్నారు. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాల మూలాలను విశ్లేషిస్తూ, తర్కిస్తూ, దార్శనికతతో ఆయన కవిత్వం, కథలూ వుంటాయి. 'ప్రజాసాహితి' మొదటి సంచిక నుండి ఆయన రాసిన సాహిత్యం పాఠకులకు విధితమే. ఈనెలే వెలువడిన 'పోరాటం' సంపుటిలో 25 కవితలు, 11 మినీ కవితలు, కథలు వున్నాయి. నవంబర్ 2020న నిజామాబాద్ నుండి ప్రచురించబడింది.

1/8 డెమ్మీలో 115 పుటలు. వెల : రూ.100/–

ప్రతులకు : **మల్లవరపు విజయ, ఇంటి నెం : 1-1-502, మహాన్ అపార్టుమెంట్, ప్రభుచాయ బ్లాక్, వినాయక్‌నగర్, నిజామాబాద్. సెల్ : 99893 26248.** మరియు **మైత్రీబుక్‌హౌస్, అరండల్‌పేట, కార్ల్‌మార్క్స్‌రోడ్డు, విజయవాడ – 520002. ఫోన్ : 86393 14662** ✸

# ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమానికి సంఘీభావాన్ని తెలియజేసిన పంజాబు, హర్యానా హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు

**శాంతియుతంగా** నిరసన తెలియజేయడానికి ఢిల్లీకి ప్రదర్శనగా వెళ్తున్న రైతులపై పోలీసులు వివిధ రూపాలలో బలప్రయోగం చేయడాన్ని ఖండిస్తూ పలువురు పంజాబు, హర్యానా రాష్ట్రాలకు చెందిన జాతీయ క్రీడాకారులు తమ అవార్డులను వాపసు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ మరుసటిరోజే ఆ రాష్ట్రాల హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు కూడా రైతుల ఉద్యమానికి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

పంజాబులో మొదలైన రైతు ఉద్యమం పలు గాయకుల, నటుల, రాజకీయవేత్తల, మత పెద్దల, పెద్ద స్థాయి అధికారుల, ఎన్నారైల, క్రీడాకారుల మరియు ఇతర దేశాధినేతల మద్దతును సంపాదించు కుంటున్నది. దీనికి ఇటీవల న్యాయవ్యవస్థకు చెందిన నిపుణులు కూడా బహిరంగంగా తమ మద్దతును ప్రకటించారు.

పంజాబు హైకోర్టు మాజీ తాత్కాలిక న్యాయమూర్తి జస్టిస్ మెహతాసింగ్ గిల్, జస్టిస్ రంజిత్‌సింగ్ మరియు జస్టిస్ నవాబ్‌సింగ్‌లు ఒక ఉమ్మడి ప్రకటన చేస్తూ 'తమ హక్కులను కోల్పోయే పరిస్థితి ఎదురైనపుడు దానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలియ జేయడం ప్రతి పౌరునికి రాజ్యాంగం ప్రసాదించిన హక్కు' అని పేర్కొన్నారు.

ఢిల్లీకి శాంతియుతంగా ప్రయాణమైన రైతులపై పోలీసులు ప్రవర్తించిన తీరు అప్రజాస్వామికమే కాదు దుర్మార్గం కూడా అంటూ రైతుల వేదనను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి, వారి కడగండ్లను తీర్చడానికి సరైన పరిష్కారాన్ని కనుగొనాలి. కానిపక్షంలో పంజాబు వంటి సరిహద్దు రాష్ట్రంలో చెలరేగిన అశాంతి దేశ శాంతి, సుస్థిరతలకు తీవ్ర ఆటంకం కలుగజేస్తుంది అన్నారు.

తీవ్రమైన చలి పరిస్థితుల్లో రైతులపై విచక్షణారహితంగా జలఫిరంగులు, లాఠీలు, బారికేడ్ల వంటివి ఉపయోగించడం భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్యానికి తీవ్ర తలవంపులను తెచ్చింది. అంతటి విపత్కర పరిస్థితుల్లోనూ తమపై లాఠీలు ఝళిపిస్తున్న పోలీసులకు రైతులు తిరిగి నీరు, తిండి అందించడం వారి పెద్ద మనసును సూచిస్తూ అన్నదాత అనే మాటను నిజం చేసింది. పాలకులంతా దీనిని గమనించాలి అన్నారు.

దేశమంతా కరోనా మహమ్మారి బారినపడి తీవ్ర ఆర్థిక మాంద్యం, ఆరోగ్య అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సంక్షోభ సమయంలో (జూన్ 2020) ప్రభుత్వం లాక్‌డౌన్‌ని కూడా విధించి జాతి యావత్తూ అన్ని కార్యకలాపాలు స్థంభించిపోయిన సమయంలో అంత అత్యవసరంగా ఆర్డినెన్సులు జారీ చేయవలసిన అవసరం ఏమిటి? ఇవి జాతికి అంత ప్రాధాన్యత కలిగిన అంశాలా? అని వారు తీవ్ర విమర్శ చేసారు.

పార్లమెంటులో బిల్లు నుండి చట్టంగా రూపొందడానికి ఇంత కాలంపాటు వేచియున్న బిల్లులను గతంలో మేము ఎన్నడూ చూడలేదు. కేంద్రం తన శక్తినంతటినీ ఉపయోగించి పార్లమెంటులో ఈ చట్టాలను ఆమోదింపజేసుకుంది. రాజ్యసభలో అయితే కనీసం చేతులు ఎత్తే పద్ధతిలో కాకుండా కేవలం ఔను / కాదు అనే పద్ధతి (voice vote) ద్వారా నెగ్గించుకుంది.

ఉద్యమం కేవలం పంజాబు, హర్యానాల వరకే పరిమితమై శాంతియుతంగా జరుగుతున్నపుడే ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి ప్రయత్నించి ఉంటే రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లకు అలజడి పాకకుండా ఉండేది. ఇపుడు దేశవ్యాప్తంగా రైతులు వామపక్షాలు, పలు ఇతర ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించడానికి దారితీసింది అన్నారు.

ఈ నూతన చట్టాలు కార్పొరేటు వర్గాలను మాత్రమే బలోపేతం చేస్తాయని రైతులు చెందుతున్న ఆవేదన, ఆందోళన అంత సులువుగా ఉపశమించేది కాదు. ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతుల అవసరాలను గుర్తించి వారికి కార్పొరేట్ల నుండి రక్షణ కల్పించాలి. వాస్తవానికి పెద్ద రైతులు, భూస్వాములు కూడా కార్పొరేటు వర్గాలను ఎదుర్కోలేక చతికిల బడతారు అన్నారు.

కోటీశ్వరుల పక్షాన గాకుండా ప్రభుత్వం పేద రైతుల పక్షాన ఆలోచించాలి. దేశంలో కోటీశ్వరులు లేదా కార్పొరేట్ల సంఖ్య అత్యల్పం. అయినప్పటికీ వారే అన్ని విధాలుగా ప్రయోజనాలు పొందగలుగు తున్నారు. అధిక సంఖ్యాకులైన పేద, బడుగు రైతులను రుణాల ఊబిలో నుండి బయట పడవేయలేకపోతే వారు భూముల్నే కాదు జీవితాల్ని కూడా కోల్పోతారు అంటూ ప్రభుత్వానికి హితవు పలికారు.

'పయొనీర్' సౌజన్యంతో ✸

కవిత

## దిగ్బంధనం

- గోలి మధు,

మానవ వికాస మండలి

చీమల్లాంటి వాళ్ళేగా
అనుకుంటూ..
నల్ల చట్టాల్ని రూపొందిస్తే
చైతన్యం రంకెలు వేస్తూ
పోరు చేస్తుంది !

కోతల్లో కొడవలి
పట్టిన పిడికిలి
కోయక మానదు
హస్తినలో బిగిసిన
పిడికిలి ఎర్రకోటను
ఉక్కిరిబిక్కిరి చేయక
మానదు....!

✸

# దేశాన్ని అంబానీ ప్రదేశ్, అదానీ ప్రదేశ్‌లుగా మార్చజూస్తున్న పాలకుల దేశద్రోహాన్ని ఎండగడదాం

కరపత్రం

## కార్పొరేట్ వ్యవసాయ నల్లచట్టాలపై దేశవ్యాప్తంగా కదిలి ఢిల్లీకి చేరిన చారిత్రాత్మక రైతాంగ ఉద్యమానికి అండగా నిలుద్దాం

*మిత్రులారా!*

మనదేశ రైతాంగం, శ్రమజీవులు పాలకుల కార్పోరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అప్రకటిత కరోనా ఎమర్జెన్సీ కాలాన్ని తట్టుకుని నెలలతరబడి ఆందోళనలు సాగిస్తున్నారు. గడ్డకట్టే చలిని కూడా లెక్కచేయక ఢిల్లీకి చేరే అన్ని రోడ్లపై పదుల కిలోమీటర్ల దూరం ట్రాక్టర్లనే గుడారాలుగా మార్చుకుని తమ నిరసనను 26 రోజులుగా తెలియచేస్తున్నారు. దేశమంతా బందులతో, నిరసన వార్తలతో నిత్యం తెల్లవారుతోంది. 1 కోటి 50 లక్షల జియో సెల్‌ఫోన్ కనెక్షన్‌లను ఇతర కంపెనీలలోకి మార్చుకొని తమ పోరాట చైతన్యాన్ని చూపారు. పాలకులకు భయపడి సహకరించని మీడియాకు ప్రత్యామ్నాయంగా వెబ్‌చానళ్లను ప్రారంభించుకున్నారు. ఈ ఉద్యమ క్రమంలో అమరులైన 30 మందిని స్మరిస్తూ రైతుసంఘాల పిలుపులో భాగంగా దేశమంతా 20.12.2020న పెద్దఎత్తున 'శ్రద్ధాంజలి దివస్' పాటించారు. ఇంత జరుగుతున్నా సామ్రాజ్యవాదుల, కార్పొరేట్ శక్తుల లాభాల కోసం వారి ఏజెంట్లులాగా పాలకులు మాత్రం బరితెగించి వ్యవహరిస్తూనే వున్నారు. కిసాన్ సంఘర్ష్ సమితి నాయకులు ఎన్నివిధాలుగా ఈ చట్టాలు రైతాంగానికి నష్టం చేస్తాయో ఓపికగా వివరిస్తున్నా ఏమాత్రం పట్టించుకోకుండా, వినకుండా అవస్థలు పెడుతున్నారు.

మరొకవైపు నలుమూలల నుంచి వచ్చి ఢిల్లీలో ఉద్యమిస్తున్న రైతాంగానికి అనేకవిధాలుగా మద్దతు పెరుగుతూ ఉంది. నిరంతరం ఆహారం అందేలా రొట్టెల మిషన్లు పెట్టారు. వేలాదిమంది శ్రమజీవులతో వందల సమిష్టి వంటశాలలు నడుస్తున్నాయి. డాక్టర్లు అవసరమైన వైద్యమందిస్తున్నారు. స్నానాలకు నీళ్లు, బట్టలు వుతుకుకోడానికి వాషింగ్ మిషన్లు ఏర్పాటు చేసారు. సెలూన్లు ఏర్పాటు చేశారు. ట్రాక్టర్లు, స్కూటర్ రిపేర్లు చేయడానికి మెకానిక్కులు వచ్చి తమవంతు సహాయం అందిస్తున్నారు. పాటలతో, నాటకాలతో, సంగీత కచేరీలతో రైతుల ఉద్యమం నడుస్తున్నది. మొత్తంగా ఒక సమిష్టి ఉద్యమ సంస్కృతిని పాటిస్తూ పట్టుదలతో ఢిల్లీని ముట్టడించి తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు.

ఇంకొకప్రక్క లాయర్లు, జడ్జిలు ఒక్కరొక్కరుగా తోడుగా వస్తున్నారు. క్రీడాకారులు, వివిధరంగాల్లో అవార్డులు పొందినవారు గతంలో సాధించిన అవార్డులను, మెడల్స్‌ను వెనక్కు ఇచ్చేస్తున్నారు. రకరకాల రూపాల్లో ఈ నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.

నిత్యం ప్రభుత్వ వ్యవసాయ మండీలతో ముడిపడిన రైతు జీవితాన్ని 3 నల్లచట్టాలు చీకటిలోకి నెట్టాయి. ఇంతకుముందే పెప్సీ కంపెనీ ద్వారా బంగాళాదుంప రైతు బానిస బతుకులను ముందుగా అనుభవం పొందిన పంజాబ్, హర్యానా, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, వంటి ఉత్తరభారత రాష్ట్రాల రైతాంగం రానున్న మహాప్రమాదాన్ని ముందుగా పసిగట్టి పెద్దఎత్తున కదిలింది. బీహార్‌లో తెచ్చిన ప్రవేటు మార్కెటింగ్ చట్టాల పుణ్యమాని, ప్రభుత్వమండీలు చాలావరకు మాయమై మొక్కజొన్న 1835 రూ. నుంచి కనీస ధర 600 రూ.లకి పడిపోవడం, మధ్యప్రదేశ్‌లో బిజేపి ఆర్భాటంగా తెచ్చిన మోడల్ మండీల వల్ల ఏర్పడిన దిక్కుతోచని స్థితిని చర్చలలో రైతులు ఎంత ఉదహరించినా మోదీ, అంబానీ, అదానీ మిత్రైకబంధం ఒప్పుకోవడంలేదు. ఆయిల్ వనరులను, రకరకాల ఖనిజాలను అతి స్వల్పకాలంలో దోచుకుని ప్రభుత్వ సంస్థలనూ, రంగాలను ఆక్రమించి తెగబలిసిన రాబందు కంపెనీ యజమానుల దోస్తానీ అంత బలీయమైనది. ఇదొక చారిత్రక సందర్భం. లక్షలకోట్ల డబ్బు, లక్షల ఎకరాల రైతుల భూములను, మొత్తం వ్యవసాయాన్ని కొల్లగొట్టాలన్న పథకం ఒకవైపు, రైతు ఉద్యమం మరొకవైపు పరస్పరం ఎదురెదురుగా తలపడుతున్నాయి.

ప్రపంచీకరణ పరిణామాల చేదు అనుభవాలను ఇప్పటికే చవిచూస్తున్న మనదేశ రైతాంగం ఎక్కడికక్కడ స్పందిస్తున్నారు. నిజానికి పండించే వారికే కాకుండా వినియోగదారులైన అన్ని వర్గాల ప్రజలకు తరతరాల ద్రోహం తలపెట్టిన వినియోగదారుల చట్ట సవరణ, విద్యుత్ చట్టం-2020లను దేశప్రజలంతా ఎదిరించి రద్దు చేయించుకోవాల్సి ఉంది. మధ్యతరగతి ప్రజలతో పాటు చాలామందిని మోసగించడానికి ఇది రైతుల సమస్య మాత్రమేనని భ్రమింపచేయడానికి ప్రయత్నం జరుగుతున్నది. బీజేపీ అధికారంలో ఉన్నచోట్ల మీడియా ద్వారా, ఆర్ఎస్ఎస్ జీతభత్యాల వాట్సప్ గుంపుల ద్వారా వారి దేశద్రోహాన్ని దేశభక్తిగా నమ్మించేందుకు నానాతంటాలు పడుతున్నారు. రాజకీయ నాయకులు, కార్పొరేట్‌శక్తులు వేరువేరు కాదని అంతకంతకూ రైతాంగానికి అర్థమై అంబానీల, ఆదానీల వంటి దళారీశక్తుల నిజ స్వరూపం బయట పెడుతూ వారి దిష్టిబొమ్మలు తగలబెడుతుండడంతో బెంబేలెత్తుతున్నారు.

ప్రజలను బానిసత్వంలోకి నెట్టే చర్యలు ఒకవైపు చేస్తూ, మరొకవైపు సరిహద్దుల మధ్య, మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టాలని విఫల యత్నాలు చేస్తూనే వున్నారు. కార్పొరేట్ గోబెల్స్ మీడియా ప్రచారం చేసే సీజనల్ దేశభక్తి నాటకాలను ప్రజలు అర్థం చేసుకోవడం, రైతాంగానికి మద్దతు పలకడం ఈ స్వదేశీ దోపిడీశక్తులు జీర్ణించుకోలేక పోతున్నాయి. పోరాటంలో ఉన్న లక్షలాదిమందిని మోసం చేయలేక కేంద్రంలోని నిరంకుశ పాలకులు రాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ అధికార,

ప్రతిపక్ష అవకాశవాద పార్టీలను బెదిరించి లొంగదీసుకో చూస్తున్నారు. రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన వివిధ రంగాల ఫెడరల్ హక్కులను కేంద్రం హరిస్తున్నా ఈ రాష్ట్రాల పాలకపార్టీలకు సిగ్గనిపించడం లేదు. తెలుగు రాష్ట్రాలలో పాలకపార్టీల ఈ రకపు అవకాశవాదం స్పష్టంగా చూడవచ్చు. పార్లమెంటులో మద్దతిచ్చి ఇక్కడ తాత్కాలిక ఎత్తులు, పొత్తులు, పై పై తగాదాలతో ప్రజలను వంచించ చూస్తున్నారు. రైతు వేయబోయే పంటలను ముందుగా నిర్ణయించాలని, కరెంట్ మీటర్లు పెట్టాలని ఈ వ్యవసాయ నల్లచట్టాల సారాన్ని ముందుగా అమలుచేయ పూనుకుంటూ కేంద్రం దగ్గరకు అడుగడుగునా వెళ్లి ఆస్కార్‌లు అందుకుంటున్నారు. అన్నీ మేమే చేసేస్తున్నాం, ఇక ఉద్యమా లెందుకని రైతాంగాన్ని నిత్యం మోసగింపచూస్తున్నారు. ఒక్కటంటే ఒక్క మౌలిక సమస్యను పరిష్కరించలేని దళారీపాలనలో పెరుగుతున్న నిరుద్యోగం, రోజురోజుకీ పెరుగుతున్న పేదరికం లక్షలాదిమంది యువతను, మహిళలను, రైతాంగాన్ని రోడ్లపైకి రప్పిస్తున్నది. వివిధ రాష్ట్రాలలో ఉద్యమిస్తున్నా, ఇప్పుడు ఢిల్లీ రహదారుల్ని దిగ్బంధిస్తూ గ్రామాల నుంచి లక్షలమంది చేరుకుంటున్నా అదంతా ఇన్నాళ్లుగా వారనుభవిస్తున్న పీడనపై ఆగ్రహమే. ప్రజావ్యతిరేక విధానాలపై వారు పెంచుకున్న వ్యతిరేకత ఫలితమే. ఉద్యమశక్తులు అందించే చైతన్యం, క్రమశిక్షణ వారిని దీర్ఘకాలిక ఉద్యమబాటలో నిలుపుతున్నాయి. ఈ చైతన్యం భవిష్యత్తులో తాకట్టులో భారతావని బంధనాలను తెంచడానికి చేసే ప్రయత్నంగా అభివృద్ధి కావాల్సివుంది.

దోపిడీశక్తులకు ఇక ఎప్పటికి ఎదురులేదనే నిరాశా వాదనలను బద్దలుకొడుతూ ఈ ఉద్యమం ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోన్నది. వివిధ దేశాలలో ఉన్న భారతీయులతో పాటు ఆ దేశాల ప్రజలు, అక్కడి ప్రభుత్వాలు కూడా రైతాంగ ఉద్యమానికి మద్దతు పలుకుతున్నారు. చాలా దేశాల్లో రైతుల సమస్యలు చర్చనీయాంశంగా మారాయి. ట్రంపు వారసులుగా ప్రపంచవ్యాపితంగా పరువును కోల్పోతున్న ఈ దశలో మరొక ప్రయత్నంగా మోడీ చేత రైతులనుద్దేశించి మాట్లాడించి అమ్ముడుపోయిన మీడియా ద్వారా ఒప్పించే కార్యక్రమాలకు తెర లేపుతున్నారు.

సాంస్కృతికోద్యమ సైనికులైన సాహిత్యకారులు, కళాకారులు తమ సృజనాత్మక పద్ధతులలో ఈ చావు తెలివిని తిప్పికొట్టాలి. రైతుని బానిసగా మార్చుతున్న కార్పొరేట్ దళారీ రాజ్యం గురించి చైతన్య పరచాలి. “ఆగస్టు 15 అర్ధరాత్రి జరిగిన విద్రోహం గురించి చెప్పకుండా అన్నం సహించదు నాకు” అంటాడు చెరబండరాజు. ఆవిధంగానే నేటి వ్యవసాయానికి, రేపటి రైతాంగానికి జరగబోయే ద్రోహం గురించి చెప్పకుండా మనం నిద్రపోకూడదు. పంటభూముల్ని స్టాక్ ఎక్సేంజ్‌లో పెట్టి లక్షలకోట్ల లాభాలతో ప్రకృతిని సర్వనాశనం చేసే కార్పొరేట్ శక్తులవైపు నిలుస్తారా? తరతరాలుగా భూములను నమ్ముకుని వ్యవసాయాన్నే జీవన విధానంగా మార్చుకుని ఆత్మగౌరవంతో బ్రతుకుతున్న రైతాంగం వైపు నిలబడతారా అని రేపటి అదానిప్రదేశ్‌లు అంబానీప్రదేశ్‌లను నిర్మించ జూస్తున్న దళారీ పాలకులను రైతుల చైతన్యంతోనే ప్రశ్నింపచేద్దాం. మన కలాలతో, గళాలతో మనవంతు కృషి కొనసాగిద్దాం.

**హైదరాబాద్**
**22.12.2020**

**జనసాహితి**
**జంటనగరాల శాఖ** ✸

# ప్రముఖ హిందీ అనువాదకులు, రచయిత్రి, కొకు కుమార్తె, ఆర్.శాంతసుందరి మరణానికి జనసాహితి సంతాపం



**శాంతసుందరిగారు** గత కొంతకాలంగా అనారోగ్యం వెంబడిస్తున్నా దాని గురించి మాట్లాడకుండా సాహిత్యం గురించే చర్చించేవారు. ఆమె 11-11-2020న మరణించారు. ఆమె మరణం పట్ల జనసాహితి ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతున్నది. ఇంత పెద్ద వయసులో ఉండి కూడా కూతురు మరణాన్ని తట్టుకుని భరిస్తున్న కొడవటిగంటి కుటుంబరావు జీవిత సహచరి వరూధినిగారికి, శాంతసుందరిగారి జీవిత సహచరులు గణేశ్వరరావుగారికి మా సానుభూతిని తెలుపుతున్నాము.

దశాబ్దాలుగా అనువాద కృషిలో నిమగ్నమైన శాంతసుందరిగారు, గణేశ్వరరావులు ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చాక మాకు ఎంతో ఆప్తులుగా వున్నారు. జనసాహితి సంస్థకు, 'ప్రజాసాహితి' పత్రికకు ఎన్నో అనువాద రచనలు అందించడంలోను, 'ప్రజాసాహితి' పాఠకుల సమావేశాలలో విలువైన సూచనలు మొహమాట పడకుండా ఇవ్వడంలోను ముందున్నారు. జంటనగరాల శాఖ నిర్వహించిన ఎన్నో సభలలో పాల్గొనేవారు. హైదరాబాద్‌లో నిర్వహించిన అనువాద పాఠశాలకు సహకరించడంతో పాటు తరచూ నిర్మలానందగారితో చర్చిస్తూ పత్రికకు సహకరించేవారు.

హిందీ నుంచి తెలుగులోకి, తెలుగు నుంచి హిందీలోకి ఎన్నో అనువాదాలు చేశారు. తెలుగు నుంచి హిందీలోకి ఎక్కువగా చెయ్యాల్సిన అవసరాన్ని అనువాద పాఠశాలలో తన అభిప్రాయంగా చెప్పారు. ఆమె మరణం సాహిత్య లోకానికి, ప్రధానంగా అనువాద ప్రపంచానికి చాలా లోటుగా భావిస్తున్నాం. కవులు, రచయితలు, మేధావులు తమ తమ నివాళులు అర్పించడానికి కరోనా కలిగిస్తున్న ఆటంకాలు మనకు తెలుసు. శాంతసుందరిగారు ప్రగతిశీల సాహిత్య కుటుంబంలో పుట్టి దశాబ్దాలుగా ప్రజల పక్షాన నిలవడం, ప్రజా సాహిత్యానికి అనువాద సహకారం అందించడం ఈ తరం సాహిత్యకారులు గుర్తుపెట్టుకునేలా కృషి చేయడం మన బాధ్యత. అదే శాంతసుందరిగారికి మనమిచ్చే నివాళి. ✸

# ప్రపంచవ్యాప్తంగా వున్న అగ్రికల్చర్ అకడమిక్ రీసెర్చ్ గ్రూపునకు చెందిన నలభైమంది ప్రముఖ ఆర్థికవేత్తలు కేంద్ర వ్యవసాయ శాఖామంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు రాసిన లేఖ

**అగ్రికల్చర్** అకడమిక్ రీసెర్చ్ గ్రూపుకు చెందిన ప్రపంచవ్యాప్తంగా వున్న 40 మంది ప్రముఖ ఆర్థికవేత్తలు ఇటీవల ఢిల్లీ చుట్టుపక్కల జరుగుతున్న రైతుల ఉద్యమం నేపథ్యంలో భారత కేంద్ర వ్యవసాయ శాఖామంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు సామూహికంగా ఒక లేఖ రాసారు. దేశవ్యాప్తంగా రైతులను రోడ్లపైకి తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయవలసిందిగా ఆ లేఖలో కోరారు. దేశమంతా భయంకరమైన మహమ్మారి బారినపడి విలవిలలాడుతూ, ఆర్థికవ్యవస్థ కుదేలవుతున్న సంక్షోభ సమయంలో హడావిడిగా ఈ బిల్లులను పార్లమెంటులో చట్టాలుగా చేసిన తీరు గర్హనీయమని, ఇది దేశ సమగ్రతను దెబ్బతీసేదిగా వుందని పేర్కొంటూ, ఈ చట్టాలను ప్రభుత్వం ఏ ఉద్దేశాలను ఆశించి చేసిందో చెప్పాలంటూ కొన్ని ప్రశ్నలను కూడా సంధించారు.

**లేఖ పూర్తి పాఠం :**

గౌరవనీయులైన భారత కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖామంత్రివర్యులు నరేంద్రసింగ్ తోమర్‌గార్కి,

మేము భారత ఆర్థికవ్యవస్థతో సంబంధం కల్గియున్న నలభైమంది ప్రపంచ ఆర్థికవేత్తలం. భారత ప్రజానీకం పట్ల మాకు అచంచలమైన విశ్వాసం, బాధ్యత వున్నాయి. దేశంలో ఆదాయం, సంపద ప్రజలందరికీ సమానంగా పంపిణీ కావాలని మేము కోరుకుంటున్నాము. దేశ రైతాంగాన్ని సుదీర్ఘకాలం పాటు ఉద్యమాల బాట నడిపిస్తున్న ఇటీవల కేంద్రం చేసిన మూడు వ్యవసాయ చట్టాల పట్ల మేము ఆందోళన చెందుతున్నాం. చిన్న, సన్నకారు రైతులకు వారు పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధరలు రావాలి. అందుకు తగినట్లుగా మార్కెట్ వ్యవస్థ అందుబాటులో వుండాలి. అయితే ఇపుడు పార్లమెంటు చేసిన నూతన వ్యవసాయ చట్టాలు మార్కెట్ల అనుకూలతను గానీ, గిట్టుబాటు ధరలను గానీ కల్పించలేవు. ఇదిలా ఉండగా కరోనా మహమ్మారితో దేశమంతా తీవ్ర భయాందోళనలతో కొట్టుమిట్టాడుతున్న సమయంలో, పార్లమెంటులో చర్చకు కూడా అవకాశమివ్వకుండా కూడా విడిగా చట్టాలను చేసిన తీరు ప్రభుత్వంపట్ల ప్రజలకు అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ చట్టాలను అమలు చేస్తే రాబోయే రోజుల్లో పలు ప్రమాదకరమైన పరిణామాలు చోటు చేసుకుంటాయని పలువురు ఆర్థికవేత్తలు తమ ఆందోళనను వెలిబుచ్చుతున్నారు.

ఎ). ఒప్పంద వ్యవసాయం ద్వారా చిన్న, సన్నకారు రైతులు ఆశించినంత ప్రయోజనం పొందడంలేదని ఆఫ్రికా, లాటిన్ అమెరికా మరియు భారత్‌లోని పలు అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. భారత వ్యవసాయ రంగంలో చిన్న, సన్నకారు రైతాంగమే అత్యధిక సంఖ్యలో వున్నది. అధికశాతం వ్యవసాయం వారి చేతుల మీదుగానే జరుగుతోంది. ఈ చట్టాలు ఈ అత్యధిక, సంఖ్యాకుల ప్రయోజనాలను, సంక్షేమాన్ని దెబ్బతీస్తాయి. చిన్న, సన్నకారు రైతులు దోపిడికి గురికాకుండా వారిని ప్రైవేటు దళారీ వ్యవస్థ నుండి రక్షించడానికి వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీ వ్యవస్థ ఏర్పాటు చేయబడింది. (వాస్తవానికి ఈ మార్కెట్ల ద్వారా జరుగుతున్న లావాదేవీలు స్వల్పమే అని చెప్పాలి). ఇపుడు తీసుకువచ్చిన చట్టాలు చిన్న, సన్నకారు రైతులను ప్రైవేటు, దళారీ శక్తుల నుండి దోపిడికి గురికాకుండా రక్షించడానికి బదులు ఈ శక్తులను మరింత బలోపేతం చేస్తాయి. వ్యవసాయోత్పత్తుల మార్కెట్ కమిటీలు నిర్లక్ష్యానికి గురై ప్రైవేటు శక్తులపై తమ నియంత్రణ కోల్పోయేలా ద్వంద్వ విధానాన్ని తీసుకురానున్నాయి. నియంత్రిత, అనియంత్రిత మార్కెట్లు వచ్చి ప్రైవేటు కాంట్రాక్టర్లను, కార్పొరేట్లను, దళారీ వ్యవస్థనూ మరింత బలోపేతం చేస్తాయి. దాంతో రైతాంగం పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా తయారవుతుంది. గత మూడు దశాబ్దాలుగా దేశంలో కార్పొరేటు వ్యవస్థ ఎంతగా ప్రభుత్వాలను శాసించే స్థాయికి ఎదిగిందో మనం చూస్తూనే వున్నాం. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ కార్పొరేటు వ్యవస్థను నియంత్రించగలిగే సామర్థ్యంగానీ, ఆసక్తిని గానీ కనబరచడంలేదు. అన్ని ప్రభుత్వాలు వారికే కొమ్ము కాస్తున్నాయి. కార్పొరేటు శక్తుల పెద్ద పెద్ద స్కాములు ఇటీవల చాలా వెలుగులోకి వచ్చాయి. ఒప్పంద వ్యవసాయాన్ని ప్రోత్సహించడం వలన రైతాంగం తమ స్వయం ప్రతిపత్తిని కోల్పోయి, తమ ఉత్పత్తులకు తగిన ధరలకు డిమాండు చేయలేని పరిస్థితికి నెట్టబడుతుంది. ఫలితంగా ఇప్పటికే కుదేలైపోయిన రైతాంగం వెన్నెముక విరిగి పోతుంది. తత్ఫలితంగా ఇప్పటికే తీవ్రంగా వున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఆర్థిక అంతరాలు మరింత పెరిగి ఆర్థిక అసమానత విస్తరిస్తుంది.

బి). బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ, ఆ వ్యవస్థలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను తీరుస్తూ (అట్టడుగు వర్గాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి), సమన్యాయాన్ని పాటిస్తూ, అవినీతికి తావులేని విధంగా వివిధ రాజకీయ యూనిట్ల (రాష్ట్రాల) మధ్య అధికార విభజన పాటించాలి. మన రాజ్యాంగ నిర్మాతలు ఈ విషయంలో తగిన జాగరూకత వహించి కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాలను, బాధ్యతలనూ సమతూకంగా పంపిణీ చేసారు. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలు స్థానిక పరిస్థితులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా తమ వ్యవసాయ విధానాలను రూపొందించుకున్నాయి. అదే సందర్భంలో వివిధ రాష్ట్రాల మధ్య కొన్ని కొన్ని అంశాలతో సారూప్యత కూడా ఉంటుంది. అయితే ప్రస్తుత చట్టాలు వ్యవసాయ రంగంలో రాష్ట్రాలకు గల స్వయంప్రతిపత్తిని, హక్కులను హరించేవిగా ఉన్నాయి. రాష్ట్రాలు తమ స్థానిక అవసరాలకు అనుగుణంగా చర్యలు

చేపట్టలేని పరిస్థితికి, మార్కెట్ల ద్వారా ఫీజలు రూపంలో రావలసిన తమ ఆదాయాలను కోల్పోయే స్థితికి నెట్టబడతాయి. అంతేకాదు గడిచిన ఐదారు సంవత్సరాలుగా మైనారటీ మతస్థుల మరియు దళితుల హక్కులు కోల్పోతున్న పరిస్థితి దేశంలో నెలకొంది. ఈ చట్టాలు కొన్ని ప్రత్యేక ప్రాంతాలనూ, మతస్థులనూ (ఉదాహరణకు పంజాబులోని సిక్కులు) మరింత పరాయీకరణ చేసే ప్రమాదముంది. ఇప్పటికే దేశంలోని వివిధ ప్రాంతాల నుండి రైతులు విరివిగా వచ్చి ఉద్యమంలో చేరుతున్నారని వార్తలు వినవస్తున్నాయి. విభిన్న ప్రాంతాల, సంస్కృతుల సమాహారమైన భారతదేశంలో కేంద్ర వ్యవసాయ, విధానాలు అన్ని ప్రాంతాల మరియు అన్ని వర్గాల రైతుల ప్రయోజనాలకు కొమ్ము కాసేవిగా వుండాలి. అధిక సంఖ్యాకుల ప్రయోజనాలే ప్రభుత్వ మొదటి ప్రాధాన్యం కావాలి. అందుకు అవసరమైన నిర్ణయాలను చేయగలగాలి. అంటే అన్ని వర్గాల వారికీ ఒకే విధానం పనికిరాదు. అందువలన మేమంతా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుకుంటున్నది ముందుగా మీరు చేసిన చట్టాలను రద్దు చేయండి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ అనుబంధ సంఘాలతో సంప్రదింపులు జరపండి. వ్యవసాయానికి సంబంధించిన ఉత్పత్తి, మార్కెటింగ్, పరపతి, పర్యావరణ అంశాలు, గిట్టుబాటు ధరలు వంటి వివిధ అంశాలకు సంబంధించిన ప్రత్యేక నిపుణులు మనకు చాలామంది అందుబాటులో వున్నారు. వారందరినీ చర్చలకు ఆహ్వానించి, వారి సలహాలు స్వీకరించాలి. అపుడు మాత్రమే అందరికీ అనుకూలమైన నిర్ణయాలను చేయగల్గుతాం.

**ఇట్లు**

**సమానత్వం కొరకు భారతీయ ఆర్థికవేత్తలు (భారతదేశంలో ఆదాయం, సంపద సరైన విధమైన పంపిణీపై అభిరుచి కల్గిన విద్యావిషయక పరిశోధనా బృందం)**

**ఈ గ్రూపుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సభ్యులు**

1. **శ్రీపద మోతీరాం (మెసాచుసెట్స్ విశ్వవిద్యాలయం, బోస్టన్)**
2. **శిరీషానాయుడు (మిస్సోరీ విశ్వవిద్యాలయం, కాన్సాస్ సిటీ)**
3. **స్మితా రామ్ నారాయణ్ (దోహిడ్ ఐలాండ్ విశ్వవిద్యాలయం)**
4. **స్మృతీరావు (ఎసంష్షన్ విశ్వవిద్యాలయం, మెసాచుసెట్స్)**
5. **వంశీ వకులాభరణం (మెసాచుసెట్స్ విశ్వవిద్యాలయం - ఆమ్‌హెరెస్ట్)**

- 'ది వైర్' నుండి

అనువాదం : **గౌరీశంకర్**

పాట

# అడుగడుగున దగా

- రౌతు వాసుదేవరావు

సాకి : అడుగడుగున దగాపడిన రైతులంత ఏకమైరి
చావో రేవో తేల్చుకొనగ పిడికిలెత్తి నినదించిరి
కొత్త సాగు చట్టాలను బేషరతుగ రద్దుచేసి
మద్దతు ధర సాధించగ యుద్ధం ప్రకటించిరి
ధర్మయుద్ధం ప్రకటించిరి

పల్లవి : ఎల్లమ్మో ఎర్రమ్మో రంగయ్యో రామయ్యో
రండర్రా రండి
రైతులంత ఒకటై రంగంలో దూకారు
ఢిల్లీ కోట ముట్టడించ రణం చేస్తున్నారు ॥ ఎల్లమ్మో ॥

1. రైతే రాజని చెప్పి మన కండలు పిండినారు
వెన్నెముకవు నీవంటూ మన వెన్నును విరిచినారు
పాలకులె మారినారు మారలేదు మన బతుకని
పిడికిలెత్తి నినదించి పోరుదారి పడదాము ॥ ఎల్లమ్మో ॥

2. పోరాట ఫలితంగా వచ్చేటి కమీషన్లు
రైతు మేలును కోరి ఇచ్చేటి సూచనలు
బుట్టదాఖలు చేసి మన నోట మట్టికొట్టి
మన ఉసురు బోసుకొని ఊరేగుతున్నారు ॥ ఎల్లమ్మో ॥

3. దిక్కుతోచని రైతు తనువు చాలిస్తుంటె
కార్పురేటుకే లాభం చేకూర్చబూనారు
రైతులను ముంచేటి వ్యవసాయ చట్టాలను
దొడ్డిదారిన తెచ్చి దోచుకో జూస్తున్నారు ॥ ఎల్లమ్మో ॥

4. పంటమీద అప్పుతెచ్చి కల్లాన అప్పగించి
రైతుల పొయ్యిల్లోన పిల్లులే పడుకుంటె
దేశాన ఎక్కడైనా అమ్ముకో నీ పంటని
మన కంటిలో కారం కొట్ట జూస్తున్నారు ॥ ఎల్లమ్మో ॥

5. గిట్టుబాటు ధర ఇచ్చి ఆదుకునే ఊసులేదు
కార్పురేటు దుకాణాలు వీధి వాడ వెలసిపోయె
విదేశీ దిగుమతులకు సుంకాలు తగ్గించి
దేశీయ పంటలను నిండ ముంచినారయ్యా ॥ ఎల్లమ్మో ॥

6. కారుచౌకగా రైతుల పంటలను కాజేసి
మార్కెట్టు యార్డులన్ని మూసివేయబూనారు
నిత్యావసర సరుకులను గోదాములో దాచి
ధరలన్ని ఆకసాన విహరింపజేస్తారు ॥ ఎల్లమ్మో ॥

7. అన్నదాతలంతనేడు కన్నెర్రజేసారు
భ్రమలన్ని తొలగిపోగ భగత్‌సింగ్ జై అన్నరు
కోట్ల కొలది రైతులంత ఢిల్లీ కోట జేరినారు
ఎముకలు కొరికే చలిలో నిప్పులు కురిపిస్తున్నరు
॥ ఎల్లమ్మో ॥

8. అధికార మోజులో అధములై పాలకులు
సామ్రాజ్యవాదులకు సాగిలబడుతున్నరు
అగచాట్ల పాలైన అన్ని వర్గాల జనులు
రైతన్నల పోరులోన చేరుదాం రారండి ॥ ఎల్లమ్మో ॥

డాక్యుమెంటరీ సమీక్ష

# పంజాబు దళితుల బతుకుపోరును చిత్రించిన 'ల్యాండ్‌లెస్'

– బాలాజీ (కోల్‌కతా)




**"భూమిని దున్ని సాగుచేసే సంరక్షకులు వాళ్లు. తమవి కాని పొలాలకు కాపలాదార్లు వాళ్లు. కానీ దిష్టిబొమ్మలు ఎక్కడున్నా భూమికి హక్కుదార్లు అవుతాయా?"** – అన్న ప్రతీకాత్మక ప్రశ్నతో ఆరంభ మౌతుంది **'ల్యాండ్ లెస్'** (భూమి లేనివారు) సినిమా. పంజాబుకు చెందిన కాన్సెప్ట్ ఫొటోగ్రాఫర్ రణదీప్ మడోక్ తీసిన తొలి డాక్యుమెంటరీ చిత్రం 'ల్యాండ్‌లెస్' (2018). భూమిలేని దళిత రైతుకూలీలు, దళిత గ్రామీణ పేదలు, వారికంటే ఉన్నతకులపు జాట్ల ద్వారా శ్రమదోపిడీకీ, కుల వివక్షతకూ, సామాజిక వెలివేతలకూ, అత్యాచారాలకూ ఎలా గురౌతున్నారో వివరిస్తుందీ సినిమా.

## దళిత గాయకుడు బంత్ సింగ్ :

బంత్ సింగ్ పంజాబ్‌లో ఉండే దళిత ప్రజాగాయకుడు. మజ్దూర్ ముక్తి మోర్చా కార్యకర్తగా పనిచేస్తూ దళిత బహుజనులను తన పాటలతో చైతన్యపరిచేవాడు. 2000 సంవత్సరంలో జాట్ దుండగులు అతడి రెండేళ్ల పాపను బలాత్కరించారు. బంత్ సింగ్ న్యాయం కోసం పట్టుబట్టాడు. ఎన్నో బెదిరింపులకు భయపడకుండా పోరాడి చివరికి 2004లో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు శిక్ష పడేలా చేశాడు. దీనికి అతడు మూల్యం చెల్లించాల్సి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ జాతీయ వ్యవసాయ కార్మిక ర్యాలీకి హాజరై తిరిగి వస్తుండగా 2006 జనవరి 7 వ తేదీ సాయంత్రం జాట్ గూండాలు అతనిపై దొంగచాటుగా ఇనుపరాడ్లతో, గొడ్డలితో విరుచుకు పడ్డారు. కసితీరా కొట్టారు. అపస్మారకంగా పడివున్న అతడ్ని చనిపోయాడనుకుని వదిలేసి వెళిపోయారు. ఆసుపత్రిలో అతడి రెండు చేతుల్నీ, ఒక కాలునూ తీసేయాల్సి వచ్చింది. ప్రాణాలతో మిగిలిన అతడు తన ఆసుపత్రి బెడ్డు నుండే మళ్లీ పాడడం మొదలుపెట్టాడు. తన గళానికి చావులేదని చాటుతూ నేటికీ పాడుతున్నాడు. **'బంత్ సింగ్ కెన్ స్టిల్ సింగ్'** (బంత్ సింగ్ ఇప్పటికీ పాడగలడు) అంటూ సంజయ్ కాక్ ఓ చిన్న డాక్యుమెంటరీ సినిమా నిర్మించాడు. సిక్కుమతం ప్రాచుర్యంలో వున్న పంజాబ్‌లోనూ కుల వ్యవస్థ సరే కుల అత్యాచారాలూ యధావిధిగా సాగుతున్నాయని బంత్ సింగ్ సంఘటన ప్రపంచానికి చాటిచెప్పింది. ఈ సంఘటన జరిగేనాటికి ఫొటోగ్రాఫర్‌గా ఒక ప్రాజెక్టులో భాగంగా దళిత జీవితాలను కెమెరాలో బంధిస్తున్నాడు ఈ సినిమా దర్శకుడు మడోక్. ఈ సంఘటన అతడ్ని డాక్యుమెంటరీ తీసేలా ప్రేరేపించింది. పంజాబ్ ఖేత్ మజ్దూర్ యూనియన్ కార్యకర్త అయిన దర్శకుడు కూడా గతంలో ఒక భూమిలేని వ్యవసాయ కూలీనే. దాదాపు పదేళ్ల పరిశ్రమ తర్వాత, 2018లో 'ల్యాండ్‌లెస్' సినిమా విడుదల చేశాడు మడోక్.



## గ్రామ జీవితాన్ని మలినం చేసిన మనువు :

*"నేను నగరం నుండి గ్రామానికి వెళ్ళిన ప్రతిసారీ నేను (నా దేశం విషయంలో) గర్వించదగ్గ విషయాల జాబితా తగ్గుతూ ఉంటుంది. రెండు దశాబ్దాలుగా గ్రామంలో నివసించినప్పుడు కూడా నేర్చుకోలేకపోయిన విషయాలను, నేడిప్పుడు అర్థం చేసుకోవడం మొదలుపెట్టాను"* అని చిత్రనిర్మాత సినిమా ఆరంభంలోనే వాయిస్ ఓవర్‌లో చెబుతాడు. "మనుధర్మ శాస్త్రం ప్రకారం దేవుడు బ్రాహ్మణుడిని భూమికి అధిపతిగా నియమించాడు, బ్రాహ్మణుడు ఈ భూమికి రక్షకుడిగా క్షత్రియుడ్ని నియమించాడు, వ్యవసాయం చేసుకోమని ఆ భూమిని క్షత్రియుడు వైశ్యుడికి అప్పగించాడు. పై ముగ్గురికీ సేవ చేయడానికే శూద్రులు అవసరమయ్యారు. ఈ నాలుగు వర్ణాలకూ బయట వుండిపోయినవారు అవర్ణులు లేక కులహీనులు అయ్యారు" – అంటూ జయ్ సింగ్ ఫిల్లౌరీ అనే దళిత న్యాయవాది ఈ సినిమాలో ఓ చోట వివరిస్తాడు. (ఇప్పుడు కొత్తరైతు చట్టాల ద్వారా క్రమంగా వ్యవసాయ భూములన్నీ అంబానీ, అదానీ వైశ్యులకు చెందేలా కష్టపడు తున్నారు మనువుకు సరికొత్త వారసులైన నేటి పాలకులు.)


## సిక్కు మతం కూడా విప్పలేని చిక్కుముడి కులవ్యవస్థ :

పదహారో శతాబ్దం మధ్యకాలంలోనే ఈ ప్రాంతంలో సిక్కు మతం స్థాపించబడింది. సిక్కు మతంలో కులవివక్షకు స్థానం లేదు. సిక్కు గురువులు అన్ని సామాజిక శ్రేణులూ కలిసిమెలిసి వుండాలని బోధించారు. హిందూ మతంలో అట్టడుగున ఉన్న సమూహాల అభ్యున్నతి కోసం ప్రయత్నించారు. అందుకే ఈ మతం విస్మరణకు గురైన సమూహాలను

అమితంగా ఆకర్షించింది. కానీ ఇప్పటికీ అక్కడ సామాజిక వివక్ష కొనసాగడానికి కారణం అట్టడుగు వర్గాలు భూమిహీనులుగా (ల్యాండ్‌లెస్) వుండిపోయి, భూమి ఉన్నవారి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బ్రతకడమే! *''భూమి అనేది పంజాబును రెండు వర్గాలుగా విభజించిన సరిహద్దు రేఖ మాత్రమే కాదు, అత్యాచారం చేసే భూహక్కుదార్లు (ఉన్నత కులాల వాళ్లు), ఆ అత్యాచారానికి ఎదురొడ్డి పోరాడాల్సిన భూమిహీనులుగా (నిమ్న కులాల వాళ్లుగా) సమాజాన్ని విడగొట్టింది.''* అని తెరపై ఒక కొటేషన్ కన్పిస్తుంది సినిమా మొదట్లోనే. ఆసక్తికరమైన విషయమేమిటంటే నేడు దళితులపై అత్యాచారాలు చేస్తున్న జాట్లు తెలుగు ప్రాంతాల్లోని రెడ్లలానే ఒకప్పుడు జమీందార్ల కింద పనిచేస్తుండిన హిందూ కులవ్యవస్థలోని నాల్గవ వర్ణానికి (శూద్రులు) చెందినవారే. స్వాతంత్ర్యానంతరం, భారతదేశం తన సొంత రాజ్యాంగంతో ప్రజాస్వామ్య, లౌకిక దేశంగా ప్రయాణం ప్రారంభించాక, అది అన్ని వర్గాలకు సమాన హక్కులను, అణగారిన వర్గాలకు ప్రత్యేక రిజర్వేషన్లను పొందుపరిచింది. 1950ల చివర్లో కొత్త భూ సంస్కరణలు జరిగాయి. ఈ సంస్కరణలు జమీందారీ వ్యవస్థను రద్దు చేశాయి. అప్పటి వరకు జమీందార్ల కింద పనిచేస్తున్న జాట్ సామాజిక వర్గానికి సంస్కరణల తరువాత, సొంత భూమి దొరికింది. అవర్ణులకు భూమి దక్కలేదు, వారు భూమిలేని వారిగానే మిగిలారు. 60 వ దశకంలో పంజాబ్‌లో హరిత విప్లవం జరిగింది. దాని అభివృద్ధి ఫలాలు కొత్త భూ-యాజమాన్య తరగతి అయిన జాట్లకు దక్కడంతో ఆర్థిక అభివృద్ధి సాధించి పంజాబు రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు. వారు తమ క్రింది వారిని అణచివేసే సరికొత్త ఉన్నత కులాల వారు అయ్యారు. భూ సంస్కరణల ద్వారా వచ్చిన మార్పులు సిక్కు మతం దీర్ఘకాలంగా తీసుకువచ్చిన మత, సామాజిక సంస్కరణలను అదే స్థాయిలో నిలబెట్టలేకపోయాయి. ఆర్థిక సంబంధాల నియమాలు మత నియమాల కంటే బలమైనవని మరోమారు రుజువైంది.

### అసలు సమస్య భూమిలేమి :

రాష్ట్ర జనాభా లెక్కల్ని బట్టి పంజాబ్‌లో అత్యధికంగా షెడ్యూల్డ్ కులాలతో పాటు 31.9 శాతం దళితులు ఉన్నారు. కానీ చాలా కొద్దిమందికి మాత్రమే సొంత భూమి వుంది. 1961 నాటి *'పంజాబ్ విలేజ్ కామన్ ల్యాండ్స్ రెగ్యులేషన్ యాక్ట్'* గ్రామాల్లోని మూడింట ఒక వంతు భూమిని దళితుల కోసం కేటాయించింది. కానీ ఈ భూమిని ఉన్నత కుల భూ యజమానులు ఆక్రమించారు. దళితులకు భూమి ఇవ్వడానికి యేటా జరిగే భూమి వేలం సందర్భంగా, దమ్మీ దళిత అభ్యర్థులను నిలబెట్టి, అధిక ధరకు వేలం వేయించి దళితులకు



భూమి దక్కకుండా చేస్తుంటారు. దీనికి వ్యతిరేకంగా జమీన్ ప్రాప్తి సంఘర్ష్ కమిటీ (జెడ్‌పిఎస్‌సి) దళితులను కూడగట్టి వారిని అప్రమత్తంగా వుంచుతూ, నిరసన ప్రదర్శనలు చేస్తూ భూమికి న్యాయమైన బిడ్డింగ్ ఉండేలా ప్రచారం చేస్తోంది. సంగ్రూర్ జిల్లాలో ఈ ఉద్యమాలు బాగా జరిగాయి. దీనికి ప్రతీకారంగా ఉన్నత కుల భూ యజమానులు దళితులను పశువుల మేత కోసం కూడా స్థానిక పొడిలోకి ప్రవేశించ నీయకుండా ఇబ్బందులు పెడుతున్నారు. వారి పశువుల పాలను అమ్మనీయకుండా, నిత్యావసర వస్తువులను వారు కొనుక్కోనీకుండా వారిని నిషేధించి వేధిస్తున్నారు. ఎండుపుల్లలు సేకరించడానికి దళితులు అడవికి వెళితే, జాట్ అటవీ గార్డులకు చెప్పి అక్కడ కూడా వారికి అడ్డుతగులుతుంటారు. దళితులను సామాజికంగా వెలివేయండని గురుద్వారా మైకుల నుండి ప్రకటనలు చేస్తున్నారని ఒక గ్రామంలోని దళిత స్త్రీలు ఆరోపిస్తారు. 'గురుద్వారా ప్రజలందరిది కదా?' అని దర్శకుడు ప్రశ్నిస్తే, వారి గురుద్వారా వేరు, మా గురుద్వారా వేరు అని దళితులు సమాధానమిస్తారు. 1961 నాటి చట్టంలో వున్న 'గ్రామ భాగస్వాములూ, కమీనులూ' అన్న భాషను విశ్లేషిస్తాడు దళిత న్యాయవాది. 'గ్రామ భాగస్వామి' అంటే 'భూమి వున్నవాడు', 'కమీన్' అంటే 'కామ్' అనగా పని (శ్రమ) మీద మాత్రమే ఆధారపడే భూమిలేనోడు. 'కమీనా' అనే తిట్టు ఈ 'కమీన్' అన్న పదం నుంచే పుట్టింది అని వివరిస్తాడాయన. సిక్కు మతం జనజీవనంలోకి వచ్చిన పది తరాల తర్వాత కూడా కుల వ్యవస్థ కొనసాగడానికి కారణం 'భూమి సమస్య' పరిష్కారం కాకపోవడమే అని స్పష్టం చేస్తాడాయన.

రైలు కింద పడి తన భర్త ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడనే విషాదకరమైన కథను ఒక మహిళ వివరిస్తుంది. జ్వరంతో బాధపడుతున్న అతను రాత్రి ఒంటి గంటకు నిర్ణీత సమయంలో ఆపాల్సిన నీటి పంపును ఆపలేదు. అందుకని అతడ్ని పనిలోంచి తొలగించారు. అతను భూస్వాములకు రుణపడి ఉన్న అప్పును తిరిగి చెల్లించమని అతన్ని వేధించారు. దాంతో అతను ఆత్మహత్యను మార్గంగా ఎంచుకున్నాడు. *బ్యాంకు రుణాల విషయంలో 'జాట్ రైతులు అప్పుల కారణంగా ఆత్మహత్య చేసుకోగా, భూమిలేని కార్మికుడు అప్పు దొరక్క పోవడం వల్ల ఆత్మహత్య చేసుకుంటున్నారు'* - అన్న విషయాన్ని ఒక దళితుడు వివరిస్తాడు.

### కులం - అత్యాచారం - లింగబేధం :

ఈ చిత్రంలోని మహిళా కార్మికులు కొందరు బంగాళాదుంపల పంటను కోసేటప్పుడు వారి అనుభవాలను వివరిస్తారు. "మేము ఈ పొలాల్లో ప్రతిరోజూ చాలా కష్టపడుతున్నాము, కాని మాకు కనీస వేతనం లభించదు" అని వారు దర్శకుడితో చెబుతారు. ఒక మహిళ ఆకాశం వైపు చూస్తూ "వర్షం గనుక పడితే ఆ రోజు పని పూర్తయి నప్పటికీ, రోజు మొత్తానికి ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వరు" అని చెబుతుంది. "మేము మెరుగైన జీతాల కోసం డిమాండు చేసినపుడు, మిమ్మల్ని తొలంగించేసి బీహారీలను పనిలో పెట్టుకుంటాం" అని యజమానులు బెదిరిస్తుంటారు అని చెబుతుందొకావిడ. అంటే భూమి హీనులైన ప్రవాస కార్మికులు మరింత దోపిడీకి గురౌతున్నారని మనకర్థమవుతుంది. ఈ సినిమా కులతత్వం, జెండర్ (లింగం) మధ్య సంబంధాన్ని కూడా చూపిస్తుంది. దళితులపై జరిగే దాడుల్లో ఉన్నత



కుల మహిళలు, పురుషులు సమానంగా భాగస్వామ్యం వహిస్తారు. హింసలో దళితులు గాయపడినప్పుడు, ఉన్నత కుల సిబ్బంది, వైద్యులు, ఆసుపత్రుల నర్సులు కూడా అక్కడ వివక్ష చూపి సరైన చికిత్స అందకుండా చేస్తారు. దళిత బాలికపై అత్యాచారం జరిగితే కేసును నమోదు చేయడానికి నిరాకరిస్తారు అగ్రకుల పోలీసులు. కానీ మరోవైపు, కుల వ్యవస్థ జాట్ మహిళలకు ఎలా ఇబ్బందికరంగా పరిణమించిందో మరో కథలో తెలుస్తుంది. మితిమీరిన రసాయన ఎరువుల వాడకం కారణంగా హరిత విప్లవం పంజాబును క్యాన్సర్ గడ్డగా మార్చిన సంగతి మనకు తెలిసిందే. ఒక జాట్ మహిళ తన భర్త క్యాన్సర్ చికిత్స కోసం పొలం అమ్మేస్తుంది. కాబట్టి ఇంటి జరుగుబాటు కష్టంగా వుంటుంది. కానీ కుల నియమాల ప్రకారం అగ్రవర్ణ మహిళలు బయట పనికి పోకూడని పరిస్థితి ఆమెకు గుదిబండ అవుతుంది. స్త్రీలను అవమానపరిచే తిట్లూ, స్త్రీ స్వేచ్ఛకు విరుద్ధమైన పంజాబీ పాటల ప్రస్తావన కూడా ఈ సినిమాలో వుంటుంది.

దళితులకు భూ హక్కులు లభిస్తే మంచి సమాజం ఏర్పడుతుందనీ, కూలీలు అణచివేయబడరనీ ఉద్ఘోషిస్తూ సినిమా ముగుస్తుంది. ఒక ఐక్య బృందంగా ఏర్పడి చిన్న మడిచెక్క కొనుక్కున్న దళిత కార్మికుల కథనం ఇలా సాగుతుంది. "మేము కలిసి పనిచేసే చోట ఒకరినొకరు గౌరవించుకుంటాం. ఇక్కడ ఒత్తిడి లేదు, మా సామర్థ్యం కొద్దీ పనిచేస్తూ ఒకరికొకరు సహాయం చేయడానికి సదా సిద్ధంగా ఉంటాం."

జలంధర్ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో ఫొటోగ్రఫీని బోధించే దర్శకుడి ప్రతిభ ప్రతి ఫ్రేమ్‌లోనూ కన్పిస్తుంది. చుట్టు ప్రక్కల నేపథ్యాన్ని వివరించే వైడ్ ఏంగిల్ షాట్లూ, వేగంగా కదిలే రైల్వేలకు కాంట్రాస్టుగా ఏ మార్పూలేని దళిత జీవితాన్ని చిత్రించే కెమేరా మందకొడి గమనాలూ, తీగల్లో చుట్టుకుని రెపరెపలాడుతున్న గాలిపటం, మబ్బుచాటు చంద్రుని వంటి ప్రతీకలూ సినిమా నిండా కనిపిస్తాయి.

**తాజా పరిస్థితి :**

నేడు ఢిల్లీ బోర్డర్ల దగ్గర నెల రోజులుగా పంజాబు రైతులు మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేస్తున్నారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' (24-12-2020) ప్రచురించిన ఒక వార్తా కథనం ప్రకారం ఢిల్లీ ధర్నాలో వున్న దేవ్ సింగ్ అనే పంజాబీ దళితుడు ఇలా అంటున్నాడు – "ఖేత్ హీ నహీ బచేంగే తో ఖేత్ మజ్దూర్ కరెంగే క్యా (పొలాలు ఉనికిలో లేనట్లయితే వ్యవసాయకూలీలు ఏమి చేస్తారు?) రైతు నష్టాల్లోకి వెళితే, మాకు ఏమి దొరుకుతుంది? ఈ పోరాటంలో మేమంతా ఐక్యంగా ఉండాలి."

"వారు విత్తుతారు, పండిస్తారు, పశువుల్ని సాకుతారు. రైతు కుటుంబానికి అవసరమైన అన్ని పనులూ చేస్తారు. మాలాంటి భూములున్న రైతులు వారిపై ఆధారపడాల్సిందే" అని అదే ధర్నాలోని హర్విందర్ సింగ్ అనే 22 ఎకరాల భూమి ఉన్న రైతు అంటున్నాడు. చరిత్ర సరికొత్త సందర్భాలను ముందుకు తెస్తుంది. వ్యవసాయ చట్టాలతో భూములు, పంటలు క్రమక్రమంగా అంబానీ, అదానీ కార్పొరేట్ల చేతుల్లోకి చేరిపోయే సరికొత్త సందర్భంలో వ్యవసాయంతో జీవనం ముడిపడివున్న మనుషులంతా బృహత్తర ఐక్యత అవసరాన్ని గుర్తిస్తున్నారు.

టిక్రీ బోర్డర్ వద్ద రైతుల ఉద్యమాన్ని రికార్డు చేస్తున్న ఈ సినిమా దర్శకుడు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాడు. "రోజు కూలీ సంపాదించకుండా వీరికి పూట గడవదు. వీరు తమ జీవనోపాధి కోసం జరిపే పోరాటాలు తరచూ హింసాత్మకంగా కూడా మారేవి లేదా సామాజిక బహిష్కరణలకు దారితీసేవి. యూనియన్లు దళితులకు మద్దతునిచ్చేవి. నేడు మారిన పరిస్థితుల నేపథ్యంలో అందరూ ఐక్యత అవసరాన్ని గ్రహిస్తున్నారు" అని మడోక్ అంటున్నాడు. ఈ పోరాట విజయం అనంతరం భూమి వున్న పంజాబు రైతు చరిత్ర నుండి గుణపాఠం నేర్చాడా లేదా అన్నది అతడు దళిత వ్యవసాయ కూలీతో భవిష్యత్తులో వ్యవహరించే తీరును బట్టి మనకు అర్థమౌతుంది. ✸

కవిత

# సాధ్యమే!!

**డాక్టర్. జి.వి. కృష్ణయ్య**

సాధ్యమే!!
అసాధ్యాన్ని సాధ్యం చేసి
సేద్యం చేసిన సేద్యగాడు
సరిహద్దుల్లో శాంతియుద్ధం
చేస్తున్నవాడు
గద్దెనెక్కిన పెద్దలు గద్దిస్తున్నా
గద్దలకోసం సుద్దులుమాని
ముద్దపెట్టిన మట్టిగెడ్డని
ముద్దుపెట్టుకోమంటున్నాడు!
మట్టితో అనుబంధం
మట్టిలో కలిసిందాకావదలనని
గట్టిగా నినదిస్తున్నాడు
గట్టుతెగిన మట్టి మౌనంవీడింది
రాజ్యం కదిలింది. ✸



# బాల సాహితి

## రైతు సమస్యలు దేశానికే సవాల్!

**- సైలాడ అశ్వని, 10వ తరగతి**

**"మనకు** అమ్మ జన్మనిస్తుంది" అన్న మాట తియ్యగా, వినడానికి వినసొంపుగా ఉంటుంది. కాని ఆ తల్లి తన బిడ్డ కోసం ఎన్ని కష్టాలు పడుతుందో తెల్సా? తన ప్రాణం పోయినా పరవాలేదు. బిడ్డను కాపాడుకుంటుంది. అమ్మ మనకు జన్మనిస్తే రైతు తిండి పెట్టి మనకు పునర్జన్మనిస్తాడు. ఒక తల్లి తన బిడ్డని ఎంత ప్రేమగా చూస్తుందో రైతు తన పంటని అంత జాగ్రత్తగా చూస్తాడు. పంటకి ఏ వేళకి ఏ మందు వేయాలో వేస్తాడు. మనిషి అయితే తన కష్టాలని, అవసరాలని నోటితో చెప్తారు. కాని పంట పొలాలు అలా చెప్పలేవు కదా!. అయినా వాటి అవసరాలను రైతు అర్థం చేసుకొని తీర్చుతాడు. రాత్రీపగలు కాపలాగా ఉండి, తను చాలా కష్టపడి పంటని పండిస్తాడు. తను పండించిన పంటతో తన ఆకలి తీరడమేకాక ఇతరుల ఆకలిని తీర్చుతాడు. రైతు సమాజానికే "అమ్మ". అలా అందరి ఆకలిని తీర్చే రైతును మనం ఎంత గౌరవించాలి. ఎంత సాయం చెయ్యాలి. మనకు ఎవరైనా చిన్న సాయం చేస్తేనే కృతజ్ఞతలు తెలుపుతాం. అలాంటిది రైతు మన కడుపు నింపుతున్నాడు. మనం రైతుని గౌరవించకపోయినా పరవాలేదు. వాళ్ళ కష్టాన్ని గుర్తిస్తే చాలు. రైతు రేయి పగలు ఎంతో కష్టపడి పంటని పండిస్తాడు. ఆ పంటని పండించే రైతు కంటే కార్పొరేట్లు ఎప్పుడు ధనవంతులుగా ఉంటున్నారు. కాని పంటని నమ్ముకొని కష్టపడి పండించిన రైతు మరింత పేదవాడుగా మిగిలిపోతున్నాడు. ఆత్మహత్య చేసుకుంటున్నాడు. ఇప్పుడు పిడికిలి బిగించాడు!.

మనది వ్యవసాయపు దేశం. ఈ దేశం తిండి తింటుంది అంటే దానికి కారణం రైతు. అలాంటి రైతుకి ప్రభుత్వం ఎన్ని సదుపాయాలు అందించాలి! అందిస్తున్నాం అంటున్నారు. కాని దాని వెనుకనున్న అంతరార్థం రైతులకి నష్టం కలిపించేదే. ఎందుకంటే ఈరోజు చేసిన మూడు చట్టాలు రైతులకి నష్టం కల్గించేవే. రైతుని తమ పంటను ఎక్కడైనా అమ్ముకోవచ్చు అని అన్నారు. అయితే రైతులు తమ పంటను దగ్గరలోని మార్కెట్లులో వాటిని అమ్మగలుగుతారు. మన చుట్టుపక్కల అలాంటిది లేనిది వాళ్ళు ఎక్కడని అమ్ముతారు. ఎంత దూరమని తీసుకొని వెళ్తారు? రైతులకి కావల్సిన సహాయం కార్పోరేట్‌వాళ్ళు చేస్తానన్నారట!. చెయ్యనీ, కాని కార్పొరేట్‌వాళ్ళ సహాయం ఎలా ఉంటుంది అంటే పంటకి కావల్సిన సదుపాయాలు, మందులు, మరమ్మత్తులు మేము ఇస్తాము. కానీ, మేము చెప్పిన పంటలే వెయ్యాలి అని అన్నారు. వాళ్ళు ఏ పంటతో అయితే వారికి లాభసాటి వ్యాపారం అవుతుందో ఆ పంటని వెయ్యమంటారు. అలా అయితే తిండి ఎక్కడుంటుంది? ఎక్కడి నుండి వస్తుంది? రైతులు పంటని పండించినా వాళ్ళకి తినడానికి ఒక్క గింజ దక్కదు. అప్పటికే పేదగా ఉన్న రైతులే కాదు, దేశ ప్రజలంతా మరింత పేదలుగా, తినడానికి తిండి గింజ దొరకనంత పేదగా అయిపోతారు. వాళ్ళు పండించిన పంటని విదేశాలతో వ్యాపారం చేసే దళారులు మరింత ధనవంతులౌతారు. ప్రభుత్వం పెట్టిన చట్టాలు వినడానికి చాలా బాగున్నాయి. కాని లోపలి ఉద్దేశం చూస్తే రైతుకి పెద్ద నష్టం. కార్పొరేట్ వ్యవస్థకే లాభం. ఒక్కసారి ఆలోచించండి. రైతు పంట పండించకపోతే మనం ఏం తింటామండి. మనం, ఊరు, వాడ, దేశం మొత్తం పస్తు లుంటుంది. రైతులే పంటలు పండించకపోతే దేశాభివృద్ధి ఎక్కడుంటుంది? ఎంత డబ్బున్నవాడైనా తినాల్సింది అన్నమే. కాని అమ్ముకున్న పంటతో వచ్చే సొమ్ముని కాదు. ఈరోజు రైతులు ఈ చట్టాలకి విరుద్ధంగా ఢిల్లీకి వెళ్ళి నిరసనలను తెలియజేస్తున్నారు. అక్కడే ఉంటున్నారు. అక్కడే వంట అన్నీ. రైతు అడిగితే సాగునీరు ఇవ్వరు గానీ రైతుల పైకి వాటర్ పైప్‌లతో అక్కడే నీళ్ళు గుమ్మరించారు. రైతులపైకి మత్తునిచ్చే వాయివును వదిలారు. లాఠీలతో కొట్టారు. అయినా రైతు కదలలేదు. లాఠీలతో కొట్టేవాళ్ళకి రైతు వెళ్ళి వాళ్ళకు ప్లేటుతో అన్నం ఇచ్చాడు. అయ్యా తిను, ఆఫీసర్లు తింటున్నారు. రాజకీయ నాయకులు తింటున్నారు. నువ్వు తిను. మమ్మల్ని కొట్టడానికైనా నీకు ఓపిక ఉండాలి కదా! అని రైతు అన్నాడు. రైతు ఒకరిని నొప్పించాలని కాదు అలాంటి ఉద్దేశ్యమే ఉండదు. ఈరోజు బంద్ చేసారంటే అది శాంతంగానే చేస్తున్నారు. అత్యవసరమైనటువంటి అంబులెన్స్‌కి ఎటువంటి హాని, ఆటంకము జరగదని తెలియజేసారు. అదీ రైతంటే. ఒకరికి సాయం చేసే గుణమేగాని హాని చేసేవారు కాదు. ఈరోజు బంద్ చేసారంటే వాళ్ళ స్వార్ధానికి కాదు. రైతులందరూ ఈ కొత్త రైతు చట్టాలకి విరుద్ధంగా ఉన్నారంటే దానికి అర్థం మన దేశం ఒకరి చెప్పుచేతల్లో ఉండకూడదని! కార్పొరేట్లు చెప్పిన పంట వేసి, వాళ్ళు చెప్పుచేతల్లో ఉండిపోతే మన దేశం ఆఖరికి పస్తులుండాల్సి వస్తుంది. కార్పొరేట్లు వాళ్ళకి కావల్సిన పంటని, వ్యాపారానికి లాభం తెచ్చే పంటని వెయ్యమంటారు. వాళ్ళ స్వార్ధం వాళ్ళు ఆలోచిస్తారు. వాళ్ళకి లాభాలే ముఖ్యం. దేశ ప్రజలు కాదు. కాబట్టి ఒక్కసారి ఆలోచించండి సరైన నిర్ణయం తీసుకోండి. ఈ 3 చట్టాలని రద్దుచేసి మన దేశానికి, రైతులకి ఉపయోగపడే చట్టాలను నిజాయితీగా ప్రవేశపెట్టండి.

# అన్నదాత మన రైతు

**- పల్లి గాయత్రి,** 10వ తరగతి

**రైతంటే** అన్నదాత. అన్నం పెట్టే రైతు. మనందరికి వ్యవసాయం గురించి తెలుసు. అందులో పల్లెటూరి బిడ్డలకైతే ఇంకా బాగా తెలుసు. రైతు కష్టాలు తెలుసు. రైతు బాధలు తెలుసు. రైతుకి పంటతో ఉన్న సంబంధం, తన వ్యక్తిత్వాన్ని పల్లెభాషలో తెలియజేయడమే ఈ రచన ఉద్దేశం.

పాత్రలు : **రామయ్య, లక్ష్మి(లచ్చుమ్మ), క్రిష్టయ్య(కిట్టయ్య), పోలీసులు, అధికారులు**

(రామయ్య బయటి నుండి ఇంటికి వస్తాడు. వచ్చిన తరువాత)

రామయ్య : లచ్చుమ్మ ఏటి సేత్తన్నావు. కాస్త నీళ్ళు ఒట్టుకొని రా!

లచ్చుమ్మ : ఆ! వస్తున్నానయ్యా!

రామయ్య : ఇలా ఇవ్వు.

లచ్చుమ్మ : అయ్యా! ఈ ఏలా అందరూ విత్తనాలు జల్లుతున్నారు. మరీ మనం ఎప్పుడు జల్లేది.

రామయ్య : ఏటి సేసేది లచ్చుమ్మ. మన దగ్గర విత్తనాలు కొనేంత సొమ్ము లేదు.

లచ్చుమ్మ : అట్టాగా అయ్యా! అయితే నా నల్లపూసలు తీసుకెళ్ళి మార్వాడి దుకాణం దగ్గర తనకా పెట్టయ్యా!

రామయ్య : నీకేమైనా పిచ్చా? నీ నల్లపూసలు తనకా పెట్టమంటున్నావా? నా పాణాలు పోయినా అలాంటి పని చెయ్యను. అయినా ఆడవాళ్ళకి నల్లపూసలే కదా ముఖ్యమైనది. దానిని అమ్మమంటున్నావేంటి?

లచ్చుమ్మ : లేదయ్యా! తనకాపెట్టమంటున్నాను. అయినా దీనిని నువ్వు కదా! నిరుడు పంట లాభం వచ్చిందని కొన్నావు. దానిని పంట కోసమే కదా తనకా పెట్టమంటున్నాను. దానిని తనకాపెట్టి, విత్తనాలు అలాగే ఇంతక మునుపు తనకా పెట్టిన ఎద్దుల్ని విడిపించి తీసుకొని రా అయ్యా!

రామయ్య : లచ్చుమ్మ! నువ్వు నిజంగా నా లచ్చిమీ దేవివేనే! ఉండు ఇప్పుడే వెళ్తాను.

(రైతు వెళ్ళి నల్లపూసలు తనకాపెట్టి, వచ్చిన డబ్బులతో ఎద్దుల్ని విడిపించుకొని వచ్చి, విత్తనాలు కొని పొలంకి వెళ్తాడు. అతనికి తన ఎద్దులు అంటే చాలా ఇష్టం. అన్నదమ్ముల్లా చూసుకుంటాడు. పొలంకి వెళ్ళే దారిలో ఎద్దుల్లో ఒక ఎద్దు పడిపోతుంది. అతను చాలా బాధపడి, ఆ ఎద్దుకి మందు పెట్టి చెట్టు నీడలో కడతాడు. మధ్యలో పని ఆపడం ఇష్టం లేకుండా ఒక ఎద్దుతోనే తనూ కలిసి దున్నుతాడు. తరువాత విత్తనాలు చల్లి ఇంటికి వెళ్తాడు.)

లచ్చుమ్మ : ఇదేంటయ్యా! ఇంత బురదగా ఉన్నావు.

రామయ్య : ఏటి సెప్పనే లచ్చుమ్మ. మన ఎద్దుల్లో ఒక ఎద్దు పడిపోయింది. దానిని చెట్టు నీడలో కట్టి వచ్చాను.

(మరుసటిరోజు భూమి పూజ చేసి వర్షం కోసం ఎదురు చూస్తారు. వర్షం పడి విత్తనాలు మొలకెత్తి, పంట బాగా పండుతుంది.)

రామయ్య : ఈ ఏల నాకు చాల సంతోషంగా ఉంది. పంట బాగా పండింది.

(అకస్మాత్తుగా అకాల వర్షం వచ్చి నాలుగు రోజులు ఆగకుండా పడి పంటని ముంచి వేస్తుంది.)

లచ్చుమ్మ : ఏందయ్యా వర్షం ఆగకుండా పడుతుంది.

రామయ్య : ఏటె లచ్చుమ్మ ఈ ఏడాది పంట బాగా పండి మన అప్పులు తీర్చుతుందంటె ఈ అకాల వర్షం వచ్చి కంటికి రెప్పలా కాపాడుకున్న పంటని నీటితో ముంచేసింది.

(అని బాధపడతాడు. అప్పుడే కిట్టయ్య, రామయ్య ఇంటికి వస్తాడు.)

కిట్టయ్య : రామయ్యా! ఏటి సేత్తన్నావ్.

రామయ్య : ఏటి సెప్పను కిట్టయ్య. ఈ అకాల వర్షం వచ్చి నిలువునా ముంచేసింది.

కిట్టయ్య : అవునురా! ఈ వర్షం వచ్చి పంటని ముంచేసింది. అసలు విషయం మరచిపోయాను. మన పొరుగూరి సోమయ్య లేడూ. అతను చెట్టుకు ఉరేసుకొని చనిపోయాడటరా!

రామయ్య : అవునా! ఏం జరిగింది?

కిట్టయ్య : ఈ ఏడాది వాళ్ళ అమ్మి పెళ్ళి పెట్టుకున్నాడట. ఆ పెళ్ళి కోసం బోలెడు అప్పు చేసాడు. అలాగే విత్తనాలకు, పంటకు కావల్సిన మదుపు పెట్టాడు. మంచి లాభం వస్తే అప్పు తీర్చి, అమ్మి పెళ్ళి చెయ్యాలనుకున్నాడట. కాని ఈ వర్షం నీటితో తన నమ్మకాన్ని నిలువునా ముంచేసింది. దానిని భరించలేక, మానసికంగా బాగా ఒత్తిడికి గురై తట్టుకోలేక ఉరేసుకున్నాడట.

లచ్చుమ్మ : అవునా! ఎంత పని చేసాడు. అయ్యా నువ్వు వెళ్ళి పరామర్శించి, వాళ్ళ పిల్లలకి ధైర్యం చెప్పి రా.

రామయ్య : ఆ అట్టాగే.

(పరామర్శించి వచ్చిన తరువాత)

రామయ్య : లచ్చుమ్మ! మన పంట మొత్తం పోయింది. దానిలో కొంత పంట బాగుంది. దానిని అమ్మి డబ్బులు తీసుకువస్తాను.

లచ్చుమ్మ : అట్టాగే అయ్యా!

(పంటని తీసుకొని మార్కెట్‌కి వెళ్తాడు. అక్కడ మార్కెట్‌వాడు కొనడానికి కుదరదు పైనుండి ఆర్డర్లు వచ్చాయి. అని అక్కడ నుండి పంపించేస్తారు. దానిని తీసుకొని రోడ్డు మీదైనా అమ్మడానికి అవుతుందని వెళ్తాడు. అక్కడ పోలీసులు ఇదేమైనా నీ బాబు రోడ్డా ఇక్కడ దుకాణం పెట్టావు. ఎత్తు! అని పంటని నాశనం చేసి అక్కడ నుండి నెట్టేసారు. ఆ తరువాత బాధపడుతూ ఇంటికి వస్తాడు.)

లచ్చుమ్మ : ఏటయ్యా, ఇంత వేగంగా వచ్చేసావు. పంట బాగా కిట్టుబాటు ధరకు వచ్చిందా!

రామయ్య : లేదే లచ్చుమ్మ ఈ ప్రభుత్వాలు రైతు కష్టాలని ఎప్పుడు గుర్తిస్తారో? రాత్రనక పగలనక కష్టపడి పంట పండిస్తే అకాలపు వర్షం వచ్చి పంటని నాశనం చేసింది. మిగిలిన పంటను అమ్ముదామనుకుంటే పంటని అమ్మకూడదని మార్కెట్‌వాళ్ళు అందరూ తరిమేసారు. ఏటే లచ్చుమ్మ, సిగరెట్ తాగడం తప్పు అని తెలిసి, అనారోగ్యం అని తెలిసి దానికి ప్రజలు బానిస అయ్యారు. నలుగురికి హాని చేసే సిగరెట్ తయారీదారుడు ధనవంతుడు. నలుగురికి కడుపు నింపే రైతు ఎప్పుడూ పేదవాడే.

ఈరోజు ప్రభుత్వం రైతుకు వ్యతిరేకంగా 3 చట్టాలు పెట్టారు. వాటికి విరుద్ధంగా రైతులందరూ "ఛలో ఢిల్లీ" అంటూ ఢిల్లీకి పయనించారు. బంద్ చేశారు. నేను దానికి మద్దతుగా మన చుట్టుపక్కల రైతులతో కలిసి నేను బంద్ చేస్తాను. అసలు ఈ ప్రభుత్వాలకి ఎప్పుడు తెలుస్తుంది. ఇలాంటి పరిస్థితే కొనసాగితే ఈరోజు గ్యాస్‌బండలు, ఆక్సిజన్ ఎలా కొనుక్కుంటున్నారో ఇట్టాగే రేపు బియ్యం గింజలని కూడా లెక్కపెట్టి కొనాల్సిన పరిస్థితి వస్తుంది. రానురాను ఆ గింజ దొరకడమే కష్టమవుతుంది. కాబట్టి మన దేశం కార్పొరేట్ చెప్పుచేతల్లో ఉండకుండా మన దేశం పస్తులుండకుండా ఉండాలంటే రైతుకి భరోసా కల్పించాలి. ప్రభుత్వం చేసిన 3 చట్టాలు రద్దు చేసి రైతుకి ఉపయోగపడే చట్టాలను నిజాయితీగా ప్రవేశపెడితే మనదేశం కడుపునిండా తిండి తింటుంది.

లచ్చుమ్మ : అవునయ్యా! ఎప్పుడు ఏం జరుగుతుందో అని నాకు చాలా భయంగా ఉందయ్యా!

రామయ్య : ఎందుకు? నేను సోమయ్యలాగా చనిపోతాననా? అలా ఏం జరగదు. నేను రైతుని నలుగురికి హాని చేసే సిగరెట్ తయారుచేసేవాడు అంత దర్జాగా బ్రతికితే నలుగురికి కడుపునిండా అన్నం పెట్టే నేను ఎందుకు చస్తాను? లేదు నేను చావను. నలుగురికి అన్నం పెడతా. నాలో శక్తి నశించే వరకు నేను పంట పండిస్తా. అన్నం పెడతా. అందుకోసం పోరాడతా!! ✸

# ప్రధానమంత్రిగారూ!

**- గొల్లంగి త్రివేణి**

*గౌరవనీయులైన ప్రధానమంత్రిగారికి,*

నా నమస్కారాలు! నా పేరు త్రివేణి. మాది నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల. నేను 10వ తరగతి చదువుతున్నాను. మీకు ఈ లేఖ రైతుల గురించి చెప్పటానికి రాస్తున్నాను. రైతుల కష్టాలు చెప్పటానికి రాస్తున్నాను. రైతు అంటే దేశానికి వెన్నెముక. రైతు అంటే దేశానికి "అమ్మ". అన్నదాత అయిన రైతుకు ఎన్ని కష్టాలో తెలియదు. అతను పంటలు పండిస్తే మనం చక్కగా తింటున్నాం. కాని అతనిని కొంచెం కూడా గౌరవించం. రైతు పంటను పండించడానికి ఎంతలా తపిస్తాడో తెలుసా? రైతు వర్షం ఎప్పుడు వస్తుందా, ఆకుమళ్ళు ఎప్పుడు వేస్తామా? అవి ఎప్పుడు ఊడుస్తామా? దానికి ఎప్పుడు ఎరువు వేస్తామా, నీళ్ళు కడతామా అవి పంట పండితే ఎప్పుడు కోస్తామా దానిని నూర్చి నలుగురికి ఎప్పుడు అందచేస్తామా అని చూస్తాడు. రైతు తను వేసిన పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటాడు. తన పంట పండి మంచి దిగుబడి వచ్చింది అనుకున్నలోపే ఆ రైతు పంటకు విలువ లేకుండా పోతోంది. ఆ రైతు కష్టానికి ఫలితం లేకుండా పోతోంది. మన దేశంలో నూటికి డెబ్బై శాతం రైతులు ఉన్నారు. అలాంటి దేశంలో ఇలాంటి చట్టాలు పెడితే రైతులు అంతా ఏమవ్వాలి? ఆ రైతు లేకపోతే ఈ దేశం ఏమౌతుంది. రైతుల నుండి భూములు దూరం చేసి ఆ భూముల్లో కంపెనీలు పెట్టి లాభాలు పొందుతుంది. ఈ ప్రభుత్వం అలా లక్షలాది ఎకరాలు కంపెనీలకి ధారబోసింది. మరి దేశంలో రైతులు ఎక్కడ పంటలు పండించాలి? ఇలాంటి చట్టాలు రైతుల ఉసురు తీస్తున్నాయి. ఈ ప్రభుత్వాలు కార్పొరేట్‌వాళ్ళు చెప్పిన పంటలు రైతులు వెయ్యాలి అన్నారు. కార్పొరేట్‌వాళ్ళ లాభం కోసం చెప్పిన పంటలు వేస్తే ప్రజలు ఏమి తింటారు? వ్యవసాయ వాణిజ్య కంపెనీలు రైతులతో చేసుకున్న వ్యవసాయ ఒప్పందాలకు చట్టభద్రత కల్పిస్తాము అని చెప్పి రైతు మెడకు ఉరితాడు బిగించే చట్టాలు చేశారు – చాలా ప్రాంతాల్లో కాంట్రాక్టు వ్యవసాయం చేయటం వలన ప్రభుత్వం చెప్పిన పంటే వేయాలి. వాళ్ళు చెప్పినంత స్థలంలో వేయాలి అంటూ యాజమాన్యం నిర్దేశిస్తుంది. అలా చేయకపోతే రైతును శిక్షిస్తాయి, ఈ ప్రభుత్వాలు! వ్యాపార లాభాల కోసమే రైతులు పంటలు పండించాలి. అంటే మరి ప్రజలు ఏమి తింటారు? రైతు ఎలా బ్రతుకుతాడు? అందుకే ఈ రోజు రైతు తిరగబడ్డాడు. ఈరోజు రైతు ఢిల్లీలో బంద్‌లు చేస్తుంటే వాళ్ళపైకి పైపులతో నీళ్ళు కొట్టి, విషవాయువు వదిలి, లాఠీదెబ్బలు కొడుతున్నారు. అయినా ఎలాంటి స్వార్ధం లేకుండా వాళ్ళు అక్కడ వండుకున్న అన్నం తమని కొట్టినవారికి కూడా పెడుతున్నారు. ఇలాంటి కష్టాలు రైతులకు వస్తే మనకు వచ్చినట్లే. రైతు అంటే దేవుడండి. అలాంటి రైతుని అర్థం చేసుకోండి. రైతును బ్రతకనివ్వండి. రైతు ఈ దేశానికి అన్నదాత. రైతుకి భూమి తన కూతురులాంటిది. రైతు నుండి తన కూతురిని వేరు చెయ్యకండి. దయచేసి ఈ మూడు చట్టాలను రద్దు చేయండి. రైతులను అర్థం చేసుకోండి. రైతులు చాలామంది పుట్టటంతోనే పేదవారు! అలాంటి రైతును ఇంకా పేదవాడిని చేయకండి. దయచేసి అర్థం చేసుకోండి. ✸

కథ

# లాంతరు జానకమ్మ

- డా॥ కే.వి. రమణరావు

**రోడ్డుమీద** హైస్కూలుముందర బస్సుదిగి అర్ధమైలు నడిచి, ఎండిపోయిన ఏరుదాటి, నాయనకాలవ గ్రామం మొదట్లోకి వచ్చాను. చలికాలమేమో అప్పుడే పొద్దుదిగిపోతోంది.

"జానకమ్మ యిల్లెక్కడమ్మా" ఒకామె నెత్తిమీద గంపతో యెదురొస్తోంటే అడిగాను.

"లాంతరు జానికమ్మా?" అడిగిందామె నిలబడి. నాకేంచెప్పాలో తెలీలేదు.

ఆమె వెనక్కితిరిగి "పచ్చమిద్దె కనబడతా వుందే ఆడ కుడిపక్క సందులోకి తిరగండి. కొసాన హవేలి వస్తాది. అదే" ఆని, గంప బరువుగాఉందేమో, గబగబా వెళ్లిపోయింది.

నేను కలవాల్సిన జానకమ్మ ఈ 'లాంతరు జానికమ్మ' ఒకరేనా అనుకుంటూ కదిలాను.

ఆమెచెప్పిన సందులో చివరికొచ్చాక యెడంపక్కన పాత పెంకుటిల్లుంది. యింటి ముందర జాగాలో పూలచెట్లున్నాయి. కడప బండలు ఒకదానికొకటి ఆనించి నిలబెట్టి కాంపౌండుగోడగా చేసారు. చెక్కగేటు తీసుకోని లోపలికెళ్లాను. నడవకు ఇరువైపులా రెండడుగులెత్తు అరుగుల్తో పెద్ద వసారాలున్నాయి. నడవపైన ఇంటిపైకప్పు గోపురం మాదిరి నాలుగడుగులు పైకెత్తి వుంది. పైన్నించి కొక్కానికి హరికెన్ లాంతరు వేళ్లాడతోంది. 'లాంతరు జానకమ్మ అని అందుకే అంటారా' అనుకున్నాను.

వీధి తలుపు వారగా తెరిచే వుంది. "జానకమ్మా" అని పిలిచాను.

ఒక పదహారేండ్ల పిల్ల వచ్చింది. కళ్లద్దాలతో, ప్యాంటు, ఫుల్ చొక్కాలో వున్న నన్నుచూసి "జానకమ్మ యెనకింట్లోవుంది సార్, లోపలికొచ్చి కూచ్చోండి, పిల్చుకొస్తా" అంది.

లోపలికిపోతే పెద్ద హాలు. కుర్చీలో కూర్చోని, బ్యాగు కిందపెట్టి, "నువ్వు జానకమ్మ కూతురివా తల్లీ, కొంచెం మంచినీళ్లిస్తావా" అనడిగాను.

ఆ పిల్ల "నాపేరు బార్తి సార్, మాది పక్కూరు. యింటర్ ప్రైవేటుగా కట్టినా. జానకమ్మ దగ్గిర చదువుకుంటావున్నా" అని కూజా వొంచి లోటాలో నీళ్లునింపి నాకిచ్చి లోపలికెళ్లింది.

నీళ్లుతాగి లోటా కిందపెట్టి, చేతిగుడ్డ తీసి మొహం తుడుచుకుంటూవుంటే లోపల్నించి జానకమ్మ కళ్లద్దాలు సవరించుకుంటూవచ్చి నన్నుచూసి "యెవర్నాయనా నువ్వు?" అనడిగింది. ఆమె ఎత్తైన మనిషి, చామనచాయ రంగు. డెబ్బైయేండ్లుంటాయి, జుట్టు తెల్లబడింది. ఆమె వెనకాలే భారతి వచ్చి గోడకానుకొని కాల్తో నేలమీద రాస్తా నిలబడింది.

నేను గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న సంగతి, టౌనులో ఎక్కడుండేదీ చెప్పాక "మా బ్యాంకుల వుద్యోగస్తులందరికీ టౌనులో వొక క్లబ్బు వుంది జానకమ్మా, యీ సంవత్సరం నేను దానికి సెక్రెటరిగా వున్నాను. మేము నెలకొకసారి శనాదివారాలు వొక సేవా ప్రోగ్రాము పెడతాము. యీసారి సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు 'ఆడవాళ్ల వయోజన విద్య' మీద వొక ట్రైనింగు ప్రొగ్రాము పెట్టాము. మీరొచ్చి వాళ్లకు ట్రైనింగు యివ్వాలి. ఆరోజు కార్యక్రమాన్ని కలెక్టరు ప్రారంభిస్తాడు. మిమ్మల్ని రమ్మని పిలిచేదానికి క్లబ్బు తరఫున వచ్చాను" అన్నాను.

"అయ్యో ఆ ట్రైనింగులిచ్చేవి అవీ నాకేం తెలుసు నాయనా. దానికి ప్రత్యేకంగా ఆఫీసర్లుంటారుగదా" అందామె మొహమాటంగా.

"అమ్మా మీరు యీ వూళ్లో ఆడవాళ్లకు చదువు చెప్పడంలో చాలా కృషి చేసారని విన్నాము. కలెక్టరు కూడా యీ ప్రోగ్రాం మీద గట్టిగా వున్నాడు. మా ప్రెసిడెంట్ మిమ్మల్ని వొప్పించే బాధ్యత నామీద పెట్టాడు. మీరిక్కడ చేస్తున్నదే చెప్పండి" అన్నాను.

"నేనిక్కడ పెద్దగా చేస్తున్నదేమీ లేదు. అదంతా ఆరోజుల్లో మా అమ్మానాన్నా కష్టపడి చేసినారు. నేను కొనసాగిస్తునానంతే. రాత్రైతే వూళ్లోని కొంతమంది ఆడవాళ్లు అదో ఆబైట వరండాలో కూర్చోని వాళ్లే చదువుకుంటారు. అప్పుడప్పుడూ నాకు తెల్సిందేదో నేను చెప్తావుంటాను" అని ఇంకా ఏదో చెప్పబోతోందామె.

ఇంతలో ప్యాంటు షర్టు వేసుకున్న ఒకతను నిండా అలసందకాయలు, అనపకాయలు, గెన్సుగడ్డలున్న చేతిసంచితో లోపలికొచ్చి దాన్ని తలుపుపక్కన పెట్టాడు.

"యితను నా కొడుకు సుఖదేవ్, ఎల్లైసీలో వుద్యోగం, బెంగుళూర్లో వుంటాడు. మా కోడలు గూడా అక్కడే స్కూల్లో పనిచేస్తుంది. యిద్దరు బిడ్డలు" అని అతన్ని పరిచయం చేసి "వచ్చినప్పట్నించి మిమ్మల్ని అట్లే కూర్చోబెట్టేసినా. పాలు తెస్తా" అని జానకమ్మ లోపలికెళ్లింది.

నేను, అతను మా గురించి మాట్లాడుకున్నాం. జానకమ్మ వేడిపాలు తెచ్చిచ్చింది.

పాలుతాగాక అతను "అక్క ఫోన్ చేసింది. వాళ్ల పక్క పోర్షన్ మార్చి ఫస్టుకంతా ఖాళీచేస్తారంట. నువ్విక్కడ నీ పనులన్నీ ఫిబ్రవరికంతా ముగించేసుకో. మార్చి రాగానే నేను, రమ వచ్చి నిన్ను ట్యాక్సీలో టౌనుకు తీసుకొనిపోతాం. సామాను వెనకాలే లారీలో వస్తుంది. యిప్పటికి పదేండ్లగా వాయిదా వేస్తావున్నావు. అమ్మా యింక నువ్వేంజెప్పినా వినేదిలేదు" అన్నాడు గట్టిగా. నాముందరే అతనలా అనేసరికి జానకమ్మ కొంచెం ఇబ్బంది పడింది.

"యిప్పుడంత తొందరేమొచ్చిందిరా? నా ఆరోగ్యం గెట్టిది. చూసుకునేదానికి యిక్కడ యింతమందున్నారు. రెండు మూడేండ్లు పోయినాక అట్లే వస్తాలే" అంది జానకమ్మ మెత్తగానే.

"చూడండి సార్ మా అమ్మ తీరు. డెబ్బైయేండ్లు దాటినాక యింకా యీ తాపత్రయాలెందుకు. లోకంలో మనమేనా వుండేది. మేం దూరంలో వుంటాం, యిక్కడ యీమెకేమన్నా అయితే డాక్టర్లా యేమన్నానా. అంతేగాదు. యీ చుట్టుపక్కల చదువుకునే యే ఆడపిల్ల స్వతంత్రంగావున్నా, వుద్యోగం చేస్తానన్నా, కులాంతరవివాహం చేసుకున్నా

మాఅమ్మకేం సంబంధంలేకపోయినా ముందు యీమెను తప్పుబడతారు. యీమె దగ్గర చదువుకోవడంవల్లే అలా తయారైందని అంటారు. మీరన్నా యీమెకు నచ్చజెప్పండి" అన్నాడు నాపక్క తిరిగి.

నాకేంచెప్పాలో తెలీక జానకమ్మ పక్క చూసాను. ఆమె యేంమాట్లాడకుండా లోపలి కెళ్లింది. వెనకాలే అతనూ, మా ఖాళీ పాల గ్లాసులు తీసుకొని భారతీ వెళ్లారు.

టైము చూసుకున్నాను, లాస్టు బస్సుకు ఎక్కువ టైమ్ లేదు. ఇంకా ఆమెతో మాట్లాడేది వుంది. లేచి చుట్టూచూసాను. హాలుకు రెండు వైపులా రూములున్నాయి. హాల్లో ఒకపక్కన పుస్తకాల చెక్కబీరువాలున్నాయి.

లేచి పుస్తకాల దగ్గరికెళ్లాను. అర ప్రకారంగా చరిత్ర, సైన్సు, సోషల్ పుస్తకాలు, పాతనవలలు, సోవియెట్ ప్రచురణలు, ఆధునిక తాత్విక పుస్తకాలు ఉన్నాయి. కింది అరల్లో దొంతులుగాకట్టి పాతపత్రికలున్నాయి. రెండో బీరువాలో టెంత్ నుంచి ఎమ్మే వరకు టెక్స్ట్ పుస్తకాలు. జెనరల్ నాలెడ్జి పుస్తకాలు, మ్యాగజైన్లు ఉన్నాయి. అక్కడేవున్న రిజిస్టరులో ఎవరు ఏ పుస్తకాలు తీసుకెళ్తున్నారో చిట్టా రాసివుంది.

లోపల్నుంచీ సుఖదేవ్ గట్టిగా చెప్పడం వినిపిస్తోంది. జానకమ్మ మాటలు, బతిమాల్తున్న మరోముగ్గురు ఆడపిల్లల మాటలు వినిపించినాయి. కొంచెంసేపైనాక సుఖదేవ్ లోపల్నుంచి ఒక బ్యాగుతో వొచ్చి కూరగాయల సంచి తీసుకొని "వస్తా సార్" అని బయటికెళ్లాడు. జానకమ్మ, భారతి గేటు వరకు వెళ్లొచ్చారు.

"జానకమ్మా నాకు లాస్టు బస్సుకు టైమ్ దాటిపోతుంది, మీతో యింకొన్ని మాట్లాడాల్సినవి వున్నాయి" అన్నాను.

"లింకుబస్సు వొక్కోసారి రాదునాయనా. రాత్రిపూట మధ్యదారిలో అవస్త పడతావు. తెల్లవార్జామున్నే డైరెక్టుబస్సులో పోదువులే" అని నామాట వినిపించుకోకుండా "వెనక తోట చూద్దువుగాని రా నాయనా" అని లోపలికెళ్లింది. చేసేదిలేక నేనూవెళ్లాను.

వెనకవరండా వంటిల్లుగా ఉంది, ఇద్దరాడపిల్లలు కూరలు తరుగుతున్నారు. పెరట్లో ఇంకో రెండుగదుల పెంకులవసారా ఉంది. ఒకదాంట్లో జానకమ్మ సామాన్లున్నాయి. రెండోదాంట్లో విరిగిపోయిన బల్లలు, పాత కుట్టుమిషన్లు, అద్దకం సామాన్లు ఉన్నాయి.

"అప్పట్లో వీటిని కూడా నేర్పిస్తుండేవాళ్లం. యిప్పుడీ విద్యలకు కాలం చెల్లింది" అంది జానకమ్మ నవ్వుతూ.

వసారావెనక కూరగాయలతోట చూసి వంటింట్లోకి వచ్చాము. జానకమ్మ వంటలో జొరబడింది. భారతి సంచీ బుజానికేసుకొని "యింటికి పోయొస్తామ్మా" అని చెప్పి వెళ్లింది.

"నేనూ అట్లా వాకింగ్ వెళ్లొస్తా" అనిచెప్పి వూరిబయటికి నడిచాను. మా యింటికి, మా ప్రెసిడెంటుకు ఫోన్లుచేసి, ప్రశాంతంగా చేలు, తోటలు చూస్తూ తిరిగి చీకటిపడినాక వచ్చాను.

గేటు తీసుకోని లోపలికొచ్చేసరికి అరుగులనిండా ఆడవాళ్లు కూర్చోని చదువుకుంటా వున్నారు. నేను చెట్లమధ్య కుర్చీలుంటే ఒకదాంట్లో కూర్చున్నాను. కుడిపక్కన పెద్దవాళ్లు పన్నెండుమందున్నారు. ఎడంపక్కన పదహైదుమందిదాకా యిరవై యేండ్లలోపు పిల్లలు రెండు రౌండ్లుగా కూర్చున్నారు. పైన్నుంచి కరెంటు బల్బులు వేలాడుతున్నాయి.

జానకమ్మ బయటికొచ్చి వాళ్లదగ్గరికెళ్లి కొంచెంసేపు యేవోఅడిగింది. వాళ్లకు సలహా లిచ్చింది. నన్ను చూసి "మీరిక్కడున్నారా" అంటూ వచ్చి ఎదురుకుర్చీలో కూర్చుంది.

సరిగ్గా అప్పుడే కరెంటు పోయింది. పిల్లలు గోడకానించి పెట్టిన హరికేన్ లాంతర్లను వెలిగించి తెచ్చి మధ్యలో పెట్టుకోని చదువుకోవడం కొనసాగించారు.

"యేటికవతల హైస్కూలు వరకే వుంది. కాలేజి చాలాదూరం, బస్సులో పోవాల. చాలా యిండ్లల్లో అడపిల్లల్ని దూరం పంపరు. ఆవైపున్న చిన్నవాళ్లంతా యిక్కడి స్కూల్లో టెన్త్ ప్యాసయి యింటర్ కోసం దూరం పోలేనివాళ్లు. ప్రైవేటుగా రాస్తారు. లేదంటే వొకేసారి డిగ్రీకి కడతారు. డిగ్రీల కోసం కాదు, జ్ఞానం, కార్యశీలత కోసం చదివిస్తాను. కానీ డిగ్రీల్లేందే గుర్తింపు, వుద్యోగాలు రావుగదా. యిక యీ వైపున్న పెద్దవాళ్లది వయోజనవిద్య, వీళ్లలో కొందరు బియ్యేకు కడతారు, మరికొందరు మంచిగా చదువొస్తే చాలను కుంటారు. కొంతమంది పైచదువులు చదివి పెద్ద వుద్యోగాల్లో వున్నారు. సంవత్సరానికొకసారి పాత విద్యార్థులంతా కలుస్తారు. ఎన్నో నెలలూ పడిన కష్టమంతా, ఎదుర్కొన్న అవమానాలన్నీ ఆరోజు వాళ్లని చూసి మర్చిపోతాను" వివరించింది జానకమ్మ.

"హరికేన్ లాంతరు చుట్టూ పిల్లలు చదువుకునే సీను బాగుంది" అన్నాను.

"యీ లాంతరు చుట్టూ వీళ్ల చదువు వేరేగా వుంటుంది. కొంచెంసేపు యెవరికి వాళ్లే చదువుకుంటారు. యిష్టాన్నిబట్టి వొక్కోమనిషి కొన్ని బాగా నేర్చుకుంటుంది. యింకొంచెంసేపు వొకరికొకరు చెప్పుకుంటారు. యెవరికీ అర్థంగానివే నేను యెట్లా తెల్సుకోవాలో చెప్తాను. అంతే. యిక్కడ పంచుకోవడంతప్ప పోటీ వుండదు. టీచర్లు లేనివూర్లల్లో యీవిధంగా కలిసి చదువుకోవడం బీదకుటుంబాల పిల్లలకి చాలా వుపయోగం. వాళ్లంతకువాళ్లే చదువుకో గలరు, మనం చెయ్యాల్సిందల్లా యీ పల్లెల్లో ఆ వాతావరణం కల్పించడమే" అంది జానకమ్మ.

"యిట్లా కరెంటు పోయినప్పుడు కూడా యీ లాంతరు ఆదుకుంటుంది" అన్నాను.

"యీ లాంతరును తక్కువగా చూసేదానికి లేదు. చిన్నప్పుడు మాకు యిదే ఆధారం. దీనికి ముందు నూనెదీపాలుండేవి. యెన్నో శతాబ్దాలుగా గురుకులాల్లో శిష్యుల చదువుకు యీ దీపాలే సెంటర్లుగా పనిచేసుంటాయి. గురుకులాల్లోనే కాదు, యిండ్లల్లోగూడా. చదువేగాదు చేతిపనులు, ఆట, పాట అన్నీ రాత్రిళ్లు యిట్లా దీపం చుట్టూ నేర్చుకోనుంటారు. పూర్వకాలంలో ఆడవాళ్లు చాటుగా రాత్రిళ్లు దీనిదగ్గరే నేర్చుకునేవాళ్లేమో. అందుకే 'దీపం జ్యోతీ పరబ్రంహం' అంటారనుకుంటా. 'పరబ్రంహం అంటే అన్నమొకటేగాదు, అదెట్లొస్తావుందో తెల్సుకునే జ్ఞానంగూడా' అని మా నాన్న అనేవాడు" అంటూ పంతులమ్మైపోయి మాట్లాడింది జానకమ్మ.

"అక్కడ లాంతరు కట్టిందందుకేనా?" అనడిగినా పైన కట్టిన లాంతరు చూపిస్తూ.

ఆమె నవ్వి "అది మా నాన్న రాఘవయ్య పని. అప్పట్లో మా తాత సుబ్బయ్య వొక చిన్న రాత్రిబడి మొదలెట్టినాడు. ఆయన గాంధీగారి శిష్యుడు, వీరేశలింగంగారి అభిమాని. ఆ తరువాత మా నాన్న, అమ్మా కలిసి దీన్ని పగటి బడి చేసి పెంచినారు. నాన్న పంథా వేరు. ఆయన టీచరుద్యోగం చేసినా పార్టీ ఉద్యమాల్లో

తిరిగిన మనిషి. వాళ్లిద్దరికి ఉద్యమాల్లోనే పరిచయం. 'ఆడవాళ్లు చదువుకుంటే అందరూ చదువుకున్నట్టే' అనేది వాళ్ల ఆలోచన. ఆయన అజ్ఞాతంలోకి పోయినప్పుడంతా మా అమ్మే బడి నడిపేది. అట్లాంటి రోజుల్లో నాన్న జీతంరాక మాకు వుపవాసాలు తప్పేవికాదు. అప్పుడీ చుట్టుపక్కల హైస్కూలు లేదు. ఫీజు తీసుకోక పోయినా తల్లిదండ్రుల్ని యెంతో బతిమాల్తేగాని ఆడపిల్లల్ని చదువుకు పంపేవాళ్లుకాదు" అందామె.

"మీరెంతవరకు చదువుకున్నారు?" అనడిగాను.

"నేను మదనపల్లిలో బియ్యే చదువు తున్నప్పుడు, వొకరాత్రి యింటికి నిప్పంటుకొని మండుతున్నవాసాలు పడి మా అమ్మకు వొళ్లు కాలింది. అప్పుడీయిల్లు బోదకొట్టంలేండి. నేనింటికొచ్చేసి యింక వెళ్లలేకపోయినా. ఆపైన ఆమె యెక్కువరోజులు బతకలేదు. మేము ఆడపిల్లల్ని చెడగొడ్తున్నామని కొందరు మాయింటిని తగలబెట్టినారని అప్పట్లో అనేవాళ్లు. తరువాత ప్రైవేటుగా యెమ్మే పూర్తిచేసుకున్నా. నాన్న రిటైర్మెంటు డబ్బుల్తో యీ పెంకుటిల్లేసుకున్నాము. దగ్గర్లో హైస్కూలొచ్చాక ఇది మళ్లీ రాత్రిబడి ఐంది. మా ఆయనా టీచరే. వాళ్లదిక్కడికి ఆరుమైళ్ల దూరం. మానాన్న పోయినాక యీ బడి నడిపేదెట్లాని దిగులుండేది. కానీ మా అత్తామామ యిక్కడికే వచ్చేసినారు. రాత్రిబడి కొనసాగింది. పాపం మా ఆయన చుట్టుపక్కల వూర్లల్లో అవస్థలుపడి వుద్యోగం చేసినాడు. ఆయన పెంషనే యిప్పుడు మాకాధారం. వొక సంఘటన జరిగి నాపెళ్లైన తర్వాత గూడా కొన్నాళ్లు యీ బడి చూసుకుంటా యిక్కడే వుండిపోయినా" అంది నవ్వుతూ.

"యేమైంది" అన్నాను, సన్నటి లాంతరు వెలుగులో ఆమె నవ్వే మొహాన్ని చూస్తూ.

"పెళ్లైవెళ్లగానే మా ఆడపడచు మంగ నాకు బాగా దగ్గిరైంది. ఆ మరుసంవత్సరం ఆమె స్కూలు ఫైనల్ ఐపోయి పద్మావతి కాలేజిలో సీటు తెచ్చుకుంది. మా అత్త ఆమెను దూరం పంపిచ్చేదానికి వొప్పుకోలేదు. రోజూ యింట్లో రచ్చే. పైగా పెళ్లిసంబంధం కుదిర్చింది. అతను ఆస్తిపరుడేగాని హైస్కూలు డ్రాపౌటు. రేపు కాలేజిలో చేరేదానికి ఆఖరనగా రాత్రి పది గంటలకు మంగ మా దొడ్లో వున్న బావిలో దూకబోయింది. నేనే చూసి పట్టుకున్నాను" అని బరువుగా ఊపిరి పీల్చుకుంది జానకమ్మ.

"అయ్యో, ఆ తరువాత" అన్నాను.

"యింట్లో మా ఆయన గూడా లేడు. తెగించి అప్పటికప్పుడు లాంతరు పట్టుకొని మావూరి నబిసాయెబు అక్కడే కూతురింట్లో వుంటే ఆయన్ని లేపి తోడు తీసుకోని ఆరుమైళ్లు నడిచి యిక్కడికొచ్చినాము. ఆ రాత్రే మా షావుకారి దగ్గర అప్పు తీసుకొని తెల్లవార్జాము బస్సెక్కి తిరుపతి వెళ్లిపోయినాము. మంగ కాలేజిలో చేరింది. మా అత్త నన్ను పదినెలలు యింట్లేకి రానియ్యలేదు. యిక్కడే వుండిపోయి యీ బడి చూసుకున్నా. మా ఆయన రహస్యంగా వొచ్చేవాడనుకోండి" అందామె నవ్వేసి.

"అందుకేనా మిమ్మల్ని లాంతరు జానకమ్మ అంటారు?" అనడిగినా.

"దేనికంటారో నాకు తెలీదు. యిప్పుడు మాత్రం అన్నిచోట్లా పరిస్థితులు మారినాయను కుంటున్నారా? చాలా కుటుంబాల్లో ఆడపిల్లల్ని పైచదువుకు దూరం పంపడంలేదు. బతిమాల్తే గాని, వొక్కోసారి కొట్లాడితేగాని నాదగ్గరికైనా పంపరు. ఆడపిల్లలకు పైచదువులు అవసరం లేదన్న భావన యిప్పటికీ పోలేదు. చదువుకున్న కోడళ్లు మాట వినరని భయం. మరోవైపు కొందరు పరువు భీతితో చిన్నవయసులోనే పెండ్లిచేసి కూతుళ్లని వదిలించుకోవాలని చూస్తారు. వెంటనే సులభంగా దొరికేది మేనరికాలు. అందరట్లా చేస్తున్నారని కాదు. చాలా పల్లెల్లో పైచదువులకెళ్లలేక ఆడపిల్లలు వుండిపోతున్నారు. ఎంతోమంది అణగారి చరిత్రలో కల్సిపోయినారు. యిప్పటికైనా ప్రతి ఆడపిల్లా చదువుకొని చక్కగా బతకాలగదా. చూసినారుగదా, మావాడు వూరొదిలేసి టౌనుకు రమ్మని వొకటే పోరుపెడుతున్నాడు. యెట్లా చెప్పాలో తెలియడంలేదు. నా తర్వాత యీ బడి యీ పిల్లలు చూసుకుంటారనే నమ్మకం వుంది. కానీ పల్లెల్లో వుండిన అప్పటి ఆ స్ఫూర్తి, ఆ సంఘాలు, వుద్యమాలూ యిప్పుడేవీ? యెప్పటికైనా మళ్లీ వస్తాయంటారా? చదువుకుని వెళ్లిపోయినవాళ్లైనా తమ పల్లెల్లో యిలాంటి కేంద్రాలు పెడతారేమోనని నా ఆశ. అదైనా జరుగుతుందంటారా?" అంది జానకమ్మ దిగులుగా. ఆమె చీరకొంగుతో కళ్లు ఒత్తుకుంది.

కొద్దిసేపు నేనేమీ మాట్లాడలేకపోయాను. తరువాత మా ప్రోగ్రాం గురించిన వివరాలు చెప్తుండంగా కరెంటు వచ్చింది.

"మీకు అన్నం పెట్టేస్తాను పదండి" అని లేచింది. భారతి నాకు పంచె, టవలు ఇచ్చి బాత్రూం చూపించింది. నాతోపాటే అక్కడే రాత్రికుండిపోయిన ఆడపిల్లలందరూ అన్నాలు తిని హాల్లో చాపలు పర్చుకోని మళ్లీ చదువు మొదలుపెట్టారు. నాకు హాలుపక్కన రూములో మంచం వేసారు.

నేను నాలుక్కేలేచి పెరట్లోకెళ్లాను. భారతి నీళ్ల అండాకింద మంట వేస్తోంది. మొహం కడుక్కోని రూముకొచ్చేసరికి జానకమ్మ ఆ పిల్లతో పాలు పంపించింది.

మంచంమీద కూర్చొని పాలగ్లాసు తీసుకుంటూ ఆ పిల్లవైపు చూస్తే రాత్రంతా యేడ్చినట్టు కండ్లెర్రగావున్నాయి, మొహం వుబ్బి వుంది.

"యేమలావున్నావు, ప్రాణం బాగలేదా?" అనడిగాను.

తల అడ్డంగావూపి "జానకమ్మ టౌను కెళ్లిపోతావుంది గాబట్టి నన్ను చదువు చాలించెయ్యమన్నాడు మా మామ నిన్న సాయంత్రం" అంది.

"నీ చదువుతో మీ మామకేం సంబంధం?"

"నాలుగేండ్లకింద మానాయన కాలమై పోయినాడు సార్. మా మామయింట్లో వుంటాం. జానకమ్మయింటిగ్గాబట్టి యిన్నాళ్లూ యెట్లో పంపిచ్చినారు. యింగ నేనింట్లో వొక్కతినే చదవలేనని, పరీక్షల్లో తప్పుతానని ఆపెయ్య మన్నారు" ఆ పిల్ల కండ్లల్లో నీళ్లు తిరిగినాయి.

"చదువుకోకుండా యింట్లో వుండి యేం జెయ్యాలంట?"

"మా బావతో పెండ్లి చేస్తారంట. మా బావ యింటర్ ఫెయిల్. అట్లని తక్కువనిగాదు, మంచోడే సార్. కావాలంటే పెండ్లైనాక చదువుకోమన్నారు. యిక్కడ శానామంది ఆడపిల్లల పరిస్తితి యింతే సార్. అప్పటికీ జానకమ్మ బలవంతపు పెండ్లిండ్లు వొద్దని వాళ్ల యిండ్లకుపొయ్యి గెట్టిగా చెప్తుంది. విన్నోళ్లు వింటారు, లేనోళ్లు లేదు"

"యెందుకలా?"

"మేము కాలేజీలో యెవుర్నన్నా ప్రేమించి వాళ్లతో యెల్లిపోతామని. పరువుతీస్తామని భయెం. అట్లాచేసేది నూటికి యిద్దరో ముగ్గరో.

ఐనాగాని మమ్మల్ని పెండ్లో, నిశ్చితార్ధమో కాకుండా కాలేజీలో చేర్చరు. బస్సుల్లో దూరం పంపరు"

"పోనీ వాళ్లమాటప్రకారమే పెండ్లయ్యాక కాలేజిలో చేరచ్చుగదా"

"పెళ్లైతానే పిల్లలుగావాలంటారు. నిశ్చితార్థమైతే నిఘాపెట్టి వూపిరాడనీయరు, యింగేమి చదువు. చూస్తున్నాంగదా" అంది, 'యిదిగూడా తెలీదా' అన్నట్టు నావైపు చూసి.

నాకేం మాట్లాడాలో తెలీలేదు. పాలు తాగాలనిపించలేదు, గ్లాసు కిందపెట్టేసాను.

"మీకు కలెక్టరు తెలుసని సాయంత్రం చెప్పినారుగదా. జానకమ్మను మూడేండ్లు యిక్కణ్ణే వుంచమని సుకదేవ్ సారుకు మీరంతా చెప్పండి సార్. మేము అమ్మను బాగ చూసుకుంటాం. మా డిగ్రీ అయిపోతే చాలు, యీ రాత్రిబడి మేమే నడుపుకుంటాము. యిది మాలాంటోళ్లకు శానా అవసరం. మేమందరం రాత్రి అదే అనుకున్నాము. మీరంతా చెప్తే సుకదేవ్ సారు వొప్పుకుంటాడు. చెప్తారుగదా" అంది. కళ్లలో నీళ్లు ఉబికి బుగ్గలమీదికి జారుతున్నాయి.

నేను ఏంజెప్పాలో తెలియక తల వూపాను.

దొడ్లో యెవరినో జానకమ్మ నా గురించి అడగడం వినిపిస్తోంది. భారతి నావైపు దిగులుగా, ఆశగా చూసి కండ్లు తుడుచుకుంటా బయటికెళ్లిపోయింది. ✷

# సలుమూరి రాజారావుకు విప్లవ జోహార్లు



**ఏభై** దశాబ్దాలుగా ప్రజాగాయకుడిగా, ప్రజానాట్యమండలి కళాకారునిగా కృషిచేసిన సలుమూరి రాజారావు(87) 2020 డిసెంబరు 22న పశ్చిమగోదావరిజిల్లా తణుకులో చనిపోయారు. ఆయన తణుకు పక్కనే వున్న మండపాకలో జన్మించారు.

ప్రజానాట్యమండలి కళాకారునిగా ఎన్నో నాటకాల్లో, నృత్య నాటికల్లో నటించారు. పాటలు పాడారు. బుర్రకథలు, డప్పు పాటలను వివిధ సందర్భాలలో ప్రదర్శిస్తూ ప్రజల్ని చైతన్య పరిచేవారు. ఖాకీ నిక్కరు, తెల్ల చొక్కాతో అతి నిరాడంబరంగా, చిన్న సైకిల్‌షాపు నిర్వహించుకునే రాజారావు కమ్యూనిస్టు పార్టీ భావజాలానికి కట్టుబడి నిబద్ధతతో పనిచేశారు. తెన్నేటిసూరి రాసిన 'స్వర్గానికి రోడ్డు' అనే శీర్షికతో వుండే 'బతుకంతా భారం, క్రూరం / ప్రమాదాల తీరం, ఘోరం / పుట్టటమే మహాపాతకం / చాలే ఇక మేలనుకుంటూ'... అనే పాటను ప్రతి సభలోనూ పాడుతూ నిరుత్సాహపడబోకండోయ్ అని పిలుపునిచ్చేవారు.

నిబద్ధత గల ప్రజాకళాకారుడు కామ్రేడ్ సలుమూరి రాజారావుకు జనసాహితి సంతాపం ప్రకటిస్తోంది. వారి కుటుంబసభ్యులకు, సంస్థకూ సానుభూతి తెలియచేస్తుంది. ✷

# సామ్రాజ్యవాద వ్యతిరేకి, ఫుట్‌బాల్ దిగ్గజం డియెగో మారడోనా మరణం



**అర్జెంటీనాకు** చెందిన వృత్తి ఫుట్‌బాల్ క్రీడాకారుడు మారడోనా 25 నవంబరు 2020న తన 60వ ఏట మరణించారు. ఆయన 30 అక్టోబరు 1960లో జన్మించారు.

ఆయన నరనరాన సామ్రాజ్యవాద వ్యతిరేకతను నింపుకొన్న ప్రపంచ పౌరుడు. వెనిజులా, పాలస్తీనా – ఎక్కడైనా సరే అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నినదించినవాడు.

రాజకీయాలకు అతీతంగా ఏదీ లేదని విశ్వసించాడు. 1986లో ప్రపంచ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై విజయం సాధించి, 1982లో ఫాక్లాండ్ దీవులపై జరిగిన యుద్ధంలో అర్జెంటినా ఓడిపోయినందుకు, 'ఇది ప్రతీకారం' అని తన ఆత్మకథలో రాసుకున్నాడు. "ఆ యుద్ధంలో ఇంగ్లండ్ అర్జెంటీనా వారిని పిట్టల్లా కాల్చి చంపారు. ఈ విజయం దానికి ప్రతీకారం లాంటిది" అంటూ బ్రిటీషు సామ్రాజ్యవాదంపై తన వైఖరిని స్పష్టం చేశాడు.

పాలస్తీనా పోరాటానికి మద్దతు పల్కాడు. 2014లో గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడిని ఖండించాడు. డ్రగ్స్‌కు బానిసైన మారడోనాను క్యూబా వైద్యులు కాపాడారు. కాస్ట్రో, చేగువేరాలను ఇష్టపడ్డ మారడోనా వారి చిత్రాలను పచ్చబొట్టుగా పొడిపించుకున్నాడు.

తాను అమితంగా ప్రేమించిన క్యూబా యోధుడు కాస్ట్రో చనిపోయిన 25 నవంబరునే మారడోనా చనిపోవడం యాదృచ్ఛికం. ✷

# భారత యువతరానికి స్ఫూర్తినిస్తున్న హబీబ్ జాలిబ్ కవిత 'దస్తూర్' (వ్యవస్థ)

– కొత్తపల్లి రవిబాబు

**పౌరసత్వ** సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న యువతకు పాకిస్తాన్ నిరసన కవులు ఫైజ్ అహ్మద్ ఫైజ్, హబీబ్ జాలిబ్, అల్లామా ఇక్బాల్ స్ఫూర్తినిస్తున్నారు.

షాహీన్‌బాగ్‌లో వందరోజులుపైగా నిరసన దీక్ష చేస్తున్న మహిళల శిబిరంలో 15వ రోజున జె.ఎన్.యు విద్యార్థి శశిభూషణ్ సమద్‌ను అక్కడి నిరసనకారులు జాలిబ్ రాసిన 'దస్తూర్' కవిత చదివి తీరాల్సిందే నన్నారు. నిజానికి జె.ఎన్.యులో ఫీజులు అమితంగా పెంచిన దానిని నిరసిస్తూ కొన్ని నెలల క్రితం శశిభూషణ్ ఈ కవితను జె.ఎన్.యులో గానం చేశాడు. పాకిస్తాన్‌కు చెందిన మొదట సైనిక నియంత జనరల్ ఆయూబ్‌ఖాన్‌ను విమర్శిస్తూ రాసిన ఈ కవిత సరిహద్దులు దాటి ఇక్కడ ప్రతిధ్వనిస్తోంది.

1962లో పాకిస్తాన్ ప్రజలపై బలవంతంగా రుద్దబడిన రాజ్యాంగం ప్రకారం ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతిలోగాక, ఎలొక్టరల్ కాలేజి ద్వారా పరోక్షంగా దేశ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రహసనాన్ని ఖండిస్తూ 'దస్తూర్' కవితను జాలిబ్ రాసారు. ఇది పాకిస్తాన్‌లోని సాధారణ ప్రజల రాజకీయ నిరుత్సాహాన్ని ప్రతిబింబించింది. దీనిని కవి జాలిబ్ ఎన్నో సభల్లో, బహిరంగ వేదికల్లో గానం చేశాడు. దీనికి జాతీయ గీతమంత స్థాయి వచ్చింది. జాలిబ్ పాడినప్పుడల్లా ప్రేక్షకులు కూడా ఆయనతో గొంతు కలిపేవారు.

ఇప్పుడు దీనిని మన దేశంలోని యువత పాడుతోంది. దీనిలోని కొన్ని పాదాలు "వెలుగులేని ఉషస్సు – ఈ వ్యవస్థను నేను గుర్తించను, నేను అంగీకరించను" అనే పాదాలు పోస్టర్లలో కనబడుతున్నాయి. అప్పుడప్పుడూ కవి సమ్మేళనాల్లో తరచు ఇది ఇండియాలో వినబడినా, ప్రస్తుతం మాత్రం మొదటిసారిగా ప్రజల నిరసనల్లో ప్రముఖపాత్ర వహిస్తోంది.

"జాలిబ్ కవితను గతంలో నిరసన ప్రదర్శనల్లోనూ, ఎమర్జన్సీలోనూ వినలేదు. 2014 తర్వాతే పదే పదే జాలిబ్ కవితలు వినబడుతున్నాయి. మరల ఈనాడు ఈ కవిత బహుళ ప్రజాదరణ పొందింది. దీనిలో జాలిబ్ పాకిస్తాన్‌లోని కొత్త రాజ్యాంగాన్ని (వ్యవస్థను) తిరస్కరించాడు. ఫాసిస్టు ధోరణులు తల ఎత్తుతున్న కాలంలో అటువంటి నిరసన కవిత్వం – జర్మనీ, లాటిన్ అమెరికా, పాకిస్తాన్, ఇప్పుడు ఇండియాలో ప్రజాదరణ పొందింది. జాలిబ్‌లాగానే ఇక్కడి యువత, సాధారణ ప్రజానీకం, రాజ్యాంగ విలువల రక్షణ కొరకు పోరాడుతున్నారు. వారి ఆగ్రహాన్నీ, ఆవేశాన్ని 'దస్తూర్' కవితలోని పదబంధాలూ, భావచిత్రాలూ ప్రతిబింబిస్తున్నాయి –" అని గౌహర్ రజా అనే కవి వివరించారు.

సమద్ అనే కవి ఇలా అన్నారు, "మనం తిరస్కరించాల్సిన వాటన్నిటి గురించీ 'దస్తూర్' తెలియచేస్తోంది. ఫాసిస్టు కాలంలో ఇటువంటి విప్లవ గేయం ప్రజాదరణ పొందటంలో ఆశ్చర్యంలేదు. ఇది రాసినందుకు జాలిబ్ జైలుకెళ్ళాడు. దానిని పాడుతున్న వారికి కూడా ఈ ప్రమాదం పొంచి వుంది".

హబీబ్ జాలిబ్ అసలు పేరు హబీబ్ అహ్మద్ కాగా, ప్రసిద్ధ ఉర్దూ కవి జాలిబ్ దెహల్వి పేరులోని జాలిబ్‌ను తన కలం పేరుగా ఆయన పెట్టుకున్నారు. 1928లో తూర్పు పంజాబ్‌లోని హోషియాపూర్ జిల్లాలో జన్మించారు. ఢిల్లీలో తన పాఠశాల విద్య పూర్తి చేశాడు. కవిగా మొదట్లో శృంగారం, ప్రకృతిపై రచనలు చేశాడు. దేశ విభజన కాలంలో యువ జాలిబ్ పాకిస్తాన్‌కు వెళ్ళి, కరాచీలో ఉర్దూ వార్తాపత్రిక 'ఇమ్రోజ్'లో ప్రూఫ్–రీడర్‌గా ఉద్యోగంలో చేరారు. ఆ పత్రిక సంపాదకుడు ఫైజ్ అహ్మద్ ఫైజ్‌తో ఏర్పడిన సాన్నిహిత్య ప్రభావంతో వామపక్ష భావజాలంపై మొగ్గి, పాకిస్తాన్ కమ్యూనిస్టు పార్టీలోనూ, అభ్యుదయ రచయితల ఉద్యమంలోనూ సభ్యుడయ్యారు.

1959లో ఆయూబ్‌ఖాన్ సైనిక నియంత పాలనా కాలంలో జాలిబ్ తీవ్రమైన అశాంతికి గురయ్యాడు. పాకిస్తాన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ వారి రావల్పిండి స్టేషన్‌వారు ఆ ఏడాది నిర్వహించిన కవి సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని, ఇతర కవుల్లా గాకుండా, ఉన్న వాస్తవాన్ని కుండ బ్రద్దలు కొట్టినట్లు తన కవితలో ఇలా చెప్పాడు. "ఇక్కడేమో, భాష్పవాయువు కంపు / అక్కడేమో తుపాకీ గుళ్ళ వర్షం / దూరదృష్టి లేని ఈ కటిక చీకటి యుగంలో / నిన్ను ఎలా పొగడగలను?" జాలిబ్ ఈ నిరసన కంఠం పాకిస్తాన్ అంతా ప్రతిధ్వనించింది. సైన్యమూ, సాధారణ ప్రజలు విభ్రాంతికి లోనయ్యారు. ఆ రేడియో కార్యక్రమాన్ని రికార్డుల్లోంచి తొలగించారు. కవిని అరెస్టు చేశారు. ఆ తర్వాత జాలిబ్ వివిధ నియంతల కాలంలో, ప్రజాస్వామిక ప్రభుత్వాల కాలంలో, "ప్రజలను రెచ్చగొట్టే" కవిత్వం రాసినందుకు చాలసార్లు జైలుకు వెళ్ళాల్సి వచ్చింది. ఒక బహిరంగ ప్రదర్శనలో, లాహోర్‌లోని మోచి గేటు వద్ద 'దస్తూర్' చదివినందుకు మరోసారి ఆయన అరెస్టయ్యాడు.

1965లో ఇరాన్ రాజు మహమ్మద్ రెజా పహ్లావి పాకిస్తాన్‌కు రాగా, పశ్చిమ పాకిస్తాన్‌కు చెందిన ఆనాటి గవర్నరు, నీలో అనే సినిమా నటిని ఆ రెజా షా ముందు నాట్యం చేయమన్నాడు. ఆ నటి దానిని తిరస్కరించింది. ఆమెను అరెస్టు చేయడానికి పోలీసులు వెళ్ళారు. ఆమె ప్రతిఘటించింది. ఆత్మహత్య చేసుకోడానికి ప్రయత్నించింది. ఆమె ఆత్మగౌరవ పోరాటాన్ని కీర్తిస్తూ జాలిబ్ ఒక కవిత రాశారు. "సామ్రాజ్యవాదపు సిద్ధాంతాలు నీకు తెలియదు / సంకెళ్ళతో కూడా నాట్యం చేయవచ్చు" ఈ కవితను ఆ తర్వాత ఒక సినిమాలో వాడుకున్నారు. దానిని ప్రసిద్ధ గాయకుడు మెహదీ హసన్ పాడారు.

ఆయూబ్‌ఖాన్ తర్వాత అధికారంలోకి వచ్చిన జనరల్ యాహ్యా ఖాన్ ఫోటో ముందు జాలిబ్ ధైర్యంగా ఇలా పాడాడు – **"నీకంటే ముందు సింహాసనం, అధిష్టించినవాడు కూడా / తానే దేవుడినని విశ్వసించాడు"**

ఇక జియావుల్‌హక్ హయాంలో ఒక "స్వాగత" గీతంలో ఇలా అన్నాడు. "అంధకారాన్ని వెలుగని ఎలా వర్ణించగలను? తుపానును

మలయమారుతంగా ఎలా చెప్పగలను? మనిషిని దేవుడని ఎలా కీర్తించగలను?" జియాకు వ్యతిరేకంగా పోరాడిన బెనజీర్ భుట్టోని ఆయన బలపరుస్తూ "ఆ సాయుధులైనవారు ఒక నిరాయుధురాలైన బాలికను చూసి భయభ్రాంతులౌతున్నారు" అని రాశాడు.

జీవితాంతం అవినీతి రహితుడిగా ప్రజలకు నిబద్ధుడైన జాలిబ్ 1993లో మరణించాడు. "రెండు రకాల శ్రోతలున్నారు. ఒకరు ప్రభుత – మరొకరు ప్రజలు. నేను ప్రజల కవిగా గర్వపడుతున్నాను" అన్నాడు జాలిబ్.

## ఈనాటి వ్యవస్థ

భవంతులలో మాత్రమే మిరుమిట్లు కొలిపే కాంతి
ప్రజల ఆనందాలను చీకట్లతో నింపుతుంది
ఇతరుల బలహీనతల నుండి బలం పుంజుకొంటుంది
వెలుగులేని ఉషస్సులాంటి వ్యవస్థను
నేను గుర్తించనుగాక గుర్తించను
అంగీకరించనుగాక అంగీకరించను –

తల తీసేస్తారన్న భయంలేదు
నేను అమరజీవినని ప్రపంచానికి చాటు
జైలుగోడలు చూపి నన్నెలా భయపెట్టగలవు?
ఈ పొంచి వున్న ప్రళయాన్ని
అమాయక నిశీధిని
నిరాకరిస్తాను గుర్తించడానికి
అంగీకరించడాన్ని తిరస్కరిస్తాను

"కొమ్మలపై మొగ్గలున్నాయం"టావు నీవు
ప్రతి కప్పులోనూ అంచులు దాటే పానీయం వుందంటావు నీవు
"గాయాలు వాటంతటవే మానుతున్నాయ"ని అంటావు నీవు
ఇవి పచ్చి అబద్ధాలు అంటాను
జ్ఞానులను అవమానించడమే ఇది
నేను గుర్తించనే గుర్తించను
అంగీకరించనే అంగీకరించను.

మా మానసిక ప్రశాంతతను శతాబ్దాలుగా దొంగిలించావు
కాని మాపై చలాయిస్తున్న నీ అధికారానికి
అంతిమ ఘడియలు దగ్గర పడ్డాయి
బాధను నయం చేయగలనని ఎందుకు నటిస్తావు?
తమను నయం చేసినట్లు కొందరు చెప్పినా
నేను గుర్తించనుగాక గుర్తించను
అంగీకరించనుగాక అంగీకరించను.

**(2004 ఆగస్టు సంచిక 'ప్రజాసాహితి' సంపాదకీయం శీర్షిక "హిందూస్తానూ నాదేరా! పాకిస్తానూ నాదేరా!!" ఇది హబీబ్ జాలిబ్ పాటకు పల్లవి! "హిందూస్తాన్ భీ మేరా హై పాకిస్తాన్ భీ మేరా హై! లేకిన్ ఇన్ దోనోం ముల్కోంమె అమెరికా కా డేరాహై". ఆ పాట అనువాదం కూడా అదే సంచికలో వుంది).**

## జాతి వివక్షకు వ్యతిరేకంగా జీవితాంతం కృషిచేసిన ఇ.యస్.రెడ్డికి నివాళి

**ఇ.యస్.రెడ్డిగా** ప్రపంచవ్యాప్తంగా పరిచయమైన ఏనుగు శ్రీనివాసరెడ్డి 2020 నవంబరు 1న తన 96వ ఏట కేంబ్రిడ్జిలో మరణించారు. ఆయన 1924 జులై 1న నెల్లూరు జిల్లాలో జన్మించారు.

వీరి తలిదండ్రులిద్దరూ జాతీయోద్యమంలో పాల్గొన్నారు. శ్రీనివాసరెడ్డి హైస్కూలు విద్యార్థిదశలోనే ఒక సమ్మెకు నాయకత్వం వహించారు. 1943లో మదరాసు విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ చేసారు. ఇల్లినాయిస్‌లో కెమికల్ ఇంజనీరింగ్‌లో ఉన్నత విద్య చేయాలనుకున్నారు. వీలుపడక న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్రంలో మాస్టర్ డిగ్రీ 1948లో పూర్తిచేశారు. ఆ తర్వాత కొలంబియా విశ్వవిద్యాలయంలో తన అధ్యయనాన్ని కొనసాగించారు.

ఆయన ఐక్యరాజ్యసమితిలో మూడున్నర దశాబ్దాలు వివిధ హోదాలలో ఉద్యోగం చేసి, అసిస్టెంట్ సెక్రటరీ జనరల్‌గా ఉద్యోగ విరమణ చేశారు. ఆయన సతీమణి టర్కిష్ జాతీయురాలు. ఆమె టర్కిష్ కవి నాజిం హిక్మత్ కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువదించిన విదుషీమణి. వారు మన్‌హాటన్‌లో 50 ఏళ్ళకుపైగా నివసించి, నాలుగేళ్ళక్రితం కేంబ్రిడ్జ్‌లో కుమార్తె వద్ద స్థిరపడ్డారు.

ఐక్యరాజ్యసమితి జాతి వివక్షకు వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీ సారధిగా ఇ.యస్.రెడ్డి సుప్రసిద్ధుడు. 1963–84లో ఆ బాధ్యతలో దక్షిణాఫ్రికాలో జాతి వివక్షకు వ్యతిరేకంగా ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని సమీకరించడంలో విశేష కృషిచేశారు. నెల్సన్ మండేలా విడుదల కోసం ఎంతో ప్రచారం చేశారు. దక్షిణాఫ్రికా శ్వేతజాతి దురహంకార ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆర్థిక ఆంక్షలు విధించి, దాన్ని వివిధ దేశాలు బాయ్‌కాట్ చేయాలనే ప్రచారం ముమ్మరంగా చేశారు. 1940లలో పాల్‌రోబ్సన్, డబ్ల్యు.ఇ.బి. డుబోయిజ్, హంటర్‌ల నాయకత్వాన పనిచేసిన కౌన్సిల్ ఆన్ ఆఫ్రికన్ అఫైర్స్ గ్రూపులో పనిచేశారు. ఆ గ్రూపులో కమ్యూనిస్టులున్నారనే నెపంతో 1953లో అమెరికా ప్రభుత్వం ఆ సంస్థను నిషేధించింది. దక్షిణ ఆఫ్రికాపైనా జాతి వివక్షపైనా ఆయన సాధికారత సాధించినవాడు. పదవీ విరమణ తర్వాత కూడా వ్యక్తిగత స్థాయిలో జాతి వివక్షకు వ్యతిరేకంగా కృషిచేశారు. ఈ విషయంపై దాదాపు 50 పుస్తకాలు రాశారు.

అంతర్జాతీయంగా ఎన్నో అవార్డులు పొంది 70 ఏళ్ళపాటు జాతి వివక్షకు వ్యతిరేకంగా అంతర్జాతీయంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించిన ఇ.ఎస్.రెడ్డికి 'ప్రజాసాహితి' నివాళి తెలియచేస్తోంది.

నాటిక

# ఎండమావులు

- ఐ.టి.ఆర్.ఐ. శివాజీరావు

## రంగం - 1

**విద్యార్థి** : (స్టేజి మీదకు ప్రవేశించగానే చేతిలో గన్ ఉన్నట్టు భావిస్తూ, చాటు చూసుకొని పేలుస్తూ ఉంటాడు) తప్పుకోండి, తప్పుకోండి, అదిగో శత్రువులు వచ్చేస్తున్నారు.

**దారిలో వెళ్తున్న వ్యక్తి** : ఏమయ్యింది బాబూ?!

**విద్యార్థి** : ఉష్! మాట్లాడకండి, శత్రువులు దగ్గర్లోనే ఉన్నారు. అదిగో ఆ కుర్చీల కింద, సీట్ల వెనుక.... అదిగదిగో ఆ గోడ చాటున.... జాగ్రత్త.... చంపేస్తా, అందర్నీ చంపేస్తా ఒక్కడినీ వదలను. ఈరోజు 'చికెన్ బిర్యానీ రివార్డు' రావాలంటే ఇంకో నలుగుర్ని చంపాలి.. రండిరా – రండి... త్వరగా రండి.... ధన్, ధన్... ధనాధన్ అంటూ (స్టేజికి మరోవైపుకి నిష్క్రమిస్తాడు)

**తండ్రి** : (స్టేజి మీదకి గబగబా పరిగెత్తుకుంటూ వస్తాడు. ప్రేక్షకుల వైపు చూసి) బాబూ! ఎవరైనా చూశారా?! దయచేసి సెప్పండి బాబూ!

**వ్యక్తి** : ఏమైందండీ?!

**తండ్రి** : నా కొడుకు బాబూ! ఏమిటో, బాగానే ఉండేవోడు.. సెల్‌ఫోన్‌లో ఏవో పిచ్చి పిచ్చి ఆటలాడుతూ, పిచ్చోడిలా తయారయిపోయాడు. లేసింది మొదలు రాత్రి తొంగునే వరకూ 'సంపేస్తాను, పేల్చేస్తాను, కాల్చేస్తాను' అని ఇదే గోస. మరి ఆ సెల్‌ఫోన్లో ఎవుడున్నాడో.... ఆడికీ ఈడికీ మజ్జినున్న గొడవేటో నాకేటి బోధపడ్డేదు.

**వ్యక్తి** : అయ్యో! బాబాయ్‌గారూ! అవతల మనుషులెవరూ ఉండరు. అది ఒక ఆట.

**తండ్రి** : నువ్వు ఊరుకో బాబూ, నాకు బొత్తిగా ఏవీ తెలియని ఎర్రిబాగులోణ్ణి అనుకున్నావేటి? ఈడు, ఆడు తగూలాడుకోడం నా నిన్నాను బాబూ! పోనీ ఆడెవుడో సెప్పరా ఆడి అమ్మా బావుల్తో మాట్లాడి ఆడికీ నీకూ ఈ తగులాటకం నేకండా చేస్తాను అంటే ఏవన్నాడో తెలుసునా బాబూ కన్న తండ్రినని మంచీ మర్యాదా లేకుండా.... (అని కళ్ళనీళ్ళు తుడుచుకుంటాడు)

**వ్యక్తి** : తండ్రి వీపుమీద చెయ్యేసి నిమురుతూ వుంటాడు.

**తండ్రి** : నన్ను ఇసిగించినావంటే.. అడ్డంగా నరికేస్తానన్నాడు – మనసు కష్టపెట్టుకోకుండా ఎలా ఉండమంటావ్ బాబూ! కన్నపేగు కదా గుండె రాయి చేసుకొని 'నాకెందుకురా నాయినా... నీ ఇష్టం వచ్చినట్టుండు' అని నోరు వాయి మూసుకొని కూకున్నాను. పోనీ అలాగూరుకున్నాడా.. అంటే అదీ లేదు.. రెండ్రోజుల్నించీ ఏటయినాదో పిచ్చి పిచ్చి చేష్టలు.. పిచ్చి పిచ్చి పేలాపనలూను. 'ఇదేట్రా దేవుడా సంది మాటలు మాటాడుతున్నాడు.. గాలేమైనా జల్లిందా అని ఆళ్ళమ్మ మిరపకాయలు దిగదుడిసి పొయ్యిలో యేసింది అయినా ఆ భూతం ఒగ్గిందికాదీడిని.

**వ్యక్తి** : బాబాయ్‌గారు మీ అబ్బాయి పబ్జి గేమ్ ఆడుతున్నట్టున్నాడు. మీ అబ్బాయిలాగే చాలామందికి ఈ పిచ్చి పట్టుకుంది.

**తండ్రి** : పిచ్చే పట్టుకుందో.. పిశాచమే పట్టుకుందో.. ఆ స్థంబం యెనకాల యెవుడో ఉన్నాడంటాడు. 'ఎవుడ్రా' అని యెల్లి సూత్తే ఎవుడూ వుండడు. నిన్నటికాడి నుంచీ మరీ పిచ్చెత్తిపోయి ఈదులంట పోతున్నాడు. తుపాకీ అంటాడు. బాంబంటాడు. సంపడవంటాడు.. పొద్దుటేళ్ళ ఇల్లొగ్గేసి పోనాడు.. మా యాడది నే పన్జేసుకుంటున్న దగ్గరికొచ్చి సెపితే ఇదిగో పని మానుకొని వెతుక్కుంటూ బయలెల్లినాను. ఏదో ఈడి వాలికం ఈడూనూ.. ఏటిజెయ్యాలో ఏటో (చేతులు వూపుతూ పైకి చూస్తాడు)

**వ్యక్తి** : బాబాయ్‌గారూ! మీ అబ్బాయి చేతిలోనుంచి ఆ సెల్‌ఫోన్ లాక్కుంటే అన్ని జబ్బులూ కట్టేస్తాయి.

**తండ్రి** : నువ్వన్నది నిజవే బాబూ! ఆ సెల్‌ఫోన్ ఈడి చేతిలో పడింది.. అప్పట్నిండీ ఈడికీ మాయరోగవట్టుకుంది. అయితే నువ్వన్నది కూడా ప్రయత్నించాను. అందులో డబ్బులయిపోయాయంటే ఇవ్వనన్నాను. ఓపాలి అప్పుడేటిసేసాడో తెలుసా.. వంటింట్లో కత్తిపీట తెచ్చి మెడ మీదెట్టుకొని.. డబ్బులిస్తావా.. మెడ కోసుకొని సచ్చిదా అన్నాడు. ఇక నానేం చేద్దును. సచ్చినట్టు డబ్బులిచ్చాను.

**వ్యక్తి** : చెయ్యిదాటిపోయాడు గానీ ఒక సారి డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్ళు బాబాయ్!

**తండ్రి** : అవును బాబూ! ఏదో ఒకటి సెయ్యాలి.. లేకపోతే మాకు చెందకుండా పోతాడు. జబ్బులైతే తెలుస్తాయి. తెచ్చిపెట్టిన జబ్బుల్ని కనుక్కోలేకపోతున్నాం. ఈడి ఈడు గుంటలందరికీ ఇదే వెర్రొట్టుకుందంట.... మేం మా రెక్కలు ముక్కలు సేసుకొని.... నాలుగు

కూల్డబ్బులు సంపాదించిచ్చి సదువుకోండిరా నాయనల్లారా అంటే.. ఇదిగో ఇలాటి పిచ్చి పిచ్చి ఆటలాడి ఆ సదువులు సంకనాకబెడుతున్నారు. సంటి పిల్లలైతే ఆ మాట ఈమాట చెప్పి మాయ జెయ్యొచ్చు. కానీ ముడ్డి కిందకి 20 ఏళ్ళొచ్చిన పిల్లలకు మనం చెప్పగలమా బాబూ.. ఆళ్ళకాళ్ళు తెలుసుకోవాల. ఆ తెలుసుకునే రోజులే పోయినట్లున్నాయ్. అయినా నాకు తెలీకడుగుతాను. ఇంతమందినిలా పిచ్చోళ్ళిని చేస్తున్న ఆ ఆటని ఆపొచ్చు కదా బాబూ మన గవర్నమెంటోళ్ళు. ఈళ్ళనిలా పిచ్చోళ్ళని చేస్తున్న ఆ ఆటని అందులో ఆటని పెట్టిన పిచ్చినాయాల్ని బయటకి లాగి నాలుగు తగిలిస్తే ఈళ్ళ పిచ్చి ఆళ్ళ పిచ్చి ఒక్కసారే వదిలిపోద్ది గదా! ఉండు బాబు వస్తాను. 'ఒరేయ్.. బాబూ! నాన్నా.. ఎక్కడున్నావురా' (అంటూ స్టేజి రెండోవైపుకి నిష్క్రమిస్తాడు)

## రంగం - 2

***(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మినిస్టర్, అతని పి.ఏ.)***

**పి.ఏ.** : సార్! మన మీద ప్రెషర్ ఎక్కువగా ఉందండీ, అంతకు మునుపు బ్లూవేవ్ గేమ్ ఆడి చాలామంది చనిపోయారు కదా, ఇప్పుడు కొత్తగా వచ్చిన పబ్జీ వల్ల కూడా చాలామంది చనిపోతున్నారట. మరికొంతమంది పిచ్చోళ్ళయిపోతున్నారట, హత్యలు, అత్యాచారాలు కూడా చేస్తున్నారట. ముఖ్యంగా టీనేజీ పిల్లల తల్లిదండ్రులు దీనిని నిషేధించాలని ఒత్తిడి చేస్తున్నారు.

**ఐ.టి. మినిస్టర్** : ఇదిగో ఇలాంటి సోది కబుర్లు నాకు చెప్పకు! ఆళ్ళడుగుతున్నారు, ఈళ్ళడుగుతున్నారు అని నస పెట్టకు... అడిగీ.. అడిగీ చివరకు నోళ్ళు నొప్పి పుట్టి వాళ్ళే ఊరుకుంటార్లే! ఆ బ్లూవేవ్ గేమ్ వాళ్ళ మీదకు వదిలింది మనమే! ఇప్పుడీ పబ్జీ గేమ్ వదులుతున్నదీ మనమే. ఎందుకో తెలుసా అలాంటి గేమ్‌లు ఆడి ఆళ్ళు పిచ్చోళ్ళు కాకపోతే మనల్ని పిచ్చోళ్ళను చేస్తారు, వాళ్ళు ఆత్మహత్యలు చేసుకోకపోతే ఆ ఉరితాళ్ళు మనకి తగిలించి, ఉరేసేస్తారు.

**పి.ఏ.** : (అర్థం కానట్టు చూస్తాడు)

**మినిస్టర్** : అర్థం కాలేదా?

**పి.ఏ.** : (కాలేదన్నట్టు తలూపుతాడు)

**మినిస్టర్** : అందుకే నువ్వు పి.ఏ. అయ్యావు, నేను మినిస్టర్ నయ్యాను. అలాంటి ఆటలు వీళ్ళ చేత ఆడించి వీళ్ళను పిచ్చోళ్ళను, వెర్రోళ్ళను చెయ్యకపోతే మాకు ఉద్యోగాలివ్వండి, ఉపాధి కల్పించండి అని వెంట బడతారు. ఉద్యమాలు చేసి మనకే ఎసరు పెడతారు. అందుచేత మన ప్రజారంజక పాలన (కన్నుగీటి) నిరాటంకంగా జరగాలంటే వీళ్ళు, అంటే ఈ గుంటనాయాళ్ళను కుదురుగా ఉండనివ్వకూడదు.

**పి.ఏ.** : (ఓ పక్కకు తిరిగి) అమ్మ వీడి తస్సాగొయ్యా! సెల్‌ఫోన్లో ఆటలంటే ఏటో అనుకున్నాను, ఇంత మాయుందని ఇప్పుడే తెలిసింది. (ఇటు తిరిగి) తవరి మేధస్సు అమోఘవండీ! (అని మోకాళ్ళ మీద ఒంగి) ఇన్ని కోట్లమంది మూతిమీద బెల్లం రాసి పరవణ్ణం తినిపించిన ఫీలింగ్ కలిగిస్తున్న మీ రాజకీయ మర్మం ఉల్లిపాయ ఒలిచినట్టుగా విప్పి చెప్పి నాకు జ్ఞానోదయం కల్గించారండీ (దణ్ణం పెడతాడు)

**మినిస్టర్** : (దీవిస్తున్నట్టు చెయ్యి ఊపుతాడు)

## రంగం - 3

**(ఇందులో సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్, అతని మిత్రుడు, షాప్ ఓనర్, బాయ్ కం కంప్యూటర్ ఆపరేటర్ ఉంటారు.)**

**(సాఫ్ట్‌వేర్ ఎంప్లాయి, అతని మిత్రుడు షాపులో వస్తువులు కొనుక్కొని బిల్ చెల్లిస్తారు. బాయ్ కం కంప్యూటర్ ఆపరేటర్ డబ్బులు తీసుకొని గులాబిరంగు బిల్ సాఫ్ట్‌వేర్ ఎంప్లాయికి అందిస్తాడు.)**

**సాఫ్ట్** : (ఆ బిల్ చేత్తో పట్టుకొని ఒణుకుతూ మూర్ఛపోతాడు, మిగిలినవాళ్ళు కంగారుగా అతని చుట్టూ చేరతారు. ఓనర్ తాళం చెవుల గుత్తిని అతని చేతిలో పెడతాడు).

**ఓనర్** : బాబూ! అతనికి మూర్ఛరోగముందా?

**స్నేహితుడు** : మూర్ఛా కాదు.. పాడూ కాదు. ఇతనికి పింక్ స్లిప్ ఫోబియా ఉంది.

**ఓ** : అంటే ఏటి బాబూ?!

**స్నే** : ఈయన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఒకప్పుడు నెలకు రెండు లక్షల ప్యాకేజీ మీద ఉద్యోగం చేసే ఈయన జీతం ఇప్పుడు నెలకు పాతిక వేలకు పడిపోయింది. ఆ ఉద్యోగం కూడా ఎప్పుడు ఉంటుందో.... ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితి.

**ఓ** : అయ్యో! అదేం పాపం?!

**స్నే** : పాపమ్ మరి, ఇతను పనిచేస్తున్న కంపెనీ నష్టాల్లోకి పోవడంతో ప్రతినెలా ఎంతో కొంతమందిని తీసేస్తున్నారు.

**ఓ** : ఇంతకీ ఇతని ఉద్యోగం ఉందా – ఊడిందా?!

**స్నే** : ఉండీ ఊడినట్టు ఉంది.

**ఓ** : అంటే?

**స్నే** : అంటే ఏమీ లేదండీ. నెలాఖర్న జీతం తీసుకునే టప్పుడు ఎవరికైతే పింక్ పే స్లిప్, అంటే గులాబి రంగు కాగితం మీద వేసిన జీతం వివరాలన్నమాట, వస్తుందో అలాంటివారికి ఆ కంపెనీతో రామ్!

రామ్! అన్నమాట అంటే ఉజ్జోగం పోయినట్టే! అదే ఆకుపచ్చ పే స్లిప్ అయితే ఉజ్జోగం ఉన్నట్టే! అందుకే మావాడు పింక్ కలర్‌లో ఏ కాగితాన్ని చూసినా ఇలా టెన్షన్ పడి, మూర్ఛపోతుంటాడు. మరేమీ అనుకోకండి.

బాయ్ : (నీళ్ళు తెచ్చి మొహం మీద కొడతాడు).

సాఫ్ట్ : (నెమ్మదిగా కళ్ళు తెరచి చేతిలో ఉన్న పింక్ స్లిప్ చూసి మళ్ళీ పడిపోతాడు)

బాయ్ : ఆ! అర్థమైంది! ఆ పింక్ స్లిప్ ఇలా ఇవ్వండి (అంటూ కంప్యూటర్‌లో గ్రీన్ స్లిప్ తీసి ఇస్తాడు)

స్నే : (అతన్ని కుదుపుతూ) ఇదిగో లే! ఇది గ్రీన్ బిల్.. మరేమీ ప్రమాదం లేదు!

సాఫ్ట్ : (గ్రీన్ స్లిప్ చూసి గబుక్కున అందుకొని లేచి నిలబడి డ్యాన్స్ మొదలెడతాడు) ఆయ్! గ్రీన్ స్లిప్పూ (దాన్ని ముద్దు పెట్టుకుంటాడు) నా ఉద్యోగం పోలేదూ.. నా ఉద్యోగం ఉందీ.. హాయ్.. నేను నా ఫ్లాట్ ఇఎంఐ కట్టుకోవచ్చూ.. మా అబ్బాయి స్కూల్ ఫీజ్ కట్టొచ్చూ.. మా ఆవిడ పుట్టింటికి పోదూ (గెంతుతూ చుట్టూ తిరుగుతాడు)

స్నే : ఏమిటిది అసహ్యంగా! ఇది మీ కంపెనీ కాదు.

సాఫ్ట్ : (ఆగి) కాదా?! (చుట్టూ చూసి) మనం షాప్‌కి కదూ వచ్చాం.. మరి చెప్పలేదేమీ.. ఏవీ మన సామాన్లు (అవి తీసుకొని బయటికి వెళ్ళిపోతాడు.. స్నేహితుడు కూడా వెనుకే వెళ్ళిపోతాడు)

ఓనర్ : ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇంతమందినీ, ఆ కంపెనీ అంతమందినీ తీసేసిందని పేపర్లలో రాస్తున్నారు. ఇప్పుడు డైరెక్ట్‌గా చూశాం. ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ అంటే అంత గొప్ప ఇంత గొప్ప అన్నారు. వీళ్ళందరికీ ఉద్యోగాలు పోతే వీళ్ళ బ్రతుకులేమవుతాయో?!

బాయ్ : ఏమవుతాయి, వాళ్ళ బ్రతుకులు కూడా నాలా అయిపోతాయి.

ఓనర్ : అదేంట్రా అలా అనేసావు? నీ బ్రతుక్కేమి?

బాయ్ : ఔనండి! దివ్యమైన బ్రతుకు. నా బ్రతుక్కేమి! నోట్లోకి అయిదు వేళ్ళు పోతుంటే పొట్ట పట్టలేక ఉబ్బి పోతుంది. తెలుగు మీడియం చదివితే ఎందుకూ పనికిరానని, మా నాన్న ఇల్లు పొల్లు అమ్మి నన్ను ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్‌లో చదివించాడు. తర్వాత ఇంజనీరింగ్ చేశాను. ఒక్కటంటే ఒకటి నా చదువుకి తగ్గ ఉద్యోగం రాలేదు.. చివరికి నాలుగు ఇంగ్లీషు ముక్కలు వచ్చిన పనివాడు కావాలంటే మీ దగ్గర జేరాను. ఇంగ్లీషు మీడియం చదువు మన షాప్‌లోకొచ్చే నార్త్ ఇండియన్స్‌కి, మీకు అవసరం అయినపుడు లెటర్స్ రాయడానికి, నా ఇంజనీరింగ్ డిగ్రీ ఇలా కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయటానికి పనికొచ్చింది. అదే దివ్యమైన బ్రతుకు!

ఓనర్ : నీకామాత్రం ఇంగ్లీషు ముక్కలు వచ్చు కాబట్టే ఈ మాత్రం ఉద్యోగమైనా దొరికింది. లేకపోతే ఇదీ లేదు.. నీకన్నా చదువుకున్న వాళ్ళెందరో ఈరోజు ఖాళీగా ఉన్నారు. ఊరిమీద గాడిదలు కాస్తున్నారు. (విసురుగా అన్నాడు)

బాయ్ : నిజవేనండీ.. ఇంగ్లీషురాని వాళ్ళు గాడిదలు కాస్తుంటే ఇంగ్లీషొచ్చిన నన్ను గాడిద కాస్తుంది.

ఓనర్ : (కోపంగా) ఏమన్నావ్?!

బాయ్ : అయ్యో! మిమ్మల్ని ఎలా అంటానండి తిండి పెడుతున్నవారు. ఈ వ్యవస్థని అంటున్నాను. ఇంగ్లీషు వస్తే ఉద్యోగాలొస్తాయి, అమెరికా వెళ్ళిపోవచ్చు అని మబ్బుల్లో నీళ్ళు చూపించి మా చేతిలో ముంత ఒలకబోయించారు. ఇంగ్లీషు... ఇంగ్లీషని అందరూ ఇంగ్లీషు మంత్రాలు జపిస్తుంటే మా నాన్న ఆస్తులమ్మి, అప్పులు చేసి ఇంగ్లీషు చదువులు చదివించాడు. చివరికేమయ్యింది. ఇంగ్లీషుకీ, ఉద్యోగాలకీ సంబంధం లేదని అర్థమైంది.. అసలిక్కడ చదువుకు తగ్గ ఉద్యోగాలేమీ లేవు. పెరుగుతున్న చదువరులకు తగ్గట్టుగా ఉద్యోగాలు పెరగకపోగా పైగా తగ్గిపోతున్నాయి. స్వీపర్ ఉద్యోగానికి కూడా లక్షల మంది పోటీపడే పరిస్థితి. పిహెచ్‌డిలు చదువుకున్నవాళ్ళు కూడా అప్లై చేశారని పేపర్లో చదివే వుంటారు. ఇంగ్లీషొచ్చినంత మాత్రాన ప్రత్యేకంగా కూర్చోబెట్టి దండ వెయ్యరు.

ఓనర్ : మరి ఆ ఇంగ్లీషు చదువుల్నే ఇప్పుడు ఒకటవ తరగతి నుంచీ పెట్టేసి అసలు తెలుగు మీడియం మొత్తంగా తీసేస్తానంటుందీ ప్రభుత్వం.

బాయ్ : నిరుద్యోగానికి పరిష్కారం చూపలేక ఎక్కడో సమస్య వుందని తప్పుదారి పట్టించడమే. తల్లిదండ్రుల అమాయకత్వాన్ని క్యాష్ చేసుకోవటమే ఇది. ఇంగ్లీషొస్తే ఉపాధి లభిస్తుందనడం ఎండమావులను చూసి దాహం తీర్చుకోమనడమే! ఇంగ్లీషొచ్చిన నాలాంటి లక్షల మంది సరైన ఉపాధి లేక చస్తుంటే మా వివరాలను బయటకి తెలీనివ్వకుండా తొక్కి పట్టి వందల్లో ఒక్కడు తెచ్చుకున్న అమెరికా ఉద్యోగం చూపించి 'ఇదిగో ఇంగ్లీషు నేర్చుకోండి.... అదిగో అమెరికా ఉద్యోగం' అంటున్నారు. మన చదువు మన దేశానికి ఉపయోగపడకుండా, అమెరికా లాంటి ఇతర దేశాలకు పంపటానికి ఇంగ్లీషును రుద్దుతున్నారు. ఇప్పటికే డిగ్రీలు మీద డిగ్రీలు వచ్చినా సరైన చదువు లేక ఇంగ్లీషు భాష రానివాళ్ళే 90% వున్నారు. ఇహ ఇప్పుడు ప్రాథమిక

విద్య నుండీ ఇంగ్లీషును రుద్దడమంటే నూటికి తొంబై శాతం విద్యార్థులను పదవ తరగతి కూడా దాటకుండా డ్రాపౌట్స్‌గా మార్చడమే! దీని వెనుక పెద్ద కుట్రే ఉండి ఉంటుంది.

**ఓనర్** : కుట్రా?! ప్రభుత్వానికేం పని?!

**బాయ్** : ఆలోచిస్తే అలాగే అనిపిస్తుందండీ. కాకపోతే తెలిసిన భాషలోనే రాని చదువులు తెలియని భాషలో ఏం నేర్చుకుంటామండి. ఇలా విద్యార్థుల మీద ఇంగ్లీషును రుద్దడం వీళ్ళందర్నీ ఉద్ధరిద్దామని కాదు. ఇంగ్లీష్ అర్థం చేసుకునే లేబర్‌ని తయారు చేయడం కోసం.

**ఓనర్** : నువ్వు చెప్పేది సమంజసంగా అన్పించటంలేదు.

**బాయ్** : దానికి ఉదాహరణ నేనేనండీ నా ఇంగ్లీషు చదువు ఎందుకు ఉపయోగపడుతుంది. మన షాపుకొచ్చే హిందీ వాళ్ళకో, ఇంగ్లీషు వాళ్ళకో మన షాపులో వస్తువుల్ని చూపించి వివరించడానికే కదా?

**ఓనర్** : అవుననుకో!

**బాయ్** : అదేవిధంగా మన తీర ప్రాంతానికి పెద్దఎత్తున విదేశీ ఫ్యాక్టరీలు వచ్చాయి, ఇంకా వస్తాయి. విదేశీ ప్రతినిధులు వస్తారు, పర్యాటకులు వస్తారు. వాళ్ళు చెప్పింది అర్థం చేసుకొని వాళ్ళకు పనులు చేసే లేబర్ పెద్దఎత్తున కావాలి.

**ఓనర్** : ఎటువంటి పనులు?

**బాయ్** : వాళ్ళు దిగే హోటళ్ళలో సర్వర్లుగా, వాళ్ళ బూట్ పాలిష్ చేసేవాళ్ళుగా, కారు డ్రైవర్లుగా ఇంకా ఇలాంటి చిన్న చితకా పనులు చేసే సేవక వర్గం పెద్ద ఎత్తున అవసరం. సొంత భాషలో చదివితే కదా సొంత ఆలోచనలు వస్తాయి. సొంత ఆలోచనలు లేకుండా బానిసల్లా పనిచేయించుకోవటానికి ఇంతకంటే మంచి పథకం ఏముంటుందండీ?

**ఓనర్** : ఇంత దుర్మార్గమా? అయితే ఇంగ్లీషోడి దగ్గర మన బానిసత్వం ఇంకా పోలేదన్నమాట. ఇలా అయితే మనందరం ఈ ఇంగ్లీషుని వ్యతిరేకించాలి.

**బాయ్** : ఇంగ్లీషు కూడా భాషే కదండీ. ఇంగ్లీషుని ఒక భాషగా వ్యతిరేకించకూడదు. కానీ మన మాతృభాషలకు సమాధి కట్టి ఆ సమాధుల మీద పరాయి భాషా పునాదులు నిర్మించడాన్ని వ్యతిరేకిద్దాం సర్!

**ఓనర్** : ఇప్పుడు నువ్వన్నది సమంజసంగా ఉంది.

## రంగం - 4

**(కొంతమంది యువకులు నిక్కర్లతో ఉంటారు. ఒక అధికారి ఉంటాడు)**

**అధికారి** : (మ్యాన్‌హోల్ చూపించి) మీకు ఉద్యోగం వచ్చాక మీరు ఇలాంటి మ్యాన్‌హోల్స్‌లో దిగి పనిచేయాల్సి ఉంటుంది. మీలో ఎవరైతే ఈ మ్యాన్‌హోల్‌లో దిగి ఈ బకెట్‌తో మురికి బయటకు తీస్తారో వాళ్ళకే మన మున్సిపాలిటీలో స్వీపర్ ఉద్యోగం కన్‌ఫర్మ్ అవుతుంది.

(ఒక్కొక్కరు దిగి బకెట్‌తో మురుగు తీస్తారు. అధికారి మార్కులు వేసుకుంటాడు. మూడవ యువకుడు దిగుతాడు. బయటకి రాడు)

**అధికారి** : ఏమయ్యాడు బాబూ వీడు. అందులో కాపురం పెట్టేసాడా (నవ్వుతాడు)

(అందరూ కంగారుగా చుట్టూ మూగుతారు. పిలుస్తారు. సమాధానం లేదు. ఒక యువకుడు దిగి పడిపోయిన యువకుడ్ని బయటకు తీస్తాడు. అందరూ చేతుల మీద తెచ్చి నేలమీద పడుకో బెడతారు. శ్వాస ఆడించే ప్రయత్నం చేస్తారు. అప్పటికే చనిపోతాడు)

**అధికారి** : వీడెవడ్రా చచ్చి నా ప్రాణం మీదకి తెచ్చాడు. ఉండండి 108కి ఫోన్ చేస్తాను. అలాగే పోలీస్ రిపోర్టిస్తాను. పోస్ట్‌మార్టమ్ ఇవ్వాలి. ఈలోగా మీలో వీడ్ని తెలిసినవాళ్ళెవరైనా ఉంటే వీడి అమ్మాబాబులకి ఫోన్ చెయ్యండి. (వెళ్ళిపోతాడు)

(యువకులంతా శవం చుట్టూ నించుంటారు. సంఘ కార్యకర్త వస్తాడు.)

**సంఘ కార్యకర్త** : ఇక్కడ స్వీపర్ ఉద్యోగానికి సెలక్షన్స్ జరుగుతున్నా యంటగా, ఇతనేమిటి ఇలా పడిపోయాడు!

**యువకులు** : (మ్యూట్‌లో వివరిస్తారు)

**యు 1** : టెస్ట్ జరుగుతుండగా పొరపాటున చనిపోయాడు. ఈ టెస్ట్‌లో పాసయితే సెలెక్ట్ చేస్తామన్నారు. ఈ చనిపోయినతను రాజేష్ నా మిత్రుడు.

**సంఘ కార్యకర్త** : అరే! అదెలా? ఇతని తల్లిదండ్రులకి కబురెల్లిందా? అంబులెన్స్‌కి ఫోన్ చేశారా? అధికారులు ఏమీ పట్టనట్లు వారి దారిన వారు పోయారే.... మీరంతా చూస్తుంటే బాగా చదువుకున్నవాళ్ళలా ఉన్నారు.

**యు 1** : అవును! నేను ఎంటెక్ చేసాను. చనిపోయిన నా మిత్రుడు ఎంఎస్‌సీ చేసాడు. ఇంకా వీళ్ళల్లో పి. హెచ్‌డిలు, పిజీలు చేసినవాళ్ళున్నారు.

**సం.కా** : అన్ని ఉద్యోగ ప్రయత్నాలు అయిపోయి, చివరకు ఇక్కడకు వచ్చారా?

**యు 1** : అవును. కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్టు, నిరుద్యోగానికి సవాలక్ష కారణాలు చూపుతున్నారు. నేను గవర్నమెంటు కాలేజీలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేసాను. పర్మినెంట్ చేస్తారని ఆశగా ఎదురు చూశాం. గవర్నమెంట్ ఎంతకీ స్పందించలేదని ఉద్యమం చేసాం. చివరికి మమ్మల్ని టెర్మినేట్ చేశారు.

**సం.కా** : నిశ్శబ్దంగా అందర్నీ చూస్తుంటాడు.

యు 4 : ప్రభుత్వం ఖాళీలన్నీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వాళ్ళతో నింపుతూ ఉంది. వాళ్ళకు ఏ హక్కులూ వుండవు. ఏ కార్మిక చట్టాలూ వర్తించవు. ఆ ఉద్యోగాలు ఎప్పుడుంటాయో, ఎప్పుడు ఊడుతాయో తెలీదు. ఈ స్వీపర్ పోస్ట్ పర్మినెంట్ పోస్టు అని ఆశతో వచ్చాము.

యు 3 : మన తీర ప్రాంతంలో బోలెడు ఫ్యాక్టరీలు పెడుతున్నారు. ప్రయత్నించాంగానీ ఫలితం లేదు.

సం.కా : పబ్లిక్‌రంగ సంస్థల్ని పప్పు బెల్లాల్లా కార్పొరేట్లకు అమ్మేసి యువతకు సరైన ఉద్యోగాల్లేకుండా చేశారు.... చేసి మనకు విదేశీ పెట్టుబడులొస్తేనే ఉపాధి అని నమ్మించారు.... మన తల్లిదండ్రుల దగ్గర బలవంతాన భూములు లాక్కొని పరిశ్రమలు పెట్టించారు. ఆ ఫ్యాక్టరీలిక్కడ పెట్టింతర్వాత కానీ జరిగిన మోసం ఏమిటో అర్థం కాలేదు.
వాళ్ళు ఇక్కడ ఫ్యాక్టరీలు పెట్టింది చవకైన మన లేబర్‌ని, మన శ్రమను దోచుకొని, వనరులను ఉపయోగించుకొని, ఆ ఫ్యాక్టరీలనుంచొచ్చే కాలుష్యంతో మన నేలను నింగినీ, నింపేసి, మనకు జబ్బులు, కాలుష్యం ఇచ్చి వాళ్ళు లాభాలు పట్టుకు పోతున్నారు. ఈ ఫ్యాక్టరీల్లో వుండే ముఖ్యమైన పోస్టులు, అధికారుల పోస్టులు మనవి కావు. కేవలం కూలీల పోస్టులే మనవి.
వీళ్ళు తెచ్చే పెట్టుబడి కూడా నామమాత్రమే. మన ప్రభుత్వాలు వీళ్ళకు కేటాయించిన వేల ఎకరాల భూములను మన బ్యాంకుల్లోనే తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొని పెట్టుబడిగా పెట్టి లక్షల కోట్ల లాభాలు తరలించుకుపోతున్నారు. మనకి ఉద్యోగాల పేరిట ఇంత ముష్టి విదిలిస్తున్నారు. ఇంతకన్నా మోసం ఉంటుందా?!

యు 2 : ఏపిపియస్సీ పోస్టులు నోటిఫికేషన్ కూడా వచ్చింది..

సం.కా : వాటి గురించెందుకడుగుతారు? ప్రతీ గవర్నమెంటు ఆఫీస్‌లోనూ వందలాది పోస్టులు ఖాళీలున్నాయి. 150 పోస్టుల ఖాళీలకు 50 పోస్టులు నోటిఫికేషన్ వేస్తున్నారు. అదీ నింపరు. ఈరోజు ప్రతీ ఆఫీసు లోనూ నలుగురైదుగురు చేసే పని ఒక్కడే చేస్తున్నాడు. ఏపిపిఎస్సీని మనలాంటి నిరుద్యోగులకు ఆగ్రహం రాకుండా ఉపయోగించుకుంటున్నారు. ఎప్పుడో ఒకసారి ఏదో ఒక నోటిఫికేషన్ ఇస్తారు. అందులోనూ.... పైరవీళ్ళూ.... కోర్టుకేసులూ.... వగైరా.. వగైరా.. దానికోసం ఎదురుచూస్తూనే మన తలలు బట్టతలలైపోతున్నాయి. ఉద్యోగాలు మీకెందుకు అని మన ప్రధానిగారు స్వయం ఉపాధితో ఉన్నత స్థానాలకు ఎదగమంటున్నారుగా. రోజూ పేపర్లలో రాస్తుంటారు కదా! మిరపకాయ బజ్జీలమ్ముకొని కోట్లు సంపాదించుకున్నవారి సక్సెస్ స్టోరీలు.. సెనక్కాయలమ్ముకొని కారు కొనుక్కున్నతని గురించీ.. ఆయనగారు చెప్పింది ఈ స్వయం ఉపాధి గురించే! ప్రధానిగారి ఉద్దేశమేమంటే.. దేశంలో అందరికీ ఉద్యోగాలివ్వలేం. కనుక మీరు స్వయం ఉపాధి పెట్టుకొని అభివృద్ధి చెందండీ అంటూ ఆయన పకోడీ బళ్ళు పెట్టుకోండి, నూడిల్స్ బళ్ళూ, చపాతీ బళ్ళూ పెట్టుకోండి అంటున్నారు.

యు 1 : స్వయం ఉపాధి అంటే ఉత్పత్తి రంగంలో ప్రభుత్వం మాలాంటివాళ్ళకి రుణాలిచ్చి స్మాల్‌స్కేల్ పరిశ్రమల లాంటివి పెట్టించి వస్తువులు ఉత్పత్తి చేయించి వాటికి మార్కెటింగ్ కల్పిస్తే మాకు ఉపాధి కలుగుతుంది. ఈ దేశంలో ఉత్పత్తి రంగం కూడా బలపడుతుంది. కానీ అలా చేయటంలేదు.

సం.కా : (వాళ్ళలో ఆవేశాన్ని గమనిస్తున్నాడు.)

యు 1 : ముమ్మాటికీ లేదు. నోట్ల రద్దు వల్ల ఎన్ని వేల చిన్నతరహా పరిశ్రమలు మూతపడ్డాయో తెలుసా.. లక్షల మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

యు 2 : ఈరోజు గుండుసూది నుంచి బాల్‌పాయింట్ పెన్ను వరకూ దిగుమతులపై ఆధారపడవలసి వస్తున్నది. ఈ దేశాన్ని ఇంత దిక్కుమాలిన స్థితికి చేర్చిన వీళ్ళా మాకు స్వయం ఉపాధి కల్పించేది?

సం.కా : మీరు పోటీపడుతున్నది ఎన్ని ఉద్యోగాలకు?

యు 1 : ఈ స్వీపర్ ఉద్యోగాలు కూడా మూడు మాత్రమే ఉన్నాయి. ఒక్క విషయం చెప్పనా.. ఈ రోజు మాలో ముగ్గురం మాత్రమే సెలెక్ట్ అవుతాం. మిగిలినవాళ్ళ సంగతేంటో చెప్పమంటారా?! ఈ ఊరొదిలిపెట్టి పోవడమో లేక ఆత్మహత్య చేసుకోవడమో?!

సం.కా : అంత నిరాశ ఎందుకు సోదరా!

యు 2 : మా వీధిలోకి వెళితే ఏమంటారో తెలుసా? వీడు ఎంటెక్ చేసాడు గానీ కనీసం స్వీపర్ పోస్ట్‌కి కూడా సెలెక్ట్ అవలేకపోయాడురా. అని నవ్వుతారు. అప్పుడు మొహం ఎక్కడ పెట్టుకోవాలో తెలీదు.

సం.కా : బాధపడకండి.

యు 1 : ఇంకో విషయం చెప్పనా (ఏడుస్తూ) ఈ దుర్మార్గమైన వ్యవస్థ మమ్మల్ని ఎంత క్రూరంగా మార్చేసిందంటే.. మాలో ఒకడు చచ్చిపోయాడని మేమెవ్వరం బాధపడటంలేదు. ఉన్న పోస్టులకు ఒకడు కాంపిటీషన్ తగ్గిందని లోలోపల సంతోషిస్తున్నాం (అంటూ నెత్తి కొట్టుకొని ఏడుస్తుంటాడు)

సం.కా : (దగ్గరకు తీసుకొని) ఊరుకోండి! ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంది.

(ప్రేక్షకుల వైపు చూసి) చూడండి. రేపు చదువు పూర్తిచేసుకొని మా నిరుద్యోగ సైన్యంలో చేరడానికి మీరు కూడా సిద్ధంగా వున్నారు. రేపు బయటకు వచ్చాక మీ పరిస్థితి కూడా ఇదేననే వాస్తవం మీరు తెలుసుకోవాలి. యువతరం, యువరక్తం అన్యాయాలకు, మోసాలకు బలికాకూడదు. నిజాన్ని తెలుసుకుని చైతన్యంతో సంఘటితపడాలి. మనమీదే ఆశలు పెట్టుకున్న ప్రజలకు వెలుగుదారి కావాలి. ఈ దేశంలో ఉన్న సమస్త విద్యార్థి లోకం, యువరక్తం ఏకం కావాలి. గడ్డిపోచలన్నీ కలసి పేనితే ఏనుగును బంధించగలవు. చలిచీమలన్నీ కలసి చిలువను మట్టుబెట్టగలవు. మనమంతా ఏకమయితే ఈ వ్యవస్థ సమూలంగా మారుతుంది. మన ఐక్యతే ఈ వ్యవస్థను మార్చగలదు, మన అవస్థలను తప్పించగలదు. "వర్ధిల్లాలి విద్యార్థి యువజనుల ఐక్యత" (అందరూ గొంతు కలుపుతారు)

(2019 డిసెంబర్ 4, 5 తేదీల్లో జరిగిన పిడిఎస్ఓ విద్యార్థి సంఘం మహాసభల సందర్భంగా రాసింది)

బాలసాహితి

## రైతన్నా!

**- కె. పుష్పలత, 10వ తరగతి**


**నువ్వు** మట్టిలో బతుకుతావు
మా కోసమే చితుకుతావు!
మట్టిని దైవంగా కొలుస్తావు
పైరును ప్రాణంగా భావిస్తావు!
నీ స్వేదంతో నేలను తడుపుతున్నావు!
నేల నుంచి సిరులు పండిస్తున్నావు!
వాన చుక్క కోసం పడిగాపులు కాస్తున్నావు
కరువు రక్కసితో నిరంతరం యుద్ధం చేస్తున్నావు!
కష్టపడి పంట సాగు చేస్తున్నావు
గిట్టుబాటు ధర లేక దిగాలు పడుతున్నావు!
అందరికి అన్నం పెడుతున్నావు.
నువ్వు మాత్రం పురుగుల మందు సేవిస్తున్నావు!
నీ నవ్వు మాకు సుభిక్షం రైతన్నా
నీ కన్నీరు మాకు దుర్భిక్షం మాయన్నా!
రైతు బతుకులు మారాల్సింది చిత్రాల్లో కాదు
రైతు బతుకులు మారాల్సింది ఇక్కడే అనీ
కలుపు రాజకీయాల పీక పట్టుకొని
రాజధాని వీధుల్లో తెగబడ్డావు!
తెగించాలి! తెగించాలి
చీడపీడల పనిపట్టు!
సాగు పచ్చగా నిలబెట్టు!!

## చల్లా వెంకటరెడ్డిగారి 7వ వర్ధంతి



**26** జనవరి 2014న గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామంలో చల్లా వెంకటరెడ్డిగారు తన 85వ ఏట మరణించారు. వీరు 14 జనవరి 1930న జన్మించారు. సీతమ్మగారు తన భర్త వెంకటరెడ్డిగారి జ్ఞాపకంగా 'ప్రజాసాహితి'కి 25 వేల రూపాయల శాశ్వత నిధిని సమకూర్చారు. వీరికి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు వున్నారు. పెద్దకొడుకు శివారెడ్డి ప్రజాసాహితి శ్రేయోభిలాషి. చల్లా వెంకటరెడ్డిగారి ఏడవ వర్ధంతి సందర్భంగా వారిని 'ప్రజాసాహితి' గుర్తుచేసుకుంటోంది.

## సజ్జా నారాయణరావుగారి ఏడవ వర్ధంతి



**12** జనవరి 2014న కృష్ణాజిల్లా నాగాయలంక గ్రామంలో సజ్జానారాయణరావుగారు తన 90వ ఏట మరణించారు. 1924లో జన్మించిన వీరు కమ్యూనిస్టు ఉద్యమ అభిమానిగా ప్రయాణించారు. వీరి భార్య సజ్జా సుబ్బమ్మగారు తన భర్త జ్ఞాపకంగా 'ప్రజాసాహితి'కి రూ.25 వేలు శాశ్వతనిధి సమకూర్చారు. వీరికి ఒక కూతురు. ఇద్దరు కొడుకులు. వీరిది 'ప్రజాసాహితి'ని ప్రారంభం నుండీ అభిమానించే కుటుంబం. నారాయణరావుగారి 7వ వర్ధంతి సందర్భంగా వారిని 'ప్రజాసాహితి' గుర్తు చేసుకుంటోంది.

వ్యాసం

# హిందుత్వ తీవ్రవాదులు తమ వ్యతిరేకులను భయపెట్టే డిజిటల్ నేరాలకు పాల్పడుతున్నారా?

- జి.వి.భద్రం

**తమ** అభిప్రాయాలతో ఏకీభవించనివారిపై తమ రాజకీయ సిద్ధాంతాలను విమర్శనాయుతంగా పరిశీలించేవారిపై, తమ సైద్ధాంతిక, రాజకీయ అవగాహనలను వ్యతిరేకించేవారిపై హిందుత్వ తీవ్రవాదులు పలు రూపాల్లో వేధింపులకు పాల్పడటం, భౌతిక దాడులకు పాల్పడటం, ఆఖరుకు హింసాపూర్వకంగా వారిని హత్యలు చేయటమన్నది మన దేశంలో పరిపాటిగా మారిపోయిన విషయం, మనదేశంలోని ప్రజలందరూ నిరంతరం చూస్తున్నదే, వారికి అనుభవైక వేద్యంగా వున్నదే.

అయితే మనదేశంలో మాత్రమే తమ వేధింపులను పరిమితం చేసుకోవటానికి హిందుత్వ తీవ్రవాదులు సంతృప్తిపడటంలేదనీ, విదేశాల్లో సహితం తమ వేధింపులను కొనసాగించటానికి సరిక్రొత్త రూపాలను ఎంచుకొంటున్నారని, ఇందుకుగాను నూతన యుగపు డిజిటల్ – నేర రూపాలను ఎంచుకొంటున్నారనీ సూచించే ఘటనలు తెలియ వస్తున్నాయి.

అమెరికా దేశంలో, 'స్వేటింగ్' అనబడే, ఆకాశరామన్నలచేత తాము వేధించదలుచుకొన్నవారిపై మిలటరీ సాయుధ పోలీసులను ఉసికొలిపే నూతన డిజిటల్ నేరాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ వేధింపులో, అందుకు కారణభూతమై, మిలటరీ పోలీసులను తమపై ఎవరు ప్రేరేపించారన్న వివరం బాధితులకుగానీ, ఆఖరుకు పోలీసులకు కానీ లభించదు. ఆకాశరామన్నలు చేసే ఒక టెలిఫోన్ / డిజిటల్ జూమ్ కాల్ చేయటం రూపంలో యిది జరుగుతుంది.

అమెరికా దేశంలోని మితవాద తీవ్రవాదులు (ఆల్ఫ్–రైట్) యిటీవలి కాలంలో, తమ వ్యతిరేకులను వేధించటానికి చేపడుతున్న ఎత్తుగడ యిది. ఇదే ఎత్తుగడను ఉపయోగించి హిందుత్వ తీవ్రవాదులు కూడా, తమ వ్యతిరేకులపై వేధింపులను జరుపుతున్నారా? అనే సందేహానికి, అవుననే అనుకోవటానికి ఆస్కారమున్న ఘటన ఒకటి యిటీవలనే వెల్లడైంది.

వాస్తవంగా జరగని ఒక హింసాయుత నేరం జరిగినట్లు, పోలీసులకు ఒక అబద్ధపు (కాకి) సమాచారం అందుతుంది. వెంటనే సాయుధ మిలటరీ పోలీసుదళం (ప్రత్యేక ఆయుధాల మరియు ఎత్తుగడల దళం – స్వాట్) రంగంలోకి దిగుతుంది. నేరం జరిగిందని ఆరోపించబడిన యింటిపై యీ సాయుధ దళం, చుట్టుముట్టి, ఆ యింటివారు తక్షణమే యింటి తలుపులు తెరవకపోతే కాల్పులు జరుపుతుంది. ఇటువంటి సందర్భాలలో అమాయకులు పోలీసు కాల్పులలో మరణించటం అనేది అన్ని కేసులలో సంభవించదు. అయినా వ్యతిరేకులను వేధించటానికీ, భయపెట్టడానికీ యిది ఒక ఫలవంతమైన రూపంగా వుంటుంది.

స్వేటింగ్ అన్నదానికి అర్థం గట్టిగా కొట్టడం. అయితే యీ సందర్భంలో దీనిని దొంగతనంగా గట్టిగా కొట్టడంగా అర్థం చేసుకోవలసి వుంది. ఇటీవలి కాలంలో జరిగిన ఒక స్వేటింగ్ ఘటనను గురించి తెలుసుకొందాం :

వినాయక చతుర్వేది అమెరికా దేశంలోని ఇర్విన్‌లోని యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో చరిత్రను బోధించే అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. ఇతడి తల్లితండ్రులు ఐదు దశాబ్దాల కాలం ముందు నుండీ అమెరికా దేశంలోనే నివసిస్తున్నారు. వినాయక చతుర్వేది అక్కడే స్కూలు విద్య నుండి చదువుకొన్నాడు. అక్కడే ఉద్యోగం చేస్తున్నాడు.

ఒక నెల రోజుల క్రితం (అక్టోబరు మూడవ వారంలో) వినాయక చతుర్వేది, ఒక రోజున 84 సంవత్సరాల వృద్ధుడైన తన తండ్రితో ఫోన్‌లో మాట్లాడుతూ వుండగా, ఆయన తనకు మరో లైను నుండి ఎవరో ఫోను చేసి తాను షెరీఫ్ (స్థానిక ప్రాంత పోలీసు అధికారి)నని చెబుతూ, తనకు అడ్డదిడ్డమైన ప్రశ్నలు వేస్తున్నాడనీ, ఆరా తీస్తే అది ఒక ప్రవేటు కాలర్ యొక్క నెంబరుగా రిజిష్టరు చేయబడి వుందని, బహుశా ఎవరైనా తనను ఆటపట్టించటానికి అలా ఫోన్ చేశాడేమోనని చెబుతూ వుండగా, వెనుక నుండి అతడి తల్లి "మన యింటి ముందు చాలామంది పోలీసులు నిలబడ్డారు" అంటూ గట్టిగా అరవటం వినిపించింది. మళ్ళీ ఫోన్ చేస్తానంటూ, అతడి తండ్రి ఫోన్ పెట్టేసి, యింటి ముందు నడవాలో గల వీధి తలుపులు తెరచి చూచి నిర్ఘాంత పోయాడు. ఎందుకంటే తమ వీధి తలుపులకు ఆయుధాలను ఎక్కుపెట్టిన అనేకమంది పోలీసులు, పేల్చటానికి సంసిద్ధంగా నుంచొని వున్నారు. ఆయన తలుపు తీయకపోయి వుంటే వారు తుపాకులు పేల్చి తలుపులను బ్రద్దల కొట్టుకొని లోనికి చొచ్చుకొని వచ్చి వుండేవారు. అతడి తండ్రి తలుపు తీసినపుడు, ఆ పోలీసులు తమకు ఒక జూమ్‌కాల్ ద్వారా, వినాయక చతుర్వేది తల్లి తన యొక్క షాట్ గన్‌తో ఒకర్ని కాల్చి చంపటం తాను చూసినట్టుగా ఫిర్యాదు వచ్చిందని చెప్పి, యిల్లు అంతా వెతుకుతామని చెప్పి ఆ ప్రకారం యిల్లంతా వెతికారు. అప్పుడర్థమయింది. ఆ పోలీసు అధికారులకు తమకు వచ్చిన ఆ కాల్ ఒక బూటకపు (అబద్ధపు) కాల్ అని. అప్పుడు ఆ అధికారులలో ఒకరు తన తండ్రితో ఎవరో యూరోపులో ఉన్న ఇంటర్‌పోల్‌కు ఆకాశరామన్న కాల్ చేసి ఆ రకంగా అంటే వినాయక్ చతుర్వేది యొక్క తల్లి తన షాట్‌గన్‌తో ఒకరిని చంపుతూ వుండగా తాను చూశానని రిపోర్టు చేశారనీ, వెంటనే ఇంటర్‌పోల్‌వాళ్ళు రాష్ట్ర హైవే పెట్రోలు వారికి సమాచారమందించారనీ, వారు స్థానిక షరీఫ్‌కు సమాచారం యివ్వటంతో తాము యిక్కడకు చేరుకొన్నామనీ వివరించాడు.

అలా ఎవరో ఎందుకో తమపై స్వేట్ బృందాన్ని ఉసికొల్పట మన్నది వారికి అంతుబట్టని విషయం అయింది. అందుకు వారికి ఎటువంటి కారణం కనపడలేదు. పోనీ పొరపాటున అలా జరిగిందా?

అంటే అందుకూ అవకాశం కనపడలేదు. ఎందుకంటే ఫిర్యాదు చేసినవారు ఖచ్చితంగా ఆ వృద్ధ స్త్రీ యొక్క పేరును, ఆవిడ యొక్క యింటి చిరునామాను యిచ్చారు. ఇలా ఎవరు చేసివుంటారు అన్న విషయాన్ని తెలుసుకోదలచుకొన్న వినాయక్ చతుర్వేది యీ విషయమై విచారణ జరిపారు.

గతంలో యీ "స్వేటింగ్"కు ఫెమినిష్టు విమర్శకులు గురిచేయ బడ్డారు. ఆ తర్వాత ఎవరుబడితే వారిని యీ "స్వేటింగ్"కు గురిచేసి వేధించటం, భయపెట్టడం అన్నది పెరిగిపోయింది. ఎఫ్.బి.ఐ. వారి ప్రకారం యీ రకమైన తప్పుడు రిపోర్టులపై వేధింపబడే (స్వేటింగ్ రూపంలో) కేసుల వివరాలను ప్రభుత్వం 2008 నుండీ పర్యవేక్షించటం ప్రారంభించింది. ఇటువంటి తప్పుడు రిపోర్టులు ఒక వెయ్యి వరకు జరిగినట్లు ఆ పర్యవేక్షణాసంస్థ అంచనా వేసింది.

గత ఐదు దశాబ్దాల కాలంగానూ చతుర్వేదుల కుటుంబం తీవ్ర శ్వేతజాత్యహంకారులు వుంటూన్నారనే చరిత్ర కలిగిన ప్రాంతంలోనే నివసిస్తున్నారు. వినాయక్ చతుర్వేదికి స్కూలులో చదువుకొంటున్నప్పుడు అతడి స్కూలు టీచరు తాను ఒక స్థానిక నయా – నాజీ సంస్థలో సభ్యుడు అని తెలిపే ఒక న్యూస్ లెటర్ విద్యార్థులకు ఎంతో గొప్పగా చూపెట్టిన విషయం కూడా గుర్తుంది. అయినా యింతవరకూ వారెప్పుడూ ఎటువంటి జాత్యహంకార వేధింపులకు గురికాబడలేదు.

ఒకవేళ యిప్పుడు, తాము నివసించే ప్రాంతంలో వలసదారుల వ్యతిరేక, జాత్యహంకార (నల్లజాతి వ్యతిరేక) భావాలు పెరగటం వలన యిలా జరిగిందా? అనే సందేహం వారికి కలిగింది.

అప్పుడు వినాయక్ చతుర్వేది, యీ విషయాన్ని గురించి టెక్ ప్రపంచంలో వున్న ఒక మిత్రుడితో చర్చించాడు. ఆ మిత్రుడు, గేమ్స్ డిజైనర్‌గా వున్న ఫెమినిష్టు డిజైనర్ అయిన కెరోలిన్ సిండర్స్ యొక్క వ్యాసాలను చదవమని సలహా యిచ్చాడు. ఆవిడ "మా అమ్మగారి యింటికి, ఇంటర్నెట్ స్వేట్ బృందాన్ని పంపిన ఆ సమయం" అని వ్రాసిన వ్యాసాన్ని వినాయక్ చదివాడు. అందులో సరీగ్గా తమకు జరిగినట్టుగానే, ఆవిడ తల్లిపైకి కూడా, ఒక తప్పుడు ఆరోపణతో "స్వాట్" టీం ఉసికొల్పబడి, పంపబడిందనీ, కాకపోతే ఆ యింట్లో ఒక తీవ్రమయిన హింసాయుత నేరం జరిగిందనీ, కొందరిని బందీలుగా ఆ యింటిలో నిర్బంధించారనీ స్థానిక పోలీసులకు సమాచారం వచ్చిందట! ఈ ఘటనకు ముందు, సిండర్స్‌ను "గేమ్ సంస్కృతిలో వున్న స్త్రీ విద్వేషం" అనే అంశంపై వ్రాసినందుకు ఆమెను ఎన్నోసార్లు ఆన్‌లైన్ వేధింపులకు గురిచేశారు. ఈ సంవత్సరపు మొదటి మాసాల్లో వినాయక్‌ను కూడా ఆకాశరామన్నలు వేధింపులకు గురిచేశారు. అప్పుడు ఆయన ఒక ఇన్వెస్టిగేటర్ (నేర పరిశోధకుడు)తో యీ విషయం గురించి మాట్లాడారు. ఆ నేర పరిశోధకుడు, వినాయక్‌కు తనను యీ రకంగా వేధించటానికి నిర్దిష్టంగా ఆకాశరామన్న వారెవరైనా తెలుసునా అని ప్రశ్నించాడు.

అప్పుడు ఆయనకు కొన్ని విషయాలు గుర్తొచ్చాయి. తన తల్లితండ్రులను వేధించటం యిదే మొదటిసారి కాదని. 1991లో వినాయక్ చతుర్వేది గ్రాడ్యుయేషన్ చదువుతూ వుండగా, అతడి తల్లితండ్రులకు ఆకాశరామన్న ఫోన్‌కాల్సు వచ్చేవి. వాటిలో వారు, ఆయన తల్లితండ్రులను వినాయక్ చతుర్వేది, హిందూ జాతీయవాదాన్ని నిరసించే అంశాలను గురించి వ్రాయకుండా ఆపుజేయమని చెప్పేవారు. ఇటీవలి కాలంలో, వినాయక్ చతుర్వేది వ్రాతల వలన అతడి తల్లి తండ్రులకు అదే రకమయిన ఫోన్ కాల్స్ వస్తూనే వున్నాయి.

అమెరికాలో వున్న ఒక హిందుత్వ సంస్థ యొక్క నాయకుడు నేరుగా వినాయక్ చతుర్వేదికే ఫోను చేసి, తాను చతుర్వేది యొక్క కుటుంబం వారందరి గురించీ – తల్లితండ్రులు, అత్తమామలు, బంధువులు గురించి – దర్యాప్తు చేసి అన్ని వివరాలు సేకరించాననీ చెప్పాడు. అంతేకాక తమ సంస్థ బ్లాక్ – లిష్టు (దాడి చేయటానికి తయారు చేసిన వ్యక్తుల జాబితా) చేసిన మేధావుల పేర్లను చతుర్వేదికి చెప్పాడు. అంతేకాక తమ సంస్థ యొక్క ధ్యేయం మార్క్సిజం, ఫెమినిజం సబ్ ఆల్టరన్ అధ్యయనం, విమర్శనాయుత సిద్ధాంతాలతో ప్రభావితమై పరిశోధనలు జరిపిన వారికి వ్యతిరేకంగా ప్రచార కార్యకలాపాలు నిర్వహించటం అని కూడా తెలియజేశాడు.

అయితే వినాయక్ చతుర్వేది, చేస్తున్న పరిశోధనాత్మక అధ్యయనాలు, వ్రాస్తున్న అంశాలు సరీగ్గా హిందుత్వవాద మూలపురుషుల్లో ఒకరైన వి.డి.సర్కార్ యొక్క సిద్ధాంతం పైననే! ఆయన 2019లో సోషలిస్టు పత్రిక అయిన 'జాకోబిన్' అనే పత్రికకు వి.డి.సర్కార్‌ను గురించిన ఒక యింటర్వ్యూ యిచ్చాడు. ఆ యింటర్వ్యూకు అమెరికాలోనూ, భారతదేశపు మీడియాలోనూ కూడా ఎంతో ఆదరణ లభించింది. ఆ తర్వాతనే ఆకాశరామన్నల వేధింపు మొదలయింది. తర్వాత ఆయన ఒక విద్యావిషయక చర్చతో గూడిన వ్యాసాన్ని – "హింస, హిందూ సభ్యత" అంటూ వి.డి. సావర్కార్ భాష్యం చెప్పిన విషయంపై – ప్రచురించారు. తిరిగి యిదే విషయంపై ఆయన "కౌంటర్ కరెంట్" అనే ఒక వామపక్ష పత్రికకు యింటర్వ్యూను యిచ్చారు. దీనిపై భారతదేశంలోని కొందరు వ్యాఖ్యాతలు జాతీయ పత్రికల్లో వ్రాశారు కూడా! ఇప్పుడు ఈ ఘటన జరిగింది.

ఈ వివరాలు విన్న నేరపరిశోధకుడు, యివన్నీ యాదృచ్ఛిక ఘటనలు అని కొట్టిపారేయలేదు.

అయితే గతంలో జరిగిన ఆన్‌లైన్ వేధింపు ఘటనలకు గానీ, ప్రస్తుతం జరిగిన స్వేటింగ్ ఘటనకు గానీ ప్రత్యక్ష సాక్ష్యాలు లేవు.


ఈ రకంగా ఊరూ, పేరూ తెలియని, ఆకాశరామన్నల చేత యిటువంటి వేధింపులకు గురిచేయటం, భయపెట్టడం అన్నదానికి ఒక రకమైన దెయ్యాల – భూతాల రూపమైన భయంకర లక్షణం వుంది.

ఏమైనప్పటికీ, ఈ వేధింపు ఘటనలో మేధోపరమైన చర్చలలో ఆసక్తిలేని మితవాదుల ప్రచ్ఛన్న హస్తం వుంది అనటానికి కావల్సిన అన్నివిధాల జాడలు కన్పిస్తున్నాయి.

హిందుత్వ తీవ్రవాదుల అకృత్యాల గురించి చేయబడే ఒక హెచ్చరికగా యీ ఘటనను అర్థం చేసుకోవటం ఎంతమాత్రమూ పొరపాటు కాబోదు!

**(నవంబర్ 8 నాటి 'హిందూ' ఆదివారం మేగ్జయిన్‌లో వినాయక్ చతుర్వేది వ్యాసం ఆధారంగా)** ✸

# దోపిడీ పాలకవర్గాలను నిరసించిన హిందీకవి మంగ్లేశ్ దబ్రాల్ మరణం



**ప్రముఖ** హిందీ కవి, పత్రికా సంపాదకుడు, అనువాదకుడు మంగ్లేశ్ దబ్రాల్ కరోనా బారినపడి 2020 డిసెంబర్ 9న ఎయిమ్స్ హాస్పిటల్‌లో మరణించారు. ఆయన 1948 మే 16న ఉత్తరాఖండ్‌లోని కఫల్‌పాని అనే ఒక కుగ్రామంలో జన్మించారు.

డెహ్రాడూన్‌లో విద్యనభ్యసించిన దబ్రాల్ 1960లలో ఢిల్లీ చేరి, అక్కడ 'హిందీ పేట్రియాట్', 'ప్రతిపక్ష్', 'ఆస్‌పాస్' పత్రికలలో పనిచేశారు. ఆ తర్వాత భోపాల్ వెళ్ళి భారత్ భవన్ వారి 'పూర్వాగ్రహ్' పత్రికకు సంపాదకత్వం వహించారు. ఆ తర్వాత అలహాబాద్ లక్నోల నుండి వెలువడే 'అమృత్ ప్రభాత్'లో పనిచేసి, 'జనసత్తా', 'సహారా సమయ్'లకు సంపాదకత్వం వహించారు. ఆయన 'నేషనల్ బుక్ ట్రస్ట్'లో సంపాదక నిపుణునిగా చేస్తూ, 'పబ్లిక్ ఎజెండా' అనే హిందీ మాసపత్రికకు సంపాదకునిగా పనిచేశారు. 'జనసత్తా' ప్రతి ఆదివారం ప్రచురించే అనుబంధం 'రవివార్'ను వర్ధమాన రచయితల ప్రోత్సాహిక వేదికగా తీర్చిదిద్దారు.

దబ్రాల్ ఐదు కవితా సంకలనాలను, 'పహాడ్‌పర్ లాల్టేన్', 'ఘర్ కా రాస్తా', 'నయే యుగ్‌మే శత్రు'; రెండు వచన గ్రంథాలను – ఒక యాత్రా గ్రంథాన్ని రచించడమేగాక, అరుంధతీరాయ్ రాసిన బుకర్ బహుమతి పొందిన 'ది మినిస్ట్రీ ఆఫ్ అట్‌మోస్ట్ హాపినెస్'ను హిందీలో 'అపర ఖుషి కా ఘరానా' పేరుతో అనువాదం చేశారు.

ఆయనకు 2000లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఆయన కవిత్వం అనేక భారతీయ భాషలలోకి, విదేశీ భాషలైన ఇంగ్లీషు, రష్యన్, జర్మన్, డచ్, స్పానిష్, పోర్చుగీస్, ఇటాలియన్, ఫ్రెంచ్, పోలిష్, బల్గేరియన్‌లలోకి అనువాదమయ్యింది.

పాలకవర్గాలకు నిరసన తెలియచేస్తూ 2015లో తన అకాడమీ అవార్డును వెనక్కి ఇచ్చేశారు. ఈనాటి దేశ పరిస్థితిపై ఆయన తన కవితాసంపుటి 'నవయుగ్ మే శత్రు'లో విమర్శనాత్మకంగా విశ్లేషించారు.

## ప్రజాపీడకుని ఋజువు

ప్రజాపీడకుని అమాయకత్వానికి ఎన్నో ఋజువులున్నాయి
వాడి గోళ్ళూ, కోరలూ పొడుగ్గాలేవు
వాడి కళ్ళు ఎర్రబారి వుండవు
పైగా, చిరునవ్వులు చిందిస్తూ వుంటాడు
తరచుగా, నిన్ను తన ఇంటికి ఆహ్వానిస్తుంటాడు
తన మెత్తని చేయి చాపి కరచాలనమిస్తాడు
ప్రజలు తనంటే భయపడతారని విని ఆశ్చర్యచకితుడౌతాడు

నిరంకుశుడి ఇంట్లో పాత కరవాలాలు, తుపాకులు
అలంకారప్రాయంగా ప్రదర్శిస్తుంటాడు
తన శవాన్ని పూడ్చడానికి
అందమైన సమాధి నిర్మించుకున్నాడు
దాని చుట్టూ ప్రసిద్ధ కళాఖండాలున్నాయి
మహత్తర సంగీతం మధ్య
మరెక్కడా అంత రక్షణ పొందలేవు
ఇవాళ, రేపు వాడికెంతో ప్రజాదరణ!
మృతుల్లో ఎందరో కూడా అతని ఇంటిని సందర్శిస్తుంటారు!

(1992)

(మంగ్లేశ్ దబ్రాల్ హిందీ కవితకు ఆంగ్లానువాదం మానస్ ఫిరాఖ్ భట్టాచార్యజీ – తెలుగు : కొత్తపల్లి రవిబాబు)

పుస్తక సమీక్ష:

# సింగమనేని అపరిమితమైన "పరిమితం"

- బూదాటి వేంకటేశ్వర్లు

**కథలు,** వ్యాసాలు, సమీక్షలు, జ్ఞాపకాలతో కూడిన సింగమనేని రచన 'పరిమితం' చదివితే, వ్యక్తి సంస్కారాన్ని ప్రోదిచేసి, సమాజాన్ని చైతన్యపరచటమే, సామాజిక సాహిత్య స్పృహగా భావించినట్లు కనిపిస్తుంది. మేధ, విశ్లేషణ, సత్యదర్శనం, ఇన్నేళ్ళ సాహిత్యాధ్యయనపుటనుభవం ఈ పుస్తకంలో పరచుకొని కనిపిస్తుంది. వ్యాసం రాయటమంటే, సృజనాశక్తి ఇంకిపోయిన వాళ్లు చేసే కలాపమని కొందరు భావిస్తుంటారు. కాని సృజన చేయటమెలాంటిదో వ్యాసం రాయటం కూడా అలాంటిదే. సింగమనేని వ్యాసాలలో అలాంటి జీవశక్తి తొణికిసలాడుతుంటుంది.

సమాజ దర్శనాన్ని సాహిత్య దర్శనంగా అనువర్తింప చేసుకున్న జ్ఞాని సింగమనేని. కేవలం సామాజిక సిద్ధాంతాన్నో, కేవలం సాహిత్య విలువనో పట్టుకొని ఆర్భాటం చేయరు. సమాజాన్ని పట్టించుకోని సాహిత్యాన్ని, సాహిత్యాన్ని తిరస్కరించే సిద్ధాంతాన్ని, అసంపూర్ణ వలయాలని సింగమనేని భావిస్తారు. మార్క్సిజాన్ని ఎంతగా మన్నిస్తారో, సాహిత్యపు విలువల్ని అంతగా మన్నిస్తారు. సాహిత్యపుటనుభవాన్ని మాత్రమే అందిస్తూ, విలువల్ని విస్మరించిన ఏ రచనైనా సింగమనేని ఆమోదించరు. వర్తమాన చైతన్యాన్ని సంవదింపచేస్తూ, తాను నమ్మిన విలువల కోసం ఎక్కడా ఎప్పుడూ రాజీపడకుండా రచన చేస్తున్న అతి కొద్దిమంది అక్షర శిల్పులలో సింహసదృశ ప్రవృత్తిగల సింగమనేని ఒకరు.

ఈ సంపుటిలో అయిదు కథలున్నాయి. ప్రతి కథ వర్తమాన జీవితాన్ని ప్రతిబింబించేదే. ఇవి 2017–2019 ప్రాంతాలలో రాసినవి. ఇళ్లను వస్తు ప్రదర్శనశాలలుగా మార్చివేసిన వస్తు సంస్కృతిని, ప్రపంచీకరణ ఎలా బలోపేతం చేసిందో, దాని వలన మనిషికి, నమ్ముకున్న విలువలకు ఎలాంటి భంగపాటు కలిగే ప్రమాదముందో తెలియజెప్పిన కథ 'వెయ్యికాళ్ల జెర్రి', గోర్కీ 'అమ్మ' నవలలోని పావెల్ ఉపన్యాసాన్ని, నవలను హృదయానికెక్కించుకున్న వెంకటపతి పాత్ర, పరిసరాల చేత ప్రభావితమై, వద్దనుకున్న నిర్ణయాన్ని మార్చుకొని అపార్ట్‌మెంట్‌ను కొనుక్కుంటాడు. ఇరుగుపొరుగు వాళ్ల ఇళ్లను చూచి, వాళ్లు తమను తక్కువగా చూస్తున్నారన్న గిల్టీ కాన్షస్‌నెస్‌తో భార్యాబిడ్డలు అప్పు చేసి మరీ హంగు ఆర్భాటాలు చేయటం చూచి, వెంకటపతి తీసుకున్న నిర్ణయం ప్రధానంగా ఈ కథ సాగుతుంది. మనసుల్ని వశం చేసుకుంటున్న మార్కెట్ శక్తులు, వస్తు సంపాదనే ధ్యేయంగా పరుగులు పెడుతున్న కుటుంబాలు, వస్తు దాహాన్ని తీర్చుకోవటానికి అవినీతిపరులయి విలువలు వదిలేస్తున్న ఉద్యోగులు – వీళ్లందరినీ హెచ్చరించే పాత్ర వెంకటపతిది. ప్రపంచీకరణ వలన బలోపేతమైన మార్కెట్ శక్తుల్ని 'వెయ్యికాళ్ల జెర్రి'గా చెప్పటం ప్రతీకాత్మకత. వేయిపడగలలోని ధర్మారావు పాత్రలో విశ్వనాథ కనిపించినట్లు, వెంకటపతి పాత్రలో (సింగమనేనితో పరిచయమున్నవారికి) సింగమనేనిగారే కనిపిస్తారు.

'రైలు వెళ్లిపోయింది' – అనే కథ ఆస్తి కోసం అనురాగాన్ని, బంధుత్వాన్ని మర్చిపోయిన పెడబుద్ధులకు బుద్ధి చెప్పే సౌజన్యశీలి కథ. ప్రతి ఉమ్మడి కుటుంబంలోను ఇటువంటి కథ నిన్న మొన్నటిదాకా ఉండేది. నలుగురన్నదమ్ములలో ఒకడు పట్నంలో చదవటానికి మిగిలిన వాళ్లంతా శ్రమించి దోహదం చేస్తే వాడు ప్రయోజకుడయ్యేవాడు. అన్నదమ్ములు ప్రయోజకుడైన సోదరుడిని చూసి సంతసించేవారు. వెంకటరత్నమనే పాత్ర కూడా అలా ప్రయోజకుడై ఉద్యోగియైనవాడే. తాను పడుతున్న సుఖం వెనుక సోదరులున్నారన్న మన్నన వెంకటరత్నానికయితే ఉందిగాని, కట్టుకున్న భార్యకు మాత్రం తమ వాటా ఉమ్మడి ఆస్తిలో నుండి తేలేదని భర్తపై విపరీత కోపం. రిటైరయ్యాక, కొడుకు ఉద్యోగం కోసం, ఉమ్మడి ఆస్తిలో తమ వాటా అమ్మమంటూ కొడుకు, భార్య చేసిన ఒత్తిడికి వెంకటరత్నం ఎలా స్పందించాడు అనేది ఇందులో ప్రధాన ఇతివృత్తం. ప్లాట్‌ఫాం మీదనున్న బెంచీ మీద కూర్చొన్న వెంకటరత్నం రైలు కోసం ఎదురుచూస్తూ చేసిన తలపోతలుగా కథను నడపటం ఇందులోని శిల్పం. వెంకటరత్నం తీసుకున్న నిర్ణయాన్ని కూడా రచయిత గడుసుగా, ధ్వన్యాత్మకంగా చెపుతాడు. తాను భార్యాబిడ్డల సంతృప్తికై బయలుదేరి వచ్చి, అన్నదమ్ముల నుండి ఆస్తిలో భాగం తెచ్చుకోవటానికి ఎక్కవలసిన రైలును ఎక్కకుండా చూస్తూ అలాగే ఉండిపోయాడు. మరో పది నిమిషాల తరువాత ఇప్పుడు వెళ్లిన రైలుకు వ్యతిరేక దిశలో వచ్చి ఆగిన రైలులో చకచకా ఎక్కి కూర్చొన్నాడని చెప్పి ముగిస్తాడు. అంటే ఉమ్మడి ఆస్తిలో వాటాపై తన హక్కు నైతికంగాదని, అడగమన్న భార్యాబిడ్డల నిర్ణయాన్ని తిరస్కరించటం వెంకటరత్నం మనోనిశ్చయమని రచయిత చెప్పటం.

మూడవ కథ 'మనవరాలి ప్రశ్న'. ఈనాడు మాతృభాషావ్యవహార కర్తలందరూ పడుతున్న వ్యథ ఈ కథ. ఆంగ్లభాషా వ్యామోహంలో పిల్లలను మాతృభాషకు దూరం చెయ్యటం సాంస్కృతిక ద్రోహమంటూ ఈ కథలో కథకుడు వ్యాఖ్యానిస్తాడు. 'పది రూపాయలంటే ఎంత'? – అని అడిగిన మనవరాలి ప్రశ్నకు విస్తుపోయిన తాతయ్య చలపతి, కూతురితో, స్నేహితులతో తన అనుభవాన్ని పంచుకుంటే అది ఈ తరంలో సహజమేనని వాళ్ల అనుభవాలు చెప్పటం, ఇంట్లో పనిచేసే పనిమనిషి అప్పుచేసి మరీ కాన్వెంట్‌కు పంపటం వంటి అనుభవాలతో చలపతి మథనపడి జరుగుతున్న సాంస్కృతిక ద్రోహానికి నిస్సహాయంగా బాధపడటం ఇందులోని ఇతివృత్తం. 'ఏమమ్మా! తెలుగమ్మా! ఎక్కడ నీ చిరునామా?' – అంటూ విషాద హృదయాలతో తల్లడిల్లే మాతృభాషా ప్రేమికులకు ప్రతినిధి చలపతి పాత్ర. ఎంత అరిచి గీ పెట్టినా, ఎవరమూ ఏమీ చేయలేని సామాజిక విషాదంలో ఉన్న అసహాయ స్థితి మన మాతృభాషా స్థితి. అందుకే చలపతి పాత్రను కూడ అసహాయంగానే, మౌనంగా రోదిస్తున్న భాషా ప్రేమికునిగానే రచయిత ముగించేశాడు.

'మరో దిద్దుబాటు' కథ, గురజాడ రాసిన 'దిద్దుబాటు' కథా ధోరణిలోనే నడిచింది. మన కుటుంబ వ్యవస్థలో ఉన్న రిజిడిటీ ఎలా స్త్రీవాదానికి దారితీసిందో పరోక్షంగా చెప్పిన కథ యిది. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులయినప్పుడు, భర్త చేదోడువాదోడుగా ఇంటి పనుల్ని సరిదిద్దకపోతే, స్త్రీ మీద ఎంతటి భారం పడుతుందో తెలియజెప్పి, పురుషాహంకారంతో ప్రవర్తిస్తే కుటుంబం ఎలా నలిగిపోతుందో వ్యంగ్య వైభవంగా చెప్పిన కథ. అదే సమయంలో స్త్రీ పురుష సంబంధాలంటే 'హక్కుల పోరాటం కాదు. పరస్పరం సర్దుబాటు అవగాహన'. అన్న సూత్రాన్ని అపురూపంగా వ్యాఖ్యానించి చెప్పిందీ కథ. ఈ కథా నిర్మాణ సూత్రం వెనుక గురజాడ దిద్దుబాటు కథాసూత్రమే ఉన్నప్పటికీ వర్తమాన సమాజాన్ని వర్ధమానంగా అనువదించింది ఈ కథ. అరుణ, సురేష్‌లు ఈ కాలపు ఉద్యోగ దాంపత్యాలకు ప్రతినిధులు. తన భర్త గుణంలో పరివర్తన తెచ్చి, కుటుంబాన్ని పండించుకున్న అరుణ, ఏ స్త్రీవాదికి తీసిపోదు. అయితే ఆ మార్పును సాధించిన తీరే, గృహిణికి ఆదర్శప్రాయం.

అయిదవ కథ 'హేమంత సమీరం'. పెళ్లిచూపులకు వరుడి ఇంటికే తరలి వెళ్లిన ఆధునిక యువతి కథ. సరదాగా సాగినప్పటికీ ఆధునిక ప్రవృత్తిని తెలియజెపుతుంది. ఎవరు ఎవరింటికి వెళ్లి చూసినా తప్పులేదని, కలిసి పోవలసినవి మనసులని తెలియజెపుతుందీ కథ.

ఇలా అయిదు కథలూ అయిదు సంస్కారాల్ని ప్రవచించే పంచశీలాత్మక కథలు.

ఇక వ్యాసాల గురించి పరిశీలిద్దాం. ఈ వ్యాసుడు రాసిన ఆరు సమీక్షా వ్యాసాలూ ఆణిముత్యాలే. ఈ ఆరు వ్యాసాలలో మొదటి వ్యాసం కాదు గాని, మొదట ప్రస్తావించవలసిన వ్యాసం 'గురజాడతో మాటా – మంతీ'. ఈ వ్యాసాన్ని చదువుతుంటే దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారు రాసిన 'జానకితో జనాంతికం' గుర్తుకు వస్తుంది. శ్రీరామనవమికి సీతమ్మనుద్దేశించి రామాయణంలోని ఒకటి రెండు ఘట్టాలను సీతమ్మతో పంచుకొని, ఆ తల్లి వాత్సల్యాన్ని పొందాలని చేసిన భావ చిత్రాలతో కూడిన నివేదన 'జానకితో జనాంతికం'. రఘువంశంలో కుశుని పరస్త్రీ పరాఙ్ముతను ప్రస్తావించి, ఆ విషయంలో రాముడు కూడా నీ కొడుకు ముందు దిగదుడుపేనని అంటాడు. భూగర్భంలోకి వెళ్లేటప్పుడు బిడ్డల్ని వదలి వెళ్లటానికి కన్న కడుపు ఎలా అంగీకరించింది అని ప్రశ్నిస్తాడు. 'ఆ తరువాత వాళ్ళెక్కడున్నారో, ఎట్లా ఉన్నారో, వాళ్ల సంగతి ఏమయిందో ఈ దేశంలో వార్తలు నీకు తెలిసుండవు. కొద్దిగానే చెపుతాను విను' – అని రాముని సరయూ ప్రవేశం చేశాక అయోధ్య స్థితిని, కుశలవుల స్థితిని రఘువంశంలో కాళిదాసు చెప్పిన వాటినన్నిటిని నాటకీయంగా కష్టసుఖాలు మాట్లాడుకున్నట్లు మాట్లాడతాడు. అదే విధంగా సింగమనేని, గురజాడ వర్ధంతి రోజున గురజాడతో చేసిన సంభాషణ నాటకీయంగాను, వ్యంగ్యంగాను సాగుతుంది.

గురజాడను అడ్డం పెట్టుకొని, ఆయన చెప్పిన విలువల సూక్తుల్ని అభినయిస్తూ కపటంగా బ్రతికేస్తున్న మనుషుల్ని, సాహిత్య జీవుల్ని ఉతికి ఆరేశాడు సింగమనేని. చూడండి "అయ్యా మహాకవీ! మీకొక నమస్కారం. చాలా కాలంగా మీరంటే నాకు ఒక ఆగ్రహం, కసి, కొంత భయం కూడా!.... .... వందేళ్లుగా మమ్మల్ని పట్టి పీడిస్తున్నావు కదా! మమ్మల్ని మేము నిరంతరం పశ్చాత్తాపంతో కుమిలిపోయేలా అపరాధ భావనతో క్రుంగిపోయేలా చేశావు కదా! మా బ్రతుకుల్ని మేము బ్రతకనీయకుండా, తగుదునమ్మా అని ప్రతి ప్రయాణానికి అడ్డు తగులుతున్నావు గదా!" – అంటూ వ్యంగ్యవచో విలాసంతో గిరీశం వాళ్లను చావబాదాడు. 'మనిషి చేసిన రాయిరప్పకు మహిమ కలదని సాగిమొక్కకు' – అంటూ శాపనార్థాలు పెట్టినట్లు మమ్మల్ని దెప్పిపొడవటం న్యాయమా? 'కొండ కొనల వెదుకులాడే వేలా?' – అన్నావు. మా కొండలు ఉండేదే అందుకు కదా! అంటూ గురజాడ చెప్పిన అభ్యుదయ భావాలన్నిటినీ పాటించని సమాజాన్ని చీల్చి చెండాడాడు ఈ వ్యాసంలో. 'కన్యాశుల్కం'లోని గిరీశం గురించి చెపుతూ "మీ నాటకంలో వాడున్నాడే, గిరీశం అనే వెధవ. వాడిని గుర్తించటం మాకు చాలా సులువై పోయిందిప్పుడు.... మీ నాటకం చదవక ముందు గిరీశాలను గుర్తుపట్టటం చాలా కష్టంగా ఉండేది. ఇప్పుడా సమస్య లేదు. ప్రతి ఊళ్లో ప్రతి సంస్థలో, ప్రతి కాలేజీలో, మరీ ముఖ్యంగా యూనివర్శిటీలలోని గిరీశాలను సులభంగా పసిగట్టేస్తున్నాం! మీ నాటకంలో గిరీశం, తన శిష్యుడు వెంకటేశాన్ని ఉపయోగించుకున్న తీరు మా గిరీశాలకిప్పుడు ఎంత ఆదర్శమో! మా యూనివర్శిటీలలో శిష్యులున్నదే అందుకు గదా! వాళ్లు స్టూడెంట్స్‌గా ఉన్నప్పుడూ, రీసెర్చ్ స్కాలర్స్‌గా, పోస్ట్–డాక్టోరల్ ఫెలోగా ఉన్నప్పుడు మేము వాళ్లతో చేయించుకునే చాకిరీ మీరు స్వయంగా వచ్చి చూడాల్ల. మీ నాటకంలోని గిరీశం, ఏదో పొట్ట నింపుకోవటానికి, తన పబ్బం గడుపుకోవటానికి మాయమాటలతో మభ్యపెడతాడు. అంతే, మేము అలా కాదు. లక్షలకు లక్షలు సంపాదిస్తూ కూడా శిష్యులతో గాడిద చాకిరీ చేయించుకుంటున్నాం. మేము రాసిన పుస్తకాలను వాళ్ల ఖర్చుతో వేయించుకుంటాం కూడా!" అంటూ విశ్వవిద్యాలయాలలోని ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థుల్ని ఎలా కట్టుబానిసలుగా ఉపయోగించు కుంటున్నారో, అపర గిరీశాలై ఎలా ఎలా వ్యవహరిస్తున్నారో చెపుతాడు. అలాగే మహిళల గురించి కూడ గురజాడ చెప్పిన మాటలు మా కష్టాలకు కారణమైనాయంటూ వాపోతాడు. చివరగా "మా అదృష్టం కొద్దీ 53 ఏళ్లకే తనువు చాలించావు కాని, పూర్తి ఆయుష్షుతో మీరు జీవించియుంటే ఇంకా ఏమేమి రాసేవారో! మా బ్రతుకుల్ని ఎంతెంత నాశనం చేసేవారో! ఆలోచించటానికే భయమేస్తోంది!" – అని చెప్పి ముగింపుకు వస్తాడు.

ఇలా సెటైరికల్‌గా, వ్యాజస్తుతి వ్యాజనిందలతో సాగిన ఈ వ్యాసం ఒక మాస్టర్ పీస్. వెంకటరమణశాస్త్రిగారి వ్యాసంతో ఒక బిడ్డ తల్లితో వాత్సల్యాన్ని కుమ్మరిస్తూ ప్రసంగించినట్లే ఉంటుంది. కాని సింగమనేని వ్యాసం వ్యంగ్యంతో, సమాజం గూబ పగులకొట్టినట్లే కనిపిస్తుంది. ఒక మహాకవిని గౌరవించటమంటే, శిలామూర్తులకు దండలు వేసి తద్దినం పెట్టినట్లు ఊకదంపుడు ఉపన్యాసాలీయటమా? కాదు కదా! ఆ ఆక్రోశాన్ని ఈ వ్యాసంలో సృజనాత్మకంగా వెలిబుచ్చారు.

సింగమనేని ఎప్పుడూ ప్రస్తావిస్తుండేదేమంటే మనకు సాహిత్య చదువరులు కావాలని. జిల్లా రచయితల సంఘాలలాగే, సాహిత్య సంస్థలలాగే ఈ సాహిత్య చదువరుల సంఘాలు రావాలి అంటూ సాహిత్య ప్రేమికులు, చదువరులు లేకపోతే ఈ సాహిత్య సంపద ఎవరి కోసం? అని ప్రశ్నిస్తుంటారు. సమాజాన్ని అర్థం చేసుకోవటానికి సాహిత్యం గొప్ప పనిముట్టని, వ్యక్తి సంస్కారాన్ని పెంచటంలో ఇంతకు

మించిన ఆయుధం లేదని వారి అభిప్రాయం. అందుకే సాహిత్యం సమకూర్చిన ప్రయోజనాలను సాహిత్య పఠనమనే వ్యాసంలో పేర్కొన్నారు. సాహిత్య పఠనం వల్ల లభ్యమయ్యే ప్రగతిశీల, మానవీయ భావాలూ, సంస్కారవంతమైన ఆలోచనలూ పాఠకుడిని ఎలా ఉన్నతుడిని చేస్తాయో చెప్పటానికి గురజాడ, శ్రీశ్రీ, తిలక్, జాషువా వంటి కవుల రచనలను వాళ్ల పంక్తుల్ని పేర్కొని ఉద్దీప్తిని కలిగించారు.

'సీమకథా వికాసంలో' కె. సభాను తొలి కథకునిగా పేర్కొంటూనే అంతకుముందు జి. రామకృష్ణ రాసిన చిన్న కథల్ని ప్రస్తావించి, సభా తరువాత రాసిన కథల్ని కూడా పేర్కొన్నాడు. ఆ పిదప తొలితరం, మలితరం, ఇప్పటి తరం కథకుల్ని వాళ్ల రచనల విశిష్టతల్ని పేర్కొన్నాడు. వ్యవసాయ సంక్షోభాన్ని, మాలమాదిగల జీవిత దౌర్భాగ్యాన్ని, స్త్రీ–దళిత–ముస్లిం మైనారిటీవాద ధోరణులలో వచ్చిన కథలతోపాటు ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన కథల్ని కథకుల్ని పేర్కొని సీమకథా వికాసాన్ని విహంగ వీక్షణంతో వివరించారు. మారుతున్న, మారిన రాయలసీమ ముఖచిత్రాన్ని, మానవీయ సంబంధాలను తెలిపిన వ్యాసమిది. అపజ్ఞాతమనే వ్యాసం కాళీపట్నం రామారావుగారి కథల్లో ఎవరూ దృష్టిపెట్టని అపజ్ఞాతానికి సంబంధించింది. ఈ కథను సమీక్షిస్తూ రాసిన విమర్శన వ్యాసమిది. క్లిష్టమైన విషయాన్ని నేర్పుగా జ్ఞాతం చేసిన కారా మాష్టారి ప్రజ్ఞను ఈ సమీక్షా వ్యాసంలో ఎత్తి చూపారు. అలాగే కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యుడు తుమ్మల రామకృష్ణ షష్ట్యబ్ది సంచికకు రాసిన అభినందన వ్యాసం 'ఒకడు తుమ్మల రామకృష్ణుడు'. తుమ్మల రామకృష్ణ రాసిన 'మట్టిపొయ్యి', 'ఊరిమద్దిస్తం', 'అడపం', 'ఊబి', 'రాలిన చింత', 'పరాభవం' వంటి కథల వైశిష్ట్యాన్ని పేర్కొని, రామకృష్ణ రాసిన కథలలో రామకృష్ణ ఎలా దొరుకుతాడో వివరించాడు. 'అధ్యక్షోపన్యాసం' అనే వ్యాసం సంజీవదేవ్ శతజయంతి సందర్భంగా సాహిత్య అకాడమీ ఏర్పరచిన సభలో చేసిన అధ్యక్షోపన్యాసమే. సంజీవదేవ్ విశాల హృదయం, ప్రాంతాలకతీతమైన దృక్పథం, సౌందర్య దృష్టి, మానవతావాదం, అన్నింటిని అద్దంలో చూపించిన వ్యాసమిది.

మిగిలిన పదహారు వ్యాసాలు సమీక్షా వ్యాసాలే. మహాకవి గురజాడ శత వర్ధంతి సందర్భంగా 'ప్రజాసాహితిలో గురజాడ' – పేర ప్రచురించిన గ్రంథంపై చేసిన సమీక్ష యిది. ఇందులో 137 వ్యాసాలున్నాయి. కాకలు తీరిన సాహితీవేత్తల వ్యాసాలతో చేసిన గురజాడ విందది. దానిని గురించి చెపుతూ 'ఇందులోని శీర్షికలే సమగ్రత్వాన్ని సూచిస్తున్నా' యంటూ ఆ వ్యాసాల విశిష్టతను, ప్రాసంగికతను విశ్లేషించారు. రాయలసీమ గురించి ఈవేళ విశేషంగా రాస్తున్న యువరత్నాలలో అప్పిరెడ్డి హరినాథరెడ్డి ఒకరు. అతనికి కేంద్ర సాహిత్య అకాడమీ యిచ్చిన యువ పురస్కారానికి కారణమైన 'సీమ సాహితీ స్వరం శ్రీ సాధనా పత్రిక' – అనే పుస్తకానికి రాసిన సమీక్షా వ్యాసం. ఇది ఇండియాటుడేలో ప్రచురించబడినది. పత్రికా పరిశోధనకు ఒక నూతనమైన ఒరవడిని సృష్టించిన పుస్తకమని, రాయలసీమ సాహితీ సాంస్కృతిక వికాసాన్ని తెలుగు ప్రజలకు తెలియజెప్పే అపురూపమైన పరిశోధనమని ఈ గ్రంథాన్ని సింగమనేని కీర్తించారు. సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి రచించిన 'బడి' కవితాసంపుటిని సమీక్షిస్తూ "మనం చూడనిదాన్ని చూయించటం, మన అనుభవంలో లేనిదాన్ని మన అనుభవంగా మలచటమే గొప్ప లక్షణమైతే, 'బడి' కవిత్వం నిజంగానే చాలా గొప్ప కవిత్వం" – అని అభినందిస్తారు.

ఎండపల్లి భారతి రాసిన 'ఎదారి బతుకులు' కథలను సమీక్షిస్తూ మనకు తెలియని మరో ప్రపంచపు అనుభవాల పేటిక అని, జెండర్ దృక్పథాన్ని, దళిత స్పృహను వెలిగించిన కథలని, ఈ కథల్ని చదివితే మాదిగల కోసం ఎలాంటి సంస్కరణల అవసరముందో ఒక మంచి నివేదికను తయారుచేయవచ్చని చెపుతారు.

'వందేళ్ల కథకు వందనాలు' – అనే పేరుతో గొల్లపూడి మారుతీరావు సంకలనం చేసి ప్రచురింపచేసిన గ్రంథాన్ని తెలుగు కథకు అపూర్వమైన గౌరవమని ఆ గ్రంథ విశిష్టతను పరిచయం చేస్తారు. జగన్నాథశర్మ రచించిన 'పేగు కాలిన వాసన' కథాసంపుటిని సమీక్షిస్తూ ఆ కథల నిర్మాణ శిల్పాన్ని కథకుని కథన కౌశలాన్ని వివరిస్తాడు. ఈ దేశపు సామాజిక చిత్రపటాన్ని ఈ కథలు ఆవిష్కరిస్తాయని పేదరికం వల్ల ఉత్పన్నమయ్యే విషాదాలను ఘనీభవించిన కథలివియని చెపుతారు. విశాలాంధ్రవారు ప్రచురించిన 'ప్రేమ్‌చంద్ కథల'ను గురించి పేర్కొంటూ వాటి సజీవత్వాన్ని చెపుతారు. షేక్ అహమద్ బాషా రాసిన 'కిడ్నాప్' నవల సస్పెన్స్‌తో ఎలా నడుస్తుందో చెప్పి, అవినీతి రహితంగా కుల మత వర్గాలకతీతంగా పాలించే ప్రభుత్వం రావాలనే ఆశయంతో రాసినదీ నవలయని చెపుతారు. 'శత వసంతాల తెలుగు కథ'ను సమీక్షిస్తూ రాజకీయ వాసనలూ, ఉద్యమాలూ, వర్గస్పృహ లాంటివి కనిపించకపోవటాన్ని చెప్పి, కథ ప్రచురణ సంవత్సరం పేర్కొనకపోవటాన్ని తరువాతి ప్రచురణలో సవరించుకోవాలని చెపుతారు. నోబెల్ బహుమతి గ్రహీతలు ఇరవైమంది రాసిన కథల్ని లక్ష్మిగారు తెలుగులోకి అనువదిస్తే విశాలాంధ్ర వారు ప్రచురించారు. వాటిని సమీక్షించిన సింగమనేని ఈ కథల్ని చదివి ప్రపంచ పర్యటనా అనుభవాన్ని పొందమంటారు.

ప్రొఫెసర్ తెన్నేటిరాజు రాసిన 'ఆహారంపై ఆంక్షలా' – పుస్తకాన్ని సమీక్షిస్తూ లౌకిక భావజాలాన్ని మేల్కొల్పటానికి, జ్ఞాననేత్రం విచ్చుకోవటానికి గొప్ప కృషి చేస్తుందని సమీక్షిస్తారు. ప్రేమ్‌చంద్ రాసిన 'గోదాన్' నవలను తెలుగులో అట్లూరి పిచ్చేశ్వరరావు అనువదిస్తే, దానిని సమీక్షిస్తూ సింగమనేని "చారిత్రక విభాతసంధ్యల మానవ కథావికాసమెట్టిదో అర్థం చేసుకుంటాము" – అని అంటారు. కన్నయ్యకుమార్ ఆత్మకథ ఇచ్చే స్ఫూర్తిని, 1961లో మహీధర్ రామమోహన్‌రావు రాసిన 'కత్తులవంతెన' నవలలోని చెక్కుచెదరని మానవ స్వభావాన్ని, ఎదుర్కొనే సంఘర్షణల్ని, ఇబ్బందుల్ని, సమస్యల్ని పాఠకుల ముందుంచి బుర్రను ఎలా పదును పెడుతుందో చెపుతారు. వాడ్రేవు వీరలక్ష్మి సంపాదకత్వం వహించిన 'నవలా నాయికలు' – గ్రంథాన్ని సమీక్షిస్తూ గత అయిదు దశాబ్దాలుగా నడిచిన స్త్రీ జీవితాలకు, ఆలోచనలకు, ప్రతిస్పందనగా నిలిచిన గ్రంథమని చెపుతారు.

సింగమనేని సమీక్షా వ్యాసాలన్నీ ఆయా పుస్తకాల పట్ల పాఠకుడికి సానుకూల దృక్పథాన్ని కలిగించి, ఆయా పుస్తకాల పఠనానికి ఉన్ముఖుడిని చేసేవే. కేవలం భట్రాజులా పొగడటమే లక్ష్యంగా ఈ సమీక్షలు కనిపించవు. అవసరమైనచోట్ల మిత్రుని సలహాలాగా సూచనలు

చెప్పటానికి సందేహించలేదు. ఉదా॥కు సడ్లపల్లె చిదంబరరెడ్డి రచించిన 'బతుకు వెతుకులాట' పుస్తకాన్ని సమీక్షిస్తూ ఆ పుస్తక భాషను గురించి ఇలా రాస్తారు. "ఎవరు మాట్లాడే భాష వారు మాట్లాడాలి. అందరి భాషా రచయిత మాట్లాడకూడదు. రచయితకు కూడ ఒక భాష ఉంటుంది. రచనలోని పాత్రలకూ ఒక భాష ఉంటుంది. ఏ పాత్ర భాష ఆ పాత్ర మాట్లాడితే ఔచిత్యం. ఈ పుస్తకం మొత్తం ఉత్తమ పురుషలో సాగుతుంది. రచయిత తన భాషలో కాకుండా చదువు సంధ్యలు లేని, పల్లెటూరివాడి భాషలో అదీ ఉత్తమపురుషలో పుస్తకం రాయటంవల్ల భాషాశిల్పభంగం జరిగింది – అదొక్కటే ఇందులో కొట్టొచ్చినట్లు కనిపించే లోపం" (పుట : 100) అని స్పష్టంగా రాస్తారు. అంతేకాకుండా "చాలామంది రచయితలు మాండలికం పేరుతో, మాండలికం పట్ల ప్రేమతో, భాషాశిల్పభంగానికి, కృత్రిమత్వానికి పాల్పడుతున్నారు. పాఠకుల్ని దూరం చేసుకుంటున్నారు" (పుట : 100). ఇది అందరూ ఆలోచించవలసిన విషయమని చెపుతారు. మాండలికాల్ని వాడే రచయితలందరూ ఆలోచించవలసిన విషయమిది.

పాఠకుడికి అవగాహన కల్పించటం ద్వారా గాని, లేదా అవగాహనా పరిధిని విస్తృతం చేయటం ద్వారా గాని ఆయా గ్రంథాలను చదివింప చేయటం సమీక్షావ్యాసపుటుద్దేశం. సాధారణంగా ఈ సమీక్షావ్యాసాలు రచయితలను ప్రమోట్ చేసే ధోరణిలోనే ఉంటాయి. ఒకటి రెండు సలహాలు, సూచనలతో విమర్శించినా అది మిత్రసమ్మితంగానే ఉంటుంది. ఎవరో పనిగట్టుకొని, కావాలని వ్యక్తిగత ద్వేషంతోనో, మరో ఉద్దేశంతోనో చేస్తే తప్ప, సమీక్షా వ్యాసం సాధారణంగా ఇలాగే ఉంటుంది. తాను సమీక్షించే పుస్తకంపై చేసే వ్యాఖ్యానాలు, సాహిత్య విమర్శలో భాగంగా ఉండాలే తప్ప, ఇతరంగా ఉండకూడదు. తెలుగు సాహిత్య విమర్శ వికాసంలో సమీక్షా వ్యాసాలదే పైచేయిగా కనిపిస్తోంది. తొలినాటి సాహిత్య పత్రికలలో వచ్చిన సమీక్షా వ్యాసాలలో శబ్దార్థ చర్చలు కూడ చోటు చేసుకునేవి. నేటి దినపత్రికలలో, సాహిత్య పత్రికలలో వచ్చే సమీక్షావ్యాసాలలో వాటి ప్రస్తావన లేదు. విషయాన్ని సూటిగా చెప్పటం, పులుముడు లేకుండా తేటగా చెప్పటం ప్రధానంగా కనిపిస్తుంది. సింగమనేని సమీక్షా వ్యాసాలన్నిటా కనిపించే గుణాలు కూడా ఇవే. ఇన్నేళ్ల ఆయన సాహిత్య అధ్యయన సంస్కారం ఆ వ్యాసాలలో సాక్షాత్కరిస్తుంది.

చివరిగా తన బాల్యాన్ని గురించి రాసిన జ్ఞాపకాలను చదివితే అరవై డెబ్బై యేళ్ల ముందున్న రాయలసీమ ప్రాంతపు గ్రామీణ జనజీవన సామాజిక చిత్రణ కనిపిస్తుంది. అప్పటి పల్లెటూరి ప్రేమలు, ఆప్యాయతలు, అనుబంధాలు అవన్నీ ఒక హరితశ్వాసలా అనిపిస్తాయి. పబ్లిక్ పరీక్షలు పట్టించుకోకుండా నవలను ఫెయిర్ చేయటానికి పూనుకున్న నారాయణ విషయం తెలిసి వచ్చిన తండ్రి ప్రవర్తన తండ్రీతనయుల అనుబంధాలు ఎంత గొప్పగా ఆ కాలంలో పరిఢవిల్లాయో తెలియజెపుతుంది.

సింగమనేని 'పరిమితం' చదివితే కలిగే సాహిత్యానుభవం అపరిమితం. సాహిత్య విద్యార్థులు, సాహిత్య ప్రేమికులు చదివి అవశ్యం, సాహిత్యావరణంలో సంచరింతురుగాక! ఈ వ్యాసాల్ని, సమీక్షల్ని చదివితే మన ఇంటి పెద్ద మన దగ్గర కూర్చుని తెలియని విషయాల్ని తెలియజెప్పినట్లనిపిస్తుంది. మన ఎదురుగా కూర్చొని సింగమనేని మాట్లాడినట్లే అనిపిస్తుంది. ✸

## విశాలాంధ్ర సంపాదకుడు ముత్యాల ప్రసాద్ మరణానికి సంతాపం



**సాహితీవేత్త,** అరసం కార్యనిర్వాహక కార్యదర్శి, 'విశాలాంధ్ర' దినపత్రిక సంపాదకుడు ముత్యాలప్రసాద్ తన 54వ ఏట కోవిడ్ బారినపడి 24-11-2020న విజయవాడలో మరణించారు.

కృష్ణాజిల్లా ఆగిరిపల్లి మండలం కలటూరు గ్రామానికి చెందిన ముత్యాలప్రసాద్ విద్యార్థి దశ నుండి విద్యార్థిసంఘాలలో పనిచేశారు. 1990 నుండి 2006 వరకు 'విశాలాంధ్ర'లో వివిధ హోదాలలో పనిచేశారు. కొంతకాలం 'సాక్షి'లో చేసి 2014లో 'విశాలాంధ్ర' సంపాదకునిగా చేరారు. ఆయన ఆదివారాలు రాసిన సంపాదకీయాలు సాహిత్య వ్యాసాలుగా పేరు తెచ్చుకున్నాయి.

పత్రికారంగంలో ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాల్సిన ప్రసాద్ అకాలమరణానికి 'ప్రజాసాహితి' సంతాపం ప్రకటిస్తోంది. ✸

## ప్రసిద్ధ అనువాదకుడు కొమ్మారెడ్డి కేశవరెడ్డి మరణం

**గణితశాస్త్ర** ఉపాధ్యాయుడు, ప్రసిద్ధ అనువాదకుడు కొమ్మారెడ్డి కేశవరెడ్డి తన 80వ ఏట తాడేపల్లి సమీపాన కుంచనపల్లిలో 26-11-2020న మరణించారు.

ఆయన గురజాల దగ్గర అంబాపురంలో ఒక శ్రామిక కుటుంబంలో జన్మించారు. గురజాల, నరసరావుపేట, కర్నూలు, హైదరాబాద్‌లలో విద్యాభ్యాసం చేసి సూర్యాపేటలో లెక్కల మాస్టారుగా పనిచేశారు. 'ఐక్య ఉపాధ్యాయ' పత్రికకు సంపాదకులుగా పనిచేశారు.

1980లో గోర్కీ రాసిన 'ది సిటీ ఆఫ్ యెల్లో డెవిల్'ను ఇంగ్లీషు నుంచి తెలుగులోకి 'నగరం' శీర్షికతో అనువదించడంతో ఆయన అనువాద కార్యక్రమం ప్రారంభమైంది. ఆ తర్వాత 1981లో గోర్కీ కథలు, 30కి పైగా పుస్తకాలు అనువదించారు.

ఆయనకు 'ప్రజాసాహితి' నివాళులు. ✸

# గోరంట్ల వెంకటేశ్వరరావుగారి 8వ వర్ధంతి



**గోరంట్ల వెంకటేశ్వరరావుగారు** 30-6-27న ఇంకొల్లు మండలం ఇదుపులపాడు గ్రామంలో జన్మించారు. చిన్న వయసులోనే కాంగ్రెస్ సేవాదళ్ నాయకునిగా అనేక కార్యక్రమాలు నిర్వహించి మంచి కార్యకర్తగా పేరు తెచ్చుకున్నారు. అగ్రనాయకులతో పరిచయాలుండేవి. తర్వాత హిందీ చదువుకోసం పామర్రు దగ్గర విద్యావనం వెళ్ళారు.

అక్కడ చదువు పూర్తయ్యాక చీరాలలో కొంతకాలం హిందీ ప్రైవేట్లు చెప్పారు. 21-4-1956 సంIIలో కొత్తపల్లి వేంకటకృష్ణవర్మగారమ్మాయి వాణీదేవితో వీరి వివాహం జరిగింది. చీరాల హైస్కూలులో హిందీ పండిట్‌గా చేరారు. సమర్థులైన ఉపాధ్యాయునిగా పేరుపొందారు. 1991లో రిటైర్ అయ్యారు. 1.1.2013న వీరు మరణించారు. సంస్మరణార్థం కుటుంబసభ్యులు వారి ప్రథమవర్ధంతి సందర్భంగా 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి 25,000/-లు అందచేశారు.

వారి 8వ వర్ధంతి సందర్భంగా 'ప్రజాసాహితి' వారిని గుర్తు చేసుకుంటోంది.

# ప్రజాతంత్ర న్యాయవాది కంఠంనేని రవీంద్రరావుగారి 6వ వర్ధంతి




**కంఠంనేని** రవీంద్రరావుగారు విజయవాడలో విలువలకు కట్టుబడిన న్యాయవాదిగా ప్రసిద్ధి. వీరు కృష్ణాజిల్లా మోపిదేవి గ్రామంలో 1936లో జన్మించారు. హైస్కూలు అవనిగడ్డలోనూ, ఇంటర్+డిగ్రీ మచిలీపట్నంలోనూ, న్యాయశాస్త్రాన్ని విశాఖపట్నంలోనూ పూర్తిచేసి 1962లో అవనిగడ్డలో న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించారు. విద్యార్థిదశనుండీ వామపక్ష రాజకీయాలతో సాగుతూ, వృత్తిపరంగా పేదల పక్షాన నిలిచి పీడిత ప్రజాఉద్యమాలకు న్యాయవాదిగా సహకరించారు. పార్వతీపురం, హైదరాబాదు కుట్రకేసులకు సాయపడ్డారు. దివిసీమ ఉప్పెనకు గురయినప్పుడు (1977 నవంబరు) సహాయక చర్యలనందించే కృషికి బాధ్యత వహించారు. టంగుటూరు పొగాకు రైతుల ఉద్యమాలపై అణచివేతలో భాగంగా కేసులు మోపినపుడు బాధితుల పక్షాన కేసులు వాదించారు. ఓ.పి.డి.ఆర్. రాష్ట్రకార్యవర్గ సభ్యునిగా వుంటూ తనకు ఆరోగ్యం సహకరించినంత వరకు ఉద్యమానికి తోడ్పడ్డారు. వారు కోరిన ప్రకారం వారి దేహాన్ని వైద్యవిద్యార్థుల అధ్యయనానికి తోడ్పడేవిధంగా వైద్య కళాశాలకు అప్పగించారు.

'ప్రజాసాహితి' ప్రారంభంనుండి పాఠకునిగానేకాక తగు అభిప్రాయాలూ, సూచనలూ యిస్తూ నిశిత పరిశీలకునిగా వుండేవారు. కంఠంనేని రవీంద్రరావుగారి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు 'ప్రజాసాహితి' పత్రికకు ఏభైవేల రూపాయలు శాశ్వతనిధికి అందజేశారు. ఆయన 11-1-2015న మరణించారు. రవీంద్రరావుగారి 6వ వర్ధంతి సందర్భంగా 'ప్రజాసాహితి' వారిని జ్ఞాపకం చేసుకుంటోంది.

# నండూరి రాఘవయ్యగారి

## 13వ వర్ధంతి



**అడవులదీవి** వాస్తవ్యులు నండూరి రాఘవయ్యగారు తన 97వ ఏట 2008 జనవరి 26న మరణించారు. వారి భార్య యశోదమ్మగారు 1999 జులై 4న మరణించారు. వారి కుమారుడు నండూరి నారాయణరావు భౌతికవాదిగా కృషి చేస్తున్నారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆయన 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి ఇరవై ఐదువేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. వారికి కృతజ్ఞతలు. గత 40 ఏళ్ళ నుండి నారాయణరావుగారు 'ప్రజాసాహితి' పాఠకుడిగా, శ్రేయోభిలాషిగా వున్నారు. వారి 13వ వర్ధంతి సందర్భంగా ప్రజాసాహితి జ్ఞాపకం చేసుకుంటోంది.

# వేమన అధ్యయన & అభివృద్ధి కేంద్రం, రాయలసీమ సాంస్కృతిక వేదిక విజ్ఞప్తి

***శ్రీ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌గారికి,***
అధ్యక్షులు, ***ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం, ఆంధ్రప్రదేశ్.***
మరియు ***గౌరవ అధికార భాషా సంఘం సభ్యులకు.....***
***వేమన అధ్యయన & అభివృద్ధి కేంద్రం, రాయలసీమ సాంస్కృతిక వేదిక... పక్షాన మనవి.***

ఆర్యా.......నమస్తే..!

అనంతపురం జిల్లాలో 9 డిసెంబరు 2020న అధికార భాషా సంఘం పక్షాన అధికారకంగా పర్యటిస్తున్న మీకు హృదయపూర్వక స్వాగతం.

ఈ సందర్భంగా అధికార భాషాసంఘం ఆధ్వర్యంలో కింది మా సూచనలు, అభిప్రాయాలు పరిశీలించి అమలు చేయాలని మనవి చేస్తున్నాము.

★ ★ ★ ★ ★

1. అధికార భాషాసంఘంలో రాయలసీమ నాలుగు జిల్లాలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు ఒక సభ్యుడు కూడా లేరు. ఈ లోపాన్ని సవరించి కనీసం ఈ ప్రాంతాల నుండి ముగ్గురికి భాషా సంఘంలో సభ్యులుగా అవకాశం కల్పించాలి.
2. సినిమాలలో రాయలసీమ భాష, సంస్కృతి కించపరిచేలా సన్నివేశాలు వెలువడుతున్నాయి. వీటిని అరికట్టాలని కోరుతున్నాం.
3. రాజ్యాంగబద్ధంగా తెలుగు మాధ్యమంలో చదువుకొనే హక్కుకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలి. ప్రాథమిక పాఠశాలలలో తెలుగు భాషోపాధ్యాయులను నియమించాలి.
4. రాయలసీమ పరిసరాలలోని కన్నడ, తమిళ, ఉర్దూ మాధ్యమాల పాఠశాలల సంరక్షణ చేయాలి. అదేవిధంగా కర్ణాటక, తమిళనాడులలో తెలుగు మాధ్యమ సంరక్షణకు, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలి.
   సరిహద్దు తాలూకా కేంద్రాలలో ద్విభాషా సౌహార్ద కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.
5. కేంద్రం బ్యాంక్ తదితర పరీక్షలు మాతృభాషలలో నిర్వహిస్తూ ఉంది. అందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాష్ట్రంలో చాలా పరీక్షలు ఇంగ్లీషు మాధ్యమంలో చేస్తుంది. మాతృభాషలో పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.
6. భాషా మంత్రిత్వశాఖను పునరుద్ధరించాలి. అధికార భాషాసంఘం పక్షాన ఒక అధికారిక భాషాపత్రిక కొనసాగించాలి. అధికార భాషాసంఘం అధికారాలు, బాధ్యతలపై చిన్న పుస్తకాలు ముద్రించాలి. అధికార భాషాసంఘం ఆధ్వర్యంలో అధికారికంగా జిల్లా, మండల, గ్రామ స్థాయి భాషాసంఘాలు నెలకొల్పి, అధికారభాష పటిష్ఠంగా క్షేత్రస్థాయిలో అమలుకు కృషి చేయాలి. భాష కోసం నిజాయితీగా కృషి చేస్తున్న వారిని గుర్తించి గౌరవించాలి.
7. తెలుగు విశ్వవిద్యాలయం పాలనాకేంద్రాన్ని శ్రీశైలంలోని తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలి.
8. తెలుగు అకాడమీ ఏర్పడి సంవత్సరం కావస్తున్నా ఇంతవరకు ఒక్క పని మొదలు కాలేదు. తెలుగు భాషాసంరక్షణ కోసం అకాడమీ కార్యక్రమాలు చేపట్టేలా చేయాలని మనవి చేస్తున్నాము.
9. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని తాళపత్రాల అధ్యయన సంస్థ ఇంతవరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటుకు అడుగు పడలేదు. తాళపత్రాల అధ్యయన కేంద్రం, సిబ్బందిని నియమించి ప్రాచీన తాళపత్రాలను కాపాడేలా చేయాలి.
10. తెలుగు ప్రాచీన అధ్యయన కేంద్రాన్ని నెల్లూరులో ఏర్పాటు చేశారు. దీనికి పూర్తి స్థాయి సంచాలకులను, సిబ్బందిని, పరిశోధకులను నియమించి ఆ నిధులు సమగ్రంగా వినియోగించే పాటుపడాలి.
11. రాష్ట్రంలోని ప్రాచీన శాసనాలు వివిధ కారణాల రీత్యా కనుమరుగు అవుతున్నాయి. శాసనాలను ఆధునిక సాంకేతిక పద్ధతులలో సంరక్షణ చేసి మూల శాసనాలను కాపాడాలి. శాసనాలను, పురావస్తు కట్టడాలను ధ్వంసం చేస్తే కఠినమైన చట్టాలతో శిక్షించాలి. ఆ శాసనాలలోని భాషను ఆధునిక భాషలో ప్రజలకు అర్థమయ్యేలా ప్రత్యేకంగా పక్కనే కొత్త ఫలకాలలో చిత్రించాలి.
12. జిల్లా కేంద్రాలలో భాషా భవన్‌లను నిర్మాణం చేయాలి.

**ధన్యవాదాలతో.....**

ఇట్లు...
**తెలుగు భాషాభిమానులు..**
**డా. అప్పిరెడ్డి హరినాథరెడ్డి,** వేమన అధ్యయన అభివృద్ధి కేంద్రం
**డా. పి. దామోదర రెడ్డి,** రాయలసీమ సాంస్కృతిక వేదిక

కవిత

# ప్రకృతి శిల్పులు

- రవి సంగోజు

పైరుపూల పోరులో ఒరిగిన
ప్రకృతి శిల్పులు
జనావళి హృదయాలలో
చెక్కుచెదరని శిల్పాలు

విస్మరించకుండా
నిండు మనసుతో
తలవంచి
రుణం తీర్చుకోవడానికి
సాష్టాంగ ప్రణామాలు సమర్పించాలే

★ ★ ★

నిత్యం దిగంతాలకు వెదజల్లే నిగ్రహ
కాంతిపుంజాలు

ఆరిపోకుండా
రోజంతా సమురుబోసి
ఆ వెలుగు దీపాలకు
రెండు చేతులతో నిండుగా
అడ్డుపెట్టి
నిరంతరం కాపాడుతూ నలుగురితో పంచుకోవాలే

★ ★ ★

నేలవాలిన పాదాల వద్ద రాలిన పూలగుత్తులు

వాడిపోకుండా
తోడు నిలిచి పొద్దున్నే
మట్టిలో విరిసిన
అగ్నిపూలతో
కొత్త మాలలు ఏర్చికూర్చి దండలు వేయాలే

★ ★ ★

మట్టికాళ్ళ ధూళితో దారంతా
మానవీయ పరిమళం

ఆగిపోకుండా
నెత్తినెత్తుకొని
నియంతల విలాసాలను తాకే విధంగా
రోజూ గుప్పుమనే
ఊదుపొగ వేయాలే

★ ★ ★

ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఊపిరి సలపనీయని ఆదర్శాల సుగంధం
తడారకుండా
మన ఇండ్లల్లో నిట్టాడుకు
నిటారుగా నిలిపి
ఎప్పుడూ
మనో ఫలకంపైన రంగరించాలే

★ ★ ★

నెత్తురు ముద్దలతో వేసిన అసమాన త్యాగ ముద్రలు

చెదిరిపోకుండా
జాతీయం చేసిన రహదార్ల మీద
ఆరబోసిన దేహాల ముగ్గులను
గుండెల్లో భద్రపరుచుకొని
భగత్‌సింగ్ పేర ఐడికట్టి
పాఠాలను
పిల్లలతో వల్లె వేయించాలే

★ ★ ★

ఎత్తిపోతలై ప్రవహించే సుళ్ళుతిరిగే కన్నీళ్లు

వృధాకాకుండా
ఒత్తుకుని ఎదల నిండా హత్తుకుని
కలబోతలను ఒలబోసుకుని
కాసింత కష్టమైనా
కరిగిపోయే మనసుల మనుషులు
ఏకతాటిపైన పైరుపచ్చగా
ముందుకు నడవాలే

## పాములపాటి జానకమ్మగారి 4వ వర్ధంతి



**గుంటూరుజిల్లా** నిడమర్రుకు చెందిన కీ.శే. పాములపాటి గోపిరెడ్డిగారి భార్య జానకమ్మగారు 12-11-2016న తన 80వ ఏట మరణించారు.

జానకమ్మగారు గృహిణిగా వుంటూనే దేశ రాజకీయ, సాంఘిక పరిస్థితులను ఆకళింపు చేసుకునేవారు. ఆమె 'ప్రజాసాహితి' పత్రిక అభిమాని.

వీరి 2వ వర్ధంతి సందర్భంగా 12-11-2018న ఆమె కుమార్తె తాడిపర్తి శివమ్మ తన తల్లి జ్ఞాపకార్థం 'ప్రజాసాహితి' శాశ్వతనిధికి ఇరవై ఐదు వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. వారికి కృతజ్ఞతలు.

జానకమ్మగారిని 4వ వర్ధంతి సందర్భంగా జ్ఞాపకం చేసుకుంటున్నాం.

# రైతాంగ పోరాటంపై కవితల, పాటల కొరకు విజ్ఞప్తి

**రాజ్యం** చేసిన మూడు వ్యవసాయ చట్టాలకు, విద్యుత్ చట్టానికి వ్యతిరేకంగా, ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా దేశవ్యాప్తంగా రైతాంగం, ప్రధానంగా ఉత్తర భారత రైతాంగం గత 40 రోజులపైగా రాజధాని నగరమైన ఢిల్లీని చుట్టుముట్టి, ప్రకృతి సృష్టించే అవరోధాలనూ, ప్రభుత్వం చేస్తున్న దాడులనూ అధిగమించి ఒక అపూర్వమైన క్రమశిక్షణతో దీర్ఘకాలిక పోరాటాన్ని కొనసాగిస్తోంది.

దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు తమ తమ పద్ధతులలో వీరికి సంఘీభావాన్నీ, సహకారాన్నీ అందిస్తున్నారు. సాహితీ సాంస్కృతికరంగం జేజేలు తెలుపుతోంది.

మన తెలుగు కవులు ఈ సమకాలీన ప్రజాపోరాటానికి తమ కవితల పాటల ద్వారా మద్దతు తెలియచేస్తున్నారు. వీటిలో ఒక స్థాయి గల కవితలను పాటలను సేకరించి, ఒక సంకలనంగా ప్రచురించాలని జనసాహితి నిర్ణయించింది. ఈ కవితలు వివిధ రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, స్థానిక పత్రికలలోనూ వాట్సాప్‌లలోను, ఫేస్‌బుక్‌లోనూ ప్రచురితమై అందరికీ అందుబాటులో లేవు. కనుక

1. మీ మీ ప్రాంతాలలో పత్రికలలో వచ్చిన కవితలు – వాటి రచయితల పేర్లు – ఏవైతే వారి ఫోన్ నెంబర్లు, వారి అనుమతి సేకరించి పంపండి.
2. మాకు అందిన కవితలను పరిశీలించి, ఎన్నిక చేసిన వాటికే సంకలనంలో ప్రచురిస్తాం.
3. అనువాద కవితలైతే వాటి మూలప్రతి కూడా పంపించాలి.
4. కవితలు మాకు జనవరి 30లోగా అందేట్లు పంపండి.
5. సంకలనంలో ప్రచురించిన కవితల రచయితలకు ఒక ప్రతి బుక్ పోస్ట్‌లో పంపిస్తాము. ఎటువంటి పారితోషికము వుండదు.
6. కవితలు prajasahithi1977@gmail.comకు గానీ 'ప్రజాసాహితి' – డోర్ నెం. 30–7–6, అనపర్తివారి వీధి, దుర్గా అగ్రహారం, విజయవాడ–2.కు కొరియర్ ద్వారా పంపించండి.
7. కవితలు సేకరించి పంపిస్తున్నవారు తమ పేరు – ఫోన్ నెంబరు ఇవ్వాలి.

**6–1–2021** – జనసాహితి

కవిత

## అన్యాయం బరువు

**– డా॥ కె.జి. వేణు**

బొద్దెంకను
వురికంబానికెక్కిస్తున్నారు
మారణాయుధాలు
మోసుకొచ్చిందట
శాంతిభద్రతల దుప్పటికి
నిండా కన్నాలు పెట్టిందట
రాజ్యహింసకు సింహాసనాలేసిందట
మరణశిక్ష సబబేనని
సూర్యగ్రహణం సాక్షిగా తీర్పు
కాళ్లిరిగిన బొద్దెంకను
లాఠీలమీద మోసుకొస్తున్నారు
దృశ్యాన్ని చూస్తున్న
తలారి తలపాగా బరువు
ఒక్కసారిగా వెయ్యి టన్నులయింది
బరువు తగ్గని అన్యాయం
రాబందులా
జైలు గోడలమీద వాలిపోయింది ✸



# ప్రముఖ బెంగాలీ చలనచిత్ర నటుడు సౌమిత్ర చటర్జీ కన్నుమూత

**చలనచిత్ర** నటుడు, దర్శకుడు, నాటక రచయిత, కవి ఐన సౌమిత్ర చటర్జీ తన 85వ ఏట 15–11–2020న కలకత్తాలో కోవిడ్‌తో మరణించారు. ఆయన 19–01–1935లో కలకత్తాలో జన్మించారు.

బెంగాలీ సాహిత్యంలో ఎమ్.ఏ. చదివిన సౌమిత్ర మొదట ఆల్ ఇండియా రేడియోలో అనౌన్సర్‌గా పనిచేశారు. బాల్యదశలోనే తండ్రి నుంచి నటన వైపు, తల్లి నుంచి కవిత్వం వైపు ఆకర్షింపబడ్డారు. సత్యజిత్‌రే తీసిన 14 సినిమాలలో నటించారు. చలనచిత్ర నటునిగా 1959లో 'అపూర్ సంసార్'లో నటించారు. మృణాల్‌సేన్, తపన్‌సిన్హా, అసిత్‌సేన్, తరుణ్ మజుందార్ల సినిమాలలోనూ నటించారు. టాగోర్ రాసిన కథ 'స్త్రీ పత్ర' సినిమాకు దర్శకునిగా ప్రశంసలందుకున్నాడు.


నిర్మాల్య ఆచార్యతో కలసి 'ఎక్సాన్' (లే ఇప్పుడు) అనే పత్రిక ప్రారంభించారు. దాని ముఖ పత్రాలను రే తయారుచేసేవారు. దానిలో రే చిత్రాల విశేషాలు ప్రచురించి చలనచిత్ర నటునిగానే గాక నాటకాలు రాసి వాటికి దర్శకత్వం వహించారు.

1979లో పద్మశ్రీ అవార్డును తిరస్కరించారు.

2004లో 'పద్మభూషణ్' అవార్డును స్వీకరించారు. ఇవిగాక జాతీయ, అంతర్జాతీయ అవార్డులెన్నో అందుకున్నారు.

కళాత్మక, సందేశాత్మక చలనచిత్రాలలో, నాటకాలలో నటించిన సౌమిత్ర చటోపాధ్యాయకు ఇదే మా నివాళి. ✸

# తెలుగు సాహితీలోక బాంధవుడు, దేవీప్రియ మరణానికి జనసాహితి సంతాపం!



**తన** పేరు కూడా దేశ ద్రోహుల జాబితాలో ఏమూలో నమోదయి ఉంటుందని అనుమానించాడో ఏమో, ఖాజా హుస్సేన్, దేవీప్రియగా అవతరించి తన కవితా ఖడ్గమెత్తి తన 71వ ఏట 21-11-2020న మరణించారు.

71 సంవత్సరాల క్రితం గుంటూరు జిల్లా తాడికొండలో జన్మించిన దేవీప్రియ, గుంటూరు ఏసీ కళాశాలలో చదువుకుని, దిగంబర కవుల ప్రభావంతో, గుంటూరు కేంద్రంగా 1970ల ప్రాంతంలో ఏర్పడిన 'పైగంబర' కవుల బృందంలో ఒక ముఖ్యుడయ్యాడు. శ్రమజీవుల కుటుంబంలో పుట్టెడు కష్టాల నడుమ పుట్టిన దేవీప్రియ, నాటి గుంటూరు రాజకీయ వాతావరణంలో పిన్న వయసులోనే ఎరుపెక్కిన ఆలోచనలతో కష్టజీవులదైన ఎఱ్ఱ జెండా భావజాలానికి సహజంగా దగ్గరయ్యాడు. కుల, మతాల పంజరాన కట్టుబడకుండా, జీవిత కాలమంతా లౌకికవాదానికి, జీవనానికి కట్టుబడ్డాడు.

కవిగా, జర్నలిస్టుగా 'ప్రజావాహిని', 'నిర్మల జ్యోతి', 'మనోరమ', 'హైదరాబాద్ టైమ్స్', 'ఉదయం' పత్రికలలో పనిచేశారు. 'దాసి', 'రంగుల కల' లాంటి ప్రగతిశీల సినిమాలకు తన మాటల పాటల రచనలను అందించారు. కవిగా, రచయితగా తనదైన ఒక సొంత ముద్రతో దేవీప్రియ పేరు పడ్డారు. హైదరాబాదు నుంచి వెలువడిన 'ప్రజాతంత్ర' పత్రికకు ఎడిటర్‌గా పనిచేస్తున్న అత్యవసర పరిస్థితి కాలంలో శ్రీ శ్రీ చేత ఆయన ఆత్మకథ 'అనంతం' ధారావాహికను కొనసాగించాడు. ప్రఖ్యాత మలయాళీ ఫెమినిస్ట్ రచయిత్రి కమలాదాస్‌నూ, ఆమె రచనలను 'ప్రజాతంత్ర' వారపత్రిక ద్వారా తెలుగు పాఠకులకు పరిచయం చేశారు. 'ఉదయం' దినపత్రికలో దేవీప్రియ రచించే రాజకీయ వ్యంగ్య మినీ కవిత్వ రన్నింగ్ కామెంట్రీకి, పదునైన మోహన్ వాత అనగా కార్టూన్ కోసం పాఠకులు ప్రతినిత్యం ఎదురుచూసే వాళ్ళంటే అతిశయోక్తి కాదు.

సోవియట్ యూనియన్ కూలిపోయినప్పుడు, శ్రామిక రాజ్య అభిమానిగా దేవిప్రియ రాసిన 'హిట్లర్ నవ్వు' పేర్కొనదగిన ఆయన మంచి కవితలలో ఒకటి. 'అమ్మచెట్టు', 'నీటి పుట్ట', 'చేప చిలుక', 'తుపాను తుమ్మెద', 'గరీబు గీతాలు', 'సహజానంద స్వామి' వంటి పలు రచనలు, ఆయన సంపాదకీయాలు అనేక సంపుటాలుగా వెలువడినాయి.

దేవీప్రియ కవిత్వపు హోరులో 'చెమట చెల మల అలల' శబ్దం వినిపిస్తూ ఉంటుంది. అతని భావధారలో సాంఘిక పీడనకు గురవుతున్న అట్టడుగు వర్గాల ఆవేదనలు వినిపిస్తాయి. శ్రమ దోపిడీకి బలౌవుతున్న కష్టజీవుల ఆక్రందనలు వ్యక్తమవుతాయి. రెండవ శ్రేణి పౌరులుగా జీవిస్తున్న మహిళల నిట్టూర్పులు దాగి ఉంటాయి. అప్రకటితంగానూ, ప్రకటితంగానూ భావజాలరంగంలో విస్తరిస్తూ, భౌతిక జీవితంలో వివక్షకు దాడులకు గురి చేస్తున్న మతతత్వ భావజాలం పట్ల మత మైనారిటీలలోని తీవ్ర నిరసనను, అణచి పెట్టుకున్న ఆక్రోశాన్ని వారి లౌకిక ఆకాంక్షలను బహువిధ కళాత్మక రూపాలలో దేవిప్రియ రచనలలో వ్యక్తమవుతాయి. ఒక్క మాటలో అసమానతలతో, అప్రజాస్వామిక మతతత్వ ఉన్మాదాలతో నిండిన భారత సమాజంలో, పీడిత ప్రజా పక్షపాతిగా దేవిప్రియ సాహిత్య సామాజిక జీవితమంతా నిండి ఉంది.

ఏ వామపక్ష సాహిత్య సంఘాలలో సభ్యుడు కాకున్నా, అనుక్షణం వామపక్ష భావజాలాన్ని శ్వాసించి జీవించినవాడు దేవీప్రియ!

అతని జీవిత సహచరి రాజేశ్వరి మరణించిన దగ్గర నుండి ఆమె లేనితనాన్ని ఎంతో మనోవ్యథతో భరించిన దేవీప్రియ, ఆకస్మికంగా జబ్బు పడి పదిరోజుల పాటు నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 21-11-2020 ఉదయం ఏడు గంటలకి మన నుండి శాశ్వతంగా దూరం అయిపోయారు.

ఎంతో సహృదయుడు స్నేహ ప్రియుడు మానవత్వంపై ప్రగాఢ విశ్వాసం కలిగిన దేవిప్రియ మరణం సాహితీ ప్రపంచానికి తెలుగు ప్రజానీకానికి తీరని లోటు.

ఆయన లేని లోటుని పూరించడానికి ఆయన ఆశయాల విప్లవ శంఖం మరింత బలంగా పూరించడం ద్వారా లౌకిక ప్రజాస్వామ్య సాంస్కృతిక వికాసం వైపుకి వేగంగా నడిచిన వాళ్లమవుతాం.

కామ్రేడ్ దేవిప్రియ మరణానికి జనసాహితి సంతాపం ప్రకటిస్తోంది ఆయనకు జోహార్లు తెలుపుతోంది.

## సైన్స్ ఫిక్షన్ రచయిత కె. సదాశివరావు మరణం

**శాస్త్ర** విజ్ఞానంపై ఆధారపడి కథలు రాసిన కె. సదాశివరావు హైదరాబాదులో 7-12-2020న హఠాత్తుగా మరణించారు. ఆయన 15-07-1943న కృష్ణాజిల్లా ఆత్కూరులో జన్మించారు.

వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో భూగర్భశాస్త్రంలో ఎం.ఎస్.సి. చదివి, పోలీసుశాఖలో ఉన్నతోద్యోగిగా పనిచేశారు. పాశ్చాత్య సాహిత్యంతో బాగా పరిచయమున్న సదాశివరావు తెలుగు పాఠకులకు సమకాలీన అంతర్జాతీయ రచయితలను పరిచయం చేశారు. తాము కథకునిగా సైన్సు ఫిక్షన్ కథలను రచించారు. అవి 'ఆత్మా ఫాక్టర్', 'సైన్సు ఫిక్షన్ కథలు'గా ప్రచురితమయ్యాయి.


వారికి 'ప్రజాసాహితి' నివాళి.

# మహిళాభ్యుదయ దీపిక అబ్బూరి ఛాయాదేవి 'వనిత'

- డా॥ షేఖ్. మహబూబ్ బాషా

**వలసాంధ్రలో** ఇరవైకి పైగా స్త్రీల పత్రికలు ప్రచురితమయ్యాయి. వాటిలో 'సతీహిత బోధిని', 'తెలుగు జనానా' మొదలైనవి పురుషుల సంపాదకత్వంలో వెలువడితే 'సావిత్రి', 'అనసూయ', 'ఆంధ్రలక్ష్మి', 'వివేకవతి' మొదలైనవి స్త్రీల సంపాదకత్వంలో వెలువడ్డాయి. వలస పాలనా కాలంలో ప్రారంభమైన 'గృహలక్ష్మి', 'ఆంధ్ర మహిళ' మొదలైన పత్రికలు భారత స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగాయి. వలసాంధ్రలో మహిళా చైతన్యానికి దర్పణం పట్టే స్త్రీల పత్రికలు మహిళోద్యమ నిర్మాణంలో గణనీయమైన పాత్రను పోషించాయి. స్త్రీల అక్షరోద్యమానికి కొనసాగింపుగానే స్వాతంత్ర్యానంతరం ఆంధ్రలో కొన్ని స్త్రీల పత్రికలు ప్రచురించబడ్డాయి. కమ్యూనిస్టు స్త్రీల "ఆంధ్రరాష్ట్ర మహిళాసంఘం" 'ఆంధ్ర వనిత' అనే పత్రికను మార్చి / ఏప్రిల్ 1948లో ప్రచురించింది. రెండే రెండు సంచికలు వచ్చిన తర్వాత ఈ పత్రికను కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధించింది. దరిశి సుభద్రమ్మ దీనికి సంపాదకురాలు. 'వనితా విహార్' అనే పత్రిక 1949లో రాజమండ్రి నుండి వెలువడింది. సత్యవతీదేవి, రాజ్యలక్ష్మి, మహాలక్ష్మి అనే ముగ్గురు స్త్రీలు దీనికి సంపాదకత్వం వహించారు. 'నారీలోకం' అనే పత్రిక కె. రంగమ్మ రెడ్డి సంపాదకత్వంలో విజయవాడ నుండి వెలువడింది.

ఈ చారిత్రక నేపథ్యంలో ఏప్రిల్ 1956 నుండి అబ్బూరి ఛాయాదేవి సంపాదకత్వంలో 'వనిత' పత్రిక వెలువడనారంభించి ఆ సంవత్సరాంతం వరకు కొనసాగింది. 'వనిత'ను పాఠకులకు పరిచయం చెయ్యడమే ఈ వ్యాసం ఉద్దేశం. సంపాదకురాలైన అబ్బూరి ఛాయాదేవిది పరిచయం అవసరంలేని పేరు. 'వనిత' "ఆంధ్ర యువతీ మండలి" తరపున ప్రచురించబడింది. "ఆంధ్ర యువతీ మండలి" 1935లో హైదరాబాదులో నెలకొల్పబడింది. "భారతదేశం యావత్తూ బానిసత్వం అనుభవిస్తున్న కాలంలో ఆనాటి సాంఘిక దురాచారాలనూ, నిరక్షరస్యతనూ రూపుమాపి, దేశ స్వాతంత్ర్యానికి పాటుపడాలనే ఆకాంక్షతో, ఆంధ్ర వనితలలో నిద్రాణమై వున్న వివిధ శక్తులను వికసింపజేసి, వారి అభిరుచులను ప్రోత్సహించి, వారి సాంఘిక జీవనంలో అభ్యుదయం తేవాలనే ఆశయంతో.... ఆనాడు స్త్రీలకున్న శతసహస్ర నిర్బంధాలలో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి" శ్రీమతి యల్లాప్రగడ సీతాకుమారి, శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి ఈ సంస్థను స్థాపించారు. వారికి బూర్గుల అనంతలక్ష్మీదేవి, రంగమ్మ ఓబుల్‌రెడ్డిలు "సర్వ విధాల" తోడ్పడ్డారు. శ్రీమతులు మాడపాటి మాణిక్యమ్మ, టి. వరలక్ష్మమ్మ, సరోజిని యస్.యన్.రెడ్డి మొదలైనవారు సంస్థ అభివృద్ధికి పాటుపడ్డారు. రాణి సరళాదేవి, గద్వాల్ రాణి, సాపన్నపేట, పాల్వంచ, గుదుగుంట సంస్థానాధీశ్వరులు ఆర్థికంగా సహాయం చేశారు. స్త్రీలు ఇందులో సభలూ, సమావేశాలూ, పండుగలూ జరుపుకొనేవారు. స్త్రీలలో విజ్ఞానాభివృద్ధికై ప్రముఖులతో ఉపన్యాసాలిప్పించేవారు. 'మండలి'లో ఉన్న గ్రంథాలయం స్త్రీలకుపయుక్తంగా ఉండేది. స్త్రీలలో కళలను ప్రోత్సహించడానికి తరగతులను నిర్వహించేవారు. బాలబాలికలకు ఉచితంగా విద్యనందించడానికి పాఠశాలను స్థాపించారు. 1954 నాటికి విశాలమైన సొంత భవనం యేర్పడింది. 1956 నాటికి 'మండలి'లో 300 మంది సభ్యులుండేవారు. మహిళాభ్యుదయం కోసం "ఆంధ్ర యువతీ మండలి" 'వనిత'ను ప్రచురించింది.




మాసపత్రిక అయిన 'వనిత'లో సుమారు 64 పుటలుండేవి. సంవత్సర చందా మూడు రూపాయలు. 'వనిత' స్త్రీల రచనలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. పురుషుల రచనలు దాదాపుగా లేవనే చెప్పాలి. నాయని కృష్ణకుమారి, యల్లాప్రగడ సీతాకుమారి, నందగిరి ఇందిరాదేవి, అబ్బూరి ఛాయాదేవి, ఉన్నవ విజయలక్ష్మి, తెన్నేటి హేమలతాదేవి, జ్ఞానకుమారి హెడా, లక్ష్మీ భాగ్యనగర్, వల్లభనేని రంగాదేవి, డాక్టర్ కొండా శకుంతలాదేవి, డాక్టర్ యస్. శ్రీదేవి, యం. జానకీరాణి, అడవికొలను రుక్మిణి, శ్రీపాద వెంకటరమణమ్మ, మర్రి సావిత్రీదేవి, రాజేశ్వరి, కె. విశాలాక్షి మొదలైన రచయిత్రులు 'వనిత'లో తమ రచనల్ని ప్రచురించారు. "ఆంధ్ర యువతుల అభ్యున్నతి నిమిత్తమై 'వనిత' అనే పత్రిక వెలువడుతున్నందుకు పరిపరివిధాల నేను సంతోషపడుతున్నాను. స్త్రీ జాతి అభ్యుదయానికి దోహదం చేసే ఆదర్శాలను, సమాచారాన్ని అందజేయటానికి కంకణం కట్టుకున్న పత్రిక ఈ రోజుల్లో అత్యంత వాంఛనీయం. ఆంధ్రయువతీ మండలి వారు నడుపుచున్న ఈ పత్రిక నాలుక్కాలాల పాటు నిలిచి ఆంధ్ర మహిళాలోకానికి ఎల్లవేళల్లోనూ వెలుగు అందిస్తూ ఉండగలదని ఆశిస్తున్నాను" అని 'వనిత' ప్రారంభ సంచికలో దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ శుభాకాంక్షలందజేశారు. అప్పటికామె "ఆంధ్రమహిళ" వెలువడుతుండింది. అయినా 'వనిత'ను పోటీగా భావించక ప్రోత్సహించడం విశేషం. 'ఈ పత్రిక మూలమున తెలంగాణములోని మహిళలలో చక్కని ప్రబోధము, విజ్ఞాన ప్రసారము కలుగునట్లు దైవమను గ్రహించుగాక!" అని మాడపాటి హనుమంతరావు ఆశీర్వదించారు.

మొదటి సంచిక సంపాదకీయంలో 'వనిత' లక్ష్యాల్ని చాలా స్పష్టంగా వివరించారు సంపాదకురాలు : "స్త్రీని వంట యిల్లు అనే చీకటి పరిధి నుంచీ ఆమెను వెంటాడుతున్న ప్రతిబంధకాలనుంచీ తప్పించి ఆరుబయట ఆకాశం క్రింద ఏం జరుగుతున్నదో తెలియ చెప్పటానికి, చుట్టూరా విస్తరించుకుని ఉన్న విశాల ప్రపంచంలో అనునిత్యం సాగే జీవన సంఘర్షణలో స్త్రీ ఉనికి, స్త్రీ భాగస్వామ్యం, ఆమె నిర్వహించవలసిన పాత్ర – ఇత్యాది విషయాలను ప్రబోధించటానికి ఎక్కువ మహిళా పత్రికలు అత్యంతావశ్యకం.... ఇల్లు చక్కబెట్టుకోవటం ఒక్కటే కాదు, దేశాన్ని చక్కబెట్టవలసిన బాధ్యత కూడా యీనాడు స్త్రీపైనే ఉన్నది. అయితే, ఈ ద్వంద్వ బాధ్యతను మన వనితలు ఎంతవరకు గుర్తించగలుగుతున్నారన్నదే ప్రస్తుత సమస్య. పురుషునితోపాటు సమాన హక్కులను సాధించాలన్న విషయాన్ని గుర్తించినప్పటికి, ఆ లక్ష్య సాధనలో స్త్రీ ఎంతవరకు కృతకృత్యురాలౌతున్నది? అసలు ఆ లక్ష్య సాధనకు అవసరమైన సాధన సామగ్రి ఎటువంటిది? దేశ జనాభాలో ఈనాడు సగం మంది స్త్రీలే. కానీ, వారిలో అనేకమంది అవిద్యావంతులు. ఆర్థికంగా పరాధీనులు. మౌఢ్యం, నిరంతర కుటుంబ భారం వీరిని అనేక విధాలుగా క్రుంగదీస్తున్నది. అంతేకాదు. ఈనాడు మన కుటుంబ జీవితాల్లో కానవచ్చే నైరాశ్యానికి, నిట్టూర్పులతో రోజులు వెళ్లబోసు కోవటానికీ ఇదే హేతువు. ఇక కట్నాలు, వివాహాలు మొదలైన సమస్యలను ఎత్తుకున్నామంటే అదంతా ఒక అగాధం. ఈ విపత్తుల నుంచి తనకు తానై తప్పుకోగలగటానికి ఆమెలో సహజంగా నిద్రాణమై ఉన్న అంతశ్శక్తిని, చైతన్యాన్నీ మేలుకొలపటానికి స్త్రీ జాతిలో నేడు కొత్త ఆలోచనలు ప్రవేశించటం అన్నది తప్పనిసరిగా రావలసిన పరిణామం. నిద్రాణమై ఉన్న మన వనితలలో యీ అవసరాన్ని గుర్తింపజేసి వారిలో జాగృతిని కలిగించి దేశ పునరుద్ధరణకి, శాంతి సౌభాగ్యాల ఆవిర్భావానికీ విస్తృతమైన వేదికను నిర్మించటం కోసమై 'వనిత' పత్రిక అవతరిస్తున్నది. ఈ కర్తవ్య నిర్వహణలో నిరంతర కృషి కొనసాగించటమే 'వనిత' పరమావధి."

'వనిత'లోని సంపాదకీయాలు విశిష్టమైనవి; అభ్యుదయకరమైనవి. మొట్టమొదటి సంచికలోని సంపాదకీయం మహిళాభ్యుదయానికి స్త్రీల పత్రికల ఆవశ్యకతను తెలియజేసింది. 15-5-1956 నాటి సంపాదకీయం ("వనితా సమాజాలు") స్త్రీ సమాజాల అవసరాన్ని నొక్కి వక్కాణించింది. పల్లెటూరి స్త్రీలతో పోలిస్తే పట్నవాసపు స్త్రీలలో "సమిష్టి భావం శూన్యం" అనీ "సంకుచితత్వం, సోమరితనం అలవరచు కోవటం నాగరిక లక్షణం కాదు. నలుగురితో కలిసినప్పుడే సభ్యత అలవడుతుంది" అనీ "గృహ నిర్వహణతో బాటు, సంఘ జీవనం కూడా స్త్రీకి ముఖ్యం" అనీ తెలియజేసి "విద్యావంతులు, అనుభవజ్ఞులూ అయిన వనితలు ప్రత్యేకంగా సమాజాలను స్థాపించి వివిధ కార్యక్రమాలను కొనసాగిస్తూ వనితల పురోభివృద్ధికి పాటుపడవచ్చును" అని సూచించింది. 15-6-1956 నాటి సంపాదకీయం గ్రామ పంచాయితీల నిర్వహణలో స్త్రీలు పాల్గొనడానికి సంబంధించింది. ఆంధ్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీల్లో పాల్గొనే అవకాశం స్త్రీలకు కల్పించిందనీ "వనితాభ్యుదయాన్ని కాంక్షించే ప్రతి వారూ ఆంధ్ర ప్రభుత్వాన్ని అభినందించి" తీరుతారనీ ఆశించింది. "ఈ వైజ్ఞానిక యుగంలో మన సాంఘిక జీవన సంస్కారానికీ, అభివృద్ధికీ, మహిళల సహకారం అత్యంత ముఖ్యమని యీనాటికి అందరూ" గుర్తించారనీ, "అయితే, మహిళల విషయంలో ప్రభుత్వం కానీ, ప్రజాభ్యుదయానికి పాటుపడే నాయకులు కానీ నిష్పక్షపాతంగా వ్యవహరించవలసి ఉంటుంది" అనీ ఆకాంక్షించింది. 15-7-1956 నాటి సంపాదకీయం ("వనితాభ్యుదయం") రెండు అంశాలను చర్చించింది. సరోజినీనాయుడు, మార్గరెట్ కజిన్స్‌ల స్మృతి చిహ్నాల యేర్పాటుకు సంబంధించిన నిర్ణయాన్ని గూర్చి తెలియజేస్తూ "ఈనాడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, హక్కులూ, ఆనాటి వారిరువురి నిరంతర కృషి, స్వార్థత్యాగం మూలాన్నే లభ్యమయినాయి" అని స్పష్టం చేసింది. వారి స్మృతి చిహ్నాలను నెలకొల్పడంలో అఖిలభారత మహిళాసభకు తోడ్పడడం "తన ప్రధాన కర్తవ్యమని ప్రతి భారత మహిళా గుర్తించా"లని కర్తవ్య ప్రబోధ చేసింది. అదే సంపాదకీయంలో పతిత స్త్రీల కోసం కేంద్ర సాంఘిక సంక్షేమ సంఘం ద్వారా భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా 430 పునరావాస గృహాలను యేర్పాటు చేసిందనీ, వాటిలో వారికి అగ్గిపెట్టెలు, చాపలు మొదలైన వాటిని తయారు చేయడం నేర్పిస్తే వాళ్ళు తమ కాళ్ళపై తాము నిలబడగలరనీ దానికోసం ప్రత్యేకంగా రెండవ పంచవర్ష ప్రణాళికలో పదిన్నర కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందనీ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ తెలియజేసినట్లు సమాచారాన్నందించింది. "అంత పెద్ద మొత్తాన్ని స్త్రీ జనాభ్యుదయం కోసం వినియోగించదలచి నందుకు" భారత ప్రభుత్వాన్ని ప్రతి స్త్రీ అభినందించాలని కోరింది. డిసెంబరు 1956 నాటి సంపాదకీయం కూడా 'పతిత' స్త్రీలకు సంబంధించిదే. 'పతిత' స్త్రీలను ఉద్ధరించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి శ్లాఘనీయమైనదైనప్పటికీ పరోక్షంగా అది 'పతిత' స్త్రీలను అవినీతికి పాల్పడేందుకు ప్రోత్సహిస్తోందనీ కాబట్టి సమాజంలో "అవినీతిని నిర్మూలించే మార్గాలను అనుసరించడం" ముఖ్యమని సూచించింది. "వేశ్యాగృహాలను రూపురేఖల్లేకుండా చేయడానికి, అన్నిరకాల అవినీతిని నిర్మూలించడానికి పోలీసుశాఖలో స్త్రీలను నియమించడం సమంజసమే. అవినీతి మార్గాలను అరికట్టడం సంకుచితత్వం కాదు. అవినీతికరమైన పనులు చేయడమే నాగరికతకు లక్షణమనే దురభిప్రాయాన్ని పోగొట్టే బాధ్యత హిందూ వైవాహిక సంప్రదాయాలను మన్నించే ప్రతి స్త్రీ పైనా ఉన్నది." 15-8-1956 నాటి స్వాతంత్ర్య దినోత్సవ సంచికలో భారత స్వాతంత్ర్యోద్యమం కోసం పోరాడిన మహిళల్ని గుర్తు చేసుకోమని పిలుపునిచ్చింది. "స్త్రీ జనాభ్యుదయం కోసం పోరాడిన వనితలలో ప్రజానీకానికి తెలిసినవారు కొద్దిమంది మాత్రమే. వారిలో ఎంతమంది అజ్ఞాతంగా ఉండి కృషి చేశారో, ఎంతమంది పేర్లు చరిత్రలో అట్టడుగున పడిపోయాయో – వారందరినీ భారతదేశ స్వాతంత్ర్యదినోత్సవ శుభ సమయంలో సంస్మరించుకుని వారికి జోహారులర్పించడం మన విధి" అని భావితరాలు బాధ్యతను గుర్తుచేసింది. 15-9-1956 నాటి సంపాదకీయం "ఆడపిల్లను అదుపులో ఉంచడం"కి సంబంధించింది.

"ఆధునిక పద్ధతుల్లో" అలంకరించుకుంటూ, మహిళాసభల్లో ఉపన్యాసాలిస్తూ, పత్రికల్లో కథలూ వ్యాసాలూ రాసే "అభ్యుదయ"వాదులైన ఆడవాళ్ళు సైతం ఆడపిల్లల విషయానికొచ్చేటప్పటికి ఏవిధంగా "పద్దెనిమిదవ శతాబ్దం" నాటి భావజాలం కలిగి ఉంటున్నారో బట్టబయలు

చేసింది. "ఆధునికురాలై"న ఒకావిడ ఆరుగంటలకు వస్తానన్న తన చదువుకున్న కూతురు ఎనిమిదైనా రాకపోవడంతో "అసలు ఆడపిల్లలు అంత స్వతంత్రంగా స్వేచ్ఛగా తిరగటం పనికిరాదు" అంటుంది. "సమాన హక్కులుండాలంటే" అంటే "నాకు నచ్చవు అలాంటి హక్కులూ గిక్కులూనూ - ఈ విషయంలో నాకు పద్దెనిమిదవ శతాబ్దంలోనే నమ్మకం ఉంది సుమండీ" అంటుంది. కుహనా అభ్యుదయవాదులపై బలమైన విమర్శ ఈ సంపాదకీయం.

'వనిత'లో కవితలూ, కథలూ, వ్యాసాలూ ప్రచురించబడ్డాయి. "ఉజ్వల వనిత" అనే కవితలో (15-4-1956, పు. 27-29) యల్లాప్రగడ సీతాకుమారి "సర్వశక్తులు వినియోగించి సమానత్వము సంపాదింపగా" ముందుకు సాగమని భారత మహిళలకు పిలుపునిచ్చింది. ఆ కవితలోని కొన్ని భాగాలు :

ఓ నవ వనితా / ఉజ్వల వనితా
పదపద ముందుకు / భారత వనితా
ఎన్నోనాళ్ళుగా విన్నాం విన్నాం
భారత మహిళా కీర్తి ప్రశంసలు
అబలా నారీ సాధ్వీ అంటూ
భారత కీర్తికి మూలం అంటూ
గృహ రాజ్యానికి రాణులటంటూ
బయటికి మాత్రం పోరాదంటూ
......
ఎన్ని బంధనాలెన్ని చిక్కులో
ఎట్లా వచ్చితివో యీ దశకు
నీ శక్తులన్నీ లాగారెవరో
నీ కట్టులన్నీ కట్టిందెవరో
నీ రెక్కలన్నీ విరిచారెవరో
నీ హక్కులన్నీ చెరిచిందెవరో
......
ఎన్నాళిట్లా యుంటావమ్మా
పరుల చేతిలో కీలు బొమ్మవై
......
తిరిగి జూచుకో వెలుగు రేఖలను
జాతి జాతి స్వాతంత్ర రేఖలను
త్రెంపి వేసుకో సాంప్రదాయములు
శత సహస్ర దాస్యంపు బంధములు
......

'వనిత'లో కవితలూ, కథలకన్నా వ్యాసాలు ఎక్కువగా ప్రచురింపబడ్డాయి. "స్త్రీలు - ఉద్యోగాలు" అనే వ్యాసంలో (15-5-1956, పు. 24-27) ఎస్. రాజ్యలక్ష్మి స్త్రీని ఇంటికి మాత్రమే పరిమితం చేసే అసహజమైన పితృస్వామ్య జండర్ విభజనని విమర్శించి స్త్రీలు ఉద్యోగాల్లో ప్రవేశించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. స్త్రీలు మార్దనం కలవారు కనుక వారు విద్యా, వైద్య, శాంతి స్థాపనారంగాల్లో చక్కగా రాణించగలరని వివరించారు. "ఈనాటి మానవ సంఘంలో వచ్చిన మార్పులననుసరించి మన సాంఘిక జీవనం కూడా స్త్రీ దృష్ట్యా పునర్వ్యవస్థీకరించబడాలి" అని ఘోషించారు. "విద్యావంతులైన స్త్రీలు గొప్ప ఉద్యోగుల భార్యలై కేవలం వారి ప్రతిబింబాలుగాను మర్యాద చిహ్నాలు గాను మారి స్వంత బాధ్యతలను మారుస్తున్నా"రనీ, "ఆత్మగౌరవమున్న ప్రతి స్త్రీ స్వీయక్షేత్రంలో స్వయం ప్రకాశమానురాలు కాగోరుతుంద"నీ, "అటువంటి పవిత్ర లక్ష్యాన్ని ధన వ్యామోహమని దూషించేవారు సంఘంలో స్త్రీ బాధ్యతను గుర్తించలేని" గుడ్డివారుగా భావించాలనీ స్పష్టపరిచారు.

ఎస్. రాజ్యలక్ష్మి రాసిన "ఉపాధ్యాయ వృత్తిలో స్త్రీ" అనే వ్యాసంలో (15-4-1956, పు. 9-13) "స్త్రీలో సహజంగా ఉండే మాతృప్రేమ, ఓర్పు, మానవత్వం మొదలైన విద్యాబోధనకనుకూలమైన ఉత్తమ లక్షణా"లుండడం వల్ల ఆమె ఉపాధ్యాయ వృత్తికి బాగా సరిపోతుందని భావించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న స్త్రీలకు ఆయాదేశాలు (ఉదాహరణకు ఫ్రాన్సు, రష్యా, ఫిలిప్పైన్సు, యుగోస్లేవియా) కల్పించిన వివిధ సౌకర్యాలను గూర్చి - అంటే జీతభత్యాలు, Pre-natal allowance, maternity allowance మొదలైనవి - వివరించారు. హైదరాబాదు రాష్ట్రంలో కూడా ఉపాధ్యాయినులకు "కొన్ని మంచి సౌకర్యాలు" ఉన్నాయనీ, వేతనాల విషయంలో స్త్రీ-పురుష వివక్ష లేదనీ, "పురిటి సమయంలో రెండు మాసాల వరకు నిండు జీతం పైన శలవు దొరికే అవకాశం" ఉందనీ, అయితే స్త్రీల సంఖ్యకు "తగినన్ని స్థానాలు గాని అవకాశాలు గాని" లేవనీ తెలియజేస్తూ "అవి కూడ ముందుముందు లభించవచ్చును" అని ఆశించారు.

"స్త్రీలు-నర్సింగ్" అనే వ్యాసంలో (15-4-1956, పు. 21-26) డాక్టర్ కొండా శకుంతలాదేవి నర్సింగ్ వృత్తి ప్రాశస్త్యాన్ని వేనోళ్ళ కొనియాడి స్త్రీలు ఈ వృత్తిలో ప్రవేశించాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. "సంసార స్త్రీలు, అవివాహిత స్త్రీలు కూడా ఈ వృత్తిని స్వీకరించి (ఫ్లారెన్స్) నైటింగేల్ లాగానే అపార కీర్తిని సంపాదించుకోవచ్చు. కీర్తికన్నా కూడా సార్ధకతను, చిత్తశాంతిని కలిగించే ఈ సేవారంగంలో ఉన్న తృప్తి గమనించతగినది" అని స్త్రీలకు సూచించారు.

"వరకట్నాలు - మధ్యతరగతి కుటుంబాలు" వ్యాసంలో (15-7-1956, పు. 4-9) నందగిరి ఇందిరాదేవి నాడు పెచ్చరిల్లుతున్న వరకట్న సమస్యను దీర్ఘంగా చర్చించారు. ఈ వ్యాసం "కోడెకు ఎంత ధర వొచ్చింది అత్తయ్యా?" అనీ "నిజంగా నరుల కనిష్ఠ ధర మెట్రికులేటుకు రెండు వేలు, రేడియోలో చెప్పినట్టు గరిష్ఠ ధర మూడు వేలు. బజార్లో ప్రకటించడమే గానీ బి.ఏ., ఎం.ఏ.,ల రేట్లు రోజు రోజుకూ వేల జాబితాలలో పెరిగిపోతున్నాయి. ఇలా కట్నమేగాక ఆడబడుచుల లాంఛనాలు, అప్పగింతలు, వెండి చెంబులు, పట్టుబట్టలు మగపెళ్ళివారికి సమర్పించుకోవటంతోపాటు పెళ్ళి ఖర్చు కూడా వేలు దాటుతుంది - ఆడపిల్లల తండ్రులకు" అనీ మొదలౌతుంది. ముఖ్యంగా ఎక్కువమంది ఆడపిల్లలున్న మధ్యతరగతివారిని వరకట్న దురాచారం ఎంత తీవ్రంగా పీల్చి పిప్పి చేసేదో ఈ వ్యాసం కళ్ళకు కట్టినట్లు వివరించింది. "మధ్యతరగతి కుటుంబాలవాళ్ళు ఈ దోపిడి భరించటం కష్టమయిపోతున్నది" అంది. "కొన్ని సార్లు కొడుకుల భవిష్యత్తు కూడా గమనించక నలుగురు ఆడపిల్లలున్న తండ్రి నాలుగేసి వేలు గుమ్మరించి దివాలా తీసిన

సంఘటనలు ఎన్నో ఉన్నాయి. తమకు చదువులు, సంగీతాలు చెప్పించిన ఖర్చుతోబాటు కట్నాలు కూడా ఇవ్వవలసి వచ్చిన తండ్రి కష్టాలను భరించలేక ఎంతోమంది ఆడపిల్లలు ఆత్మహత్యలకు గురికావటం కూడా కొత్తకాదు" అని విశ్లేషించింది. యువకులు యువతిని కాకుండా "డబ్బునే పెళ్ళాడటం నిజంగా శోచనీయం" అనీ, ఇస్తానన్న కట్నంలో ఏ కొంచెం తక్కువైనా పెళ్ళిపీటల మీద నుంచి లేచిపోతున్నారనీ, లాంఛనాలు సరిగా జరపకపోతే యేడాది తిరిగేలోపే యింకో పెళ్ళికి సిద్ధమౌతున్నారనీ వాపోయింది. వరకట్న సమస్య సమసిపోవాలంటే కేవలం శాసనం ద్వారా దాన్ని నిషేధించడమో లేక సంఘసేవ చేసేవాళ్ళు దాన్ని ఆపుచేయాలని అనడమో కాదనీ, నిజంగా దాన్ని ఎదుర్కోవాలంటే మొదట స్త్రీకి ఉన్నత విద్య చెప్పించడంతోపాటు తనకు నచ్చిన వరుని ఎన్నుకొనే స్వేచ్ఛనివ్వాలని నొక్కి చెప్పింది. వరనిర్ణయ స్వేచ్ఛ వల్ల అవినీతి ప్రబలి పోతుందనిగానీ "Wrong Selection" జరుగుతుందని గానీ భావించడం కేవలం "అనుభవంలేని భయాలు" మాత్రమే అని తేల్చి చెప్పింది. వరకట్న సమస్యను ఎదుర్కొనడానికి "ధైర్యసాహసాల"తో ముందుకు వెళ్ళాలనీ "భయపడుతూ ఒడ్డున కూర్చుంటే ఈత ఎన్నటికీ రాదు. దూకాలి మరి!" అనీ వెన్నుతట్టింది.

"సమాన ప్రాతినిధ్యం" అనే వ్యాసంలో (15-8-1956, పు. 52-54) ఎస్. రాజ్యలక్ష్మి స్త్రీ దృక్పథాన్ని బలంగా ప్రతిపాదించారు. 15 ఆగస్టు 1947న వచ్చింది కేవలం రాజకీయ స్వాతంత్ర్యమేననీ, ఓటు వేయడానికి మినహా ఈ స్వాతంత్ర్యం అర్థం లేనిదనీ "ఇక స్త్రీల స్థితి చూస్తే స్వాతంత్ర్యం యొక్క అర్థం సన్నగిలిపోతుంది" అనీ "ఏ విషయంలో చూచినా వీరి పురోభివృద్ధికి ఎన్నో ఆటంకాలు కనబడతాయి" అనీ చెప్పారు. పార్లమెంటులో హిందూ స్త్రీల వారసత్వపు హక్కుకు సంబంధించిన చర్చ "సానుభూతి" దృక్పథంతో జరిగిందనీ, అదే "పార్లమెంటు సభ్యులంతా స్త్రీలే అయితే.... సానుభూతి కోసం యాచించకుండా ఒక సహజమైన హక్కు కోసం వారు చర్చించి ఉందురని నిస్సందేహంగా భావించవచ్చు" అని స్పష్టం చేశారు. దీనిని బట్టి పార్లమెంటులో చేసే నిర్ణయాలు కేవలం స్త్రీలే చేస్తే స్త్రీలకు సంబంధించిన విషయాల్లోనే కాకుండా మిగిలిన విషయాల్లో కూడా అవి పురుష దృక్పథానికి తప్పకుండా భిన్నంగా ఉంటాయని వాదించారు. ఉదాహరణకు **"అంతర్జాతీయ సమావేశాలన్నిటిలోనూ యుద్ధ విషయాలు కేవలం స్త్రీలే నిర్ణయించినట్లయితే శాంతి అవకాశాలు సహస్ర విధాల ఎక్కువవుతాయని నమ్మవచ్చును"** అని ప్రగాఢంగా విశ్వసించారు. అందుకే దేశ జనాభాలో స్త్రీలెంతమంది ఉన్నారో అదే నిష్పత్తిలో శాసనసభల్లో వారి ప్రాతినిధ్యం ఉండాలని వాంఛించారు. కానీ "రాజకీయాధికారాలు మరిగిన పురుషులు" 'స్త్రీలు వెనుకబడి ఉన్నారు', వారికి 'ప్రాపంచికానుభవం తక్కువ' మొదలైన ఆక్షేపనలు చేసి స్త్రీలకు సమాన ప్రాతినిధ్యం యివ్వనిరాకరిస్తారనీ, కానీ యిలాంటి వాదనల్లో "నైతిక బలం" లేదనీ, ఆంగ్ల వలసవాదులు కూడా స్వాతంత్ర్యానికి పూర్వం యిలాంటి నీతిరాహిత్య వాదనలతోనే భారతీయులకు స్వాతంత్ర్యం నిరాకరింపజూశారనీ తెలియజేశారు. అందుకే "శాసనసభలో కనీసం సగం స్థానాలు స్త్రీలకు ప్రత్యేకింపబడడం స్త్రీ జాతికి కనీసం న్యాయం చేయడం అన్నమాట" అని ఘంటాపథంగా చెప్పారు. కానీ ఈనాటికీ ఆమె ఆకాంక్ష నెరవేరకపోవడం పెను విషాదం.

అడవికొలను రుక్మిణి వ్యాసం "ఎందుకు? ఎవరికోసం" (నవంబరు 1956, పు. 37) పొద్దున నిద్రలేచినప్పటి నుండీ రాత్రి నిద్రపోయేదాకా విశ్రాంతి అనేది లేకుండా ఇంట్లో స్త్రీలు చేసే బండ చాకిరీ మీద చేసిన తీవ్రమైన విమర్శ. ఏదనా చదువుకోవడానికైనా తీరిక దొరకని జీవితంతో సతమతమయ్యే బి.ఏ. చదువుకొన్న గృహిణి "నిజమే, తనకి సుఖం, ఎదుటి మనిషికి ప్రయోజనం లేని తన డిగ్రీ యెవరికోసం? ఎందుకు?" అని నిస్పృహ చెందుతుంది. నవంబరు 1956 సంచికలో "మహోజ్వల మహిళ అనీబిసెంట్" అనే వ్యాసం (పు. 16-17) ప్రచురితమైంది. ఇందులో అనీబిసెంట్ సాధించిన విజయాల్నీ, ఆమె కృషినీ వివరించారు. జ్ఞానకుమారి హెడా వ్యాసం "కాంగ్రెసు పార్టీలో మహిళలు" (నవంబరు 1956, పు. 30-32) కాంగ్రెస్ సంస్థను పునరుద్ధరించడంలో స్త్రీలు పోషించాల్సిన పాత్రను వివరించింది. 15-5-1956 నాటి సంచికలో గౌతమబుద్ధుడి మీద ఒక వ్యాసం, బౌద్ధ మహిళల మీద యింకో వ్యాసం ప్రచురించబడ్డాయి. అదే సంచికలో మద్రి సావిత్రీదేవి 'బమ్మెర పోతన'పై ఒక వ్యాసం రాసింది. 15-8-1956 నాటి సంచికలో రాజేశ్వరి "వీరవనిత" శీర్షికతో ఝాన్సీ లక్ష్మీబాయిపై వ్యాసం ప్రచురించింది.

'వనిత'లో చాలా కథలు ప్రచురించబడ్డాయి.

అబ్బూరి ఛాయాదేవి "గోదావరి" అనే పెద్ద కథను రాశారు. ఈ కథ జులై - డిసెంబరు 1956 మధ్య ధారావాహికగా వెలువడింది. సత్యవతి అనే అనాథ స్త్రీ బాధాతప్త జీవితం యిందులో వర్ణించబడింది. సత్యవతికి గ్రుడ్డివాడైన తమ్ముడుంటాడు. అతన్ని కని తల్లి చనిపోతుంది. పెళ్ళయ్యాక సత్యవతికి ఒక కొడుకు, ఒక కూతురు కలుగుతారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేసుకోబోయిన భర్త చనిపోగా సత్యవతి అనాథ అవుతుంది. భర్త తరపు బంధువులెవరూ ఆమెను ఆదుకోవడానికి ముందుకు రారు. గత్యంతరం లేక తన పిల్లల్ని ఒక అనాథశరణాలయంలో చేర్పిస్తే అక్కడి బావిలో పడి కొడుకు మరణిస్తాడు; అది చూసిన కూతురికి విపరీతమైన జ్వరం వస్తుంది. కొడుకు మరణవార్త సత్యవతికి ఆలస్యంగా తెలిసి కనీసం కూతుర్నైనా చూసి వెళ్దామని వస్తుంది. కానీ జ్వరం కారణంగా ఆమె ఒళ్ళోనే కూతురు చనిపోతుంది. తన దీనగాథని ఒక రైలు ప్రయాణంలో సత్యవతి కథకురాలితో చెప్పగా ఆమె జాలిపడి తనతో రమ్మని తన ఇంటికి ఆహ్వానిస్తుంది. చదువుకొని తర్వాత ఏదైన ఉద్యోగం చేసుకోవచ్చుంటుంది.

కథలో భాగంగా కథకురాలు స్త్రీలకు సంబంధించిన అనేక విషయాలను చర్చించారు. బి.ఏ. పాసైన కథకురాలు ఉద్యోగం చెయ్యకుండా ఇంట్లోనే ఎందుకుందని ప్రశ్నించిన సత్యవతితో "అబ్బే, ఆయనకిష్టం లేక కాదు. ఆ మాటకొస్తే అసలు వివాహానంతరం నేను ఉద్యోగంలో చేరడానికి అభ్యంతరం చెప్పరన్న వాగ్దానం తీసుకున్నమీదటే వివాహానికి సమ్మతించాను. ఆ రోజుల్లో నా అభిప్రాయాలే వేరు! భర్త భార్యను లోకువగా చూడటానికీ, ఆమె పైన అధికారం చెలాయించడానికీ, ఆమె అశక్తతకూ మూలకారణం ఆర్థికంగా ఆమె పరాధీన కావటమేనను కునేదాన్ని. అంచేత ఆడది కూడా విద్యాభ్యాసం చేసి ఉద్యోగంలో చేరి ధనాన్ని ఆర్జించినట్లయితే ఆమె ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోగలుగుతుంది.

భార్యాభర్తలు తరతమ భేదాలు లేకుండా సమాన స్థాయిలో ఉండగలుగుతారు అనుకునేదాన్ని. ....అసలు వివాహమే చేసుకోకూడదు అనుకునేదాన్ని కొన్నాళ్ళు" అని కాలేజీలో చదువుకొనే రోజుల్లో తనకుండిన అభిప్రాయాలను తెలియబరిచింది. కథలో భార్యల్ని అనుమానించే భర్తల్ని తీవ్ర స్వరంతో నిరసించిన కథకురాలు అలాంటి మగాళ్ళ నోట్లో గడ్డి పెట్టాలన్నారు. ఈ విధంగా కథాంతర్భాగంగా సమాజంలో స్త్రీలెదుర్కొంటూండిన అనేక సమస్యల్ని చర్చకు పెట్టారు అబ్బూరి ఛాయాదేవి. స్టీఫాన్ జ్విగ్ కథ ఆధారంగా అబ్బూరి ఛాయాదేవి "అశ్విని" అనే కథను కూడా రాశారు. అది ఏప్రిల్-జూన్ 1956 మధ్య ధారావాహికగా వెలువడింది.

రెండు సంచికల్లో ప్రచురితమైన రుక్మిణీ గోపాల్ కథ "ఆదర్శమా, అభ్యుదయమా?" (15-8-1956, పు. 6-14 మరియు 15-9-1956, పు. 5-14) బ్రాహ్మణ పురుషుడికీ, వంచితురాలైన దళిత స్త్రీకీ పెళ్ళి జరగడానికి సంబంధించిన కథ. బి.ఏ. రెండవ సంవత్సరం చదువుతున్న కథానాయకుడు సుందరం ఆదర్శభావాలు కలిగి ఉండి ఎల్లప్పుడూ ఏదో గొప్ప పని చేయాలని అశాంతితో ఉంటాడు. చదువు వంటబట్టని అతని అన్న వెంకట్రావు ఇంట్లోనే ఉండి పొలం పనులు చూసుకుంటుంటాడు. వారిది బాగా కలిగిన కుటుంబం. తండ్రికి పేరాశ. పెద్ద మొత్తంలో కట్నం ఆశించి ఎన్ని సంబంధాలొచ్చినా పెద్ద కొడుకు పెళ్ళి దాటవేస్తుంటాడు. "డబ్బుతో పాటు చదువు కూడా ఉన్నందుకు" చిన్న కొడుకైన సుందరాన్ని "పెద్ద ధరకు" అమ్మాలని ఉంటాడు.

వెంకట్రావు తమ పొలంలో పనిచేసే దళితుడైన నూకాలు కూతురైన లక్ష్మిని మోసగించి గర్భవతిని చేస్తాడు. ఈ విషయం తెలుసుకున్న అతని తమ్ముడు సుందరం అన్నతో లక్ష్మిని పెళ్ళి చేసుకొని చేసిన తప్పుకు పాయశ్చితం చేసుకోమంటాడు. "స్వచ్ఛమైన బ్రాహ్మణ వంశంలో పుట్టి మాలపిల్లని చేసుకోమంటావా? నాన్నకీవిషయం తెలిస్తే ఇంకేమన్నా ఉందా?" అన్న వెంకట్రావు తండ్రి చూసిన యింకో సంబంధాన్ని చేసుకోవడానికి సిద్ధమౌతాడు. ఈ విషయం తెలిసిన లక్ష్మి మ్రాన్పడి పోతుంది. "సెడిపోయినదాన్ని, పెళ్ళి కాకుండా కడుపు తెచ్చుకున్నాను. నన్నెవరు సేసుకుందుకు ఇష్టపడతారు. నన్నెవరుద్ధరిస్తారు?" అని సుందరం ముందు వాపోతుంది. లక్ష్మి. ఆమె దయనీయమైన పరిస్థితిని గమనించిన సుందరం తనే ఆమెను పెళ్ళి చేసుకోవడానికి సిద్ధపడి తన వల్లనే లక్ష్మి గర్భవతి అయిందనీ తను లక్ష్మిని పెండ్లాడతాననీ ఇంట్లో చెబుతాడు. ఇది విన్న అతని తండ్రి రామయ్య "ఇన్ని వేలు ఖర్చు చేసి చదువు చెప్పించినందుకిదా ఫలితం. గొప్ప ఉద్యోగం దొరుకుతుందని, పేరు ప్రతిష్టలు తెస్తానని నేను చదువు చెప్పిస్తే చివరకు నువ్వు చదివింది ఈ మాల చదువా?" అని రంకెలేస్తాడు. సుందరం మేనమామ సోమనాథం "ఒక మాలపిల్ల కోసం కులం పోగొట్టుకుంటావా?" అని ప్రశ్నిస్తాడు. ఇంటిల్లిపాదీ లక్ష్మిని పలు రకాలుగా దూషిస్తుంటే భరించలేకపోయిన సుందరం "ఒక స్త్రీకి అన్యాయం చేసి వదిలెయ్య మంటారా? ధర్మశాస్త్రాలు ఇలాగే చెబుతున్నాయా?" అని ఎదురు ప్రశ్న వేస్తారు. ఎంత చెప్పినా సుందరం వినకపోయేసరికి చిర్రెత్తుకొచ్చిన తండ్రి ఇంట్లోంచి వెళ్ళిపొమ్మంటాడు; ఆస్తిలో చిల్లిగవ్వ కూడా దక్కదని బెదిరిస్తాడు. అయినా ఖాతరు చెయ్యని సుందరం తన ఆదర్శం కోసం, అభ్యుదయం కోసం ముందడుగు వేసి ఇంట్లోంచి బయటకు వస్తాడు.

"పట్టుదల" భార్యల ఆకాంక్షల్ని భర్తలు ఎలా త్రుంచివేస్తారో తెలిపే కథ. (డిసెంబరు 1956, పు.16-17 & 20). రచయిత్రి శిరుగూరి రత్నమ్మ. ఇందులో రామారావు, రాధలు భార్యాభర్తలు. స్కూలు ఫైనలు పాసైన రాధ పెండ్లి అయిన తర్వాత డిగ్రీ సాధించాలని భావించినా కనీసం ఎఫ్.ఏ. చదువుకొనేందుకు కూడా భర్త అంగీకరించడు. ఆమె "వూరిలో ఉన్న సంస్థలన్నిటిలోనూ మెంబరవాలనీ వీలయితే సెక్రటరీ దాకా కావాలనీ అనుకుంటూండేది. భర్తకు ఇవేమీ ఇష్టంలేదు. స్త్రీ పురుషునికి ఆనందాన్నిచ్చే యంత్ర సాధనమని అతని ఉద్దేశము. తాను పంజరములో చిలకలాగు బంధింపబడ్డానే అని రాధ అస్తమానం అసంతృప్తితో బాధపడుతోండేది." ఒకరోజు వీధి చివరనున్న హైమావతమ్మగారు కొత్తగా మహిళాసమాజం యేర్పాటు చేశామని తెలియజేసి అక్కడికి రమ్మని రాధను ఆహ్వానిస్తుంది, రాధ వస్తానంటుంది. మహిళా సమాజంలో మెంబరుగా చేరుతానని రాధ భర్తని అడిగితే అతను వద్దంటాడు. హైమావతమ్మతో వస్తానని చెప్పాను; కనీసం ఈ ఒక్కరోజైనా మహిళా సమాజానికి వెళ్ళిరావడానికి అనుమతి యివ్వమని అడిగిన భార్యతో "అదేం వల్ల కాదు. ఆడది తిరిగి చెడింది, మగవాడు తిరక్క చెడ్డాడు అంటారు పెద్దలు.... హాయిగా నీ యింట్లో నీ యిష్టమొచ్చినట్లుండు. నిన్నెవరూ అనేవారు లేరు. ఇల్లు దాటి వెళ్ళడానికి ఎంత మాత్రం వల్లకాదు" అని కట్టడి చేస్తాడు భర్త.

ఉన్నవ విజయలక్ష్మి కథ "వక్రరేఖ" సెప్టెంబరు 1956 సంచికలో ప్రచురితమైంది (పు. 24-33). పదేళ్ళ వయసులో తల్లిని పోగొట్టుకున్న శాంతమ్మను ముగ్గురు తమ్ముళ్ళతో కలిపి చాలా గారాబంగా పెంచుతాడు తండ్రి. పద్దెనిమిది సంవత్సరాల వయసులో పెళ్ళైన శాంతమ్మకు త్వరలోనే భర్త చనిపోగా విధవగా మిగిలిపోతుంది. తమ్ముళ్ళ సహాయంతో చదువుకొని మెట్రిక్యులేషన్ పరీక్షా, సంగీతంలో హైయర్ గ్రేడ్ పరీక్షా పాసవుతుంది. పొరుగింటాయనతో పరిచయం కాస్తా అతి చనువుకు దారితీసి శాంతమ్మ గర్భవతి అవుతుంది. బాధ్యత నుండి తప్పించు కోవడానికి అతడు రెండు నెలలు సెలవుపెట్టి పుట్టింటికెళ్ళిన భార్య దగ్గరికి పోతాడు. కుంగిపోయిన శాంతమ్మ ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకొని మద్రాసు చేరి సముద్రంలో పడుతుంది. వంచితులైన స్త్రీల కోసం శరణాలయాన్ని నడిపే ఒక "నాన్నగారు" ఆమెను కాపాడతాడు. ఆ శరణాలయంలోనే ఆమె కొడుకుని కంటుంది. ఆ అబ్బాయిని మాకప్పగించి కావాలంటే మళ్ళీ పెళ్ళి చేసుకోమని సలహా యిస్తాడు "నాన్నగారు". కానీ శాంతమ్మ పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకోకపోతే ఏదో ఒక ఉద్యోగం యిప్పిస్తాడు. వంచితులైన స్త్రీలకు ఆత్మహత్యే శరణ్యం కాదనీ, స్త్రీలు చదువుకొని ఉంటే క్లిష్ట సమయాల్లో వారిని ఆదుకొంటుందనీ చాలా బలంగా చెప్పారు రచయిత్రి.

యం. జానకీరాణి కథ "శోభించని క్షమాబుద్ధి" (నవంబరు 1956 పు.49-53)లో నారాయణరావు, సుభద్రలు భార్యాభర్తలు. ఒకనాడు సుభద్రకు విపరీతమైన జ్వరం వచ్చి నిద్రలో చంద్రం అనే అతన్ని గూర్చి కలవరిస్తుంది. పెళ్ళి కాకముందు ఆమెకు అతనితో సన్నిహిత సంబంధం

ఉంటుంది. చంద్రం పేరును కలవరించగా విన్న ఆమె భర్త సహించ లేకపోయి చంద్రం ఎవరని అడుగుతాడు. ఆమె వివరాలన్నీ చెబుతుంది. ఇది విన్న భర్త ఎలా స్పందిస్తాడో అని తీవ్రంగా భయపడ్తుంది. దీంతో ఆమె జ్వరం మరింత పెరుగుతుంది. కానీ అతడు "క్షమించాను" అంటాడు. దీంతో ఆమె షాక్‌కు గురౌతుంది. జ్వరం మరింత ఎక్కువై చనిపోతుంది.

నాయని కృష్ణకుమారి నాటిక "చెఱగని గుర్తులు" (ఏప్రిల్ 1956, పు.14–20) భార్యని ప్రశంసించకుండా "అడుగడుక్కీ సూదుల్లాంటి మాటల్తో మనస్సు జల్లెడ" చేసే "పేచీకోరు" అయిన భర్తకూ, "భర్త దగ్గర నుండి మన్ననలు మూటగట్టుకుందామని" భావించే భార్యకూ సంబంధించింది. శ్రీధర్, లక్ష్మి భార్యాభర్తలు. శ్రీధర్ తిండి దగ్గర బాగా పేచీ పెట్టేరకం. కంచం దగ్గరినుండీ చేసిన వంట వరకూ ప్రతి దానికీ వంక పెట్టేవాడు. భర్తకు బాగా యిష్టం అని చెప్పి వంకాయ కూర, పప్పుచారు ఎంతో యిష్టంగా చేస్తుంది భార్య. కానీ అతడు పెదవి విరుస్తాడు. దీంతో నిరాశ చెందిన భార్య "నువ్వొక్కడివి తప్ప ఈ ప్రపంచంలో అందరూ నన్ను మెచ్చుకొనేవాళ్ళే, చివరకు నా బ్రతుకు నీకు కాకుండా పోయింది" అని వాపోతుంది. తన తప్పు గ్రహించిన శ్రీధర్ "కాదు, నేనే నిన్ను హింసిస్తున్నాను. నా అలవాట్లు నీకు మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి.... నేనేం చేసినా నన్ను క్షమించు'' అంటాడు. దీంతో భార్య అతన్ని గుండెలకు హత్తుకుంటుంది.

ఎం. జానకీరాణి కథ "మనుష్యులు మంచివాళ్ళే – కానీ...." (డిసెంబరు 1956, పు. 37–39)లో కథకురాలు స్కూలు టీచరు. తన ఇంట్లో పనిచేసే కుర్రాడు రాముడు కూరగాయలు కొనడంలో అణా, బేడా దొంగలిస్తున్నాడేమో అని అనుమానిస్తుంటుంది. అయినా మనుష్యులంతా మంచివాళ్ళేననే సిద్ధాంతానికి చెందిన ఆమె పరిస్థితుల ప్రభావాన్ని బట్టి మనుషులు తప్పుచేసినా క్షమించడం మానవధర్మం అని నమ్ముతుంది. ఒకరోజు స్కూల్‌లో జరిగే ఫంక్షన్‌కు వెళ్తూ మెళ్ళోని బంగారు గొలుసు తీసి కర్చీఫ్‌లో చుట్టి టేబుల్‌పై పెట్టి వేరే నగ మెళ్ళో వేసుకుని స్కూలుకి వెళ్తుంది. తిరిగి వచ్చాక చూసుకుంటే టేబుల్‌పై పెట్టిన నగ కనిపించదు. ఇంటి నుండి బజారు వరకూ అంతటా వెతికినా ప్రయోజనం కనిపించదు. "స్కూలులో పడిపోయిందేమో.... ప్యూనులకి దొరికినా యివ్వరు. ఈ నౌకరు వెధవలు అణా బేడల కోసమే లోభిస్తారు, నాలుగు సవరల గొలుసు చేదా?" అనుకుంటుంది. మరుసటిరోజు రాముడు వచ్చి ఆ గొలుసు యిస్తాడు. బైట మెట్ల దగ్గర పడి ఉండిందని చెబుతాడు. అప్పుడు "నా చెవులని నేను విశ్వసించ లేకపోయాను. ఎఱ్ఱబారిన ఆ రాముడి కళ్ళు, శుష్కించిన ఆ వేళ్ళలోని నా 'సొమ్ము'! ఏమిటిదంతా? నా విజ్ఞానం, నా సంస్కారం, నేను అన్నీ వంచించుకొని, సూక్ష్మీకరించుకుని, శూన్యత్వంలోకి పోతున్నట్లు అనిపించింది నాకు." అయిదు రూపాయల నోటు యివ్వబోతుంది రాముడికి. వాడు అంత డబ్బు నాకు వద్దు. పండక్కి టపాకాయలు యిప్పించండి; నా తమ్ముళ్ళు, చెల్లెల్లు కాల్చుకుంటారు అంటారు. దీంతో "కూరలు, వెచ్చాలు, అణాలు కాజేయడాలు, నా అపోహలు అన్నీ గిర్రున నా ముందు తిరిగాయి."

"రెండు నాలుకలు" అనే "వాక్చిత్రం"లో (15–9–1956, పు.34–36) రచయిత్రి రాజేశ్వరి స్త్రీల ఆర్థిక పరాధీనతనూ, ఒక తరానికి చెందిన స్త్రీలకూ, ఇంకొక తరానికి చెందిన స్త్రీలకూ మధ్య అంతరాన్నీ, ఒక తరంలో స్త్రీలు కోరుకున్నవి (ఆర్థిక – స్వాతంత్ర్యం) మరొక తరంవారికి దొరికేటప్పటికి భరించలేకపోవడాన్ని చక్కటి వ్యంగ్యంతో తెలియజేసింది. కలెక్టరు భార్య అయినప్పటికీ "కరివేపాకు వీధిలోకి అమ్మొస్తే కొందాఁవంటే కానీ ఉండ"ని పరిస్థితిలో ఉన్న అత్తగారు "ఆడదాన్ని అర్థానికి ఆమడ దూరంలో ఉంచాలన్న సిద్ధాంతం ఏమిటి?" అనుకొంటుంది. తన చేత్తోకానీ కూడా భార్య చేతికివ్వని తన ఆడబిడ్డ భర్త గూర్చి తలచుకుంటుంది. అయినా ఆమె ఆడబిడ్డ గడుసుది కాబట్టి "ఆయన జేబులో డబ్బులు తీసుకొని వాడుకొంటుందిట." కానీ తాను అలా ఎప్పుడూ చేయలేదనీ "అసలాయన డబ్బు ఎక్కడ దాచుకుంటారో కూడా నాకింతవరకు తెలియదు" అని వాపోతుంది. అయినా ఆయనకు చెప్పకుండా ఖర్చుపెడితే ఊరుకోడనీ ఆరా తీసి చంపేస్తాడనీ తెలిపింది.

కానీ తన కొడుకు తరం వచ్చేసరికి అతడు జీతం మొత్తం తెచ్చి భార్యకిచ్చేసే రకం. తన ఖర్చుల కోసం కూడా భార్యనడుగుతాడు. అత్తగారిలా కాకుండా కోడలు తన భర్తను డబ్బులు "ఎందుకండీ" అని అడగగలదు. అంతేకాకుండా అతను ఎక్కడికైనా వెళ్తుంటే 'ఎక్కడికెళ్తున్నారు? ఎందుకెళ్తున్నారు?' అని కూడా ఆరా – తీయగలదు. ఇవన్నీ గమనిస్తున్న అత్తగారికి "ఆయనకీ, అబ్బాయికీ పోలికే లేదనీ, అబ్బాయి "పెళ్ళాన్ని అదుపులో పెట్టుకోవడం పోయి దాని ముందు (బొత్తిగా) పిల్లి అయిపోతున్నాడేఁవిటి?" అనిపిస్తుంది. అంటే తన కోడలు కూడా తనలాగే ఉండాలనీ, తన కొడుకు తన భర్తలాగా ఉండాలని భావిస్తుంది. కానీ ఒకప్పుడు తాను ఆర్థిక స్వాతంత్ర్యం కోసం వగచిన సందర్భాన్ని పూర్తిగా మరచిపోయి "రెండు నాలుకల్ని" కనబరుస్తుంది.

'వనిత'లో 'ఆరోగ్యవేదిక', 'వనితావనము', 'శిశువిహారం' మొదలైన కాలమ్స్ ఉండేవి. 'ఆరోగ్యవేదిక' కాలమ్ కింద "సౌందర్యపోషణ" శీర్షికన డాక్టర్ కొండా శకుంతలాదేవి స్త్రీ సౌందర్య పోషణలోనే కాకుండా ఆరోగ్యాభివృద్ధిలో శారీరక వ్యాయామం పోషించే బృహత్తర పాత్రను కూలంకషంగా వివరించారు. "మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకొనలేకపోవడం అంటే మన మృత్యువును మనం కోరి పిలుచుకోవడమే" అని తెలియజేసిన శకుంతలాదేవి భారతదేశ స్త్రీల సగటు జీవన ప్రమాణం తక్కువగా ఉండడానికీ (పాతిక సంవత్సరాలు) పాశ్చాత్య స్త్రీల జీవన ప్రమాణం ఎక్కువగా ఉండడానికీ వివిధ రకాల వ్యాయామాలు చేయడానికి పాశ్చాత్య స్త్రీలకుండే స్వేచ్ఛే కారణమని చెప్పారు. "మనదేశంలో (మాత్రం) స్త్రీలు బాల్యవివాహమనే రాక్షసికి బలియై (చాలా తొందరగా) సంసారమనే అంధకారంలో పడి, స్వేచ్ఛా రహితులయి, చీకటి జైళ్ళకంటే అన్యాయమైన వంటశాలల్లో మ్రగ్గడమే యింత శీఘ్రంగా మృత్యువుకి గురికావడానికి కారణం" అని విశ్లేషించారు. గర్భిణీ స్త్రీలు యింటినుండి బయటికి కదలకూడదనడం వట్టి "అపోహ" మాత్రమే అని తెలియజేశారు. వారు "సామాన్యంగా యింట్లో చేసుకొనే పనులు చేస్తూనే వుండాలి" అని సలహా యిచ్చారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనీ "సౌందర్య పోషణకు ఆరోగ్యం అవసరం" అనీ "ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం అత్యవసరం" అనీ ఘంటా పథంగా చెప్పారు. "డాక్టరుగారితో" శీర్షికన సంభాషణ రూపంలో రాసిన

ఆర్టికల్‌లో (15-6-1956, పు.43-48) గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారు కట్టుకునే బట్టలు, తినే ఆహారం, వ్యాయామం, మూత్రం, విరేచనం, విశ్రాంతి, రక్తం, స్తనాలు, ఇతర జబ్బులు, మానసిక ఆరోగ్యం, సంభోగం, ప్రయాణం, గాది మొదలైన భాగాల్లో గర్భిణీ స్త్రీలు పాటించాల్సిన నియమాలను సులభ గ్రాహ్యంగా తెలియజేశారు. 15-8-1956 నాటి సంచికలో "ఆహారం తీసుకోవడం ఎందుకు" అనే వ్యాసం రాశారు (పు. 15-20).

'వనితావనము' కాలమ్ క్రింద లక్ష్మీ భాగ్యనగర్ తోటపని గూర్చి (15-4-1956, పు.48-51), జాజిపువ్వుల్లోని రకాలను గూర్చి (15-5-1956, పు. 51-53) తెలియజేశారు. 'శిశు విహారం' కాలమ్ క్రింద ప్రచురితమైన "పిల్లలు - చదువులు" అనే సంక్షిప్త వ్యాసంలో (15-6-1956) ఛాయ (బహుశా అబ్బూరి ఛాయాదేవి) పిల్లలకు విద్య నేర్పించాల్సిన పద్ధతిని వివరించారు. "విద్యావిధానం పిల్లలకు శిక్షణనివ్వాలేగాని శిక్ష కాకూడదు" అని చెప్పిన ఛాయ విద్య పిల్లల్లోని సృజనాత్మకశక్తిని వెలికితీసే విధంగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేశారు. "పిల్లలు - పత్రికలు" అనే చిరువ్యాసంలో (15-6-1956) అబ్బూరి ఛాయా జానకి బాలల పత్రికల ఆవశ్యకతను నొక్కి చెప్పారు. "బాలల చేతనే కథలూ వ్యాసాలూ పద్యాలూ వ్రాయించినట్లయితే వారికి ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. మహాకవులనబడేవారు పెద్దల మెప్పు కోసం రాయకుండా, భావిభారత పౌరులు అయిన బాలలను దృష్టిలో ఉంచుకొని రాయాలి. బాలల భావాలు సంకుచితం కాకుండా విశాలంగా ఉండేటట్లు బాలలను దృష్టిలో పెట్టుకొనేవారి రచనలు సాగించాలి. ఇందుకు పత్రికలు, ప్రభుత్వము, సంఘమూ కూడా ప్రోత్సహించాలి" అని కోరారు.

వలస పాలనా కాలంలో తెలుగు మహిళలు ప్రారంభించిన అక్షరోద్యమాన్ని స్వాతంత్ర్యానంతరం కొనసాగించడానికి 'వనిత' ప్రయత్నించింది. ఈ పత్రిక ఒక సంవత్సరం కూడా ప్రచురించ బడకపోవడం విషాదకరం. ✷

# ప్రజాకళాకారుడు కామ్రేడ్ ఆదూరి సంతోష్‌కు జోహార్లు

**పైలం** సంతోష్‌గా పేరుబడ్డ కామ్రేడ్ ఆదూరి సంతోష్ 21-11-2020న తన 55వ యేట మరణించారు.

వలసల మీద, కరువు మీద కోడూరి శ్రీను రాసిన పాట "వుందు పైలం గుండు అమ్మ మాయమ్మ / బొంబాయి పోతున్న తల్లి మాయమ్మ.."ను సొంతం చేసుకుని భావోద్వేగంతో పాడిన సంతోష్ తన ఇంటిపేరును పైలంగా మార్చుకున్నారు.

సూర్యాపేట దగ్గర సాయుధ రైతాంగ పోరాట వారసత్వం వున్న వెల్దెండ గ్రామానికి చెందిన బ్రహ్మయ్య (సంతోష్ CPIML జనశక్తి పార్టీలో పేరు) అరుణోదయ సంస్థకు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. సొంతంగా తను రాసిన పాటలను "పైలం పాటల ఊట" పేరుతో ప్రచురించారు.

నకిరేకల్లు దగ్గర అమరుడు జానం రామరెడ్డి గ్రామంలో జరిగిన కళారూపాల శిక్షణా శిబిరంలోనూ, సూర్యాపేట దగ్గర నామవరం గ్రామంలో జరిగిన సాంస్కృతిక అధ్యయన తరగతులలోనూ, కోదాడలో 1993లో జరిగిన ప్రజా సాంస్కృతిక ఉద్యమ సదస్సులోనూ, సారా వ్యతిరేక ఉద్యమంలో, ఇంకా అనేక జిల్లాలలో జరిగిన కార్యక్రమాల్లో సంతోష్ అవిశ్రాంతంగా కృషి చేశాడు.

పార్టీపై నిర్బంధ కాలంలో కేసులు, దాడులలో చిత్రహింసలను భరించాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంగా 'తెలంగాణ సాంస్కృతిక వేదిక' వ్యవస్థాపక అధ్యక్షునిగా వుండి అనేక ప్రదర్శనలిచ్చారు. అంతకు ముందు దివికుమార్ అధ్యక్షుడిగా, రామారావు ప్రధానకార్యదర్శిగా, ఉదయ్ కార్యదర్శిగా వున్న అరుణోదయ సాంస్కృతిక సంస్థలో సంతోష్ కూడా శీలంస్వామి, విమలక్క, పటాన్‌చెరువు రాములు, గోరటి వెంకన్నలతోపాటు రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా వుండేవారు. కామ్రేడ్ సంతోష్‌కు జనసాహితి విప్లవ జోహార్లు పలుకుతోంది. ✷

# పి.జీవరత్నం (చిన్ని) 5వ వర్ధంతి



జననం : 28-12-1982

మరణం : 14-11-2015

**14** నవంబరు 2015న తన 35వ ఏటనే, డెంగ్యూ జ్వరంతో అకాల మరణం చెందిన పి.జీవరత్నం పసిపిల్లల ప్రేమికుడు. ఎక్కువ సమయం పిల్లలతో గడిపేవారు. అనేక సాంఘిక కార్యక్రమాలతో స్వచ్ఛందంగా సేవలందించేవారు. బాలసదన్లకూ, పాఠశాలలకూ ఆర్థిక సహకారం అందచేసేవారు.

బిసిఏ, ఎం.ఎస్.సి. కోర్సులు చదివిన జీవరత్నం శ్రీకాకుళంజిల్లా వసుంధర గ్రామానికి చెందినవారు. పూణే ప్రాంతంలో జన్‌సార్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా చేశారు.

ఆయన జ్ఞాపకార్థం ఆయన తల్లి లక్ష్మి, తండ్రి దండాసి, భార్య సౌమ్య, కుమారుడు దైవిక్, అన్న మోహనరావు, వదిన వాణి, పెద్దక్క బి.ఉషారాణి, చిన్నక్క ఆర్.జయలక్ష్మిగార్లు ప్రజాసాహితి శాశ్వతనిధికి జీవరత్నం రెండవ వర్ధంతినాడు 25 వేల రూపాయలు అందచేశారు.

జీవరత్నం మరణానికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ✷

# ముప్పై ఏళ్ళక్రితం ప్రజాసాహితి

**(1990 నవంబర్ - సంచిక 4, సంపుటి 14, 1990 డిశంబర్ - సంచిక 5, సంపుటి 14, 1991 జనవరి - ఫిబ్రవరి - సంచిక 6, 7 - సంపుటి 14)**

**1990** నవంబర్ సంచిక మతోన్మాదానికి నిరసనగా గీసిన చిత్రంతో పెరిగిపోతున్న విదేశీ దోపిడీకి వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద అనుకూల పాలకుల విధానాలకు వ్యతిరేకంగా 'వ్యవస్థ రద్దుకై ఉద్యమించాలి' అన్న సంపాదకీయంతో వెలువడింది. 1990లో నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత, మనదేశంలో మెక్సికో రాయబారిగా పనిచేసిన మెక్సికో కవి ఆక్టేవియో పాజ్ రాసిన 'పాత ఢిల్లీ! కంపు ఢిల్లీ!' కవితను కొత్తపల్లి రవిబాబు అనువదించారు. కవితాఝరి శీర్షికలో కాట్రగడ్డ దయానంద్ రాసిన 'ఋతుగానం', ఛాయరాజ్ రాసిన '2=1', పి. తిరుపాలు రాసిన 'వసంతం వడిలో వదిగిపోతా', 'భూమి' రాసిన 'అనుభూతులు రాల్చిన చెట్టు - శవంలేని చితి', బి. రామానాయుడు రాసిన 'అంతరంగం', ఇస్మా రాసిన 'పొడుపుకథ'లను ప్రచురించారు. మండల కమీషన్ సిఫారసుల నేపథ్యంలో సాగిన రిజర్వేషన్ల వ్యతిరేక, సానుకూల ఆందోళనలను, పాలకుల ప్రజా విభజన విధానాలను తెలియచేస్తూ జనసాహితి మచిలీపట్నంశాఖ రూపొందించిన 'ప్రతిభా.... ఓ.. ప్రతిభా' - వీధి నాటకాన్ని ప్రచురించారు. 'ఆంక్షలు - నిషేధాలు' శీర్షికలో యార్లగడ్డ రాఘవేంద్రరావు రాసిన 'ఈనాటిది కాదీ అణచివేత - ఆంక్షల చరిత్ర' వ్యాసాన్ని, 'కరపత్రాలూ కదిలేచరిత్ర' శీర్షికలో అమరుడు శ్రీ దర్శి చెంచయ్య శతజయంతి సందర్భంగా నివాళులర్పిస్తూ ఆయన కృషికి శాశ్వత చిహ్నంగా భావితరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా కార్యక్రమాలని చేపట్టమని దర్శి చెంచయ్య శతజయంతి కమిటీ విడుదల చేసిన కరపత్రాన్ని ప్రచురించారు. 'వాడని మందారాలు 8' శీర్షికలో 'రోజులు మారాయి' సినిమాలోని 'ఒలియో-ఒలియో' పాటను ప్రచురించారు. వివేచన శీర్షికలో రాల్ఫ్ ఫాక్స్ రాసిన 'నవల - ప్రజలు'ను కొత్తపల్లి రవిబాబు అనువదించిన ధారావాహిక కొనసాగింది. గోవర్ధన్ రాసిన 'బి.జె.పి. బందిఖానాలో రాముడు' కథనూ, స్వీకరించిన పుస్తకాల వివరాలు, చైతన్యవాహిని, విప్లవ ప్రభంజనం ధాటికి నిలువలేక, కుప్పకూలుతున్న పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద వ్యవస్థలను చిత్రించిన రేఖాచిత్రం వెనుక అట్టపై ముద్రించారు.

1990 డిశెంబర్ సంచిక దర్శి చెంచయ్య ముఖచిత్రంతో గదర్ పార్టీ ప్రకటనతో వెలువడింది. మతం మత్తు జాతీయ విపత్తు - మసీదులు, దేవాలయాలకన్నా మానవ ప్రాణం మిన్న, సామాజిక సమస్యలకూ, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడండి!, మత సామరస్యాన్ని కాపాడండి!!, 'డిసెంబరు 23ను మతతత్త్వ వ్యతిరేకదినంగా పాటించండి!' అని పిలుపునిస్తూ సంపాదకీయాన్ని రాశారు. 'ఆంక్షలూ - నిషేధాలు' శీర్షికలో చలనచిత్రాల సెన్సారు బోర్డువారూ, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖవారూ చలనచిత్రాలకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిర్మాతలను ఎన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారో తెలియ చేస్తూ ప్రసిద్ధ ఆంగ్ల సినిమా వారపత్రిక 'స్క్రీన్' సంపాదకుడు బి.కె. కరంజియా - 30 అక్టోబర్ 1987 సంచికకు రాసిన సంపాదకీయ వ్యాసం - 'ముఖ్యమంత్రిగారి పెళ్ళాం కాళ్ళకు మొక్కడం గురించి' ప్రచురించారు. చిత్ర రాసిన 'సుజలాం సుఫలాం' కథను, 'వాడని మందారాలు : 9' శీర్షికలో 'మనసు-మాంగల్యం' చిత్రంలోని 'ఆవేశం -ఆవేదన' పాటను ప్రచురించారు. 'కరపత్రాలూ-కదిలేచరిత్ర' శీర్షికలో 9-12-90న ప్రారంభమైన రాష్ట్రవ్యాపిత 'శంభుక రథయాత్ర'ను జయప్రదం చేయమని భారత నాస్తిక సమాజం, మంగళగిరివారు విడుదల చేసిన కరపత్రాన్ని, దర్శి చెంచయ్య శతజయంతి సందర్భంగా అజయ్‌ఘోష్ 'గదర్ పార్టీ'ని పరిచయం చేశారు. 'నేనూ-నాదేశం' అనే దర్శి చెంచయ్య ఆత్మకథ నుండి 'గదర్ పార్టీలో' అనే వ్యాసాన్ని, నిర్మలానంద పరిచయం చేసిన 'శ్రీ దర్శి చెంచయ్య (1890-1964)' వ్యాసాన్ని ప్రచురించారు. 'వివేచన' శీర్షికలో రాల్ఫ్-ఫాక్స్ రాసిన 'నవల - ప్రజలు' మూడవ అధ్యాయం - సత్యము - వాస్తవికత'ను కొత్తపల్లి రవిబాబు అనువదించారు. కవితాఝరి శీర్షికలో కాట్రగడ్డ దయానంద్ రాసిన 'రోదన మౌనంగానే వుంటుంది', జూకంటి జగన్నాథం రాసిన 'మ్యూజికల్ ఛైర్స్' యార్లగడ్డ రాఘవేంద్రరావు రాసిన 'ఆమెవరు?, నగారా రాసిన 'సామాన్యుల ఘోష' కవితలను ప్రచురించారు. సిద్ధా సుబ్బారావు రాసిన 'ప్రతిభ!' పాటను, స్వామి రాసిన 'రామజన్మభూమి కాదు - దున్నేవానికె భూమి' పాటను, క్రాంతికిరణ్ రాసిన 'అనర్హత' కథను ప్రచురించారు. శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ శతజయంతి ఉత్సవ కమిటీ సంఘంవారు 'జపమాల' నవలకు బహుమతినివ్వటాన్ని ఖండిస్తూ 'స్పందన' శీర్షికలో కత్తుల రవికిరణ్ రాసిన 'మాలపల్లి ఉన్నవా : జపమాల రాజారాం' వ్యాసాన్ని, ఉన్నవ లక్ష్మీనారాయణ శతజయంతి ఉత్సవ కమిటీ సంఘం తరుపున సి.వి.ఎన్.ధన్ పత్రికలకు విడుదల చేసిన ప్రకటనను, 'స్పందన' శీర్షికలోనే పోలీసు చిట్టిబాబుది ఆత్మహత్య కాదు, హత్యే! అంటూ విజయవాడ నుండి ప్రజామిత్ర రాసిన వ్యాసాన్ని, స్వీకరించిన పుస్తకాల వివరాలు, చైతన్యవాహిని కార్యక్రమాలను జనసాహితి కార్యవర్గ తీర్మానాలూ, దెబ్బమీద దెబ్బగొట్టు - బానిస బంధాల్ తెగ్గొట్టు అని సూచించే రేఖాచిత్రాన్ని, వెనుక అట్టమీద 16 ఏళ్ళ వయసులో స్టాలిన్ రాసిన కవితను ప్రచురించారు.

1991 జనవరి - ఫిబ్రవరి సంచిక మతతత్త్వ వ్యతిరేక పోరాట సంచికగా వెలువడింది. శ్యామ్‌మోహన గీసిన మతతత్వాన్ని ప్రతిఘటిస్తున్న పోరాటంలో మానవత్వం చిత్రం ఈ సంచిక ముఖచిత్రం. 'లౌకికవాదుల ముందున్న ఉమ్మడి కర్తవ్యం' అనే సంపాదకీయంతో పాటు 'ఆంగ్లో అమెరికన్లు వార్ క్రిమినల్స్ అనే సంపాదకీయాలును ప్రచురించారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా జనసాహితి నిర్వహించిన రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా 27 అక్టోబర్ 1990న భారత రాష్ట్రపతికి పంపిన విజ్ఞప్తి పత్రాన్ని, సఫ్దర్ హష్మీ స్మారక నిధి తరపున భీష్మసహానీ, ఎం.కె.రైనా, నివన్ సుందరమ్, హబీబ్ తన్వర్, కృష్ణఖన్నా, ఇంద్రాణి రెహమాన్, షబనా అజ్మీ, షబ్నమ్ హష్మీ చేసిన ప్రకటనను,

శీర్షికలో 'మతతత్త్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన కళాకారులు'ను, ప్రకటన శీర్షికలోనే 'స్వేచ్ఛపై దాడి'ని ప్రచురించారు. క్రాంతికిరణ్ రాసిన 'చితాగ్ని గుండం', డాక్టర్ శాంతికుమార్ రాసిన 'చెవిలో పువ్వు' కథలనూ, యం.యస్. సార్నా రాసిన పంజాబీ కథ 'శవాల పంటకాలం'ను, హిందీ కథ – 'నేటి కబీర్' అబ్దుల్ బిస్మిల్లా రాయగా నిర్మలానంద అనువదించారు. బాబి వర్ధన్ రాసిన 'మతాన్ని మోస్తున్న పత్రికలు' వ్యాసాన్ని, '1 నుండి 10వ తరగతి వరకు పాఠ్యాంశాల్లో మతబోధన' గురించి నాసరయ్యగారు రాసిన వ్యాసాన్ని, 'మతతత్త్వం, లౌకికవాదం' వావిలాల గోపాలకృష్ణయ్య రాసిన వ్యాసాన్ని, 'కేరళ–మతసామర్యం'పై కె. రవివర్మ రాసిన వ్యాసాన్ని, 'పంజాబ్‌లో మతతత్త్వ వ్యతిరేక పోరాటం – భగత్‌సింగ్, అవతార్‌సింగ్ పాష్‌ల కృషి' గురించి డా॥ చమన్ ప్రభాకర్ రాసిన వ్యాసాలను, ఛాయరాజ్ రాసిన 'మతము–విజ్ఞానము', 'విశ్వాసం చరిత్రకు పోటీకాదు' వ్యాసాలను ప్రచురించారు. 'కల్లవార్తలు పల్లవించిన కల్పవల్లులు', '160 సం॥ల క్రితం హైదరాబాద్', 'కృతజ్ఞతలు', స్వామి వివేకానంద్ రాసిన 'వేదాంత సిద్ధాంతం + ఇస్లాం ఆచరణ' అనే అభిప్రాయాలను ప్రచురించారు.

19–12–1990న 'ఈనాడులో కబుర్లు' శీర్షికలో ప్రచురించిన 'భయం.... భయం..... భయం..కరం' వ్యాసాన్నీ, 'బాబర్ వీలునామా'ను, 'మతతత్త్వ వ్యతిరేక కమిటీ – జె.ఎన్.యు. ఢిల్లీ' విజ్ఞప్తిని, 'స్వాతంత్ర్య సమరయోధుల' విజ్ఞప్తిని, 'స్పందన' శీర్షికలో 'రక్తపు మడుగులు కంట కానలేదా స్వామీ?' అని కతారి రాసిన వ్యాసాన్ని ప్రచురించారు. 'కరపత్రాలు – కదిలేచరిత్ర' శీర్షికలో – శాంతి పరిరక్షణ కమిటీ వెలువరించిన 'బస్తీ శాంతి పరిరక్షణ కమిటీలుగా ఏర్పడండి! ముందు జాగ్రత్తలు తీసుకుని, మతకల్లోలాలని నివారించండి!!' కరపత్రాన్ని, అయోధ్యలో రావణకాష్టంపై 'పుస్తక సమీక్ష', 'ఇది ఒక పుస్తకం కాదు – ఒక ఉద్యమం' అని హరిబాబు రాసిన సమీక్షను, పి. చంద్రశేఖర్ అజాద్ రాసిన స్కెచ్ 'క్షుద్ర దేవతలు'ను, 'కవితాఝురి' శీర్షికలో – 'నెత్తుటి కన్నీరు' – నిఖిలేశ్వర్, 'ఎరుపెక్కిన కళ్ళతో' – ప్రతీక, 'మంచు తుఫాను' – నేతాజీ, 'కుట్ర' – సూర్యచంద్రరావు, 'మానవులం' – పి. తిరుపాలు, 'మౌఢ్యం' – మఖ్దూం, 'మతం' – మహమ్మదాలి, 'ఫిరంగి భగవాన్' – ఆర్. రామకృష్ణ, 'గాయపడ్డ మానవ స్వప్నం' – ఎ.ఎన్, 'ఖండన' – దర్భశయనం శ్రీనివాసాచార్య, 'మనిషి' – జొన్నాదుల పాపారావు, 'శాంతిసభ' – వి.వి, 'రక్త నాగరికత' – ఎ. మురళీకృష్ణ, 'షహర్ హమారా చార్‌సౌ సాల్‌కా?' – డా॥ దేవరాజు మహరాజు, 'శవాల్ని మెట్లుగా' – ఆసురాజేంద్ర, 'మతోన్మాది కలలో' – కొత్తపల్లి రమేష్‌బాబు, 'మాయల మరాఠీ' – మీరా, 'ముద్రలు' – తాతా రమేష్‌బాబు, 'రామ మసీదు బాబ్రీ భూమి' – కందుకూరి శ్రీరాములు, 'ఆయుధం అమ్మ' – బి. రామానాయుడు, 'ఒక గాయం ఒక శోకం' – బండ్ల మాధవరావు, 'హంతకుడు మళ్ళీ వస్తాడా?' – అఫ్సర్ – రాసిన కవితలు, దశరథ రాసిన 'గుండె చీల్చుకుని ఘోషిస్తున్నా....' పాటను ప్రచురించారు. 'ప్రమాదకరం కాదు – మతతత్త్వం వార్తగా మారిపోవడం, ప్రమాదకరం – వార్తలు మతతత్త్వంగా మారిపోవడం' అనే పేపర్‌లోని వార్తల కత్తిరింపులతో రూపొందించిన బొమ్మను, వెనుక అట్ట మీద భగత్‌సింగ్, చంద్రశేఖర్ అజాద్, అసఫాఖుల్లా ఫొటోలతోపాటుగా ఉమ్మడి అమరత్వం – ఉమ్మడి వారసత్వం, పంచుకుందామా – వీటిని మతాల నిప్పత్తిలో' అన్న వాక్యాలను ముద్రించారు. ఈ మతతత్త్వ వ్యతిరేక పోరాట సంచికను హిందూ – ముస్లింల ఐక్యతకు నిరంతరం కృషి సల్పుతూ – ఆ కృషిలోనే ఒక మతోన్మాది కత్తివేటుకి బలైన అమరుడు గణేష్ శంకర్ విద్యార్థి స్మృతికి అంకితమిచ్చారు. ✷

## తెలుగు, కన్నడ సాహితీవేత్త

# గుత్తి(జోళదరాశి)చంద్రశేఖర రెడ్డికి నివాళి



**కర్ణాటక** సరిహద్దులో గల జోళదరాశి గ్రామవాసి చంద్రశేఖర్ రెడ్డి తెలుగు, కన్నడ సాహిత్య కృషీవలుడు. ఆయన 31.12.2020న తన 76వ ఏట మరణించారు. వారు బళ్లారి జిల్లా జోళదరాశిలో 5.2.1945న జన్మించారు.

వారు కర్ణాటక విశ్వవిద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ పట్టభద్రులు. తెలుగు కన్నడ భాష ప్రేమికులు. 'వరమాల – జయమాల', 'సిరి సునీత', 'రైతు రాయలు' అనే పద్య కావ్యాలు రాశారు. కన్నడం నుండి తెలుగులోకి 9 పుస్తకాలు, తెలుగు నుండి కన్నడంలోకి 5 పుస్తకాలు అనువదించారు. చంద్రశేఖర్ రెడ్డి బళ్లారి రచయితల సంఘం ఏర్పాటుకు కృషి చేశారు. కర్ణాటకలో తెలుగు భాష సంరక్షణకు ఉద్యమించారు. ప్రతిసంవత్సరం తమ గ్రామంలో కవుల, రచయితలతో సమ్మేళనం నిర్వహించడం, ఎందరో సాహితీవేత్తలను గౌరవవించడం ,క్రమం తప్పకుండా చేస్తూ తెలుగు కన్నడ సాహిత్యం కొత్తతరాలు తెలుసుకోవాలని తపన పడేవారు. తమ గ్రామ సమీపంలో ఎయిర్ పోర్ట్ పేరుతో భూముల సేకరణను వ్యతిరేకిస్తూ జరిగిన ఉద్యమంలోనూ, సాగునీటి పోరాటాలలోనూ క్రియాశీలకంగా పాల్గొన్నారు. హైదరాబాద్‌లో వుంటూ ఒక రచయితగా, ప్రజాస్వామికవాదిగా జనసాహితికి అండగా వుండేవారు. కల్బుర్గి హత్యను ఖండిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలోను, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోను నిర్వహించిన సభలో పాల్గొని మాట్లాడారు. వారికి జనసాహితి అశ్రునివాళి అర్పిస్తున్నది.

– **జనసాహితి**

# చైతన్యవాహిని

**విజయవాడ, 15-12-2020** సాయంత్రం లెనిన్ సెంటర్లో కేంద్ర ప్రభుత్వం రైతాంగంపై, దేశ ప్రజలపై రుద్దుతున్న మూడు వ్యవసాయ బిల్లులకు, విద్యుత్ బిల్లుకు, కార్మిక హక్కులను రద్దు చేస్తూ చట్టాలను సవరించడానికి నిరసనగా పలు ప్రజాసంఘాలు నిర్వహించిన ప్రదర్శనలో జనసాహితి రచయితలు, పాఠకులు పాల్గొన్నారు. జనసాహితి అధ్యక్షుడు దివికుమార్, ఇతర ప్రజాసంఘాల నాయకులు ప్రసంగించారు.

**హైదరాబాదు, 20-12-2020**న 30 మంది రైతు అమరుల స్మృతిలో భాగంగా, జనసాహితి, ఎరుకసాహితి, పి.వో.డబ్ల్యూ (స్త్రీ విముక్తి), అరుణోదయ, స్త్రీ సంఘటన సంస్థల ఆధ్వర్యంలో స్మృతి దినం పాటిస్తూ, 'రైతాంగానికి బాసటై నిలుద్దాం' కార్యక్రమం, బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద జరిగింది. అమరులైన రైతుల ఫొటోలకు పూలు అర్పించి వివిధ సంఘాలవారు జోహార్లు చెప్పారు. 'స్త్రీ సంఘటన' పత్రిక ఎడిటర్ ఎం. లక్ష్మి నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు, అరుణోదయ విమలక్క, జనసాహితి జంటనగరాల శాఖ అధ్యక్షుడు కె. రామ్మోహన్, రైతు నాయకులు నాగిరెడ్డి, టి.పి.టి.ఎఫ్. నాయకులు రాంబాబు, రచయితలు శ్యామ్, వి.ఆర్.శర్మ, ఓయూ విద్యార్థి నాయకుడు శ్రీనివాస్ రైతుల ఉద్యమాన్ని సమర్థిస్తూ మాట్లాడారు. అనంతరం సుందరయ్య పార్కు చుట్టూ నినాదాలిస్తూ ప్రదర్శన నిర్వహించారు.

**తెనాలి, 20-12-2020**న బొల్లిముంత శతజయంతి ప్రచురణల కమిటీవారు ప్రచురించిన 'బొల్లిముంత కథలు' పుస్తక ఆవిష్కరణసభ వివేక సెంట్రల్ స్కూలు ఆవరణలో ఉదయం 10:30 నుండి 2:00 గంటల వరకు జరిగింది.

వివేక సంస్థల అధిపతి రావిపాటి వీరనారాయణ, రామరాజు, గుత్తా వెంకటరత్నంలు కార్యక్రమాన్ని నిర్వహించారు. 'బొల్లిముంత కథలు' పుస్తకంలో వున్న 31 కథలను విశ్లేషణాత్మకంగా పరిచయం చేస్తూ దాదాపు 24 మంది స్థానిక రచయితలు, విమర్శకులు, నటులు, ఒక్కొక్కరు ఐదు నిముషాలపాటు మాట్లాడారు. బొల్లిముంత విశిష్టత గురించి గుజ్జర్లమూడి కృపాచారి, కొత్తపల్లి రవిబాబు ప్రసంగించి, వారికి కేటాయించిన కథలపై మాట్లాడారు. స్థానిక రచయితలను ప్రోత్సహిస్తూ ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమం ఒక కార్యశాలగా వుందనీ, ఒకప్పుడు పలు రచయితల, కళాకారుల నిలయమైన తెనాలి గత వైభవాన్ని మరల తేడానికి బీజప్రాయంగా ఈ కార్యక్రమం ఉపయోగపడ్తుందని రవిబాబు ప్రశంసించారు.

జర్నలిస్టు, బి.ఎల్. నారాయణ వందన సమర్పణ చేశారు.

**విజయవాడ, 21-12-2020**న రచయితలు, కళాకారులు, మేధావుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 వరకు - ఢిల్లీలో రైతులు జరుపుతున్న ఆందోళనకు మద్దతుగా సంఘీభావ కార్యక్రమం జరిగింది.

కవిగాయక సమ్మేళనాన్ని శిఖా ఆకాశ్, వైష్ణవిశ్రీలు నిర్వహించారు. సాహితీస్రవంతి వొరప్రసాద్, విరసం అరసవిల్లి కృష్ణ, జనసాహితి దివికుమార్, అరసం అరుణ్‌కుమార్, చలపాక ప్రకాశ్, మల్లెతీగ కలిమిశ్రీ, జర్నలిస్టు ఉషా, యస్. డ్యానీ, సామాజిక కార్యకర్త కె.వి.దేవి ప్రసంగించారు. పిచ్చయ్య, అనిల్‌లు గేయాలాపన చేశారు. వీరేగాక పలు సంస్థల ప్రతినిధులు పాల్గొని రైతుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. మొత్తం 55 మంది కవులు, మేధావులు దీనిలో పాల్గొని తమ గళాలను వినిపించారు.

**రాజమహేంద్రవరం, 30-12-2020** సాయంత్రం స్థానిక నెహ్రూనగర్ సామాజిక భవనంలో కేంద్ర ప్రభుత్వం చేసిన వ్యవసాయ చట్టాలపై రైతుల పోరాటానికి కలాల సంఘీభావాన్ని తెలియచేస్తూ జనసాహితి తూర్పుగోదావరిజిల్లా శాఖ చర్చాగోష్టిని నిర్వహించింది.

చర్చాగోష్టిని ప్రధానోపాధ్యాయులు కె.వి.వి. సత్యనారాయణ ప్రారంభిస్తూ రైతాంగానికి మద్దతు తెలియచేయాలనీ, చలికి, అనారోగ్యానికి రైతులు మరణించడంపట్ల ఆవేదన వ్యక్తం చేశారు. చర్చాగోష్టిని జనసాహితి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సిరాజ్ సమన్వయం చేస్తూ వ్యవసాయ చట్టాలను వివరించారు. ఈ చట్టాలు కార్పొరేట్ల దోపిడీకి అనువుగా వున్నాయనీ, ప్రజలందరూ వీటివల్ల నష్టపోతారనీ వివరించారు.

జనసాహితి సభ్యుడు కె.ఎస్. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రైతుల ఉద్యమానికి ప్రభుత్వం కల్పించిన ఆటంకాలను ఖండించారు. దేశవ్యాప్తంగా ఈ రైతుల పోరాటానికి సంఘీభావాన్ని తెలియచేయడం ఆహ్వానించాల్సిన పరిణామమన్నారు. మేధావులు, ప్రజాస్వామికవాదులు, యువకులు, శ్రామికులు, విభిన్నవర్గాల ప్రజలు రైతుల ఆందోళనకు మద్దతు పలకాలని కోరారు.

కవులు విరాగి, డా॥ గూటం స్వామి తమ కవితలు చదివారు. ఈ కార్యక్రమంలో డా॥ చిలుకోటి కూర్మయ్య, జె.ఎ.సి. నాయకులు మాధవరావు, ప్రవీణ్‌కుమార్, దురాని, ఉపాధ్యాయ సంఘనేతలు ఉదయ బ్రహ్మ, లివింగ్‌స్టన్, బ్రహ్మయ్యశాస్త్రి, కార్మిక నాయకులు బి.బి.కె.రామ్, సుల్తాన్‌బాషా, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు. ✸



**1936లో మొట్టమొదటిసారిగా రైతాంగ ఉద్యమాన్ని ప్రారంభించిన గదర్ వీరులు**
వీరి పేర్లు. ఎడమ నుంచి 1. బాబా సంతాసింగ్, 2. దర్శన్‌సింగ్ ఫెరుమన్, 3. ఫోజాసింగ్ భుల్లర్, 4. బాబా సోహన్‌సింగ్ భక్నా, 5. బాబా కరంసింగ్ చేమా. 1936లో అమృతసర్ రైల్వేస్టేషన్లో అరెస్టుచేసిన ఫోటో.




**జయధీర్ తిరుమలరావు ద్వారా 'ప్రజాసాహితి'కి ఇటీవల అందిన పుస్తకాలు (స్థలాభావం వలన పుస్తకాల వివరాలు క్లుప్తంగా ఇస్తున్నాం. వీలువెంబడి కొన్ని ముఖ్యమైన పుస్తకాల పరిచయాలు, సమీక్షలు ప్రచురిస్తాము. - సం॥)**

**1. ఆదివాసీ జానపద కళలూ, సంస్కృతి - ఒక కర్తవ్యం :** రచన - జయధీర్ తిరుమలరావు, కార్యదర్శి, ఆదివాసీ జానపద సాంస్కృతిక హక్కుల వేదిక, హైదరాబాదు. 20 పుటలు. వెల : రూ.15/- ప్రథమముద్రణ : మే 2000.

ఆదివాసీ తెగలు, దళిత కులాలు, మైనారిటీ వెనుకబడిన కులాలు మొదలైన వెనక్కి నెట్టబడినవారి కళల పునరుద్ధరణ ఆశయంగా ఏర్పడిన వేదిక గురించి వివరించిన పుస్తకం.

**2. డక్కలి జాంబ పురాణం :** ప్రధాన సంపాదకుడు జయధీర్ తిరుమలరావు కాగా కె.పి. అశోక్‌కుమార్, ఎ.కె. ప్రభాకర్, ఆర్. భాస్కరరావు సంపాదకులుగా, జి. మనోజ సహ సంపాదకులుగా 'జానపద' సంస్థ, హైదరాబాదు వారి ప్రచురణ. 1/8 డెమ్మీ - హార్డ్ బౌండ్ 44+356 పుటలు. వెల : రూ. 280/- రెండవ ముద్రణ : 2011. ప్రతులకు : ఆర్ట్స్ అండ్ లెటర్స్. 1-2-365/25సి, ఇందిరాపార్కు క్రాస్‌రోడ్స్, హైదరాబాదు - 500025. ఫోన్ : 040-27635654.

అడుగువర్గపు పౌరాణిక సాహిత్యంలో భాగమైన డక్కలి జాంబ పురాణ ప్రదర్శనకు రాత రూపం ఈ పుస్తకం. దీనిలో బుద్ధుడు, క్రీస్తు, మహమ్మదుల ప్రసక్తి వస్తుంది. మతాభిమానం వుంటుంది కాని మతోన్మాదం వుండదు. బహుమత సహనం ఎక్కువగా కనిపిస్తుంది. ఆధిపత్య నిరసన ధ్వనులు వింటాం. అంటరానితనంపై ఒక బ్రహ్మాస్త్రం ఈ డక్కలి జాంబ పురాణం.

**3. An Unsung Legacy :** Exhibition of artifacts literary materials from less known sources of marginalized communities by Jayadhir Tirumal Rao - from 12th to 14th Feb 2017.

సమాజంలో గుర్తింపుకు నోచుకోక, ప్రక్కకు నెట్టివేయబడిన జాతుల, తెగలకు సంబంధించిన కళాఖండాలు, సాహిత్యము, హైదరాబాదు, కళాభవన్‌లోని ఐసిసిఆర్ వారి ఆర్ట్ గ్యాలరీలో 2017 ఫిబ్రవరిలో 12, 13, 14 తేదీలలో ప్రదర్శించారు. వాటి వివరణతో కూడిన ఇంగ్లీషు బులెటిన్ ఇది.

తెలంగాణ సాహిత్య కళావేదిక ప్రచురించింది. హైదరాబాద్ యూనివర్శిటీకి చెందిన దళిత మరియు ఆదివాసీ అధ్యయన అనువాద కేంద్రం ఈ ప్రదర్శనను నిర్వహించింది.

**4. తొవ్వ ముచ్చట్లు - 2, 3, 4, 5 భాగాలు :** 'ఆంధ్రభూమి' దినపత్రికలో ఆరేళ్ళపాటు వారం వారం జయధీర్ తిరుమలరావు రాసిన వ్యాసాల సంపుటులు ఇవి. మొదటిభాగం 2013లో, రెండవ భాగం 2017లో, మూడో భాగం 2018లో, నాలుగో భాగం 2019లో, ఐదో భాగం 2020లో సాహితీసర్కిల్, హైదరాబాదువారు ప్రచురించారు. 1/8 డెమ్మీ సైజులో వున్న రెండోభాగం 252 పుటలు (59 వ్యాసాలు). వెల : రూ. 150/-; మూడోభాగం 226 పుటలు (45 వ్యాసాలు). వెల : రూ. 160/-; నాలుగోభాగం 230 పుటలు (48 వ్యాసాలు). వెల : రూ. 200/-; ఐదోభాగం 256 పుటలు (48 వ్యాసాలు). వెల : రూ. 200/- ప్రతులకు : ప్రసిద్ధ పుస్తక విక్రేతలు ఆంధ్ర, తెలంగాణలు.

ఆయా సంవత్సరాలలోని సాహిత్య, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక, ఆర్థిక, రాజకీయరంగాలలోని విషయాలపై సూటిగా, వాడిగా చేసిన విశ్లేషణలు ఇవి. సాహిత్య విద్యార్థికి బహువిధాల ఉపయోగపడే పుస్తకాలు.

**5. కన్నీటి సాగరాలొద్దురా మల్లన్న! :** సంపాదకులు : జయధీర్ తిరుమలరావు, ఎ.కె. ప్రభాకర్

1/8 డెమ్మీ 172 పుటలు. వెల : రూ. 120/- తెలంగాణ రచయితల వేదిక, హైదరాబాదు వారి ప్రచురణ. మొదటిముద్రణ : ఏప్రిల్ 2017. గాడితప్పిన మల్లన్న సాగర్ ప్రాజెక్టు (రిజర్వాయరు) దాని మూలంగా ముంపుకు గురయ్యే 24 గ్రామాలకు చెందిన 25 వేలమంది ప్రజలు చేస్తున్న ఆందోళనలు, ప్రతిఘటనా పోరాటాలు గురించి తెలంగాణ రచయితల వేదిక బృందం తమ క్షేత్ర పర్యటన ద్వారా తెలుసుకున్న వాస్తవాలూ, ఈ సమస్యపై స్పందించి ఇతరులు రాసిన 25 వ్యాసాలూ, 15 కవితల సమాహారం ఈ పుస్తకం.

ముంపు గ్రామాల ప్రజలు రిజర్వాయర్‌ను వ్యతిరేకించడంలేదు. నిర్వాసితులకు ఇచ్చే నష్టపరిహారం పునరావాసం రాష్ట్ర ప్రభుత్వ జీవో 123 (2015 జులై) ప్రకారం కాకుండా కేంద్ర ప్రభుత్వం చేసిన 2013 నాటి భూసేకరణ పునరావాస చట్టం ప్రకారం కల్పించాలని వారు పోరాడుతున్నారు.

ప్రతులకు : ఎ.కె. ప్రభాకర్, బి-205 సోలంకి గుల్‌మహర్, బ్రాహ్మణవాడి, బేగంపేట, హైదరాబాదు - 500016. ఫోన్ : 99519 42242.

**6. యుద్ధ కవచం :** తెలంగాణ భాషాసాహిత్యాలపై కాళోజి గొడవ. రచన : జయధీర్ తిరుమలరావు. 1/8 డెమ్మీ 10+46 పుటలు. వెల : రూ. 40/- మొదటిముద్రణ : సెప్టెంబరు 2017.

ఎ.కె. ప్రభాకర్ ముందుమాట రాశారు.

తెలుగుభాష, తెలంగాణ తెలుగుభాష వేర్వేరు భాషలన్న ప్రతిపాదన చేస్తున్న రచయిత ఈ అంశంపై కాళోజి చెప్పినవాటిని కొన్ని ఉదాహరిస్తూ రాసిన 4 వ్యాసాల సంపుటి ఇది. అనుబంధంలో కాళోజీ రాసిన 8 కవితలు ఇచ్చారు.

అక్షరమాల ఒకటే - లిపి ఒకటే. వ్యాకరణం ఒకటే - కాని మాండలీకాలు, యాస వేరుగా వుంటే దానిని మరొక భాష అనడం సమంజసమా? చర్చకు పనికివచ్చే అంశం.

**7. నిజాం రాష్ట్ర ప్రశంస అను తెలంగాణ రాష్ట్ర ప్రశంస :** చారిత్రక ఖండకావ్యం - ఇతర పద్యాలు. రచయిత : శేషాద్రి రమణ కవులు. శతావధానులు. సంపాదకుడు : జయధీర్ తిరుమలరావు.

1/8 డెమ్మీలో 32+140 పుటలు. వెల : రూ.100/- సాహితీ సర్కిల్ ప్రచురణ - మొదటి ముద్రణ : ఫిబ్రవరి 2018.

గుంటూరుజిల్లా వాడరేవుకు చెందిన ధూపాటి శేషాచార్యులు (1890-1945), ధూపాటి వెంకటరమణాచార్యులు (1893-1963) అనే అన్నాతమ్ముళ్ళే జంటకవులుగా శేషాద్రి రమణ కవులుగా ప్రసిద్ధులయ్యారు.

బాపట్లలో ప్లీడరు గుమాస్తాలుగా పనిచేస్తూ సాహిత్య అధ్యయనం చేశారు. జయంతి రామయ్య పంతులు పరిచయం కాగా వారు వీరికి శాసనాలు, తాళపత్ర గ్రంథాలు, వ్రాతప్రతులు, నాణేలు సేకరించే పని, (శేషాచార్యులకు గుంటూరు మండలంలో రమణాచార్యులకు నైజాం సంస్థానంలో) అప్పచెప్పారు.

రమణాచార్యులు హనుమకొండ కళాశాలలో పనిచేశారు. వరంగల్‌జిల్లా పసిరె గ్రామంలో వ్యవసాయం చేశారు. చివర్లో పురావస్తు శాఖలో చేసి 1963లో మరణించారు.

దీనిలో ఎనిమిది శీర్షికలతో 84 సీసపద్యాలు, అనుబంధంలో 19 శీర్షికలతో 105 పద్యాలు గలవు.

**8. వీరుల పోరుగడ్డ 'మేడారం' :** (సమ్మక్క, సారాలమ్మలపై కోయడోలీల కథ). సంపాదకుడు : జయధీర్ తిరుమలరావు. సహసంపాదకులు : గూడూరు మనోజ, పద్దం అనసూయ.

1/8 డెమ్మీలో 128 పుటలు + 6 పుటల ఛాయాచిత్రాలు. వెల : రూ. 80/- సాహితీసర్కిల్ ప్రచురణ. ప్రథమముద్రణ : 2018.

కోయల ఉపతెగ, అర్థివారు, అశ్రితులు, సాంస్కృతిక గురువులు, వీరగాథా ప్రదర్శకులైన డోలీవారు చెప్పిన 'సమ్మక్క - సారమ్మ' కథనం మౌఖికంగా ప్రదర్శన సమయంలో రికార్డు చేసి, వాటికి వ్రాత ప్రతిని తయారుచేసి, సందేహాలను నివృత్తి చేసుకొని, ఎన్నో ఏళ్ళపాటు సంపాదకులు కృషిచేసి దీనిని అచ్చువేశారు. ఈ పాఠ్యసేకరణ కోసం పడిన పడిగాపులు, కొన్ని తంటాలు వివరించారు. డోలీలు చెప్పిన కథనంపై జయధీర్ తిరుమలరావు 30 పేజీలలో రెండు వ్యాసాలు రాశారు.

మొత్తం కథ 44 పుటలుంది. 6 శీర్షికలతో అనుబంధం వుంది.

**9. నెత్తుటి పాలపుంత :** అలిశెట్టి ప్రభాకర్ జీవిత సాహిత్యాలపై లోచూపులు. సంపాదకులు : జయధీర్ తిరుమలరావు, బి.నర్సన్.

1/8 డెమ్మీ 10+124 పుటలు. వెల : రూ.400/- సాహితీసర్కిల్ ప్రచురణ. మొదటిముద్రణ : నవంబరు 2018.

కోటబుల్ కోట్స్‌లో శ్రీశ్రీ అంతటివాడు అలిశెట్టి ప్రభాకర్. శ్రీశ్రీ ఆర్థిక ఇబ్బందుల్లో వున్ననాడు ఆంధ్రప్రదేశ్ ఆదుకుంది. అదే పరిస్థితిలో వున్న ప్రభాకర్‌కు కొందరు మిత్రుల సహాయమే లభించింది. 39 సంవత్సరాల వయసులోనే ఆంగ్లకవి కీట్సులాగా క్షయవ్యాధితో అలిశెట్టి మరణించాడు.

జగిత్యాల రైతాంగ జైత్రయాత్ర కొత్త వూపిర్లందించగా, అప్పటివరకు ఏ సంఘంలోనూ చేరని అలిశెట్టి విరసం సభ్యుడయ్యాడు. మిత్రులు వద్దని హెచ్చరించినా హైదరాబాదు చేరి దినపత్రికలలో కార్టూన్‌లు, మినీకవితలు వేయడం ద్వారా వచ్చే అల్పాదాయంతో ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డాడు. వైద్యాన్ని నిర్లక్ష్యం చేశాడు.

లఘు కవితలు వేయికి పైగా రాశాడు. మెప్పించగల దీర్ఘకవితలూ రాశాడు. తన కవితలకు తానే బొమ్మలు వేసి చిత్రకళా ప్రదర్శనలు పలుచోట్ల నిర్వహించి ప్రశంసలందుకున్నాడు.

గతకాలపు విశిష్ట రచయితల గురించి జ్ఞాపకాలు, పునర్మూల్యాంకనలు ఎక్కువగా రాని పరిస్థితిలో, అలిశెట్టి 25వ వర్ధంతి (2018) సంవత్సరంలో, అలిశెట్టిపై వివిధ పత్రికల్లో వచ్చిన వివిధ రచయితల వ్యాసాలన్నిటినీ సేకరించి ఈ సంకలనాన్ని జయధీర్ తిరుమలరావు, బి.నర్సన్ రూపొందించారు.

జయధీర్ ముందుమాట కాక, 28 మంది రచయితలు రాసిన 31 వ్యాసాలున్నాయి. వీటిలో 1993 ఫిబ్రవరిలో 'ప్రజాసాహితి' అలిశెట్టి మరణం సందర్భంగా రాసిన సంపాదకీయం కూడా వుంది.

జయధీర్ మాటల్లో : "అలిశెట్టి దుస్తులు వేసుకున్న వేమనలాగా కనిపిస్తాడు. చేగువేరాలా పోరాటం నిండిన మిస్సైల్ అనిపిస్తాడు.... అక్షర గెరిల్లా అలిశెట్టి.... ఈ కవి గురించి లోతైన చర్చ జరుగుతుందని ఆశించి ఈ పుస్తకం అచ్చు వేస్తున్నాం."

**10. సల్లంగుండవే నల్లమల :** నల్లమలలో యురేనియం తవ్వకాలపై ప్రజాభిప్రాయం.

1/8 డెమ్మీ 96 పుటలు. వెల : రూ. 100/- నల్లమల పరిరక్షణ కమిటి, హైదరాబాదు వారి ప్రచురణ. మొదటి ముద్రణ : అగస్టు 2019. ప్రతులకు : సాహితీసర్కిల్.

అతి ప్రాచీనమైన ఆదిమవాసులైన చెంచు తెగ ప్రజలకు నల్లమల అడవి గూడు లాంటిది. అతి విలువైన ఖనిజ సంపదలు కలిగిన ప్రాంతాల్లో ఇదొకటి. నల్లమలలో వున్న యురేనియం తవ్వకాల వల్ల చుట్టుపక్కల 15 కిలోమీటర్ల పరిధిలో అణుధార్మిక ప్రభావం వుంటుంది. కృష్ణానది నీరు కలుషితమౌతుంది. ప్రజలందరూ అనారోగ్యానికి గురవుతారు.

ఈ కమిటీవారు అమ్రాబాద్ మండలంలోని గ్రామాలు, తండాలు, పెంటలు పర్యటించి, అక్కడి వాస్తవాలు 13 వ్యాసాల రూపంలో ఐదు అనుబంధాలతో, నాలుగు కవితలతో ఈ పుస్తకాన్ని రూపొందించారు.

**11. మూలధ్వని :** జానపద గిరిజన సంగీత వాద్యాల సామాజిక చరిత్ర. రచయితలు : జయధీర్ తిరుమలరావు, గూడూరు మనోజ.

ఎ4 సైజు కంటె కొంచెం చిన్న సైజులో, ఫొటో ఆర్ట్‌పేపర్ ఉపయోగించి, పంచరంగులలో ఎన్నో ఫొటోలతో రూపొదించిన 12+94 పుటల అపురూపమైన పుస్తకం. మొదటిముద్రణ : మార్చి 2019.

మనం తరచు వినే కర్నాటక, హిందుస్తానీ సంగీతాలకి మూలం ఆదివాసుల్లో వుందని చాలమందికి తెలియదు. మూలవాసుల సంగీత వాద్యాలు మరుగునపడ్డాయి. వాటిని గుర్తించి, వాటిని ఉన్నతీకరించి ఆయాధ్వనులను ఆస్వాదించడం అవసరం. లేకపోతే అవి పూర్తిగా కనుమరుగౌతాయి. దాదాపు 60 రకాల మూలవాసుల సంగీతవాద్యాలు సేకరించి, వాటితో ప్రదర్శనను మార్చి 17, 18, 19 తేదీలలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని టాగోర్ ఆడిటోరియంలో తెలంగాణ రచయితల వేదిక నిర్వహించింది. ఆ సందర్భంగా ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఆ కార్యక్రమానికి హాజరుకాలేనివారికి కూడా, మూలవాసుల అపురూప సంగీత సృజన అలవోకగా అర్థమయ్యేట్లు దీనిని రూపొందించారు. **(ఇంకా వున్నాయి)** ✸

పాట

# ఢిల్లీ రైతు పోరు పిలుస్తోంది

– శ్రీదేవి

కదలండి కదలండి కదలండిరా.... ఢిల్లీ పిలిచిందిరా
దేశానికి తిండిపెట్టె రైతన్నలురా..... పోరుజేస్తున్నారా
రైతు నోట మట్టికొట్టే చట్టాలేవీ ....వద్దు వద్దన్నారా

మోడీ సర్కారు వారు. .......సైరాసై రైతన్న
మాయమాటలెన్నో చెప్పి
రైతు మేలు కోరేదె
వ్యవసాయ చట్టమని
దొడ్డిదారి లోన మోడీ
ఆర్డినెన్సు తీసుకొచ్చి
పల్లె ప్రజల ఇళ్ళన్ని - చీకట్లో ముంచాడా......
॥ కదలండి ॥

రైతన్నకు తోడైన. .....సైరాసై రైతన్న
అరకొరగా ఆసరైన
మార్కెట్టు యార్డులను
మద్దతు ధరలను
రద్దు చేసి పారేసి
బహుళజాతి కంపెనీలకి
బలిపశువులను చేసి
సామ్రాజ్యవాదులకు - దాసోహం అన్నాడా......
॥ కదలండి ॥

భగ్గుమన్న రైతాంగం. ..... సైరాసై రైతన్న
ఏమిటి ఈ అన్యాయం
ఎన్నాళ్లీ దౌర్జన్యం
ఆరుగాలం కష్టించిన
కూలిగింజలే కరువని
పల్లె నుండి ఢిల్లీ దాకా - ప్రతి గుండె మండింది....
॥ కదలండి ॥

పంజాబు రైతు కేక. ........సైరాసై రైతన్న
హస్తినకు తాకిందా
హర్యానా రైతన్నలు
హలం పట్టి నడిచారా
రాజస్థాన్ రైతులంత
రాజుకొని లేచారా
ఉత్తరప్రాదేశమంత
ఉడికి ఉడికి కదిలిందా
లక్షలాది రైతులతో - ఢిల్లీగడ్డ మెరిసిందా....
॥ కదలండి ॥

రోజులెన్ని గడిచినాను. ...... సైరాసై రైతన్న
తరిగిపోని తెగువతోటి
పసిపిల్లలు వృద్ధులనక
స్త్రీలు పురుషులని ఎంచక
బారికేడ్లు పడతోసి
పొగబాంబుకి భయపడక
గడ్డకట్టే చలిలోన
జలఫిరంగులా జడిలో - జబ్బ చరిచి నిలిచారా...
॥ కదలండి ॥

దేశానికీ పోరు. ........ సైరాసై రైతన్న
దారిని చూపించిందా
దేశమంత నీతోటి
కదం కదం కలుపుతోంది
తెలంగాణ కొమరన్న
నక్సల్బరి రైతన్న
శ్రీకాకుళ కోరన్నా
వారసుడవు నీవన్న
భరత జాతి భవితవ్యం .....నీపోరుతో మారునన్న
....కదలండి....కదలండి.....

కవిత

# ప్రాభాత సమీరం

– జీవన్

**చీకటి** సామ్రాజ్యం
వాడికి చేతిలో చెయివేసి చెప్పిందట –
చిరస్థాయిగా నీతోనే చెలిమి చేస్తానని !

రాకాసి నీడ తన జిగికౌగిట బంధించి మరీ భరోసా ఇచ్చిందట –
రక్షణ కవచంగా (సదా) నీతోనే నిలుస్తానని!

దుశ్శాసన పర్వం శాసనం చేసిందట వాడికోసం –
తమ బలిమి నిత్యమై వెలుగుతుందని!
అబద్ధాల అద్దాల మేడలో
వాడు వికృత రూపంలో వికటాట్టహాసం చేస్తున్నాడు....
కాలం తిరగబడింది –

ఎన్ని నాళ్ళ నిరీక్షణ....
ఈ క్షణం కోసమే నా తపనంతా....
ప్రాభాత సమీరం మెల్లమెల్లగా వీస్తున్నది
అరుణారుణ రేకలతో తూరుపు వాకిలి తెలతెలవారుతున్నది

చీకటి కొట్టానికి అంటుకున్న మంటలు
చిటపట ధ్వనులతో
మరో ప్రపంచానికి స్వాగత గీతికలు ఆలపిస్తున్నది

PRAJAA SAAHITHI January, 2021 (TELUGU) Rs. 40/- RNI No.APTEL/1977/0571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 68 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

కవిత



# రైతు భేరి

- పినాకిని

ఓరోరే కాషాయోడా...
కార్పొరేట్ జీతగాడా...
ఏమాయెరా దేశభక్తి - ఎటుబోయెర రాంభక్తి
రైతునోట మట్టిగొట్టి -
భూములు తాకట్టుపెట్టి అంబానీ అదానీల -
అరికాళ్లకు పూజలేంది
భరతమాత పేరుజెప్పి -
బాంచెనని మొక్కుడేంది ॥ ఓరోరే ॥

గొర్రెకు తోడేలు భలే
-కాపలా కాస్తదని
మేకల మందకు బెబ్బులి - అండదండలిస్తదని
పులితోడేలు తలకు -
స్వదేశీ తొడుగు తొడిగే
నక్కజిత్తు ఎత్తులన్ని- నమ్మరిపుడు రైతుజనం
నయానయా వ్యాపారీ-
నయవంచక దళారీ... ॥ ఏమాయెర ॥

పచ్చని పైరుని పెంచి-
పశువుల పక్షుల సాకి
ప్రకృతిలో పరవశించే-
రైతు బతుకు స్వేచ్ఛకన్న
కార్పొరేట్ బందిఖాన-
మేలెట్లర పిచ్చికన్న
గోమాతని మాకుచెప్పి - అంబానిని పూజిస్తవు.
అసల్ సిసల్ క్యాపిటలిస్ట్ - కసాయి అవతారమా
॥ ఓరోరే ॥

అదానోడి ఆస్తుల్లో - మీకొచ్చే వాటాలెంతో
అంబానీ షేరాస్తిలో - బహుళజాతి భాగమెంతో
గంటకు వందలకోట్లు - మీ ఆస్తులు పెరిగిపోయే
కష్టజీవి కష్టమంత - కార్పొరేట్ల పరమాయె
కాంగిరేసు తలదన్నిన - కాషాయపు దోపిడోడ
॥ ఏమాయెర ॥

ఎనభై శాతం
మా అన్నదాత లోకవైపు
శ్రమదోపిడి కార్పొరేటు - కంపెనీలు నీ వైపు
మా భూమిలో మేముంటే -
బానిసలం దొరకమని
సాగుమాకు దండగని -
కంపెనీల దించినవ్
కార్పొరేట్ వ్యవసాయం - కహానీలు చెప్తున్నవ్
॥ ఓరోరే ॥

ఐటీసీలో ఐ వుంటే - ఇండియాది అవుతుందా
రిలయన్స్‌లో ఎల్ ఉంటే -
దేశప్రేమ పుడుతుందా నీ దృష్టిలో దేశమొక -
లిమిటెడ్ అయిపోయిందా
శ్రమజీవుల చేతులపై - నిలిచుంటిర ఈగోళం
దేశమంటే మట్టికాదు -
మట్టిమనిషిదే ఈ దేశం
ఢిల్లి దాక తాకిందిరా - కష్టజీవి సందేశం
మోగిందిర రైతుభేరి...
కానుకోర బేహారీ.... ॥ ఓరోరే ॥ ✤

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.
Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI